UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD

Cl. No. 82 S94S

Acc No. 713

DATE DUE

DURATION OF LOAN - Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

# శ్రీ శివ శంకర కృతులు

నందన వర్ష భాద్రపద కృష్ణ షష్ఠి
షష్టి వర్షపూర్తి: సెప్టెంబరు 9 1952



శ్రీ శివ శంకర శాస్త్రి : వయస్సు 35

# శ్రీ శివశంకర కృతులు

## పద్య . గేయ . నాటికలు

## ద్వితీయ సంపుటి

. సాహితీ . సమితి . రేపల్లె .



శ్రీ శివ శంకర శాస్త్రి : వయస్సు 35

# శ్రీ శివశంకర కృతులు

పద్య . గేయ . నాటికలు

## ద్వితీయ సంపుటి

. సాహితీ . సమితి . రేపల్లె .

సర్వ స్వామ్యములు కృత్తివాస తీర్థులవి

ప్రథమ ముద్రణము (షష్టి పూర్తి) 1952

భారతీ · ప్రెస్ · తెనాలి

## అనుక్రమణిక


| | | | పుట |
|---|---|---|---|
| **పద్మావతీ చరణ చారణ చక్రవర్తి :** | | ... | 469 |
| ప్రథమ రంగము | | | 471 |
| ద్వితీయ రంగము | | | 478 |
| తృతీయ రంగము | | | 487 |
| **వర పరీక్ష :** | ... | ... | 505 |
| ప్రథమ రంగము | ... | ... | 507 |
| ద్వితీయ రంగము | ... | ... | 520 |
| తృతీయ రంగము | ... | ... | 530 |
| **యక్ష రాత్రి :** | ... | ... | 537 |
| **వహాజ యాన పంథీ :** | ... | ... | 575 |
| ప్రథమ రంగము | ... | ... | 577 |
| ద్వితీయ రంగము | ... | ... | 585 |
| తృతీయ రంగము | ... | ... | 597 |
| **దీక్షిత దుహిత :** | ... | ... | 613 |
| ప్రథమ రంగము | ... | ... | 615 |
| ద్వితీయ రంగము | ... | ... | 634 |
| తృతీయ రంగము | ... | ... | 650 |

# అనుక్రమణిక

| | | | పుట |
|---|---|---|---|
| కవి ప్రియ : | ... | ... | 667 |
| ప్రథమ రంగము | ... | ... | 669 |
| ద్వితీయ రంగము | ... | ... | 684 |
| తృతీయ రంగము | ... | ... | 698 |
| చతుర్థ రంగము | ... | ... | 713 |
| పంచమ రంగము | ... | ... | 727 |
| పదాంకము : | ... | ... | 745 |
| సద్వాక్యము : | ... | ... | 775 |
| ప్రథమ రంగము | ... | ... | 777 |
| ద్వితీయ రంగము | ... | ... | 786 |
| తృతీయ రంగము | ... | ... | 794 |
| చతుర్థ రంగము | ... | ... | 802 |
| అనువాదములు : | ... | ... | 809 |

పూజ్యు లగు మా నాయన గారి కావ్య సందోహ మంతయు సమీక్షించి, The Mind And Art of Sri Siva Sankara Sastri అను మహాగ్రంథమును, The First Look And Other Poems అను పేర కొన్ని ఖండ కృతుల అనువాదమును చేసిన పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రి (M. A , M. Lit., Ph. D.,) గారికిని, शिव शंकर काव्य दर्शन అను సమీక్షాకృతిని హిందీలో రచించిన సాహిత్యరత్న, విద్వాన్, రాచకొండ నరసింహ మూర్తి గారికిని, కొన్ని కృతులను హిందీ భాషలోనికి అనువదించిన విద్వాన్, సాహిత్యరత్న, అయాచితుల హనుమచ్ఛాస్త్రి (M.A.) గారికిని, మాతృక సరిచూచి సమగ్రముగా Proofs చదివి, కావ్యాంతర్గత సంస్కృత శ్లోకములకు భావానువాదము చేసిన కావ్యతీర్థ, కవితావతంస, గట్టి లక్ష్మీ నరసింహ శాస్త్రి గారికిని, ధన్యవాదములు.

గ్రంథ ముద్రణములో సర్వవిధముల తోడ్పడిన బ్రహ్మశ్రీ, అక్కు పెద్ది వెంకట నరసింహము గారికిని, భారతీ ప్రెస్సు యజమాను లగు శ్రీ మేడిసెట్టి సుబ్బయ్య గారికిని ధన్యవాదములు. వీరి సహకారము విస్మరించుటకు వీలు లేనిది.

తల్లావఝ్ఝల కృత్తివాస తీర్థులు

సాహితీ సమితి
నవంబరు 10 1952

పద్మావతీ చరణ
చారణ చక్రవర్తి

. అంకితము .

భార్యా స్మృతికి

# పాత్రలు

పద్మావతి

జయదేవుడు

పరాశరుడు

లక్ష్మణసేనుడు

మహేశ్వర భట్టు

వామదేవ దీక్షితులు

నీలకంఠ మఖి

ఉమాపతి

ధోయీ కవి

గోవర్ధనాచార్యులు

సమయము: క్రీ. శ. 12 శతాబ్ది

కాల పరిమితి: రమారమి ఆరు యామములు

# ప్రథమ రంగము

గౌడ నగరము:

జయదేవ భవనము

**పద్మావతి**

పయన మొనరింప నున్నారు ప్రాణనాథ,
గౌడ లక్ష్మణసేన భూకాంతు సభకు.
అవధరింపగ వలయు కృపార్ద్రమతిని
ప్రార్థనము చేయుచున్న దీ పాదదాసి.

**జయదేవుడు**

ఏల యింత జాలి హృదయేశ్వరీ, తెల్పు
మెన్నడే నిరాకరించినాడె
నేటివర కితండు నీ వాంఛితంబును!
వెరగు దోప నిట్లు వేడ నేల?

**పద్మావతి**

ఏలనో కాని ప్రాణేశ, ఈదినాన
మానసాబ్జము దోలాయమాన మయ్యె,
వెరపు సైతము కలుగు నా విన్నపమ్ము
సఫలతం గాంచ దను మహాసంశయమున.

**జయదేవుడు**

ప్రార్థనమ్ము మాని ప్రాణేశ్వరీ, నాకు
ఆజ్ఞ యిత్తువేని యచిరముగనె

అనుసరించువాడ నౌదలం దాలిచి :
శంక విడువ దగదె యింకనైన?

### పద్మావతి

వినగ నెల్లరు గీత గోవింద కృతిని
పాడుదురు మీరు నృపసభా భవనమందు.
కావ్యదోషము లున్న నిష్కారణముగను
బయలుపెట్టరె పండిత ప్రవరు లపుడు ?

### జయదేవుడు

అష్టపదులు చాల అవధరించినవాడు
గోష్ఠిలోన నృపతి కుతుకమునను
కావ్యపరిసమాప్తి కావుట యాలించి
ప్రభు వొసంగె నాజ్ఞ పఠనమునకు.

అధిపు దర్శనార్థ మరుదెంచి యున్నారు
దాక్షిణాత్య పండిత ప్రకాండు
లీ దినంబు, వార లేతెంత్రు లక్ష్మణ
ప్రభుని సభకు కావ్యపఠనవేళ.

నిఖిల కళలయందు నిష్ణాతులై మహా
విబుధులైనవారు విన్నయపుడు
కావ్యబంధమందు గలుగు ప్రాశస్త్యంబు
విశద మగును, కవికి యశము నిలుచు.

అవగుణంబు లున్న నాస్థానకవి కృత
గ్రంథమందు ధరణి కాంతునకును

కీర్తి తరుగు ననుచు గీత గోవిందమ్ము
తరచి చూచినాను తాల్మితోడ.

అంతె కాక శ్రీమ దాచార్య గోవర్ధ
నార్య సమ్ముఖమ్మునందు కృతిని
ఆదినుండి శ్రద్ధ నాలింపగా ఉమా
పతియు, శరణ కవియు- పాడినాను.

దోషరహిత మనియె ధోయీ కవీంద్రాది
సమితి యెల్ల, నాకు శాంతి యొదవె.
అతి కుశాగ్రబుద్ధి యౌ పరాశరునకు
కావ్య మయ్యె నపుడె కంఠగతము.

కావ్యశోభకారకు కావింప దగు మార్పు
లేవి తోచకున్న వింక నాకు.
పరిణతాత్మ యైన పద్మావతీ దేవి
భావ మేమొ విశద పరప వలయు.

## పద్మావతి

రస సదన మైన కృతి శరీరమ్మునందు
కానబడుచున్నయది కళంకత్రయమ్ము.
ప్రాణనాయక, మన్నించి పాదదాసి
విన్నపము, దాని దొలగించివేయ వలయు.

## జయదేవుడు

నా తలంపునందు నాలుగు దోషముల్ :
పదమునందు, వాక్య బంధమందు

అర్థమందు, రసమునందును : వీనిలో
తుదిది యొకటె ప్రబలదోష మబల !

అందుగూడ నెవి రసాది ప్రతీతి ప్ర
కర్షములకు బంధ కారకములొ,
సహజముగనె యెవి రసప్రతీతి విలంబ
కారకములొ వాని గడపవలయు.

దోష మున్న దాని దొలగించి వేయుటే
కవికి సముచితంబు, కావ్యమందు
తెలుపగదవె సకల లలితకళాభిజ్ఞ!
తోచినట్టి ప్రబల దోషములను.

## పద్మావతి

కరలి పద్మావతీ చరణ చారణ చక్ర
వర్తి యం చాదినే వైచినారు
స్థానాంతరమ్మున జయతి పద్మావతీ
రమణ యం చేమేమొ వ్రాసినారు.

వేరొక తావున విహిత పద్మావతీ
సుఖసమాజే యంచు జొనిపినారు
ఇమ్మాడ్కి నా పేరు ముమ్మారు గీత గో
విందబద్ధమ్ము కావించినారు.
కేవలమ్ము రహస్యంపు గ్రీడలందె
పేర్కొనం దగు నిజభార్య పేరు మీరు
స్వీయకావ్య శరీరాన చేర్చుకతన
గ్రంథమునకు కలంకమ్ము కలుగ లేదె ?

### జయదేవుడు

తనివి తీరునే సుధామధురమ్ము నీ
నామధేయ చింతనమ్ము వలన
పద్మ, కావ్యమందు బద్ధంబు చేయుట
వలన దాని కొదవె వైభవంబు.

సకల లోక పూజ్య జగదంబ పేరె నీ
పేరు పద్మ, దాని చేరుకొన్న
రసన మీది రజన రాలిపోవు టె కాక
ఆర్ద్రి మయి పవిత్ర మగును గాదె !

కవులు కృతులయందు కాంతాభిధానంబు
సంస్మరించుచుంట సరసమె కద !
ఉన్నవారు కొంద రుత్సాహవంతులు
పెట్టినారు భార్యపేరె కృతికి.

### పద్మావతి

నిండుసభలోన నేడు నా నృత్య విషయ
మవధరించిన పెద్ద లే మందురో కద !
కవుల దృష్టాంతముల్ పెక్కు కలవు నాథ.
కాని బాధించుచున్నది గాఢ లజ్జ !

### జయదేవుడు

విన్నయపుడు దాన వ్రీడాకరం బైన
దేమి యుండు వార లేవగింప ?
నేర్పు కలదు నీకు నృత్యాది కళలలో
నని గ్రహించి మిగుల నభినుతింత్రు.

### పద్మావతి

మీకు మీ భార్యపై ప్రీతి మేదురముగ
నుండుగాక, మనస్సులో నుంచికొనుట
సముచితం బగు, ఈరీతి జనము మ్రోల
ప్రకటనము చేయ పాడియే ప్రాణనాథ !

### జయదేవుడు

అవిదితంబె నీకు కవులు నిరంకుశుల్,
స్వేచ్ఛలోనె వారి జీవనంబు!
ఒరుల కెట్లు సాధ్య మున్నత మాతంగ
గమన మాప వారికవితయందు ?

### పద్మావతి

చాటువాక్యాలచే వివశత్వ మొదవు,
అయిన నా తుది విన్నపం బాలకించి
తెలియనీయక పద్మావతీ సమాఖ్య
జగమునకు, నన్ను రక్షింప దగును నాథ !

### జయదేవుడు

చెప్పలేదు నేను సిగ్గిల దగు మాట
నామ ముగ్గడించినాను కాని.
నీవు కళలలోన నిష్ణాత వను కీర్తి
శాశ్వతముగ నిలుచు జగమునందు.

ఓర్మి నీవు నాకు నుత్సాహ మీకున్న
కావ్య మెట్లు చేయ గలుగువాడ ?

పద్మ, పద్మ, నాదు ప్రాణేశ్వరివి, మూర్తి
దాల్చి నట్టి యిష్ట దైవతమవు !

పరాశరుడు

( త్వరితముగా ప్రవేశించి )

జాగు చేసెద వేల జయదేవ, యింక ?
నీకోస మెల్లరు నిర్నిమేషముగ
ఉత్కంఠతో వేచి యున్నవా రరుగొ
పట్టభంగ శ్రేణి పార్శ్వమ్మునందు.
కవివత్సలుండు లక్ష్మణసేన నృపతి
పంపె నాదరముతో భద్రగజమ్ము.
జాగు చేయక రమ్ము, స్తంబేరమమ్ము
నిలిచి యున్నది ద్వార నికటమ్మునందు.

నీహస్తగత మైన నీలకౌశేయ
బద్ధ మనోజ్ఞ ప్రబంధమ్ము సఖుడ,
రాధికా దృఢ పరీరంభమం దున్న
గోవిందుపోలిక గోచరించినది.

పద్మావతి

అదిగొ కల్యాణశంసి ఘంటారవమ్ము !
బయలుదేరుడు నృపసభాభవనమునకు.
వరదు డైనట్టి రాధికా వల్లభుకృప,
విజయ మగుగాక గీతగోవింద కృతికి !

## ద్వితీయ రంగము

### లక్ష్మణసేన మహారాజ సభ

**మ హా రా జు**

భూసుర పుంగవు, లేత
ద్యాసరమున కావ్యగోష్ఠి తత్పరు లగు మీ
యాసంపూర్తి శ్రవణము
మా సుకృతఫలంబు గాక మరియొం డగునే!

మీరో సమస్త విద్యా
పారంగతు, లఖిల కావ్య భవ్య సమీక్షా
ధీరులు సంగీతకళా
పారీణులు, పూత దేవభాషా కవులున్.

కావున మా కెరిగింపం
గావలె విపులముగ కావ్యగానంబులు మీ
కేవిధముగ రుచియించెనొ:
కోవిదసమ్మతి యథార్థగుణకమ్ము గదా!

**మహేశ్వర భట్టు**

చిత్తము మహాప్రభూ, మీ రశేష శేము
షీ ధురంధరులు, రసజ్ఞశేఖరులును,
అట్టి మీ సన్నిధానమునందు మేము
వ్యాఖ్య చేయుట కేవల మాజ్ఞవలన.

మేము వినలే దతఃపూర్వ మీమనోజ్ఞ
గీతగోవింద సంగీత రీతు లెపుడు.
తనివి తీరగ గానామృతమ్ము గ్రోల
జ్వరము వాసె పుటాయిత శ్రవణములకు!

కానవచ్చును నన్నవి గానకళలు
శీఘ్రకాలములో మారు చిన్నె లెన్నొ.
అయిన, జయదేవ కవి శేఖ రాష్టపదుల
పాట కెపుడు జగత్తులో లోటు రాదు!

## వామదేవ దీక్షితులు

మాళవ, వసంత, దేశవరాళి, గుణ క
రీ, గుణక్రియలును, ఘూర్జరీ విభాస
భైరవులును, రామక్రియ పాడినాడు
రక్త కంఠముతో కవిరాజు నేడు.

మ్రోగుచున్నది ఘూర్జరీరాగ మింక
మా శ్రవోయుగళంబున మధురకళల.
కవివరేణ్యుని యద్భుత గానకలన
కావ్యబంధము మధురిమోద్గారి యయ్యె!

## నీలకంఠ మఖి

కవులు ప్రాయికముగ గాయకుల్, జయదేవ
కవివరుం డఖండ గాయకుండు
నేటి గానమునకు నిజముగా గంధర్వు
లైన వివశు లగుట యబ్బురంబె?

కావ్యవిషయ మింక గాదేశ! అన్యథా
యీ కవిప్రకాండు డెంచకున్న
వివరములను కొన్ని విద్వద్వినోదార్థ
మడుగ దలతు మాజ్ఞ యయ్యెనేని.

### మహారాజు

సుమనసుల భాషణంబుల
కమర్ష మెటు కవికి కలుగు? అగుటన్ సంకో
చము వీడి కావ్య మియ్యెడ
విమర్శ చేయంగ దగును విబుధ ప్రవరా!

### నీలకంఠ మఖి

ఎందు జేర్చవచ్చు నీనవ్యకావ్యంబు?
కాదు నిండురూపకమ్ము గాని,
శ్రవ్యకావ్య మైన సంపూర్ణముగ గాదు,
గేయకృతియు గాదు కేవలముగ.

### ఉమాపతి

ఏల చేరవలయు నే శ్రేణిలోనైన?
సూక్ష్మదృష్టితోడ జూమనెడల
ప్రతికవీంద్రు రచన ప్రత్యేకమై యుండు,
కూడు నన్నిగతులు కొన్నియెడల.

ఏ గుణంబు మిగుల హెచ్చుగా గాన్పించు
చుండు దానివలన నొదవు నాఖ్య
యెట్టి కృతికినైన: ఈ మహాకావ్యంబు
నందు గేయగుణము తుందిలంబు.

## నీలకంఠ మఖి

వినుతి కెక్కినారు వెనుకటి కవివరుల్
వేలకొలది పద్యవితతితోడ
సర్గబంధములను సంఘటించి యుదాత్త
వస్తు కథన గౌరవంబు మీఱ.

ఇందు శేయసంఖ్య యిరువదినాలుగు,
పదియు నొదువ నూరుపద్యములకు,
ఇట్టి గ్రంథమునకు నేవిధంబుగ మహా
కావ్యసంజ్ఞ నీయగలము చెపుడు!

## శరణ మిత్రుడు

గ్రంథ బాహుళ్యమే మహా కావ్యమునకు
కాదు లక్షణ, మమరుక కవివతంసు
పద్య మొక్కటి నూరు ప్రబంధములకు
సాటి యని విశ్రుతము కాదె సరసనూక్తి?

## వామదేవ దీక్షితులు

శ్రీమ దాచార్య దండి శాసించినాడు
సర్గబంధమునందు అష్టాదశ మిత
వర్ణన విధానములు చూపవలయు ననుచు:
కలవె యన్ని యేత ద్గీతి కావ్యమందు?

## శరణ మిత్రుడు

సంఖ్య కష్టాదశమ్ముగా సంతరింప
గ్రంథమున వర్ణనలు మహాకావ్య మగునె?

## వామదేవ దీక్షితులు

వృత్తములు గేయములకన్న నుత్తమమ్ము
లనెడి ఛందోవిదారయ మఖిలవిబుధ
సమ్మతం, బింధు గీతికాసరణి యుండు
కతన న్యూనత కలుగదె కావ్యమునకు ?

## ధోయీ కవి

శ్రవణసౌఖ్యమె లక్ష్యము ఛందమునకు :
చదువవచ్చును పద్యాలసరణి వీని,
పద్యమునకైన గీతికా పదముకైన
రాగ తాళాల వరుసను రక్తి యెందు.

## వామదేవ దీక్షితులు

ఒకట శార్దూల విక్రీడి తోక్తితోడ
అవల నొకదాన పుష్పితాగ్రాహ్వయమున
పృథ్వి యని యింక నొక్కచో పేరు చొనిపె
వృత్తములయందు : అర్థాన వెలితి రాదె ?

## ఉమాపతి

ప్రకరణార్థమునకు భంగంబు గూర్చి త
త్పదములే ప్రధానతను వహింప
అనుట తగును దోష మని : చమత్కారంబె
ప్రతిఫలించె మూడు పద్యములను.

## వామదేవ దీక్షితులు

అతిమధుర మైన శబ్దవిన్యాస కలన
సారెసారె కలంకార చతురిమమున

పదశరీరముపై నిల్పి భావగరిమ
గనుగొనగ నీదు బుద్ధి నీకావ్యరచన.

### ధోయీ కవి

మాటలను రీతులందును మధురిమంబు
ద్యోతితం బైన, శోభకే హేతు వగును.
అధమ మగు శబ్దచిత్ర మేయైన కావ్య
మిందు నీపదలంకృతియే యొసంగు.

### మహేశ్వర భట్టు

వివిధవిధముల గీతగోవిందమందు
కడు విశృంఖలరీతి నీ కవివరుండు
రతిని వర్ణించుకతమున రక్తి హెచ్చ
దే పఠన పాఠనమ్ముల దేహముపయి ?

### గోవర్ధనా చార్యుడు

ఇందుల కవి రాధా గో
విందుల లీలలను భక్తివివశుండై యా
నందంబున మకరంద
స్యంది వచో గుంఫనముల నభివర్ణించెన్.
జనియింపవచ్చు నొకచో
మనుష్యరతివర్ణనమున మదిని వికారం,
బనఘమతి దివ్యచరితము
వినంగ నేలాగు కలుగు వికృతి మహాత్మా !
రసికప్రవరుల కెల్లన్
రసాపకర్షకము కాదు రతివర్ణన; మీ

యసదృశకృతి దాత్పర్యం
బెసంగు జీవేశ్వరైక్యమే తలపోయన్.

ఎరుక గలవార లందురు
శరీర మాద్యమ్ము ధర్మసాధన మని : త
ద్వరవాక్యంబును మెచ్చని
విరాగులకు దేహ మన్న విసుగు కవీశా !

మీరు వినోదార్థముగా
నేరిన దోషములె కాక యితరము లెన్నో
ఆరోపింపగ జాలుదు
రూరక, నిజదృష్టిదోష మున్న జనంబుల్.

## మహేశ్వర భట్టు

భక్తులకు రసికులకును పండితులకు
కవిజనంబుల కిది మహాకావ్య మగును.

## మహారాజు

మణిహారమును పుష్పమాలికం జుట్టి
గ్రంథరాజము భద్రగజముపై నుంచి
వివిధ వాద్యములతో వీధులవెంట
వైభవమ్ముగ నుత్సవము చేయవలయు.

శిల్పిచే చెక్కించి శ్రీ జయదేవ
కవిరాజ నామమ్ము గారుత్మతాశ్మ
ఫలక భాగమ్మున భర్మాక్షరముల,
జాలమార్గముకడ సంధింపవలయు.

కవిరాజు భార్యకు గౌరవార్థముగ
అర్పించినార మీ యాభరణాలు.
ఒసగినారము తటి న్యుద్యానవాటి
బిందుబిల్వం బనుపేరిట కవికి.

తగు బిరుదంబుగా తన భాషితంబె
మన కవీంద్రునకు : పద్మావతీ చరణ
చక్రవర్తిగ సభాస్తారు లెల్లరును
అంగీకరింత్రు గా కైక కంఠ్యముగ !

( సభ్యుల హర్ష ధ్వనులు )

మహేశ్వర భట్టు

దేవ, మీ కవుల్ విక్రమాదిత్య భోజ
ధరణి పాస్థాన కవులకు తగ్గిపోరు.

మ హా రా జు

వాచః పల్లవయ త్యుమాపతిధర,
స్సందర్భ శుద్ధిం గిరాం
జానీతే జయదేవ ఏవ, శరణః
శ్లాఘ్యో దురూహ ద్రుతేః
శృంగారో త్తర సత్ప్రమేయ రచనై
రాచార్య గోవర్ధన
స్పర్ధీ కోపి న విశ్రుతః, శ్రుతిధరో
ధోయీ కవిక్ష్మాపతిః .

## వామదేవ దీక్షితులు

యది హరిస్మరణే సరసం మనో
నవకథాసు విలాస కుతూహలమ్
సరస కోమల కాంతపదావలీం
శృణు తదా జయదేవ సరస్వతీమ్.

## నీలకంఠ మఖి

యద్గాంధర్వ కలాసు కౌశల మను
ధ్యానం చ య ద్వైష్ణవం
యచ్ఛృంగార వివేక త త్త్వరచనా
కావ్యేషు లీలాయితమ్
త త్సర్వం జయదేవ పండితకవేః
కృష్ణైక తా నా త్మనః
సానందాః పరిశోధయన్తు సుధియః
శ్రీ గీతగోవిన్దతః !

## గోవర్ధనాచార్యులు

శ్రీ భోజదేవ ప్రభవస్య, రామా
దేవీ సుత శ్రీజయదేవకస్య
పరాశరాది ప్రియవర్గకంఠే
శ్రీగీతగోవింద కవిత్వ మస్తు !

## తృతీయ రంగము

(జయదేవుని భవనాట్టాలికపై పద్మావతి నిలిచి యుండును. రాజమార్గమునుండి కోలాహలము)

జయము జయమ్ము శ్రీ జయదేవ కవికి !
విజయమ్ము గీతగోవింద కారునకు !
జయము పద్మావతీ చరణ నీరేజ
చారణ మృదుకలా సార్వభౌమునకు !

జయ గౌడ నృపసభా జలజాత హేళి !
జయ గాయతోత్తంస, జయము జయమ్ము !
జయము భక్తాగ్రణి, జయము జయమ్ము !
జయము పరాశర సఖ, విజయమ్ము !

విజయమ్ము రాధికావిభునకు, జయము !
విజయమ్ము విజయమ్ము విష్ణుభక్తులకు !
సత్కవిత్వమునకు జయము జయమ్ము !
జయము జయమ్ము శ్రీ జయదేవ కవికి !

### పరాశరుడు

(పేటికతో పద్మావతిని సమీపించి)

మన కిది చెల్లెలా, మహితవాసరము !
జయదేవు డీనాడు చంద్రునిబోలి
షోడశకళలతో శోభిల్లినాడు
గౌడాధిపతి సభా గగనాంగణమున !

## పద్మావతి

నీవు కవియును బయలు వెడలిన
నిముస మాడిగ నడచిపోయిన
ఘటన లన్నియు దెలుపు మన్నా,
కర్ణపేయముగన్.

## పరాశరుడు

(పేటికను వాతాయనమున నుంచి)

ప్రజలు వారులు దీర్చి పార్శ్వంబులందు
జయజయధ్వానముల్ సల్పుచుండంగ
భక్తి నంజలి ఘటింపగ రాజపురుషు
లెక్కినా ముభయుల మిభరాజుమీద.

మాటిమాటికి రాజమార్గంబునందు
కల్యాణశకునముల్ కాన్పించుచుండ
గజరాజు సత్వరగమనమ్ముతోడ
కొల్వుకూటమునకు గొంపోయె మమ్ము.

కవివరుల్ పండితుల్ గాయకోత్తములు
ఉన్నత రాజకీయోద్యోగిజనులు
పౌరాగ్రణుల్ రెండుపార్శ్వంబులందు
కూర్చుండి యుండిరి కొల్వుకూటమున.

ఇంతలోన నృపాలు డెదురుగా వచ్చి
జయదేవు మృదుపరిష్వంగంబు చేసి
కనుగొని నను శిరఃకంపంబుతోడ
వెడలె లోనికి మేము వెనువెంట జనగ.

జయ మహాగౌడ లక్ష్మణసేన భూప
యనుచు సభాసదు లైకకంఠ్యముగ
బల్కుచు లేచిరి: ప్రభుసమీపమున
కూర్చుంటి మాయన కోరికమీద.

ఆచార్య గోవర్ధనార్యుండు పిదప
తనకు నాగంతుక దాక్షిణాత్యులకు
పరిచితి చేయ సంభావించినాడు
కోవిదులను కవి కుశలమ్ము లడిగి.

అవల లక్ష్మణసేను డానతి యిచ్చె:
"ఆర్యులారా, ఇంక నవధరింపుండు
జయదేవ కవిరాజు స్వప్రబంధంబు
కర్ణపేయమ్ముగా గానము చేయు."

ఉద్యాన వనసీమనుండి యవ్వేళ
పరిమళశీతల పవమానవీచి
కావలి మృదువుగా నలముచుండంగ
సభ్యులవదనముల్ సంఫుల్ల మయ్యె.

అవల గ్రంథము దీసి యధిపతి గాంచి
జయదేవకవి సభాస్తారుల జూచి
అంజలి ఘటియించి యల్లన అనియె-
వినిపింతు గీతగోవింద కావ్యంబు.

అంతట వాగ్దేవతాదికం బగుచు
పద్మావతీత్యాది పంక్తి కల్పట్టె
పద్యంబు నతిలోకభావపూర్ణముగ
పాడినా డమ్మ, నీప్రాణవల్లభుడు!

## ప ద్మా వ తి

అయ్యో, సి గ్గగుచున్న దయ్యెడ
ఆ మహావిబుధాగ్రగణ్యులు
కాని, లక్ష్మణసేన నరపతి
కాని యే మనిరో !

## ప రా శ రు డు

సరసుండు లక్ష్మణ సార్వభౌముండు
ప్రార్థించె తత్పునః పఠనమ్ముకొరకు.
దిశ లెల్ల నిజనేత్రదీధితుల్ పర్వ,
పాడెను కవి లతల్ పల్లవింపంగ !

అంతలోపల ప్రతీహారి యేతెంచి
జయము మహాప్రభూ, జయ మని పలికి
శిల్పశోభిత మైన చిరుతపేటికను
ధరణినాథుని సన్నిధానమం దుంచి—

పద్య మాకర్ణించి పట్టపుదేవి
పారితోషికముగా పంపి యున్నారు
అని నిష్క్రమింపగా, నవనీశ్వరుండు
తత్పేటికాంతర్గతంబై వెలుంగు

నూతనమణిమయ నూపురద్వయము
దీసి కవీంద్రునిదెస విలోకించి
మందహాసమ్ముతో మరల నం దుంచ,
మేలు మే లని బుధుల్ మెచ్చుకొన్నారు.

పద్మావతి

రసనిధానం బైన కావ్యము
రచన చేసిన కవికె గానీ
భార్య కేటి కొసంగవలయును
పారితోషికమున్ !

పరాశరుడు

భార్య కొసంగుచో పారితోషికము
భర్తనుగూడ సంభావించినట్లె.
బహుమానముల నెల్ల పరికించునెడల
నిజముగా నీనాడు నీకె జయమ్ము!

( పేటికనుండి పత్రిక దీసి )

"గానము చేయుచో కవివల్లభుండు
పద్మావతీదేవి పాదయుగ్మమున
అలరు గావుత నాట్య మాడెడువేళ
మధురశింజితముతో మణినూపురములు."

ప్రభువరేణ్యుని పార్శ్వభాగమం దున్న
కక్ష్యలో గూర్చుండి కావ్యంబు వినుమ
రసపిపాసాయత్తరాజ్ఞి యుద్రిక్త
హృదయమ్ముతో జేసె నీ చతుష్పాది.

పద్మావతి

తెలియదు దేవి రసజ్ఞురా లని
దేవభాషాభిజ్ఞురా లని

నేడు విశదం బయ్యె కవితా
నిపుణురా లనియున్.

పరాశరుడు

వీక్షించినా వమ్మ, వెల లేనిరత్న
తాటంకయుగళి పద్మావతీ రమణ
జయదేవి కవి యనుసందర్భమందు
పంపె రాజకుమారి పారితోషికము.

ఈ కంకణమ్ములు నీకాంచిదామ
మీమణిహారమ్ము నీబాహుపురులు
విభు డొసంగెను నీకు విహిత పద్మావ
తీ సుఖేత్యాది ప్రదేశగానమున.

పద్మావతి

ఏటి కన్నా, బ్రాహ్మణాంగన
కీయమూల్యానేకభూషలు:
అర్హమా జగదంబ పద్మకు
అర్పణము సేయన్.

పరాశరుడు

కవిభార్య వని నీకు గౌరవంబునను
బహుమాన మొసగిన ప్రభుకుటుంబమ్ము
నిల్పుకొన్నది గాని నిజగౌరవంబు—
ఆభరణమ్ము లే రర్థించినారు ?
ఆపగాతీరాన ననతిదూరమున
రమణీయ మైన యారామము కలదు.

అందలి కాసార మలరారుచుండు
అబ్జాతములతోడ అంచలతోడ.

మాధవీమంటప మధ్యభాగముల
లాస్యముల్ సేయు కలాపముల్ విప్పి
క్రేంకారములతోడ కేకిసంఘంబు.

సహకారభూమిజ శాఖలలోన
పాడును కోకిలల్ పంచమశ్రుతిని.
శుకగణ తీక్ష్ణచంచూ వినిర్దళిత
ఫలరసంబులు నేల ప్రవహించుచుండు.

మకరందరసపానమత్త ద్విరేఫ
ఝుంకారముఖరిత శాద్వలస్థలుల
హరిణముల్ లీలావిహారముల్ చేయు.

వీనుల విందుగా వేణుకుంజముల
మురళీరవము ముహుర్ముహు రుల్లసిల్లు,
కనులపండువు చేయు క్రముకమార్గములు,
వకుళావనీజముల్ వాసించుచుండు,
తాపమ్ము పున్నాగతరువులు పాపు.

ప్రభువతంసుడు కావ్యపఠనాంతమందు
కాన్కగా నొసగెను కవిచంద్రమునకు
అతిమనోహర మైనయారామవాటి
బిందుబిల్వం బను ప్రియనామ ముంచి.

కావ్యప్రతిని నమస్కారపూర్వకము
గా స్వీకరించుచు కనుల కద్దుకొని

ఉత్తమాంగంబుపై నొక్కింత నిలిపి
ఆనతి యిచ్చె ముఖ్యామాత్యు జూచి:
"మణిహారమును పుష్పమాలికం జుట్టి
గ్రంథరాజము భద్రగజముపై నుంచి
వివిధ వాద్యములతో వీధులవెంట
వైభవమ్మున నుత్సవము చేయవలయు.
శిల్పిచే జెక్కించి శ్రీజయదేవ
కవిరాజనామమ్ము గారుత్మతాశ్మ
ఫలకభాగమ్మున భర్మాక్షరముల
జాలమార్గముమీద సంధింపవలయు."
కవితాప్రియుండును కవి విధేయుడును
కవివత్సలుండు లక్ష్మణసేన నృపతి
నామము జయదేవనామమ్ముతోడ
ఆచంద్రతారార్క మలరును గాక!
అన్ని విశేషము లవల చెప్పెదను,
ప్రొద్దు పోయిన, దింక పోయెద నమ్మ!
ద్వారదేశమున పెద్దల వీడుకొల్పి
చనుదెంచు లోనికి జయదేవు డదిగో.

(నిష్క్రమించును)

**జ య దే వు డు**

( ప్రవేశించి అనునయముతో )

**కలుగలే దాయె నా కవకాశ మింత**
**దనుక ప్రియతమ, నీసన్నిధానమునకు**

మరలి వచ్చుటకై క్షమామండలేంద్రు
నతిథినై యుండుకతన బ్రాహ్మణులతోడ.

అందియుండును నీకు నే నంపినట్టి
వార్త : లవకాశమున నిటు వత్తు నన్ను
కూర్మి మీర సారస్వతగోష్ఠిలోన
నేడు నన్ను విద్వత్కవుల్ పేడరైరి.

భోజనానంతరమ్ము సంపూర్ణచంద్రి
కా మనోహర కాంతిలో గజముమీద
గ్రంథమును నిల్పి నగరమార్గములవెంట
నుత్సవము చేయ బంపె నృపోత్తముండు.

నను గజారోహణము ధరానాయకుండు
చేయు మని కోర, పండితశ్రేణితోడ
నగరవీధులవెంబడి నడతు నంటి :
ఎట్టకేలకు గాడేను డియ్యకొనియె.

ద్వారదేశమువరకు నుత్సవముతోడ
వెంట నరుదెంచుపెద్దల వీడుకొలిపి
ఏగుదెంచితి లోనికి నెపుడు నిన్ను
చూడగల్గుదు నను మహోత్సుకతతోడ !

## పద్మావతి

వత్తు రని నే వేచియుండగ
వార్త లందెను సక్రమమ్ముగ,
ఉత్సవమ్మును జాలమార్గము
నుండి కనుగొంటిన్.

లేదు చందనపేటియందును,
లేదు మీహా స్తమ్మునందును,
ఉత్సవమ్మున విస్మరించితి
రొక్కొ కావ్యంబున్ ?

జయదేవుడు

అధిపున కొసంగితిని పఠనాంతమందు;
కంఠగత మైనపిదప నా గ్రంథ ముంచు
నవనిపతి హేమపేటికాభ్యంతరమున
సుందరా స్త్రీయ దేవతా మందిరాన.

పద్మావతి

నేడు గానం బవిరతంబుగ
నిండుసభలో జేయుచుండగ
కంఠమున స్వరభంగ మేమియు
కలుగ లేదు గదా ?

జయదేవుడు

కంఠమున గ్లాంతి యేమియు కలుగ లేదు:
ఒక్కయామము మాత్రమే యుదయవేళ
సార్థయామముపైన సాయాహ్నమందు
పాడితిని, పొంది కావ్యము పరిసమాప్తి.

పగలు సౌమ్యము మందాతపమ్మువలన
చలువరా కట్టడము సభా సౌధరాజ
ముపవనము పుష్పగుచ్ఛ నేత్రోత్సవమ్ము
ప్రసవసార వాసితము తద్భవనసీమ.

శ్రద్ధధానులు కూడిన సభ్యు లెల్ల
గానవిద్యా విశారదుల్ కలరు మెండు
సంస్కృతాభిజ్ఞు లున్నారు చాలమంది
కలరు కవిపుంగవులు నలంకారవిదులు.

రాగములకు విపంచి పరాశరుండు
మేళవింప ఉమాపతి మిశ్ర సుకవి
తాళములు వేయగా, ప్రమోదంబుతోడ
పండితోత్తము లాలింప, పాడినాను.

ఆంధ్ర విబుధులు సకల విద్యా ప్రవీణు
లధిక మేధానిధులు పద్మ, అవల వారి
కావ్యమీమాంస వివరింతు: గానమునకు
పరవశత జెంది మెచ్చిరి బహువిధాల.

అచ్చెరువు గొల్పె నాకు సేనాధిపతియె
ఆలకించుట సంగీత మంతతడవు:
చామరగ్రాహి వివశహస్తములనుండి
సారెసారెకు వీవనల్ జారుచుంట.

స్త్రీజనోచిత మగు లజ్జ చెందినావు
కాని, నీ మంజులాభిధ కావ్యమందు
కర్ణగోచర మైన యాఘట్టములనె
సరస రాజ కుటుంబంబు సత్కరించె.

రాజ్ఞి యొసగెను మణినూపుర ద్వయంబు
రత్నతాటంకము లొసంగె రాజపుత్రి
ఒసగినాడు నృపుండు కేయూరయుగళి
కాంచిదామమ్ము హారమ్ము కంకణములు.

ఆపగా తీర మంజులోద్యాన వాటి
నధిపు డొసగెను బిందుబిల్వాహ్వయమున.
అందు శ్రీరాధికా వల్లభాలయమ్ము
ఘనకాలమునం బ్రతిష్ఠింతు పద్మ !

## పద్మావతి

అభిజనం బగు బిందుబిల్వము
నందు నిర్మించితిరి పద్మను
అచటి జనములు హార్ష మొందగ
ఆలయము మున్నే.

ప్రభు సమర్పిత బిందుబిల్వో
పవన వాటికయందు రాధా
వల్లభాలయ వినిర్మాణము
వైభవమే యవుతన్ !

ప్రత్యహమ్మును బిందుబిల్వము
పావనం బగుగాక నాథా,
పరమ భాగవతాగ్ర గణ్యుల
పాద సంస్పర్శన్ !

## జయదేవుడు

గాయకుల్ హరివంశ, భాగవత, విష్ణు
బ్రహ్మవైవర్తముల్, గర్గభాగవతము
గీతగోవింద కావ్యంబు ప్రీతితోడ
పాడుచుందురు మందిర ప్రాంగణమున.

గౌడవాసుల మైత్రి మాత్రా క్షేమములోని
బిందుబిల్వము విడిచి - అపేరె కృపను
ఉపవనికి లక్ష్మణప్రభు వుంచె మనల
నభిజన వియోగ ఖిన్నత యలమకుండ.

పద్యపాదంబె లక్ష్మణ ప్రభువరుండు
నాకు బిరుదంబుగా నుంచినాడు నేడు;
త్రిభువనమ్ముల పద్మావతీ, త్వదీయ
చరణ చారణు డనియే ప్రశస్తి యింక!

### పద్మావతి

(మందహాసము చేసి)

శ్రవణమునకే నిశితవేధ
శ్రమము నుద్వహన క్లమంబును
భూషణం బగు కుండలంబు
కపోలపాళికకే!

### జయదేవుడు

నీవు చెప్పినవాక్కులు నిక్కువములె:
రత్నభూషణ ధారణ శ్రమము నీకు
నాకుమాత్రము లోచనానందదాయి:
ప్రియతమా, భూష లొకసారి పెట్టుకొమ్మ!

### పద్మావతి

ఏటి కాభరణములు నాథా!
ఇంట వెలసిన వంశదేవత

త్రిజగతీ జనయిత్రి పద్మా
దేవి కర్పింతున్.

జయదేవుడు

అర్పణము చేసినాను సర్వాంగభూష
ణాళి పూర్వ మా పద్మకు నధికభక్తి.
మండనము చేయగావలె నిందురక్తి
నన్నిభూషలు నీపద్మ కభినవముగ.

నీ వలంకారముల్ దాల్చి దేవిమ్రోల
భక్తితో నాట్యమాడెడి పట్టులందు
నేను గానము చేయుచో, నిందుకృపను
ప్రేయసీ, చూచు దేవి సుప్రీత యగుచు.

పద్మావతి

అంతకన్నను వాంఛితం బెది?
అటులె యగుచో వల్లభా, మీ
శిల్పహస్తముతో నలంకృతి
చేయ ప్రార్థింతున్.

జయదేవుడు

( పేటికలో పత్రిక తీసి పఠించి )

మధురగీతిక లిఖియించు మహిషికోర్కి—
పద్మ, మన కిర్వురకును సంభావ్య మగుట
పాదయుగళికి నుంతు ప్రప్రథమమందు
రమ్య శింజాన మణినూపుర ద్వయంబు.

## పద్మావతి

చాలు నాథా; చాలు నే నప
చార మింకను జేయ జాలను !
తొలుత వేడుట మి మ్మలంకృతి
దోషమే యయ్యెన్ !

## జయదేవుడు

వల్లభుని యెడనే కదా వాంఛితంబు ?
చరణ సంస్పర్శవలన దోషమ్ము లేదు.
ఆననాబ్జ కరాబ్జ పాదాబ్జములకు
తారతమ్యము లేదు నా తలపునందు.

ప్రథమమా నాకు నీపద గ్రహణ సుఖము !
పెద్దవారల యానతి పెండ్లినాడె
ప్రమదమున నీపదాబ్జము పట్టినాను :
ఎరుక యున్నదె యావల నెన్నిసార్లొ !

మందమందాక్షి మత్యంత మంజులంబె-
పద్మ, ఒకదాని కబ్బురపాటు కలుగు-
మమ శిరసి మండన మ్మని మధురఫణితి
దేహి పదపల్లవ మ్మని దేవుచేత
అష్టపదిలోన రాధిక ననునయింప
జేసితివి కాదె, యిపుడు నిషేధ మేల ?

ప్రణయినీ, ఈంతు నీపద పల్లవముల
కమ్రమణి నూపురమ్ము లోంకార మిమ్మ !

ప ద్మా వ తి

కావ్యలోకమువందు, రాధా
కాంతుచే ననిపించు పల్కులు
ఈ ప్రపంచమునందు నాథా,
యెట్లు వర్తించున్ ?

జ య దే వు డు

తెలిసినది కృష్ణు డనవచ్చు దేవు డగుట-
నేనో ప్రియతమ, అనరాదు, మానవుండ.

ప ద్మా వ తి

ప్రత్యవాయం బొదవె నయ్యో
ప్రాణనాథా, ప్రమాదంబున !
పాదదాసికి మీరు సాక్షా త్పరమ దైవతమే !

అవధరింపుడు విన్నపము పా
దాదికేశాంతం బలంకృతి
వలదు చేయగ దేవతనువలె వల్లభా... వినరో !

జ య దే వు డు

నిన్ను ప్రాణేశ్వరీ, నేను నిఖిల దేవ
తా స్వరూపిణిగా నెంతు తలపులోన
సత్యముగ : ఈ యసార సంసార యాత్ర
భార్య యనుభామణము విడంబనము సుమ్మి !

లలిత మణిమయ భూషణాలంకృత మయి
తావకీన తనూలత తనరు మిగుల

పల్లవిత మైన వాసంత వల్లివోలె
శాణితం బైన పుష్పేషు శరము వోలె !

చంద్రికాప్లావిత ప్రదేశమ్మునందు
చేయు మొక్కంత నృత్యమ్ము చిత్త మలర.

**పద్మావతి**

( నృత్యము చేయుచు )

హరి చరణ శరణ జయ దేవ కవి భారతీ
వసతు హృది యువతి రివ కోమల కలావతీ !

శ్రీ మద్రాధా వల్లభో విజయతే !

**సమాప్తము**

# వర పరీక్ష

అంకితము

శ్రీ తెలికిచర్ల వెంకట రత్నానికి

## పాత్రలు

జ్యోతి స్సింగు

అలకా దేవి

గంభీర సింగు

దుర్జయ సింగు

అమాత్యుడు

సైనిక బృందము

సమయము : క్రీ. శ. 16 శతాబ్ది
కాల పరిమితి : రమారమి 12 యామములు

# ప్రథమ రంగము

అర్ధరాత్రము : దుర్గములో అంతఃపురము

**జ్యోతిస్సింగు**

అది యేమి చిత్రమో అడుగడుగునకు గూడ
అపశకునమే యయ్యె ప్రియురాలా !
పయనమ్ము మాను డని పరివార మంతయును
ప్రార్థించినది నన్ను ప్రియురాలా !
గుర్రాలు మరలించి, కోటలోనికి బోవ
కోర్కి జనియించినది ప్రియురాలా !
కాని తావక సమాగమ భావనావేశ
గరిమ నను లాగినది ప్రియురాలా !

**అలకాదేవి**

శ్రమ మిచ్చితిని మీకు ప్రాణేశా !
క్షమియింతురా నన్ను ,,
కష్టమ్ము లేకుండ ,,
కనుగొంటిరా త్రోవ ,,
అందదో వార్త యని ,,
ఆందోళనము పుట్టె ,,
చూచువరకును మిమ్ము ,,
క్షోభ తగ్గనె లేదు ,,
సిగ్గు విడిచితి నను ,,
చింతింప రని యెంతు ,,

## జ్యోతిస్సింగు

సిగ్గు విడుచుట యేమి ! శ్రీరుక్మిణీ దేవి
చేసె గాదా యిట్లె ప్రియురాలా !
అంధకారము దిశల నలముకొను నందాక
అడవిలో విడిసితిని ప్రియురాలా !
భటుల నందే నిలిపి పశ్చిమప్రాకార
భాగమ్ము దరిసితిని ప్రియురాలా !
నీ యానతిని వ్రాలు నిశ్రేణి మార్గాన
నిమ్నభాగమునుండి ప్రియురాలా !
కుడ్య మారోహించి కోటలోపల జొచ్చి
గుప్తమ్ముగా నుండ ప్రియురాలా !
పరులు కనుగొనకుండ భద్రమ్ముగా నన్ను
ప్రతిహారి కొనివచ్చె ప్రియురాలా !

## అలక

ఒక్కవేళ మీరు నాథ, ఒరులకంట బడిన గూడ
ఈదుర్గమునందు మీకు నెట్టి శ్రమము కలుగబోదు.

ఎచ్చటికో వెడలినార లీయుదయము మాజనకులు
తిరుగ రారు రెండు మూడు దినములు గడచెడువరకును.

జనకు లిచట లేనితరిని సకల భటులు నుద్యోగులు
పాలింతురు నాయానతి బదులుమాట పలుకకుండ.

ఇంతె కాక శూరులు మీ రేయాతంకము లేకయె
ఇందు విశ్రమింపవచ్చు నిచ్చ వచ్చినట్లు నాథ !

జ్యోతి స్సింగు

వీరాంగనా, నిన్ను వీక్షించినంతనే
శ్రమము తొలగెను, మనః స్థైర్యమ్ము నెలకొనెను.

వేట చాలించి నే వెడలిపోయెడివేళ
దుర్గమ్ము బురుజుపై తోచితివి ప్రియతమా!
సంధ్యారుణ ప్రభా స్నపితవై యానాడు
కనక పుత్రికవోలె కాన్పించితివి ప్రియా!

ప్రాంశు భూమిజాగ్ర ఫలముకై యానాటి
నుండి యుత్కంఠతో నున్నాను ప్రియతమా!

కొలదిసారులు నీవు గోచరింపగ దుర్గ
పశ్చిమ ప్రాకార భాగమ్ముపై ప్రియా,
అంతరంగమునందు ననురక్తి నామీద
కలదు నీ కని నాకు గలిగె విశ్వాసంబు.

దుర్గాధిపతి నాట దుఃఖహేతువె యయ్యెః
గురుతింతు రే నెంత గూఢమ్ముగా నున్న.
అయిన గుప్తమ్ముగా నడవి నెన్నో సార్లు
నీ దర్శనార్థమై నిలిచి యుండెడివాడ.

అలక

ఎంత కష్టపడినవారు! ఎన్ని నెలలో గడచె గాని
సాహసించి వార్త నంప జాలనైతి మీకు నాథ!

ప్రథమదర్శనంబునందె ప్రణయము జనియింప నాథ,
బుద్ధియందు నిలిపి మిమ్ము పూజ చేయుచున్నదాన!

ఆ దినమ్మునుండి నాథ అన్యచింత లేదు నాకు,
మీరు నేను గాక జగతి మిగిలిన వా రెవరు లేరు !

ఒక్క వేళ నా ప్రార్థన ముపేక్షింతు రేమొ యనెడి
సంశయమ్ము పీడింపగ సాగె కొన్నినాళ్ళు నాథ !

### జ్యోతిస్సింగు

కష్ట పడితి వయ్యొ నీవు కారణమ్ము లేకుండనె,
కనుల కద్దుకొనెడివాడ గదా నిన్ను రాజపుత్రి !

వార్త నంపి యుందువేని వాలియుందు ప్రాణేశ్వరి,
నీ పదాంబుజములకడను నిముసములో నెగిరి వచ్చి !

నీ యాశయ మేమొ నాకు నిక్కముగా దెలియకుంట
సంశయాపన్న మతిని చాల బాధపడితి ప్రియా !

ఎట్టి విషయ మైనగాని హితవు గాక యుండె: దుర్గ
పాలనమ్ముగూడ మహా భారముగా దోచుచుండె.

దూత నంప నెంచియు మీ దుర్గమునకు, తండ్రిగారి
వింత పద్ధతులకు కొంత వెరచి యూరకుంటి ప్రియా !

### అలక

మనసు లొక్కటె యయ్యు మన శరీరము లున్న
విన్నాళ్ళు దూరాన హృదయేశా !

### జ్యోతిస్సింగు

ఇది మొదలుగా మనకు నింక నామరణమ్ము
అద్వైత సిద్ధియే ప్రియురాలా !

### అలక

( కౌగిలించుకొని )

ఈదుర్గమందుండి ఎట్టు లైనను నన్ను
త్వరితమ్మె కొనిపొండు ప్రాణేశా !
ఏరాజ పుత్రునకొ యిచ్చి నను పరిణయము
చేయు నట నాతండ్రి ప్రాణేశా !

ఈగాథ తెలియంగ నేమి తోచక మీకు
పత్రికను బంపితిని ప్రాణేశా !
ప్రొద్దు పొడువకముందె పోవలయు నెటులైన
మన కోటలోపలికి ప్రాణేశా !

ఈరేయిరయె యైన నెవ్వ రనుమానింప
కుండ నరుగగవచ్చు ప్రాణేశా !
మీవెంట నిశ్రేణి మీద నవరోహింతు,
భయ మేమియును లేదు ప్రాణేశా !

### జ్యోతిసింగు

వీలు లే దటు చేయ వీరాంగనా, నీవు
పన్నుండ నావీపుపై దిగుదు భూస్థలికి.

కాచుకొని యున్నారు కానలో మనకొరకు
అస్మదుపజీవు లౌ ఆశ్వికాగ్రేసరుల్.

మా కెల్లర కరణ్యమార్గముల్ సుగమముల్
వాయువేగము కలవి వాజు లన్నియుగూడ.

మనదుర్గమున జేరి మంచిరోజున నిన్ను
పరిణయంబై చేతు పట్టంపుదేవిగా.

పయన మవుదమ్ము లెమ్ము, ప్రాణప్రియా, రమ్ము:
జాగు చేసితివేని చంద్రోదయం బగును.

అలక

ఇపుడె కదా వచ్చినార, లించుక విశ్రాంతి పొంది
బయలుదేర వచ్చు నాథ, బడలిక తొలగిన పిమ్మట.

చంద్రోదయ మైన నేమి? శత్రుభయము లేదు కాన
భటులు పశ్చిమమ్మునందు ప్రమత్తులై యుండగలరు.

పాత్రములం దుంచినాను ఫలరసంబు లివిగో, వివి
ధాసవములు మీ కొరకే: ఆస్వాదింపుడు వీనిని.

వనమార్గంబుల గుట్టల వాగుల దుర్గమ భూముల
పయనములో బడలినారు: పదపద్మము లొత్తనిండు.

జ్యోతిస్సింగు

పట్టమహిషి వగుదు వీవు ప్రాణేశ్వరి, అచిరమ్ముగ:
పరిచారిక రాదగినది పాదసంవాహమునకు.

నిన్ను గాంచినంతలోనె నిఖిలశ్రమ వాసె ప్రియా,
నీ మధురాలింగనమున నిర్వృతియే ప్రాణేశ్వరి!

జీవిత పరమావధియే చేకూరిన దీక్షణాన,
ధన్యుడ నీ కౌగిలిలో తనువు విడుతునేని ప్రియా!

అ ల క

( ఉద్వేగముతో )

కాంతు డాడిన యమంగళ వాక్య మియ్యెడనె
ప్రతిహతం బగుగాక పరమేశ్వరీకృపను !
కాపాడుడీ ప్రాణకాంతు దేవతలార,
అను నిమేషము మీర లనుసరించుచు దయను !

ఏల ప్రాణేశ్వరా, యి ట్లనాలోచిత
వ్యాహారములచేత వ్యథ నాకు గలిగింప ?
అమరులారా, మీర లాయుస్సు సమముగా
దయ చేయ గదరయ్య, దాక్షిణ్యమున మాకు !

జ్యోతిస్సింగు

భయము చెందెద వేల ? ప్రాణప్రియా, మనకు
ఉభయులకు విశ్లేష ముండ దిం కెన్నటికి.
గ్రహియించితివొ లేదొ గాఢ సౌఖ్యమునందు
ఉండు ప్రియతమ, అనున్యూతమ్ముగా బాధ !

( ఆమె కన్నులలోనికి జూచుచుండును.
గంభీరసింగు, దుర్జయసింగు వెనుకనుండి
మందగమనముతో లోనికి ప్రవేశింతురు)

గంభీర సింగు

ఎవరు నీవు ? పలుక వేమి ?—
ఏ మిది ! జ్యోతి స్సింగా !

నమ్మ జాల కున్నాడను
నయనమ్ముల ! ఆశ్చర్యము !
అంగీకారము బడయక
అస్మద్దుర్గము లోనికి
రా గతం బేమి చెపుమ
రాజపుత్ర వీరాగ్రణి !

జ్యోతిస్సింగు

దుర్గాధిప, మదీయ దోషమ్ము క్షమియింప
వేడుచున్నా ననావిల మానసమ్ముతో.

గంభీర సింగు

శూరాగ్రణివే : ఈగతి చోరునివలె మా దుర్గము
జొచ్చినాడ, వంతేకాక శుద్ధాంతమ్ము ప్రవేశించి
అవివాహితతో నొంటిగ నర్ధరాత్రి కాలమందు
భాషించుచు గానబడుట పౌరుషవంతుల కెంతటి
క్రోధకారణంబో నీవు గుర్తెరుగుదువా కుమార !

జ్యోతిస్సింగు

అంగీకృతిం బడయ కంగణము చేరుటే
యుక్తమ్ము కానేర, దొంటిగా నాపైని
కన్యకాంతః పురాగారాన నడురేయి
గానవచ్చుట దొడ్డకార్య మెన్నడు కాదు.

కాని యొక్క రహస్యకారణం బుంటచే
దుర్గాధిపా, భవద్దుహిత సన్నిధియందు
కాంచినా రేప్పు డాకస్మికమ్ముగ నన్ను.
నాకు దెలిసెను మూడునాళ్ళవరకును మీరు
రాజధానికి మరలి రా రనుచు: ఏలనో
అచ్చెరువు గొలుపంగ నరుగుదెంచితి రిపుడె.

గంభీరసింగు

అది యటుంచుము: త్వదీయాగమన కారణం
బేమొ తెలుపగ వైతి: నీ ప్రవర్తన మీవు
యుక్తి యుక్తం బనియె యోజించుచున్నావ?

జ్యోతిస్సింగు

రాజకార్యముమీద రాలేదు నే నిటకు,
దుష్టసంకల్పాన దుర్గమ్ము చొరలేదు,
తస్కరుం డని నన్ను తలపవల దని కోర్కె,
అరుగుదెంచినవాడ నన్యథా విధి లేక!

గంభీరసింగు

ఎంచవైతివి కదా యీ యమాయికురాలి
కప్రతిష్ఠ ఘటిల్లు ననుచ నీమూలాన!
ఇంక నా తనుజాత కెట్లు పరిణయ మగును?

జ్యోతిస్సింగు

పుణ్యస్వభావ మీ పుత్రి కారత్నంబు!
నిష్కలంకం బైన నిండు ప్రేముడితోడ
అంతఃపురములోని కరుదెంచి యున్నాను.

పరిణయానంతరము పట్టంపుదేవేరి
గావింప నీమె నా గాఢ సంకల్పంబు.

గంభీర సింగు

అదియ ! మంచిమాటె కాని
అడుగలే దేమి నన్ను ?
మీ జనకులు మేము గాఢ
మిత్రుల మని తెలియు గదా ?
అడిగియున్న నీవు కన్నె
నాదరమున నిచ్చియుందు.
అనుసరించినాడ వకట,
అపమార్గము రాకుమార !

జ్యోతిస్సింగు

కావచ్చును కాని మీరు క్షమియింపర తారుణ్యము ?
అది యేమో జంకువలన నర్థింపగ నైతి మిమ్ము.
విశద మగుట మీహృదయము వేడుచునున్నాడ నిపుడు.
గతము విస్మరించి నన్ను గైకొనుండు జామాతగ.

(అని అంజలి ఘటించును)

దుర్జయసింగు

(ముందరికి వచ్చి గంభీరసింగు నుద్దేశించి)

అది యెట్లు పొసగు ? మీ రాడినమాట
తప్పరెన్నటి కని తలచుచున్నాను.
దుర్గాధిపా, నాకు దుహిత నొసంగి
చేయునట్లుగ పెండ్లి చెప్పియున్నారు.

అలక

( ద్వార పార్శ్వమునుండి )

సాహసమ్మును పితా, క్షమియింపవలయు !
వలదు, నా కిపు డీ వివాహమ్ము వలదు !

గంభీరసింగు

హిత మేదియో తల్లి, యెరుగకున్నావు-
ఇతనికి మాట నే నిచ్చి యున్నాను :
తండ్రివాక్యము నన్యథా చేయ కమ్మ !

అలక

నాకీ వివాహమ్ము నచ్చుట లేదు-
కరుణతో నను పితా, క్షమియింపవలయు !

గంభీరసింగు

ఎట్టి చిక్కు తెచ్చినావు ! ఎయ్యది కర్తవ్య మిపుడు ?
వరపరీక్ష చేయవలసి వచ్చిన దీ తరుణమందు.

స్వయంవరణ మాదినుండి క్షత్రియాంగనా వివాహ
విధానముగ ధర్మశాస్త్ర విదులు నిర్ణయించినారు.

ప్రథితమార్గ మనుసరింప ప్రత్యవాయ మేమి లేదు.

దుర్జయసింగు

కన్య నీయంగ వాగ్దానమ్ము నాకు
చేయక పూర్వమే చెప్పిన యెడల
మెచ్చుకో దగినదే మీ విధానమ్ము :
యోజింపు డియ్యెడ యుక్త మా నేమొ.

గంభీర సింగు

వలదు లెమ్ము స్వయంవరము– వరపరీక్ష చేయ దగును.
పణము నిడిన తప్పు లేదు, పరీక్ష దూష్యమ్ము కాదు.

పూజ్యు లాచరించినారు పూర్వరాజు లీవిధాన.
జనక మహారాజ ద్రుపద జన విభుల్ తదీయ సుతల
పాణి పీడనమ్ముకొరకు పణము పెట్టినారు కదా ?

త్రిపురవైరి కార్ముకంబు త్రిజగ దారాధ్యుడైన
దశరథాత్మజుండు విరిచె ధరణిసుతను బడయుటకై.

ద్రుపదరాజ పుత్రికినై త్రుంచినాడు మత్స్యయంత్ర
మఖిల మహేష్వాస మౌళి అర్జునుండు నిండు సభను.

జ్యోతి స్సింగు

క్షత్రియోచితంబ యేని
సమ్మతంబె వరపరీక్ష.

గంభీర సింగు

చాల మంచిమాట ! మీరు సమవయస్కు లధికబలులు
ఒక్క రోజు పూర్ణముగా నుపవసించి శుచు లగుమను
ఇరువురిలో నెవరు కన్య నెత్తుకొని నగంబు నెక్కి
దేవి మందిరంబు కడను దింప గలరొ వారి కేను
ప్రీతితోడ కన్నె నిచ్చి పెండ్లి చేతు : ఇదె ప్రతిజ్ఞ!

కొండ కొనను జేరకుండ కూరుమన్న, త్రోవలోన
యువతి దింపునెడల గాని ఓడిపోయినట్టు లెంతు.
మొదట స్వీకరించు వారు ముందు శిఖర మెక్కదగును.

జ్యోతిస్సింగు

చిత్తము, మహాప్రసాదము, స్వీకరించినాను పణము !

అలక

ఉపవసింప నెందులకై ఒప్పుకొన్నవారు ప్రభూ !

దుర్జయసింగు

నాకీ విచిత్ర ఘటనము నచ్చలేదు దుర్గాధిప !

జ్యోతిస్సింగు

భయము లేదు రాజపుత్రి, బాహుబలం బెరుగవు, మరి
నిరుపమాన శక్తి కలుగు నీ శరీర సన్నికర్ష.

గంభీరసింగు

యోధ్ధృవేషం బింక నుజ్జగించి కుమార,
విశ్రమింతువు గాని వెడలి రా నావెంట.

జ్యోతిస్సింగు

ఉత్కంఠతో వేచియున్నారు నాకోస
మడవియందున మదీయాశ్వికుల్ దుర్గేశ !

గంభీరసింగు

అటులైన, జేరుగా కాశ్వికావళికి మీ
దుర్గమునకుగూడ తోడనే శుభవార్త.
అట్లు చూచెద వేమి అకట, దుర్జయసింహ !
అతిథిసత్కారమ్ము నంగీకరింప వలె.

# ద్వితీయ రంగము

వంపులు తిరిగిన పర్వత మార్గము

## అమాత్యుడు

అతిక్రమ చెందకుండ ఆలయమ్ము వధూ వరులు
చేర దగిన త్రోవ గాక చిత్రముగా నెందులకో
ఇట్టి విషము మైన మార్గ మేర్పరించినారు దేవ !

## గంభీర సింగు

అడుగ దగినదే అమాత్య ! అందు కొంత గూఢముగా
రాజనీతి కలదు : మొన్న రాత్రి వేళ నా సన్నిధి
మీర లున్న పక్షములో మిగుల నేర్పుతోడ కార్య
మమరియుండు, లాభ మేమి అయినదాని కింక నేడు.

## అమాత్యుడు

ఇందుకైన తెలియకున్న దేలినవారి చిత్తమేమొ!
అలక నితడె పెండ్లియాడు టాశయంబె యేని దేవ,
కఠిన మైన పణము పెట్టి, గహన మైన మార్గ మిట్లు
చూప రని తలంచువాడ జ్యోతి గెలువకుండునట్లు.

ఇతని యపజయంబె తమ యభీష్టమేని, రాకుమారి
నప్పగించి వయసు కాని హస్తములకు, పురజనంబు
కనుగొనంగ బహిరంగముగా నగారోహణమ్ము
క్షణమాత్రముకూడ ప్రభువు సమ్మతింప రని తలంతు.

## గంభీర సింగు

తోచలేదు మరి త్రోవ నాకప్పుడు:
తూష్ణీంభావముతోనె యీసరణి
నవలంబించితి నమాత్యశేఖర !
ఎరుగక అలకాహ్వాదయము నే నా
దుర్జయసింగుకు తొలుత నిచ్చితిని
మాట: జ్యోతి పయి మమత కుమారికి
అతిగాఢం బని అవగత మయినది.
ఏమి చేయ దగు నీ క్లిష్టస్థితి !
మాట పోవునెడ మానవనాథుని
నిందింతురు గద నిఖిల జనంబులు ?
బలవంతముగా పరిణయ మేగతి
చేయ గలుగుదుము ? చెప్పి చూచితిని
ఇరువురు వరులకు నేకవిధముగా
పణము పెట్టి నే ప్రతిజ్ఞ చేయుదు.

## అమాత్యుడు

దోష మేమియు లేదు దుర్జయసింగు
నేలినవా రప్పుడే విసర్జింప.
అలకకు నతనిపై ననురక్తి లేదు—
అంగీకరింప లే దతడు పరీక్ష.

## గంభీర సింగు

సత్వరమ్మె మాట విడువ జాల కట్లు చేసినాను.
నిశ్చయమ్ముగానె జ్యోతి నెగ్గు నీ పరీక్షలోన.

ఒక్క వేళ బలహీనత నోడిపోవు పక్షమందు,
అనురాగము కలది కాన అలక యతనినే వరించు.

దుర్జయుండు నోరు విప్పి దోష మారోపింప లేడు.
మాట తప్పి పోయినట్లు మనల నెవ్వ రన జాలరు.

## అ మా త్యు డు

ప్రభు వానతిచ్చిన పద్ధతి యెల్ల
యుక్తి యుక్తంబుగా నున్నది: కాని
ఉపవాసము విధించి యుండుట యొకటి
జ్యోతికి ఈదారి చూపుట యొకటి
పరిణమించునో యేమొ ప్రతిబంధకముగ-
ఫలితమ్ము సంశయాస్పదముగ దోచు.

## సైనికుల కంఠధ్వని

మంగళం బలకా కుమారికి
మంగళము జ్యోతిః కుమారున
కచల దుర్గ ప్రభువరేణ్యున కభ్యుదయ మగుతన్ !

## అ మా త్యు డు

జ్యోతిః కుమారుని యోధ వర్గంపు
మంగళ ధ్వనులతో మార్మోగి పోవు
పర్వత పార్శ్వంబు ! పౌరు లెవ్వార
లెక్కకుండక కొండ కిరుప్రక్కలందు
మార్గంబు లన్నింటి మన వీరభటులు
ఖడ్గహస్తాలతో కాచుచున్నారు.

### గంభీర సింగు

మంచిది, కల్యాణి మందిరమ్మునకు
మనము పోవుద : మదే మంద మందముగ
వామభాగమునుండి వచ్చుచున్నాడు
తోడ్కొని పోదము దుర్జయసింగు.

### జ్యోతిస్సింగు

( అలకాదేవిని ఎత్తుకొని ప్రవేశించి )

అలకా, యించుక ఆయాసముచే
సన్నగిల్లినది జవము నడకలో.
అనుకొందునా అశ్వఖండమును
అపనయించుకొన నధ్వశ్రమమును ?

### అలక

ఆయాసమ ప్రాణేశా ! అనుకొనుడు పాషాణము,
ఉపవిష్టులు కాకుండిన ఓడిపోయినట్లు కాదు.
నాకయి మీ రకటకటా, నాథా, నా జనకువలన
విషమ వహా పరీక్షలోన వెత నొందుచు నున్నవారు !

అవలోకింపుడు నాథా, అదిగో చిత్రావతి నది
నిమ్నస్థలి ప్రవహించును నేత్రోత్సవదాయకముగ.
అర్ధభాగ మైనది యీ యధ్వానమునందు : దేవి
కల్యాణీ మందిరమ్ము కానవచ్చు శృంగమందు.

జ్యోతి స్సింగు

పోవుద మలకా, పోయెను బడలిక
ప్రాభాతిక మృదు పవనముచే, నీ
పలుకు తేనెచే! ప్రాపించినచో
గమ్యస్థానము కల్యాణమెగా!

సైనికుల కంఠధ్వని

జయము జయము జ్యోతిస్సింహ
జననేతకు మా సేనికి!
జయము జయము జయ మలకా
జనయిత్రికి మారాజ్ఞికి!
(అలకా జ్యోతి స్సింహులు నిష్క్రమింతురు.
ఇంతలో వేరొక పార్శ్వమునుండి ప్రవేశించి)

దుర్జయ సింగు

విపరీత మైన దీ విధము! పూర్వమ్ము
భూజాను లెవ్వరు పుత్రికా పరిణ
యార్థమై వీరుల కనుచిత మైన
విధి విధించిన యట్లు వినలేదు నేను.
అదిగో జ్యోతి స్సింహు డాయాస పడుచు
పై కెక్కుచున్నాడు భారమ్ముతోడ.
వారించువాడ నే వక్రమార్గాను
సరణమ్ము తెలియుచో సత్యమ్ము తొలుత.
గాఢానురాగమ్ము కలవారి కేను
నడుమగా నిలుచుట న్యాయమ్ము కాదు.

వేగమే మాన్పించి విషమ పరీక్ష
నర్పింపదగు కన్నె నతనికే దేవ!

అమాత్యుడు

ప్రభువు పరీక్ష సద్భావమ్ముతోనె
నిర్ణయించినవారు: నీ వెరుంగుదువు
పయనమ్ములో మూడు భాగాలు ముగియ
బోవు చున్నవి ఆపబోకు కుమార!

దురయ సింగు

ధరియించి క్రోడాన తారుణ్య మూర్తి
నవివాహితను వీరు డగు యువకుండు
కష్టాన నడచుచో కనుగొనజాల!
అరిగెద క్షమియింపు డన్యదిక్కునకు!

( వెడలి పోవును )

జ్యోతిస్సింగు

( మలుపులో ప్రవేశించి )

వామ భాగమ్మునకు ప్రియురాలా!
వత్తువా మెల్లగా ,,
అడుగు వేయుట యున్న ,,
అతికష్ట మయిన దో ,,
పాదరక్షలు విడుతు ,,
పదము జారక యుండ ,,
తల తిరుగు చున్న దో ,,
తరు వాను కొందునా ,,

అలక

(కన్నీళ్ళతో, గద్గద కంఠముతో)

ఉపవసించుట జేసి ఓనాథ, ఓనాథ
ఒడలు తూలుచు నున్నదో నాథ ,,
నిమ్నభాగాలపై నిజదృష్టి ,,
నిలుప బోకుడు నాథ, నిలుపబోకుడు నాథ !

వల్లభక్రోడాన వాతూలము విధాన
తేలిపోవగ నాదు దేహభావము బాపి
నానాథు నడిపించు నాతల్లి కల్యాణి !
ఇరువురం బ్రోవవే ఇలువేల్ప కల్యాణి !

(జ్యోతిస్సింగు కొంచెము నడచును.)

ఆరగింపుడు నాథ, ఆయాసము తొలంగి
శక్తి యుజ్జీవింప సహకార ఫలము లవె.

జ్యోతిస్సింగు

వల దలకా, వల దలకా, వ్రతభంగం బగు నలకా,
చిన్నిశాఖ విరిచి అలక, చేయూతగ నిమ్మలకా !

జయ జయ జయ ఏకలింగ, జవసత్త్వము లిమ్ము స్వామి !
కరుణ బూని నీ భక్తుల కాపాడుము దేవ దేవ !

(ప్రస్థానము)

గంభీరసింగు

( మలుపులో ప్రవేశించి )

దుర్జయము పలుకుల తోరముగా మతి
మారెను, పయనము మాన్పదునా యిక ?

### అమాత్యుడు

వీరుడు కావున విన దేమో యను
సంశయమ్ము మది జనించుచున్నది.
అయినను శీఘ్రమె అగ్రము చేరును
అమిత బలిష్ఠుం డగుట కుమారుడు.

( ఉభయుల ప్రస్థానము )

### అలక

( మలుపులో )

ఏమిది ఏమిది నాథా, ఇట్లు రొజుచున్నవారు!
పడుదు రేమొ తూలి క్రింద, భద్రము భద్రము భద్రము!

అయ్యో గుండెలు దడదడ లాడుచున్న వధికముగా!
దిగచెమటలు పోసె నొడలు తేరువ తప్పూనొ యేమో!

భూరి వివృతములు నాసా పుటములు, శోణోష్ఠమ్ములు
నీలిమా క్రాంతమ్ములు, నిలువుగ్రుడ్లు పడియె నయ్యొ!

చాలు జాలు! పయన మాపి సత్వరముగ దింపి నన్ను
అశ్వముపై గూరుచుండి ఆయాసము బాపికొనుడు.

పరిగణింప వలదు ప్రభూ, పరాజయం బయిన యట్లు.
అనామయం బయిన మీకు అంతె చాలు ప్రాణేశ్వర!

సమ్మతింప కుందు రేని జనకులు మన పరిణయమ్ము
ఆమరణము మీ స్మరణమె ఆలంబనముగ నిలిచెద.

దింపుడు నాథా, తోడనె దింపలేని దిగుదు నేనె.
ఈ విచిత్ర వర పరీక్ష ఇంక జాలు, ఇంక జాలు !

(దిగుటకు యత్నించును)

జ్యోతి స్సింగు

తెరలెను మైకపు తెర ప్రియురాలా !
విశ్రాంతిం గని వెడలుద మిపుడే.

అపజయమ్ము కా దంగీకారము :
పౌరుష మెడలిన ఫలితము కలదా ?

మంగళ లాభమొ మరణంబో మరి
ఏదో కావలె నీ పట్టున నే.

నిజముగ అలకా, నీ వర్ధాంగివి
కాని యెడల మృతి గాంతును ధ్రువముగ !

అర్ధాంగీకృత హైమవతీశా,
ఏలుము మర్త్యుల ఏకలింగజీ !

( అలకను ముద్దు పెట్టుకొని )

బయలుదేరుదము ప్రాణప్రియ, యిదె
నాకు జనించెను నవోత్సాహము.

అలక

బలము నొసంగుచు ప్రాణేశ్వరునకు
కావుము తల్లీ కల్యాణీ, మము !

( ప్రస్థానము )

సైనికుల కంఠధ్వని

మంగళం బలకా కుమారికి,
మంగళము జ్యోతిః కుమారున,
కచల దుర్గ ప్రభువరేణ్యున
కభ్యుదయ మగుతన్ !

# తృతీయ రంగము

కల్యాణీ మందిర ప్రాంగణము

**జ్యోతిస్సింగు**

జయ జయ జయ ఏకలింగ !
జయ కల్యాణీ జననీ !

(అలకను దింపి కూర్చుండును. ఉభయులు)

జయ భక్తాభీష్ట ప్రద
జగజ్జనకులార, జయము !

**సైనికుల కంఠధ్వని**

జయము జయము జ్యోతిస్సింహ
జననేతకు మా రేనికి !
జయము జయము జయ మలకా
జనయిత్రికి మారాజ్ఞికి !

**అలక**

బడలినారు ప్రాణేశా
పద పద్మము లొత్తుదునా ?

**జ్యోతిస్సింగు**

దాహము దాహ మ్మలకా తడి యారెను నోరలకా,
విశ్రమింతు : తీర్థము గొని వేగముగా ర మ్మలకా !

( శిలాఫలకముపైన పండుకొని
కన్నులు మూసికొనును )

అలక

( పోయి, జలము దెచ్చి )

కమలపత్ర పుటములోన
కల్యాణీ పుష్కరిణీ
దివ్యజలము దెచ్చినాను.

శీతలోదకంబు గ్రోలి
స్వేద దేర మీరు నాథ,
చనుదెంతురు జనకు లిటకు.

కనులు దెరచి యొక్కసారి
కాంచరేమి ప్రియురాలిని?
పలుకరేమి ప్రాణనాథ!

భూరిశ్రమచేత నిద్ర
పోవుచున్నవారో? క్రోలు
డించుకంత యిదిగో జలము.

చల్లినా నాననమున చల్లగా కొలనినీరు
అయిన రాదేమి తెలివి!

తేరుకొనుడు ప్రాణేశ! తేరువే లేదె యింక
మూర్ఛలో మునిగినారా!

అరుగుదేరకున్నవా రంగణమ్ములోని కెవరు.
ఏమి చేతు నే నిపుడు!

పెదవులం దడిపినాను, బిందువైన పోవదే
నోటిలోని, కేమి చేతు!

కొంత విశ్రమించినారె ఇంత శోష యెందులకో
వింత గొల్పుచున్నది, మీ కంత శక్తి గలదు గదా!

భయ మగు చున్నది పలుకరు నాథా!
కనబడ దేలా కళ వదనముపై!

గుండెలు స్ఫుటముగ కొట్టుకొనుట లే,
దందదు నాడియు హస్తము లోపల.

(వ్రేలితో పరీక్షించి)

లేశమాత్రమును లేదే ఊపిరి
విడిచిన చిన్నెయు వ్రేళుల నకటా!

అయ్యో అయ్యో ఆస్యము వెంబడి
జాలు వారినది సన్నగ రుధిరము!

రయమున రమ్మా రాజవైద్యుడా,
రక్తస్రావము, రక్తస్రావము!

అయ్యో అయ్యో, అయిపోయినదే!
ఇంకే మున్నది ఈలోకములో!

చూచుచుండగనె శూన్యం బయినది
రాజస్థానము రత్నము గోల్పడి!

కల్యాణాంతము కావలసిన దిటు
లవసిత మైనది అమంగళముగా!

నాకోసమె కద నాథా,యీ గతి
జవ్వనమందే సంప్రాప్తించెను!

చూడకున్న నను సుఖముగ నుందురె!
మృత్యుదేవతను మీపాలికి నే!
పత్రిక యేటికి పంపితి నయ్యో
ఆహ్వానము మృతి కంపిన తీరున!

దుర్గేశ్వరు నిజదుహితకు నొసటను
వైధవ్యంబే వ్రాసి యున్నదా?

రాజస్థానమునందలి రాహుత్తులయం దగ్రణి
కోటలు పట్టెడి వీరుడు కూలిపోయె విధివశాన!

సౌందర్యము బాహుబలము సాహసంబు వ్యర్థమాయె!
లక్ష్యము ప్రాపించిన, జయలక్ష్మి యేమొ దూరమాయె!

జీవితేశు నయ్యయ్యో, చేతులార చంపుకొంటి!
బ్రతికియుండి ఫలం బేమి, ప్రాణంబులు విడుతు నిపుడె.

ప్రేమకు బలి యయినవాడు- ప్రియు పవిత్ర రక్తములో
కలియు గాక నా రుధిరము కటారి కారుణ్యమునను.

(పొడుచుకొని, అతనిమీద కొరగును)

గంభీరసింగు

( పార్శ్వమునుండి ప్రవేశించి )

అమ్మా అమ్మా, అలకా, అలకా,
ఏమిది తల్లీ, ఏటికి పలుకవు?

సుకుమారి నాతల్లి శోషిల్లెనా యేమి,
ఉపవాసమున మూర్ఛ నొందెనా నా బిడ్డ!

లెమ్ము జ్యోతిస్సింహా, లెమ్ము లెమ్ము కుమార,
ఏల పడి యున్నాడవు కరకు రానేల ?
విజయమ్ము గన్నావు విషమ పరీక్షలో.

అలకా, అలకా, ఆయాసంబా ?
ఏమిది తల్లీ, ఇంకను లేవవు.

విజయము గనె నీవిభుడు పరీక్షను,
కల్యాణమె యిక, గ్రక్కున లెమ్మా!

ఉభయులుం జలియింప కున్నవా, రేమి గతి !
ఆహిత మయ్యెనో యేమొ అరసి చూడు డమాత్య!

## అమాత్యుడు

( వారిని సమీపించి )

అనుమానించిన యట్లే యయినది !
క్షణకాలములో జరిగిపోయినది !
అత్యాహితమే యైనది దేవా !
దుర్జయసింహా, తోడనె రమ్మిటు.

## దుర్జయ సింగు

(వచ్చి పరీక్షించి)

ఘోరమైన యన్యాయము ! కోలుపోయినా డసువులు
వీరాగ్రణి అక్కటకట, వితథ యత్నమందు నేడు !
ఆయాసముచే గుండియ లవిసియుండ నోపు, నోట
సన్నని రక్తస్రావము జాలువారి పేరుకొనియె.

### గంభీర సింగు

భూరిబలుడౌ జ్యోతిస్సింగు పోయినాడు మనల విడిచి!
ఏల పాడు పరీక్ష ఏర్పరించినా నమాత్య!
మూర్ఛపోయె నొక్కనాడు ముద్దుబిడ్డ ప్రాణనాథు
దుర్మరణము గాంచి మహాదుఃఖ వివశచిత్త యగుచు?

### అమాత్యుడు

అయ్యో దేవా, అత్యాహితమే!
అసువులు బాసిన దలకాదేవియు!

### దుర్జయ సింగు

వాడియైన ఛురిక దిగగ వక్షఃస్థలి గాఢముగా
రక్తసిక్తమై యున్నది రాజపుత్రికా కాయము.

### గంభీర సింగు

సర్వనాశనము సర్వనాశనము!
లోపించెను నా లోచన తారక!
వల్లభ నిధన వ్యథ సహింప లే
కాత్మహననమే ఆచరించితివ!

ఏక పుత్రికవె, ఏమనుకొంటివి
నీ యనంతరము నీ జనకుని గతి!
తనువు తుచ్ఛమని తలచి పుత్రికా,
ప్రణయ దేవతకు బలి యయి పోతివ!

ఏమున్నది నాకీ లోకములో,
కాని మొండినై కాయము వీడను!

ఆపమార్గమ్మునె యనుసరింప నేన్
నుభయులు సుఖముగ నుందురు కాదా ?

సకలము శుభముగ సంపన్నము కా
దగినది యీగతి దగ్ధం బాయెను !
వార్ధకమున నీ వ్యథ జనియించెను :
వేగమె దేహము విడుచుట ధర్మము.

దుర్జయ సింగు

వీరి పవిత్ర ప్రేమము విదితమేని దుర్గాధిప,
వీక్షింపక యీ దృశ్యము వెడలిపోయి యుండువాడ.

నావలనం గొంతవరకు నష్టం బయిపోయె మహా
యోధుని యిహలీలయు నొక యువతీ హృదయజ్యోతియు
దుర్గేశా, యెల్లరమును దోషావిష్టుల మయితిమి—
ప్రాయశ్చిత్త సూచకముగ ప్రణమిల్లుద మీ స్థలమున.

( అందరును మోకరింతురు )

ఇది పవిత్రమైన భూమి ! ఈ రంగము మీద చంద్ర
కాంతశిలా మంటపంబు కట్టింపుడు దుర్గేశా !

చిరకాలము రాజపుత్ర సీమాలంకారముగా
స్నిగ్ధప్రియ కరుణకథా చిహ్నం బగు మండపంబు.
ఖ్యాతముగా నెగడుగాక పుణ్యదంపతీ చరిత్ర
విన్నవారి మానసములు విగతకల్మషమ్ము లగుచు!

సమాప్తము

# యక్ష రాత్రి

అంకితము

శ్రీమతి కొమఱ్ఱాజు అచ్చమాంబకు

## పాత్రలు

నేమి కవి

ఇందు రాజ కవి

గాయక భీమరథుడు

సఖి సునంద

నాయిక నితంబవతి

ప్రదేశము : ఉజ్జయినీ నగరము

సమయము : క్రీ. శ. ఆరవ శతాబ్ది చివరలో

కాలపరిమితి : రమారమి యామము.

# యక్ష రాత్రి

ఉజ్జయినీ నగరములో శిప్రా నదీతీరమున సౌధారామము. వెన్నెలరాత్రి. ద్వితీయ యామము. రత్నకంబళములు పరచి ఉపధానములు పెట్టి యున్న రెండు వితర్దికలలో నొకదాని మీద ఇరువదియయిదేండ్ల వయసుగల నేమికవి కూరుచుండి యెవరికొరకో ప్రతీక్షించుచున్నాడు. ఉన్నత విగ్రహుడు, స్ఫురద్రూపి, ముప్పదియేండ్ల వయసువాడు, ఇందు రాజకవి, మందమందముగా ముందరికి వచ్చుచుండుట చూచి, నేమి ఉలికిపడి, వితర్దికమీదినుండి లేచి, నమస్కరించెను.

నేమి

ఇందురాజ, ఇందురాజ, వందన మో ఇందురాజ!
ఇందు వచ్చితేల నయ్య, సుందరమూర్తీ!

నిన్ను బోలు వారి పాద నీరజములు వికసించెడి
సుఖ మేవిధి గలిగె నిచట సుందరమూర్తీ!

నమ్మజాల కున్నవాడ నయనమ్ముల! ఈ లోకుకు
చోద్యముగా వచ్చినావు సుందరమూర్తీ!

ఇందు రాజు

( కూర్చుండి, మందహాసముతో )

ఆశ్చర్యము నా ఆగమనమ్మున
నీ కేటు గలిగెను నేమి కవీశా?

నీ వుండెడి యీ నెలవునకే కద
అరుగుదెంచితిని : ఆశ్చర్యంబా ?
వెన్నెల విరిసెడి వేళను నీమది
దోష మేమయిన తోచినదా సఖ ?

నేమి

అర్ధరాత్రమందు సైత మస్తదాదు లరుదెంచిన
ఈ ప్రదేశమునకు లోకు లెవరుగూడ వింతపడరు.
నిన్ను గాంతు రేని యిచట నిక్కముగా నప్రతిష్ఠ !
నిన్ను బోలు యోగ్యులకే నిందాభయం బుండవలయు.

ఇందు రాజు

అడుగిడినంతనె ఆరామములో
ఆరోపింతురె అపనిందలు సఖ !
చాలు జాలు నీ చతుర వాక్యములు !
నే నెర గందును నేమి కవీశా !

నేమి

విడిసి యున్న దిట వికట నితంబా
నామక నూతన నారీ రత్నము.
నిఖిల కళలలో నిష్ణాతగ కడు
ఖ్యాతి వహించిన గణికా రత్నము.

ఇందు రాజు

గణిక యుపవనిలోన కాలిడిన యంతనే
అపవాదు వేయదగునా, ఓసఖా,
అన్యాయ మని యెంచవా ?

గణిక గాంచినయంత కలుషవర్తను డనుచు
సజ్జనుల్ నిందింతురా, ఓసఖా,
సత్య మేమో చూడరా?

నేమి

ఇందురాజ కవీంద్ర, ఈ లోకవృత్తము
వ్యక్తము కాదు నీవంటి నిర్మలమతికి.
పండు వెన్నెల రేయి ప్రాయమం దున్నట్టి
కమనీయ దేహుండు గణికా భవనమందు
అడుగు పెట్టునయేని అంద రే మందురో
యోచించి చూడుమా, ఒక్కసారి కవీంద్ర!

ఇందు రాజు

విదుషీ మణి యని వికట నితంబను
ఆలోకింపగ నరుగు దెంచితిని.
గణిక యీామె యను కామవృత్తితో
నే రాలే దని నీవు తలంపవ?

నేమి

కవయిత్రి యీామె యను ఖ్యాతి యున్నది కాని
గణిక యనియెడి యపఖ్యాతి సైతము కలదె!

ఇందు రాజు

ఈమె గణిక యని యేలనో కలుగదు
అంతరంగమున అంగీకారము.

సంస్కృత కవితా సకుడ గావున
గోష్ఠి చేయగా కుతుకముతోడను

ఆరామమునకు నరుగుదెంచితిని :
అన్యచింత లే దంతరంగమున.

నేమి

అకలంక మానసున కాత్మవ త్సర్వమ్ము
కానిపించుచు నుంట కాదు విపరీతమ్ము.
ఒక వింతవార్త : ఈ యువతీ లలామమ్ము
వాంఛింపదు సువర్ణ వస్తు వాహనములన్.

ఇందు రాజు

కవి భూషణ సువర్ణ కాంక్ష మిక్కుట మేమొ!
అటులేని యోగ్యురా లగుట నిస్సంశయము.

నేమి

అభినవ కవితా యానగాము లగు
సరస కవీంద్రుల సత్కారింపు నట.
( వికటహాసము చేయును )

ఇందు రాజు

కవితాసరణి పురోగాము లౌ వారినే
సత్కారించుట యన్న సరసమే కద సఖా !

నేమి

సత్కారంబన శయ్యాతలమున !
అట్టి సుకృతితో యామిని వేగును!
( ఇందురాజు కన్నులలోనికి జూచును )

ఇందు రాజు

విపరీత భాషణల్ విశ్వాస యోగ్యముల్
కావు కా! వికటైన కట్టిపెట్టుము కవీ !

నేమి

నమ్మవలదు లే నా భాషణములు
నిజము గ్రహించెడి నియమము వరకును.
శాంతించినచో సత్యమె పలికెద :
నే నరుదెంచుట నిద్ర చేయుటకే!

ఇందు రాజు

( విరక్తితో )

పాడలేవే నీవు పద్యాలు యువకవీ!
కరగింప గలవె యీ కవయిత్రి మానసము !

నేమి

అందుచేతనే యాహ్వానించితి
ప్రియమిత్రం బా భీమరథేశ్వరు.
అనుకొను నంతనె అరుగుదెంచినా
డదుగో! నూరేండ్లాయువు సఖుడా !

(గాయకుడు భీమరథుడు ఇరువదియొనిమి దేండ్లవాడు, మెల్లమెల్లగా ప్రవేశించి ఇందురాజును జూచును )

**భీమ రథుడు**

వందనము వందనం బిందురాజ కవీంద్ర !
ఇచటి కేతెంచినా విది యపూర్వము కదా !

ఇందు రాజు

కుశలమ్మా భీమరథా ? కొన్నినాళ్ళనుండి నీవు
కానరావు నగరమందు, గ్రామాంతర మేగితివా?

భీమ రథుడు

అవును రాజా, నేడె అరుగుదెంచితి మరల.
ఉజ్జయినిలో పాద ముంచినానో లేదో
మనవాడు సరి క్రొత్తమాట చెవిలో వేసి
గోష్ఠి చేయగ నన్నుగూడ రమ్మనినాడు.
నీవు కూడ కవీంద్ర, నేమి మార్గమున నే
రాలేదు కద వారరమణీ భవనమునకు ?

ఇందు రాజు

కాదు కాదు! న న్నెరుగవ? కావ్యగోష్ఠి చేయుటకే
ఇచ్చవోడము వచ్చినాడ : ఇతనితోడ కలిసి కాదు.

భీమ రథుడు

క్రొత్తరచనలు కొన్ని కొనివచ్చి యున్నాడు
నీకు జూపించెనా నేమి కవిశేఖరుడు ?

( మందహాసము చేయును )

ఇందు రాజు

అడుగ లేదు నే, నచిరముగా నే
ఆమె సన్నిధనె ఆలకింతు నని.

నేమి

పాఠము చేయుము పాటలు సఖుడా,
చూచి ముందుగా సుగమం బగుటకు.

ఇందురాజ, నీ వేయేరచనలు
తెచ్చినాడవో తెలుపం గలవా?

ఇందు రాజు

వాగ్బంధనమై వత్సర మాయెను!

నేమి

( వికటముగా నవ్వుచు )

ఎన్ని రచించిన నెవ్వరు మమ్ముల
సత్కరింపరే సముచితరీతిని!
కావ్యరచనమే కావింపని నిను
గారవింపుటకు కారణ మేమో?

భీమ రథుడు

గ్రంథ బాహుళ్యమునకే, ఓసఖా
గారవము వర్షింపునా!
కీర్తికాముకు లౌ కవుల్ ఓ సఖా,
క్రిందు మీదులు చూడరే!
శాంతవర్తను లౌ కవుల్ ఓ సఖా,
సర్వలోక స్తుత్యులే.
కీర్తి కామిని చేతిలో ఓ సఖా,
కీలుబొమ్మవు కాకుమీ!

ఇందు రాజు

( భీమరథునితో )

ఊహింప జాల నేలో ఓ సఖా,
ఉత్తమోత్తముల కైన

అది యేమొ కొన్నియెడల ఓ సఖా,
ఆదరము దుర్లభం బౌ !
ఈ వింతలోకమ్ములో ఓ సఖా,
ఏది వాంఛింతు మదియే
ఎండమావుల రీతిగా ఓ సఖా,
ఎలయించుకొని పోవునే.

భీ మ ర థు డు

వాంఛా లతికా వాగురలోనే
చేతో హరిణము చిక్కువడును గద.

( నేమి వైపు చూచి )

శ్యామా వీక్షణ శర విద్ధంబై
చేతో హరిణము జీవము విడుమను !

నే మి

( చిరునవ్వుతో మోసము త్రిప్పి )

ధర్మపన్నములు ధారాళముగా
వర్షించితివే వాచస్పతివై !
వీని కేమి లే, వీర్యవంతు లగు
యువకుల మానస మువిదలమీదనె.

కవనము చెప్పెడి కామిని మీదికి
ఊగిపోవదా యువక మానసము ?

నిండు జవ్వనము నిష్ఫల మగు నీ
కామిని సంగతి గ్రహియింపనిచో !

( ఇంతలో సమీప లతాకుంజములో సవ్వడి
యగును. ఇరువదియైదేండ్ల సుందరి సునంద,
చల్లగా వారి సన్నిధికి వచ్చును. )

సునంద

ఆర్యులార, వందనమ్ము ! ఆ వేదికమీద కింక
దయచేయుదురా క్షమించి ! తడ వైనది యొక్కించుక.
కాండపటం బీ వితర్దికా ద్వయమ్ము మధ్యసీమ
సంతరించినంత నిటకు చనుదెంచును మా నితంబ.

నేమి

ఇది యపూర్వభంగి ! ఆమె యెదురు పడక కవివరులకు
జవనికాభ్యంతరిత సరసగోష్ఠి సలుపు టెట్లు ?

సునంద

రెండు రేలనుండి యిట్టి రీతి బూనె మా నెచ్చెలి
ప్రబలహేతు వేదో కలదు ప్రతిసీరను నెలకొల్పగ.

భీమ రథుడు

రసిక జనము నెడల నాదరమ్ము చూపు విధ మిదియా ?

సునంద

ఆదరమ్ము లేక కాదు : అట్లు తలపవలదు మీరు.
కాదదృశ్య కేవలమ్ము, కాని నియమ మేదో కలదు :
జలద పటల మంతరింప చంద్రోదయ మగును గదా !
తెలుపవలతు భవ న్నామధేయములన్ కవయిత్రికి-
మీరు సుఖాసీను లైనమీద సెలవు గైకొందును.

( కాండపటము వ్రేలదీయును )

భీమ రథుడు

ఇందురాజ విద్వత్కవి, ఇతడు నేమి కవీశుండు,
కవిని కాను గాయకుండ, కవి మిత్రుడ భీమరథుడ.

(సునంద అంతర్హిత యగును. మువ్వురును రెండవ వితర్దికమీద గూరుచుందురు. వారికి గానబడకుండ వేరొక పార్శ్వమునుండి ఇరువదియేండ్ల యువతి కులస్త్రీ వేషముతో ప్రవేశించి రత్నకంబళముమీద నెమ్మదిగా నుపవిష్టురాలై, చల్లని కంఠముతో)

నితంబవతి

విద్వాంసులకు వినతి ! కవులకుం గైమోడ్పు !
గాయకుల కంజలిని ఘటియించుచున్నాను !
ఆర్య మిత్రులు మువ్వ రాసీను లైనార !
అందింపుము సునంద, ఆర్యులకు చందనము
మల్లికా మాలతీ మాల్యముల్ స్తబకముల్.
(సునంద వచ్చి, చందనాదులు వారల కొసగి, నితంబవతి నికటమున కూరుచుండును)

నేమి

శిప్రా తరంగిణీ సీకరార్ద్రిం బగుచు
మద మందముగా మలయు చున్నది గాలి.
వెదజల్లుచున్నాడు విధువు సుధ దశదిశల
కౌముదీమిషచేత కాయముల్ మరపించి.
ఉదయించుచున్న వీ యుపవనమున సాంద్ర
కుసుమ వాసనలచే క్రొంగ్రొత్త కోరికల్.

విదుషి కైతవమునన్ వెలుగొందు నిచ్చోట
త్రిదశాలయమునుండి దిగిన యచ్చరచాన !

నితంబవతి

నేమి కవీశుడు నిర్మించినవా ?
ఆశువుగా నిప్పు డల్లిన పంక్తుల ?

నేమి

నీ స్వాగత వాక్యామృత నిష్యందముచేత నొడలు
జలదరించి బయలువెడలు సద్యోవాక్కులు తరుణీ !

నితంబవతి

పాడుదురా మీ పద్యము లున్నను,
ఆకర్ణింపగ ఆస జనించెను.

నేమి

నేను పాడజాలను, నా నెచ్చెలి యీ భీమరథుడు
గాయకుండు నా రచనలు కర్ణామృత మొనరించును.

నితంబవతి

( మందహాసముతో )

కావుననే మీ గాయక మిత్రుని
గొని వచ్చితిరా గోష్ఠీకేళికి !

భీమరథుడు

నా ప్రియమిత్రుని నవ్య గాథలను
వినిపింతున యిక విదుషీరత్నమ ?

( గొంతు సవరించుకొని )

కుసుమాస్త్రు డయ్యెన్ క్రూరకర్ము డయ్యో!
దయ యించుకైనన్ దాల్పకున్నవాడే!
మథియించుచుంటన్ మన్మథుండు నన్ను
మహిలోన నిట్టులై మన్మథాఖ్య దాల్చె.
భసలమ్ములట్టుల్ భావమ్ము లెన్నో
మదిలోన చెలియా, రొద సేయుచుండున్.
శ్రవణాధ్వమున నే చాన చొచ్చి మదిని
నెలవుకొన్న దవురా, నిండురూపు దాల్చి!
హృదయస్థ యయిన ఈయలేదు తృప్తి,
ఉరముమీద వాలి ఒత్తుకొన్నగాని!
కరుణించు చెలియా, కాలయాపనమ్ము
సలుప కింకనైన సత్వరమ్ము వచ్చి!
భరియింప లేనే భావక్షోభ మింక
దరికి జేర్చుకొనుటె ధర్మ మౌను చెలియ!

నితంబవతి

(గంభీరముగా)

కాళిదాసాది మహాకవుల సరణి దేవభాష
పద్యకవిత చెప్పగలర? ప్రాకృత కవులేన మీరు?

నేమి

దేవవాణి: కాని నిండు తీయదనము కానరాదు
భాషయందు పురుషువోలె పారుష్యము కలదు కొంత.
శాతవాహన ప్రభుడు సంతరించినట్టి మహా
సప్తశతీ గాథలందు జాలువారు నమృతరసము.

నితంబవతి

శ్రీగుణాఢ్య కవీశుండు చెప్పినట్టి బృహత్కథయు
శాతవాహ నావనీశు సప్తశతియు మధురములే.
లలనవోలె ప్రాకృతమ్ము లలితమ్మె యగును గాని
సర్వతో ముఖాఢ్యశక్తి సంస్కృతమ్మునకె చెల్లు.

భీమ రథుడు

ప్రతిదినమ్ము భాషించెడి ప్రాకృతమ్ములందు కన్న
గీర్వాణమునందు కవిత కీర్తిహేతు వనుట నిజము.

నితంబవతి

సఖి సునంద మెచ్చుకొనును సంస్కృత ప్రవీణకవుల.

భీమ రథుడు

ఇచ్ఛ లేదు ప్రాకృతముల ఇందురాజ కవీంద్రునకు.

నితంబవతి

శ్రుతపూర్వమె నాకు వారి సుగృహీతము నామధేయ,
మార్యు లేది వినిపించిన నాలకింప వలతు మిగుల.

ఇందు రాజు

భవదీయ వాక్సుధాపానార్థమే రాక.

నితంబవతి

ఈ రాజధాని కే నరుగుదేరక ముందె
కవులలో మీపేరు కర్ణగోచర మయ్యె.
అఖిల మాళవదేశమందు వ్యాపించినవి
భవదీయ ఖండికల్ ప్రఖ్యాతితోగూడ !

భీమ రథుడు

ఆత్మశక్తి యెరుంగనట్టి యున్నత బుద్ధి
వినయాభిరాము డౌ విద్వత్కవీశుండు.

ఇందు రాజు

అలమ్ ! సఖా ! దేశమందు యశముమాటకేమి : మహః
కావ్యరచన చేయువాని కవివరేణ్యు డనగ జెల్లు.
కవివతంసు లన్నను శ్రీ కాళిదాస భారవులే,
అశ్వఘోష బుద్ధఘోషు లైన నవలివారె సఖా !
చిన్నిచిన్ని ఖండకృతులు చెప్పి కీర్తి వడసినట్లు
అల్పమోద మొందుచుండు టాత్మవంచనమ్ము సఖా !

నేమి

ఉన్నతలక్ష్యం బుండుట శుభమే :
కాళి దాసువలె కవు లెట్లగుదురు !

నితంబవతి

పర్వతంబులో పరమాణువులో
ఏకపదార్థతయే వ్యవస్థితము.
పురా కవీనాం గణనా ప్రసంగే
కనిష్ఠికా ధిష్ఠిత కాళిదాసా,
అద్యాఽపి తత్తుల్యకవే రభావా
దనామికా సార్థవతీ బభూవ.

ఇందు రాజు

కాళిదాస కవితా, నవం వయో
మాహిషం దధి, సశర్కరం పయః

ఐణమాంస, మబలా చ కోమలా
సంభవస్తు మమ జన్మజన్మని!
అన్నా డొక కవి, అతని వాక్యాలు
సహృదయు లెల్లరు సమ్మతింప దగు.

నితంబవతి

ఆర్య మహాకవియు అవివాహితులా?
ఏమి కవికిని నిజసతి యున్నద?

భీమరథుడు

ఇందురాజ కవి యిప్పటి వరకును
అవివాహితుడును దూ[illegible]రుడును.
నిరుడే గృహస్థగు నే[illegible]కి కలిగెను
మొన్న మొన్ననే ముద్దుల బాలుడు.

నితంబవతి

బాలుని నామము ప్రాకృత కవి పే
రని యూహించుట అనుచిత మగునా?

భీమరథుడు

కవికిని భార్యకు కలిగెను బాలుని
పేరున భిన్నాభి ప్రాయమ్ములు.

నితంబవతి

భార్యమాట విన బాగగు: కవులకు
అంకుశ ముండుట అత్యావసరమే.

ఇందురాజ కవి, ఏవో సీమలు
వరుసను కంటిరో వర్ణించెదరా!

ఇందు రాజు

ప్రథమమునను మీ పద్యరత్నముల
నాకర్ణించిన యావల యాత్రలు.

నితంబవతి

గాథలు మాత్రము కంఠస్థములు :
ఆర్య మహాశయు, లవి పాడుదునా?

(హర్ష ధ్వనులు)

కిం ద్వారి దైవహతికే, సహకారకేణ
సంవర్ధితేన విషవృక్షక ఏష పాపః!
యస్మిన్ మనాగపి వికాస వికారభాజి
ఘోరా భవన్తి మదనజ్వర సన్నిపాతాః!
దిగ్వధూవదన చుమ్బి చేష్టయా
వీక్ష్య సద్యుతి దివా భవద్యశః
దర్శితః పృథు పయోధరోద్గమ
స్తేన సాఽపి పరిరభ్యతేఽఖిలా.
లావణ్యసిన్ధు రపరైవహి కేఽయ మత్ర
యత్రోత్పలాని శశినా సహ సంప్లవన్తే!
ఉన్మజ్జతి ద్విరద కుమ్భకటీ చ యత్ర
యత్రాపరే కదలికాణ్డ మృణాల దణ్డాః.

భీమరథుడు

గూఢమ్మును రసఘుటికా ప్రాయము
పద్యమ్ముల నీ భావము విదుషీ!

కళ లూరెను నీకంఠ స్వరమున!
కేవలముగ ఆ కిన్నర గానమె!

నితంబవతి

మీ భావములకు మిగుల కృతజ్ఞను!
ఇందు రాజ కవి, ఇక మీ యాత్రలు.

ఇందు రాజు

కాళిదాసుని దూత కావ్యమ్ము నొకమారు
పఠియించుచుండగా పండువెన్నెల రేయి
మనసు వోడమెను మేఘ మార్గాన పయనింప-

నేమి

అతి దీర్ఘవృత్త మీ యాత్రా ప్రబంధమ్ము,
ప్రొద్దు వోయిన, దింక పోదుమా కవయిత్రి!

నితంబవతి

తలిరాకు చేతితో తాంబూలము సునంద,
ఈయగలవా లేచి ఈస్నిగ్ధు లిరువురకు!

( సునంద తాంబూలము లిచ్చును. నేమి విరక్తితో లేచును. భీమరథుడు చిరునవ్వుతో ఇందురాజును జూచును. అతడు గంభీరముగా నూరకుండును. వారిని సాగనంపి, వచ్చి, సునంద కాండపటము తొలగించి కూరుచుండును. నితంబవతి, ఇందురాజు పరస్పరావలోకనమున చకితు లగుదురు )

## ఇందు రాజు

ఆరంభించితి నాక్నైయయముగా
పయన మొకానొక ప్రత్యూషమ్మున.

రామ భద్రపద రాజీవాంకిత
మేఖల మగు నా మేటి రామగిరి
స్నిగ్ధచ్ఛాయా క్షితిజంబుల కడ
గడపి వాసరము, కాంచితి పిమ్మట
మాల కూట మను మహిత క్షేత్రము.

ఆవల జేరితి నామ్రకూట గిరి:
పరిణతామ్రఫల భరితద్రుమములు
నిండి యుండగా నెత్తము మీదను
దూదచ్చికముగ అంబుద మొక్కటి
కానం బడగా, కవి వర్ణించిన
భూస్తనమ్ముపలె పొలిచెను తద్గిరి.

ఆ భూమీధర మారోహించుచు
ప్రీతిం గాంచితి భిల్ల మిథునముల.

విషమ ముపలములచే వింధ్యగిరి పాదమ్ము
ఆచ్ఛోటను విశీర్ణ మైన రేవా నదము
వింత రేఖలతోడ వెలుగొందు చుండగా
స్నానాభిలాషచే జలములో దిగినాడ.
పార్శ్వ జంబూవన ప్రాంతంబులం దుండి
వనగజంబులు కొన్ని వచ్చి నీరమ్ములో
కొంత దూరమునందు క్రుంకు లిడ సాగినవి.

ఇంతలోపల నొక్క యిభము నను వీక్షించి
పైకెత్తి తుండంబు ప్రబల ఘీంకారమున-

నితంబవతి

ఆయ్యో, ఎంతటి అపాయ మొదవెను !
ఆత్తరక్ష యెటు లయ్యె కవీంద్రా !

ఇందు రాజు

అడ్డముగా శైవలానువిద్ధం బైన
పాషాణముం దాకి పడిపోయె త్రుటిలోన;
అచ్చోటు వాసినా నతి రయమ్మున నేను.

నితంబవతి

బ్రతికినాము దైవకృపా బలముచేత !- దశార్ణముల
వంక మీరు తిరిగియుండవలయు నవల కవి ప్రవర !

ఇందు రాజు

ఔను : జనపదములం దారామములచుట్టు
మొగలికంచెలు మహామోదంబు వెదజిమ్ము.
విదిశా నగరవర్తి వేత్రవతీ నదీ
చల దూర్మిపంక్తులన్ జలక మాడుచు నుండ
తీరస్థ జనము లుద్విగ్న కంఠములతో
నక్రమ్ము నక్ర మని నను ప్రబోధింపగా-

నితంబవతి

(అప్రయత్నముగా లేచి, ఇందురాజు సమీపమునకు
వచ్చి, వితర్దికాంచలమున గూరుచుండి, ఆవేగముతో)

అయ్యో, ఏటికి దిగినా రా నదీజలంబులందు !

ఇందు రాజు

కొంత దూరమునందు గురుతించి మకరమున్,
బాహువుల్ సారించి బాణవేగమ్ముతో
ప్రాపించితి తటమ్ము ప్రజలు హర్షింపగా—

నితంబవతి

మొసలి యుండు నీరమందు మునుగ నింక నెన్న డనుచు
ఈయవలయు వాగ్దానం బిపుడు నాకు సాహసికా!

ఇందు రాజు

నీవు కోరిన యాత్ర!— నీచైర్గిరిని గంటి—
బహు కదంబంబు లాపర్వతం బంతటను
విహరించు చున్నారు విదిశా గణిక లచట
పటవాసములతోడ పరిమళింపగ దిశల్.
పుష్పలావిక లపుడు పుణుకు చుండిరి నదీ
తీరాన యూథికా కోరకమ్ముల గుములు.
అగపడె నాట్యము లాడెడి కేకులు
హరిణ బృందములు నటనట వనముల.
మన ఉజ్జయినీ మార్గమధ్యమున
నిర్వింధ్యా ధుని నిర్మలసలిలము
అపనయించినది అధ్వశ్రమమును.
బహువిధ విహగ ప్రకర నాదముల
నానందంబున నాలకించుచును
తటముల నానా తరువుల క్రిందను
రాలిన యాకుల రాసుల కడముగ
పోయి అవంతీ భూముల జేరితి.

### సునంద

ఉజ్జయినీ పురయువతులు మమ్ముల
నిజనగరములో నిలిపి యుంచిరా?

### ఇందు రాజు

ఈ క్షణ నిగళము లేమి చేయగల
విందు మౌళిరుచి యెడద నిలుపుచో ?

ఇచట కొన్ని దినమ్ము లిష్టదేవత మహా
కాళనాథ స్వామి కైంకర్యమున నుంటి.
కదలి యావల నగరి, గంభీర యను రమ్య
కల్లోలినిన్ దాటి, కాననోదుంబరాల్
కనుగొనుచు, దేవగిరి క్రమముగా బ్రాపించి
స్కందదేవునిసేవ సలిపితిని భక్తితో.

శరవణ భవుం డైన స్వామి యారాధనా
నంతరమ్ము వినూత్న నైర్మల్యము ఘటిల్లె.
సేవా సమాయాత సిద్ధ మిథునమ్ములను
కాంచినట్లే యామ్యో కన్నుగవ మూసినను.

రంతి దేవాభిఖ్య రాజసంతత రచిత
బహు గవాలంభన ప్రభవ చర్మణ్వతీ
తటిని కనుగొని, యంత దశపురము జేరితిని.

పురము వీడగ బుద్ధి పొడమ లే, దొకకొన్ని
వాసరమ్ములు నేను వసియించితిని ప్రీతి.
పురిలో విలాసినీ భ్రూలతానటనమ్ము
స్వయముగా మన్మథాచార్యక మ్మని తోచు.

### సునంద

మానితంబయె యొక్కమారు దశపురి కేగ
కానంబడును వారి కను బొమల వైభవము!

### ఇందు రాజు

బ్రహ్మావర్తమునందలి పరమ పవిత్రంబు కురు
క్షేత్రము గాంచితి పూర్ణము కృష్ణదేవు డర్జునునకు
గీతలు బోధించిన భువి—కీర్తి కాయు లైన భీష్మ
ద్రోణ సుయోధన కర్ణులు త్రుంగిన మహాహవరంగము.

అవల పూత సరస్వతి యందు మజ్జనము చేసి
కనఖల పార్శ్వవర్తి గంగా కల్లోలిని గని
స్నానము చేసెడి వేళను జారెను పాదము శిలపై-
ఆయంకము గోచరించు నస్పష్టముగా నేటికి.

(నితంబవతి అప్రయత్నముగా వంగి
ఆతని పాదమును పరిశీలించును)

కస్తూరి వాసితములు గ్రావములు దేవదారు
తరుక్షీర సురభితములు తటములు, హిమఖండంబులు
వీక్షించుచు నెడనెడ కడు వేడుకతో, కీచక మధు
రారావము లధ్వంబున నాలకించుచుం బోవుచు
చేరినాను తుట్టతుదకు శ్రీచరణ న్యాసమ్మును,
సకల పాపహరణ చణము శంభుపాదయుగళ ముద్ర.

అష్టోత్తర శతవారము లర్ధచంద్ర కలా చూడు
పాదద్వయ ముద్రచుట్టు ప్రదక్షిణము చేసినాను.
అవల పూజ చేసినాడ నచట లభ్యమైన కుసుమ
చయముతోడ శ్రద్ధతోడ శంకరు పాదద్వయికిని!

నితంబవతి

శివపాదాంబుజ చిహ్నితోపలము
భక్తి గాంచునెడ ప్రముఖు లగుదు రట !

ఇందు రాజు

కనుగొన నైతిని క్రౌంచ రంధ్రమును,
మానన సరసిని, మరలితి నింటికి.

చమరీ మృగములు చాల గనంబడె
మరలి వచ్చునెడ మార్గమధ్యమున.
కాన వచ్చినది కస్తూరీ మృగ
ముపల ఖండమున నొక మార్గములో.
సరళ భూమిరుహ సంఘట్టజ మహా
దావానలమును దవ్వుల గంటిని.

చెవులం బడియెను సింహనాద మొక
యెడ సానువులో హిమాచలమ్ముల.

(నితంబవతి భయసూచకముగా నోరు తెరచును)

త్రోవలో పడిన శ్రమము తొలగ మాదు నదీతీర
సౌధములో నడుగు పెట్టు క్షణములోనె కవయిత్రీ !

వాసయష్టి విడిచి నేల వాలి కలాపములు విప్పి
నన్ను గాంచి మయూరములు నర్తనములు చేసినవి.

చెంగుచెంగునను ముదాన చెంత జేర దీర్ఘాపాంగ
నామకం బైన లేడి నన్ను జూచినంతనే.

ఆరామములోని దీర్ఘి కాంచలమ్ము జేరినంత
చూచి నన్ను మరాళములు సోపానము లెక్కినవి.

పల్లవించె రక్తాశోక పాదపంబు, నమిత మయ్యె
బాలమందార తరువు ప్రసవగుచ్ఛ భారముతో.

నితంబవతి

(ఔత్సుక్యముతో)

వేడుక పుట్టెను వీక్షింపగ మీ
సౌధరాజ మొకసారి కవీంద్రా!

ఇందు రాజు

అరుదెంచుచో మీర లస్మద్భవన సీమ
కాంచు కృతకృత్యతను కవయిత్రి, నిజముగా!
అశ్వశకటమ్ములో నరుగుదేరుట కన్న
శిప్రాజలమ్ముపై చిన్ని పోతమ్ములో
పయనించునెడల మా పట్టభంగ శ్రేణి
నశ్రమమ్ముగ నుభయము లారోహణము చేసి
రావచ్చు పుష్పావళ్ళు రాలు మార్గమువెంట
భవనమ్ములోనికే : పంపుదును మా నావ.

నితంబవతి

(పరధ్యానముగా)

ఎంత కష్టపడినవారు! ఇంత యాత్ర కాళిదాస
గౌరవమ్ముచేతనా, కారణాంతరముననా?

ఇందు రాజు

సత్యమే రెండు, మనశ్శాంతి లేక తిరిగినాను
ఉజ్జయినీ పురము విడిచి ఒక్క యేడు కవయిత్రీ!

సునంద

ఇంచుమించు ముప్పదేండ్ల యీడు దాటిపోయినను
పెండ్లి చేసికొననె లేదు, పిల్ల యెవరు కుదరకా!
ఇంత స్ఫుర ద్రూపులే! ఎట్లు మిమ్ము నొంటిగా
మసల నిచ్చుచున్నవారో మాళవాంగనల్ కవీ!

ఇందు రాజు

(విచారముతో నవ్వి)

నాకు స్ఫురద్రూపమే నష్ట దాయకమ్ముగా
అగుపించుచు నుండు నా యనుభవాల నరయుచో!

సునంద

వామలోచనలమీద వాంఛ తీరి పోయెనా?
పెండ్లిమీద శాశ్వతముగ ప్రీతి యింకెనా కవీ!

ఇందు రాజు

వంచనమ్మె కామినీ వర్తనమ్ము తీరనెడి
భావ మచ్చుపడుటచే భయము జన్మించుచుండు!
కవయిత్రియె కాని నాకాంత అన్య కారాదు.

(ముఖము పై కెత్తి)

అట్టి జాయ లభ్యమా నాశ లేక పోలేదు!

నితంబవతి

( అతనియొద్ద నున్న గ్రంథము జూచి )

కౌముదీ ధవళ మౌ కౌశేయ బద్ధమౌ
కోశ మీక్షింపగా కోర్కె పొడముచున్నది.

ఇందు రాజు

దండి పండితోక్తమౌ దశకుమార చరిత్రమ్ము.
శ్రీ సుబంధు కవీశుండు చెప్పినట్టి వాసవదత్త.

(ఆమె హస్తము చాపగా ఇందురాజు గ్రంథ మామె చేతిలో నుంచును. వ్రేళ్ళు తాకుటచే నుభయులు సుఖస్పర్శ మనుభవింతురు. అతడు రెండవ వేదికమీది కోశము జూపి)

అందులో నేమి కలవు?

నితంబవతి

అశ్వఘోషు బుద్ధచరిత
సౌందరనంద కావ్యమ్ములు సంతరించి యుంచినాను.

(లేచి గ్రంథము కొనివచ్చి అతని చేతిలో నుంచును. ఇరువురు పునః స్పర్శ సుఖము ననుభవింతురు)

చూడ దలతురో కొ— పద్యచూడామణి బుద్ధఘోష విరచితమ్ము—

(ఇందురాజు శిరఃకంపము చేయును)

ఓ సునంద, వెదకి తెచ్చిపెట్టగలవె ?

(సునంద నిష్క్రమించును)

ఇందు రాజు

(చల్లని కంఠస్వరమున)

కారణం బేమి నీ కల్యాణ మూర్తిలో
గోచరించును చిన్ని కొరత నా కన్నులకు !

సీమంతమున లేదు సిందూర రాగమ్ము
గోరోచనా రేఖ కూడ ఫాలమునందు
అస్పష్టముగనైన అగపడుట లేదేమి?

ఉత్తమాంగన వేష మొప్పియున్నది నీకు-
కాని నగరమ్ములో కవులు కొందరు నిన్ను
గణికయించుచున్నారు గణికా లలామగా!

మర్మ మేదో యున్నమాడ్కి దోచును నాకు,
దీని వివరం బేమొ తెలుపుము కవయిత్రి!
భావ్యమ్ము కాదేని ప్రశ్న క్షమియింతువా?

నితంబవతి

(గద్గద కంఠముతో)

దుర్విపాకమ్ముచే తుడుచుకొని పోయినది
ముత్తైదువల చిన్నె ముఖమునుండి కవీంద్ర!

(అధోముఖి యగును)

ఉజ్జయినిలో నాకు యువకవుల మూలాన
అచిరకాలమునుండి అప్రతిష్ఠ ఘటిల్లె!

(రోదనము చేయును)

ఇందు రాజు

(ఉత్తరీయముతో కన్నీరు తుడిచి)

నిన్ను కాపాడంగ నే నుండగా నింక
అపయశమ్ము ఘటిల్ల దంబుజాతేక్షణా!

నేటిరాతిరినుండి నీ నా యదృష్టముల్
బద్ధములై యేక పథమునం జనుగాక !
సమ్మతం బగునేని సౌందర్య దేవతా,
భవదీయ మృదుపాద పద్మ సన్నిధియందు
ప్రీతితోడుత సమర్పింతు నా హృదయమ్ము !

నితంబవతి

అంత మాన్యతకు నే నర్హురాలను కాను !
విడిచి పోవుడు కృపా వీక్షణమ్మున నన్ను !

ఇందు రాజు

వైక్లబ్య మేల ఓ వరవర్ణినీ, ఇపుడు
స్వీకరింపవె కృపావీక్షణమ్మున నన్ను !

నితంబవతి

నామూలమున మీకు నవకళంకం బంటు,
దూరముగా నున్న దురదృష్టవతికి మీ
కిహ పరములగూడ నెంతయో శ్రేయమ్ము.

ఇందు రాజు

ప్రాణేశ్వరీ, ఏటి పల్కు లియ్యవి, చాలు !
వీడి సంశయబుద్ధి విశ్వసింపుము నన్ను.

నితంబవతి

(అధోముఖియై)

కాదు ప్రభూ, విశ్వాసము కలుగకుంట కాదు ప్రభూ !
అఖిల విధములందు మీకు అర్హురాల గాను ప్రభూ !

### ఇందు రాజు

(అనునయముతో)

జాయవైతివేని నీవు సకల శుభము లొందవు ప్రియా !
అస్మదీయ జీవయాత్ర అతి మధుర మ్మగును ప్రియా !

### నితంబవతి

నా లలాటమందు సుఖము నలువ వ్రాయలేదు ప్రభూ !

### ఇందు రాజు

బ్రహ్మవంశ సంభవుండ పంక్తి పావనుండ, ఇపుడు
బ్రహ్మలిఖిత మెట్టిదైన పరివర్తిత మగును చూడు !
(ఆమె ముఖము పైకెత్తి ఫాలమున ముద్దు పెట్టుకొనును)

### నితంబవతి

(కొంచెము తప్పించుకొని)

భూసురోత్తములు మీరు, పుట్టితి నే క్షత్రియకుల
మందు, మనకు వివాహమ్ము అనుచితమ్ము కా దందుర ?

### ఇందు రాజు

బ్రాహ్మణుడే కన్యనైన భార్యనుగా స్వీకరింప
దగును, నిషేధమ్ము లేదు ధర్మశాస్త్రమందు నెచట.

### నితంబవతి

పరిణయంబైనవెనుక ప్రజలు నన్ను పునర్భువు
అని హసింపకుందురా ? అప్రతిష్ఠ నిలువదా ?

ఇందు రాజు

ఎట్టి సంశయమ్ము ప్రియా ! ఏల నీకు లోకముతో ?
అనుచితం బైన కార్య మైనగదా అపయశమ్ము ?

నితంబవతి

సుందరాకృతులు మీరు ! చూచి చూచి నన్నుబోలు
పరమ సామాన్యురాలి భార్యగా గొనుట తగునె ?

ఇందు రాజు

సౌందర్యము శాశ్వతమా ? సద్గుణాల మాట యేమి ?
అదియు గాక నా కన్నుల కచ్చరవే ప్రాణేశ్వరి !
(ఆమెను కౌగిలించికొనును)

నితంబవతి

(కొంచె మూరకుండి)
పరికింపక పూర్వచరిత భార్యగా నన్ను మీరు
స్వీకరింప దున్నవారు జీవితేశ, సత్వరముగ !

ఇందు రాజు

లేదు భూతకాలముపై లేశమైన తలపు నాకు.
భావికాలమే మనకు ప్రధానమ్ము ప్రాణేశ్వరి!
( ఆమె శిరము మూర్కొనును )

నితంబవతి

కవయిత్రియే దార కావలయు నన్నారు :
కవిత చెప్పగలేని కాలాన నామీద

హరియించి పోవునా అనురాగ మాత్మేశ !
( ఉత్కంఠతో అతని కన్నులలోనికి జూచును )

ఇందు రాజు

( అనునయముతో ముద్దాడి )
అల మలమ్ ! ప్రియతమా, ఆదిలోనే నీదు
మాట విన్నంతనే మనసులో నుదయించె
గాఢానురాగమ్ము — కవిత చేతనె కాదు.

నితంబవతి

( ఈషల్లజ్జతో )
తెలిసికొంటిని భవద్దివ్య నామము నాథ !
అడుగ రైతిరి కదా ఆత్మేశ, నాపేరు !

ఇందు రాజు

గతములో నీపేరు కలిసి పోవగ నిమ్ము !
వికట నితంబ యన్ విఖ్యాత నామమ్మె
ఆచంద్రతారార్క మక్షయ్య మగుగాక !

నితంబవతి

(వికట హాసముతో)
ఈ వికారపు పేరె ఇం పయ్యెనా మీకు !
ప్రాణనాథా, నన్ను పరిహసించుట తగున ?

ఇందు రాజు

బ్రహ్మ కనను తరమె పడినపేరును మార్ప !

వినలేద ప్రేయసీ, వికట శబ్దమ్మునకు
అభిధానమందు రమ్యార్థ మున్న విధంబు ?

(మందహాసముతో)

సైకత శ్రోణివే, సౌందర్య మూర్తివే
భవదీయ ఘన నితంబముల కేమి కొరంత !

(జఘనభాగము స్పృశించి, అంకపాళిపై నామెను కూర్చుండబెట్టుకొని, చెక్కిళ్ళు నిమురుచు)

తాటంకములు గండ దర్పణమ్ములయందు
ప్రతిఫలించుచునుండ బాలభాను ద్యుతుల్
నూల ముక్తాహార శుభ్రరోచిః పటలి
రంగవల్లిక రీతి రంజిల్లు చుండగా,
సంఛన్నమై శుకశ్యామ చేలచ్ఛవుల
భవదీయ తనుసీమ ప్రాభాతికారామ
మధ్య సంస్థిత దేవమందిర ప్రాంగణ
ప్రభల దలపించినది ప్రాణప్రియా, నేడు !

(పాదధ్వని వినబడగా నితంబవతి లేచి
ప్రియుని సమీపముననే కూరుచుండును)

## సు నం ద

(వెనుక నుండి ప్రవేశించి)

కానరాలేదు సఖీ, కావ్య మెచట నుంచినావో ?

## ని తం బ వ తి

ఏమి కావ్యమే సునంద ? ఎవరు తెమ్మన్నవారు ?

ఇందు రాజు

పద్య చూడామణికి పంపినావు సునంద,
నంతలో మరచినా వద్భుతమ్ముగ ప్రియా!

(నితంబవతి లేచి మందమందముగా నడచిపోవును)

ఒక్క మాట సునంద! ఉలికిపడె దేమిటికి?
స్వీకరించినది నీ చెలియ నను భర్తగా.

సునంద

(విస్ఫారిత నేత్రములతో)

ఎంతకాలమున కిట్టి సువార్తను
వీను లలరగా వింటి కవీంద్రా!

సంతోషము! నా సఖి కిక నైనను
సరస జీవనము సమకూడునుగా!

భాగ్యవశమునసె భవదీయేక్షణ
మార్గమునం బడె మా నితంబవతి!

బహుకష్టములపా లైనది సఖి!
ఆమె పూర్వకథ నాలకించితిర?

ఇందు రాజు

పాప! మనదయై బాధ పడినటులు
శూన్యవదనమును జూచి గ్రహించితి.

సునంద

బలవంతముగా పాణిగ్రహణము
జరిగెను చెలియకు సంపన్నునితో.

కాలే మాషం సస్యే మాసం
వదతి శకారం యశ్చ సకారమ్
ఉష్ట్రే లుంపతి రం వా షం వా
తస్మై దత్తా వికటనితంబా.
వ్రజకుంఠితో నాసర మైనను
నిలువలేదు మా నెచ్చెలి రాజా !
బహుధన భూషలు పంపుచుండు వా
డతడు దారపై నాస త్యజింపక.
జనకు పోరు పడజాలక చెప్పెను
నిజరహస్యమును నెచ్చెలి నాతో.
కొలది రోజులకు గూఢ మార్గమున
ఊరు విడిచినా ముభయుల మెటులో.

ఇందు రాజు

సాహసించితివి సఖికోసము ! నీ
వృత్తాంతమ్మును విందు సునందా !

సునంద

అవల నాకథ నాకర్ణింతురు-
ఉజ్జయినీ పురి నుంటిమి రాజా,
గూఢముగా నొక కొన్ని మాసములు.
అనతి కాలమున కతడు గతించిన
వృత్తాంతము మా వీనుల బడినది.
శ్రీ సరస్వతి కరుణచే మా
చెలికి పద్యము లల్ల గలిగిన
శక్తి యొదవెను చిన్ననాడే స్వతస్సిద్ధముగా.

మరపు తగులును చింత లన్నియు
మా నితంబకు నసెడి తలపున
గోష్ఠు లీ యుపవనములో సమకూర్ప సాగితిని.
చెప్పుచుండెడిదాన పెండిలి
చేసికొమ్మని సకియతో నే
నప్పుడప్పుడు. కాని చెలియకు నాస్థయే లేదు.
కవియు రసికుండైన యాతడె
కా దగును నాయట్టిదానికి
భర్త యనుచు ప్రసంగవశమున పలికె నొకనాడు.
గారవించుచునుండు కతమున
కవుల నే యధికంబుగా సఖి
పట్టనమ్మున పరీవాదము ప్రబలిపోయినది.
గణిక యనియును, ప్రతివిభావరి
కవికి సత్కారమ్ము శయ్యా
వాసమున ఘటియిల్లు ననియును వాదు పుట్టినది.
కొలది దినములు మాను కొంటిమి
గోష్ఠు : లావల నేనె నిల్పితి
కాండ పటము నితంబ యొరులకు గానబడకుండన్.

(ఇందురాజు కనుబొమ్మ లెగురవేయును. ఇంతలో నితంబవతి వచ్చి, కావ్య మతనిచేతి కందీయగా ఇందురాజు ప్రియాహస్తము ముద్దుపెట్టుకొనును )

సునంద

తెలిసిన దంతయు, దీవన గొనుమా !
(మందహాసముతో సఖి చెక్కిళ్ళు నిమురును)

### నితంబవతి

( సునంద భుజములమీద చేతు లుంచి ఒక
మారు నవ్వి, అంతలోనే సిగ్గుతో )

మమ్ము విడువకుము, మంచిదానవుగ !

### ఇందు రాజు

కవి యైన రసికునే గాని యొల్ల వటంచు
సఖి సునంద వచింప జంకు పుట్టెను ప్రియా !
సౌందర్యము, కవిత్వ శక్తి లోపించుచో
ఇందురాజు నదృష్ట మేమి కానున్నదో !

### నితంబవతి

మీరె కావలె గాని, మీయంద చందముల్
కవితాది శక్తు లక్కర లేదు ప్రాణేశ !

(ఉభయుల కంఠములలోని హారములు మారును.
సునంద వెనుకకు బోయి పుష్పములు తెచ్చి
ఉభయుల మీద చల్లి అదృశ్యురా లగును)

### ఇందు రాజు

వికట నితంబా విభు డను నభిధయె
నాకు జాలు ప్రియ, నరలోకములో !

(ఉభయుల గాఢాలింగనము)

## సమాప్తము

---

# సహజ యాన పంథీ

. అంకితము .

శ్రీ చింతా దీక్షితులకు

## పాత్రలు

వృద్ధ బ్రాహ్మణ బృందము
నకుల దాసు
దేవీ దాసు
చండీ దాసు
రామ మణి
తా ర ణి
విశ్వంభర ఠాకూరు
యువ బ్రాహ్మణ బృందము

క్రీ. శ. 1350 సంవత్సర ప్రాంతాలలో
వంగదేశములో నాన్నూరు గ్రామము
కాల పరిమితి : రెండు వారములు

## ప్రథమ రంగము

ఉదయ కాలము, ప్రథమ యామము. నకులదాస గృహమున కెదురుగా బ్రాహ్మణ బృందము కూడినది. నకులదాసు లోనుండి వెలుపలికి వచ్చి వితర్దిక ప్రక్కన ఏంత జూచుచు నిలుచున్నాడు.

### బ్రాహ్మణ బృందము

అకటా, బ్రాహ్మణులచే అక్రమమ్ము చేయ
మిగులు తెగలవారు మీరిపోవరొక్కొ! ...అకటా.

శంభో, కలికాల సామజంబు మిగుల
దృప్తమౌచు వంగదేశమంతు దిరుగు! ...అకటా.

ఇంతకన్న వేరె హేయకార్య మేది
ధర్మవర్తనులను తల్లడిల్ల జేయ? ...అకటా

శుద్ధభూసురుండు శూద్రయువతి నొకతె
వలచె నన్న దుష్టవార్త పుట్టె నేడు! ...అకటా

బ్రాహ్మణమ్ము కేమొ ప్రళయ మావహించి
సర్వనాశనమ్ము సంఘటించు వేగ ...అకటా

### నకుల దాసు

ఏల ఆర్యులార, మీకు నింతటి యుద్వేగ మొదవె?
శాంతమైన మీ మానస సరసియందు భంగపటలి
ఈ విధాన రేపినట్టి దే భావానిలమొ కదా! ...ఏల
అస్మదాదు లీగ్రామమునం దతి సామాన్యు లౌట
ఆర్యులార, మీచేతో వ్యథ యెటు తొలగింపగలరు?
...ఏల...

ఈ ప్రభాతకాలమ్మున నేమిటి కరుదెంచినారో
ఆర్య మహాశయులు మదీయాంతికమున కడుగవలతు
...ఏల...

## బ్రాహ్మణ బృందము

అంకురమ్ము గాంచి ఆదిలోనె వెజ్జు
ఘృతముగానె వ్యాధిఁ ద్రుంచివేయ మేలు ...అంకు

బ్రాహ్మణుండె కాని భ్రష్టు డయ్యెనేని
అర్చకత్వమునకు అర్హు డెట్టు లగును ? ...అంకు

నేడు మొదలు గాగ నీ సహోదరుండు
ఆలయమ్ములోన అడుగు పెట్టరాదు ...అంకు

న్యాయబుద్ధి వైన నకులదాస శర్మ,
తడయ కడప వలయు ధర్మ విప్లవమ్ము ...అంకు

## నకుల దాసు

వలచినాడె శూద్రజాతి వనితను నా సోదరుండు ?
నిషధయోగ్యు డనుచు వాని నిన్న మొన్నదాక పొగడి
నేడు వానిమీద పెద్ద నింద మోపుచున్నవారె!...వల

అట్టి కార్య మెంతమాత్ర మాచరింప డని తలంతు :
నాకు దెలియునంత వరకు న్యాయవర్తనుండె చండి
...వలచి...

కారణమ్ము లేక మీరు కలత చెందువారు కారు
శాంతచిత్తు లగుదురేని సత్య మేమొ తెలిసికొందు
...వలచి...

### బ్రాహ్మణ బృందము

తొలుత రామి ప్రాంగణమ్ము త్రొక్కకుండ జూడవలయు!
నిజధర్మం బేమొ తాను నెరపి చనక దేవదాసి
బ్రహ్మచారి యైన యువకు భ్రమపెట్టుచు నుండదగునె?
తనయంతర మేమొ మరచి ధరణి సురుని భ్రష్టు జేయు
కండకావరమ్ము వేగ కరగించుట ధర్మ మగును ...తొలుత

### నకుల దాసు

ఎవరి కైన నొక్కసారి హెచ్చరింప దగును గదా?
చెప్పినట్లు చేయకున్న శిక్ష చేయ భావ్య మవల ...ఎవరి
విప్రుల మయి ధర్మమునకు విప్లవంబు సహించుతుమె ?
నిజము తెలిసికొన్నమీద నిరోధంత మార్యులార! ...ఎవరి

(బ్రాహ్మణ బృందము నిష్క్రమించును. నకులదాసు చింతాక్రాంతుడయి వేదిక మీద గూరుచుండును. ఇంతలో పార్శ్వమునుండి ఇరువది యయిదేండ్ల తరుణుడు దేవీ దాసు ప్రవేశించి నిలుచుండును. నకుల దాసు తల యెత్తి చూచును.)

### దేవీ దాసు

నమ్మబోకు నమ్మబోకు నకులదాస, వీరినింద!
శుద్ధవర్తనుండు నీదు సోదరుండు చండీదాసు
పరుల కెట్లు తెలియు నతని భావములో నైర్మల్యము?
ఓర్వలేని వార లెవరొ ఊరక యపనింద వేయ
విసమువోలె ప్రాకిపోయె విప్రసంఘమందు గూడ...నమ్మ

పాప, మతడు రామమణికి పది యడుగుల దూరమందె
నిలుచుగాని యొక్కమారు నికటమునకు బోవలేదు.
...నమ్ము...
దానిని వీక్షించినంత తగులములో బడినరీతి
భావించుట కేవలమ్ము భ్రమ మనియే యెంచవలయు
...నమ్ము...

## నకుల దాసు

నీదు భాషణముల నిండు సంతసంబె!
సరళవర్తనుండె చండి, అయినగాని
జాగరూకు డగుట సముచితంబు కాద? ...నీదు
కొంత లోకభయము కూడ నుండ వలద?
అటులు కానినాడు అప్రతిష్ఠపాలు! ...నీదు
దేవదాసివంక తేరి చూచుచున్న
అనుమానింతు రన్న ఆశ్చర్యమ్ము లేదు ...నీదు

## దేవీ దాసు

రాణి యానము రమణీయంబే—
ఆ భావముతో అవలోకింపడు.
ఆకర్షించెడి యానన మయినను
అనురాగముచే నాలోకింపడు.
ఆ వదనములో నతిమానుష మగు
కాంతి యేదియో కానంబడు నట.
తన్మయుడై యా దాని ముఖమ్మును
అద్భుత దృక్కుల నాలోకించును.

### నకుల దాసు

నీ కనిపించద నిజముగ నియ్యది
అస్పష్టం బగు యౌవన రేఖగ ?
రజక యువతిపై రక్తి జనించెనె
అవిదితమ్ముగా నంతరంగమున!
ఇంక వివాహం బెటులో చండికి
చేయుట శుభ మగు శీఘ్రమ్ముగ నే.

### దేవీ దాసు

బహు విధముల నే బరిశీలించితి,
కాదు యౌవనవికార చేష్టితము.
అనురాగము కా దంతర్ద్రోహము,
కామ వాంఛయును కాదు నిజమ్ముగ.

తద్వీక్షణమున ద్రవీభూతమై
అతని హృదయం బతి మధురంబై
అప్రయత్నముగ నంకురించినది
కమనీయం బౌ కవితాబీజము.

### నకుల దాసు

ఇది నూతనోదంత ! మెంత కాలం బాయె
చండి కుదయించి యీ సహజ కవితాశక్తి ?
ఆది కవీశ్వరుం డైన వాల్మీకులకు
శోకమ్ము వహియించె శ్లోకరూపము తొలుత.
దేవదాసీ ముఖ దిదృక్షు చండీదాసు
కవిని జేసెనె ! ఏమి కర్మమ్ము విప్రునకు !

అను దినమ్మును తానె ఆరాధనము చేయు
ఆ వాసులాదేవి యానన ప్రభలచే
అతని హృదయమ్ములో నంధకారము తొలగి
ఆవిర్భవించు గా కకలంక మగు కవిత !

దేవీ దాసు

జగదంబికా ముఖచ్ఛవియె తోచును రాని
వదనబింబమ్ముపై వాస్తవమ్ముగ నాకు
అన్నాడు మనచండి ఆవేశమున మొన్న-

వకుల దాసు

శాంతం పాపమ్! చాలును జాలును !
వినజాలను నే విపరీతోక్తులు!
సకల చరాచర జగజ్జననికిని
చాకలి దానికి సామ్యమె! శివ శివ!

సరళహృదయుడౌ చండికి నేలనో
మతి చెడిపోయిన మాట నిశ్చయము !
చెప్పి చూడుము నీ స్నిగ్ధుడు కావున
విపరీతోక్తులు విడిచిపెట్టు మని.

దేవీ దాసు

గతమాసమే చండి కవన మారంభించె
కాని శ్రీవాసులా కారుణ్య పాత్రమై
అచిర కాలములోన అఖిలదేశములందు
భక్తుండు కవి యన్న ప్రఖ్యాతి గడియించు.

సామాన్యముగ లోకసంగ్రహార్థము మీర
లనుసరించెడి ధర్మ మత డనుష్ఠింపండు.
సహజ యానములో సాధకుం డాతండు,
ఆదృష్టితో చూడ నత్యంత యోగ్యుడే.

### నకుల దాసు

సాధన కైనను శాస్త్రము వలదా?
నిజభావంబే నియమం బగునా ?

### దేవీ దాసు

గుప్తసాధన తంత్ర కోశ ప్రకారమ్ము
నవకన్యకలు : విప్ర, నట, శూద్ర, గోపాల,
కాపాలి, కాంబష్ఠ, గణికా, రజక, మాలి
కా కార పుత్రికల్ కమనీయ విగ్రహాలు,
సౌశీల్య కారుణ్య సంపన్నలు విశేష
వైదగ్ధ్య యుక్తలై వరలు కన్యకలనే
అకలంకబుద్ధితో నారాధనము చేయు
నాతండు సిద్ధుడౌ ననుట నిస్సంశయము.

### నకుల దాసు

శాస్త్రోక్తం బని సమ్మతించినను
సహజయాన మెటు సరళమార మగు ?
ఆవిధానమున ఆరాధనయే
అనిపించును నా కసహజ మనియే.
బహు శీఘ్రముగా భ్రష్టుం డగుటకు
అను వగు యానం బది యొక్కటియే.

### దే వీ దా సు

చండి పదముల నొక్కసారి గానము చేయ
దెలిసికొందువు వాని దివ్య ప్రభావమ్ము.

### నకుల దాసు

విధ్యుక్త ధర్మముల్ విడువ రా దని చెప్ప.
వీని రచనలు తెచ్చి వినిపింపు మొకమారు.

(నిష్క్రమించును. అన్యమార్గమున చండీ
దాసు పరధ్యానముగా ప్రవేశించును)

### దే వి దా సు

శూన్యదృక్కులతోడ చూచుచున్నావేల ?
పలుకకున్నా, వేమి తలపోయుచున్నావు ?

### చ ం డీ దా సు

రామ మణీ, రామమణీ !
రామ మణీ, బ్రహ్మమయీ !

# ద్వితీయ రంగము

సూర్యాస్తమయ సమయము. వాసులాదేవీ మందిరము వెనుక పుష్కరిణీ ప్రథమ సోపానముపై గూరుచుండి రామమణి చింతాయత్తయై యుండును. వెనుకనుండి శాంతముగా తారణి ప్రవేశించును.

తా ర ణి

ఏమే చెలియా, ఏకాంతముగా
నుపవేశించితి వుదకము పజ్జను.

వెదకి వెదకి నిను, వేసరి చివరకు
చూడగలిగితిని సోపానముపై.

పలుకవు చెలియా, పరధ్యానముగ
సలిలము గాంతువు, స్వస్థతయేనా ?

నీవదనముపై నేడది యేమో
కనబడు చెలియా, కమనీయద్యుతి.
లలిత భావముల లక్ష్యరూపమున
కళ లూరును ముఖకమలము సకియా !

అతిమధుర మ్మగు నది తలపోయుచు
నున్నదానివలె నొప్పెదు రామా !
వృత్తాంతమ్మును వివరించెదు నెడ
ఈ నీ చెలియకు నెంతయు ముద మగు.

సంధ్యారాగ చ్ఛవి నిమగ్న వయి
పసిడి బొమ్మవలె భాసిలె దోసీ !

మన వంశమునకు మంగళ దేవత
చందమునన్ ప్రియసఖి, తోచెదవే !

**రామ మణి**

( పైకి చూచి లేచి )

ఆహా యెంత మంచి దమ్ము వాసులాంబ
సేవలోన నేను చేరినట్టి ఘటిక ! ...ఆహా
నాటినుండి యేదో నాలో తీయ నైన
ణా తదనము నాకే గోచరించు చెలియా ! ...ఆహా
నాకు గానబడును నందనమువోలె
ఆ క్షణమ్మునుండి అగ్రహార సీమ ! ...ఆహా

( రామమణి నాట్యము చేయును.
మందహాసముతో ఆమెబుజము తట్టి-)

**తా ర ణి**

అవును సఖీ, అవును సఖీ, అగ్రహారసీమ సఖీ,
కానబడుచు నుంటు కటులు కారణమ్ము కలదు సఖీ !
నాన్నార గ్రామములో నందనము వోలె నీకు
అగపడులే కేవలమ్ము అగ్రహారసీమ సఖీ !

( నాట్యము చేయును )

**రామ మణి**

తెలిసియుండు కతన విశ్వజనని చెలియా !
అగ్రహారభూమి అగును నందనంబె.

( నాట్యము )

తా ర ణి

తెలియలేవె నాకు, దేవీ మందిరంబు
వెలయుచుంటె కాక వేరే యున్నదిలే !

( నాట్యము )

రామ మణి

అగ్రహారమందు అవనీదేవు లుందు,
రగ్రవర్ణ మన్న ఆదరమ్ము, నాకు !

(నాట్యము)

తా ర ణి

అందు నొకరిమొదల నధికభక్తి లేదా ?
భక్తికన్న తరణోపాయ మేమి చెలియా !
అమ్మవారిమీద నధిక భక్తి నీకు,
అర్చకునిమీద అంతకన్న భక్తి !

(ఉభయులు చేతులు పట్టుకొని నాట్యము చేయుదురు)

రామ మణి

అనబోకే అనబోకే !
అవని సురుల చెవిని బడిన
ఆవరణములోని కైన
అడుగు పెట్టనీయరు గదె ! ...అనబోకే
ప్రేమయేని భక్తియేని
పెరవారికి దెలియనీక

మనసులోనె నిలుపుకొనుట
మంగళమ్ము ప్రాణసఖీ ! ...అనబోకే

కొన్నినాళ్ళ క్రిందనె కద
కోలాహల ముప్పతిల్లె !
భూసురోత్తములకు కినుక
పుట్టింపం దగదు సఖీ ! ...అనబోకే

(నాట్యము)

**తారణి**

వాలినదే ఓసి, నీకు వలపు జూపు ప్రియసఖీ,
ఉత్తమం బైనచోట, ఉన్నతం బైనచోట ...వాలినదే
వెనుకజన్మలో దళము వేసి పుట్టినావు గదే !
కానిచో నీకు విప్రకామి యెట్లు దొరకునే!...వాలినదే

(నాట్యము)

**రామ మణి**

కామి యనకె తారణీ ! గాయకుండు సామాన్య
సరణిరక్తివాడటే ! సహజయాన పంథీటే ! ...కామి.

**తారణి**

చదువుకొన్నదాననా ! సహజయాన మెట్టిదో
ఎట్టి సాధకుండో నా కెట్లు తెలియునే చెలీ !
అయిన నడుగవలతు నొక్క, టతడు నీ తనువుమీద
చేయి వేసినాడేమొ చెప్పగలవె ప్రియసఖీ !

రామ మణి

కలుగ నేల నీకు కారణమ్ము లేక
ఈ కళంక చెలియా, ఏర్పరింప గలవె?

తార ణి

కవి గాయకునకు కలదా నీమీద
నిండు రక్తి చెలియా? నిజము నరసినావో?

**రామ మణి**

తెలియ కేమి, ధరణీదేవు మానసమున
దీనురాలిమీద దివ్యమైన రక్తి!

( నాట్యము )

తార ణి

నమ్మకమ్ము లేదే నాకు రామమణీ,
భ్రాంతి యేదో నిన్ను పట్టి విడువ దాయె!
ప్రేమ మున్న ముద్దు పెట్టుకొనడ నిన్ను?
గ్రుచ్చి కౌగిలించుకొనడ వెర్రిదాన!

( రామమణి కన్నీరు విడుచును )

పెట్టుకొనక నిన్ను పెండ్లి యాడు నేమొ
తెలివి యోడ మెలగి తేల్చివేసికొనవె!

**రామ మణి**

(నూతన కంఠ స్వరముతో)

**నా మీద ననురక్తి నాథునకు లే దనియె**
**తలపోయుచున్నావె తారణీ, తారణీ!**

కాదు లౌకిక మైన కామ ప్రదీపార్చి
అతిమానుషం బైన యనురాగ దీప మది !

తారణి

అనురాగ లక్షణా లాలింగనములున్
చుంబునమ్ములు తప్ప సుఖ సమాజమ్ములున్
మాకు దెలిసిన విధియె ! మనసులో ననురక్తి
గుప్తముగా నుంచుకొన్న లాభం బేమి ?
వాఙ్మనః క్రియలలో వలపు మలపులు దెలియ
పంచేంద్రియ గణమ్ము ప్రమద భరితం బగును.

రామ మణి

ఈ ప్రేమములో నేమాత్రమును
స్వారస్యంబే సకియా, తోచదె.

తారణి

దేహేంద్రియ సంతృప్తి కోసంగిన
పిదపనె కాదా ప్రేమ సఫల మగు ?
ఈ మన తనువులు హేయము లనియెడి
వేదాంతము నే వినజాలను సఖి !

(నాట్యము)

రామ మణి

పరిణీత వైన నీ భావముల్ నెచ్చెలీ,
భర్తతో సంతృప్తి బడయ వలయును గదా ?
అవివాహితకు నాకు అట్టి సౌఖ్యము మీద
భావమ్ము లేదు : నా పథము ప్రత్యేకమ్ము.

తారణి

నాకు గలుగుచుండు నడుమ నడుమ జాలి
నిన్ను దలచుకొన్న నిక్కముగ చెలియ !
షోడశాబ్దముల సుందరాంగి దేవ
దాసి వృత్తిలోన తగులు వడిన దకట !
పెండ్లియాడి చెలియ, బిడ్డలను గాంచి
నీవు సంతసింప నేను చూడవలతు.

(నాట్యము)

రామ మణి

బిడ్డ లేటికి నాకు చెలియ - మొదట
పెండ్లి యేటికి నాకు సకియ !
శ్రీవాసులా దేవి జననీ-సతత
సేవలోనే సుఖము నాకు.

( నాట్యము )

తారణి

అర్చకస్వామిపై నీకు-కలుగు
అనురాగ మే మగునో చూడు
అడుగవే ఒకసారి నిన్ను-పెండ్లి
ఆడు మని ఆయనను పిల్ల !

రామ మణి

అడుగజాల నట్టిమాట ! ఆ మహాత్ము దర్శనమ్ము
అహరహమ్ము కలుగునేని అంతె చాలు నాకు సఖీ !
అగ్రవర్ణ జాతుడైన ఆ మహానుభావు డేడ ?
రజక కులోద్భూత యైన రామ మణీ దాని యెడ !

తారణి

( ఆమె బుజము తాకి )

విస్మరింప దన్నమాట విప్రత్వము చండీదాసు.
అట్టివాడు నీకు నాథు డగుట యెట్లు ప్రాణసఖీ !
దీప ముండగనె యిల్లు తెలివితోడ చక్కబెట్టు
కొనుట మేలు, లోలోపల కుమిలిపోవ నేల సఖీ!

రామమణి

పాప, మాయనకు బ్రాహ్మణు డనియెడి
అతిశయమే లే దంతరంగమున.
పత్నిగనో ఉపపత్నిగనో నను
చూడడు చెలియా, శుద్ధమానసుడు !
ఆ నయనమ్ముల నమృతము కురియును
నన్ను గాంచునెడ, నమ్ముము చెలియా !

(నాట్యము)

తారణి

ఇట్టి ప్రేమ శాశ్వత మని యెంచరాదు ముద్దరాల !
బ్రాహ్మణు డెన్నటి కైనను పరిత్యాగ శీలి చెలీ !
కౌముదీ రసమ్ము గ్రోలి కాలయాపనము చేయు
కవిజనోక్త యా చకోరికా విధమ్ము నీది చెలీ !

(నాట్యము)

రామమణి

స్వామివదన చంద్రికా జాలపాన మత్తమై
నా నయన చకోరికల్ నాట్యమాడు నెచ్చెలీ !

అర్చకస్వామి కరుణ అమ్మవారి కరుణ యుండ
అన్య మేది వాంఛనీయ మవనిలోన నాకు సఖీ !

(నాట్యము)

(వేణుపుంజము వెనుకనుండి మందగమనమున దేవీ దాసు ప్రవేశించును. వారతనికి నమస్కరింతురు)

తారణి

(ముందరికి పోయి)

ఇటు దయచేసితి రేటికి స్వామీ ?
మీగమనములో నిక్కలి మాంద్యమె !
ముఖమెా చింతాముద్రిత మైనది !
అప్రియ మిపు డేమైనను కలదా ?

దేవీదాసు

(జాలిగా)

ఊహించినది నీవు యుక్తమే తారణీ !
అమ్మవారికి కరుణ అపసృతము రామిపై!

(రామివైపు జూచును)

తారణి

అది యేమి ! సేవలో అపచార మే మైన
చేసెనా మా రామి ? చెప్పవలయును స్వామి !

దేవీదాసు

రామి కంఠము చాల రమణీయ మైనదే !
నృత్త నాట్యములలో నిపుణురాలే రామి

సేవలో లోపమ్ము చేయలే దేనాడు
కాని శ్రీవాసులా కరుణ మాత్రము తొలగ!

తారణి

( విచారముతో )

అత్యాహిత మేమైనను పొసగెనె
అమ్మవారి కృప అపసృత మగుటకు ?

దేవీదాసు

అట్టి దేమియు లేదు : అయిన నీ నెచ్చెలికి
శ్రీవాసులా సేవ శీఘ్రమ్ముగా తొలగు.

(రామమణితో)

ధర్మకర్తలు నీకు తమ నిర్ణయము దెలుప
ఆజ్ఞ నిచ్చినవార లాగ్రహోదగ్రులై —

తారణి

ధర్మకర్తలకు దయా మృగ్యంబా !
అన్యాయం బీయానతి స్వామీ !

రామమణి

(ధైర్యము తెచ్చుకొని)

ధర్మకర్తలకు దయలే దనకే !
దురదృష్టమ్మును దూరిన లాభమె ?

తారణి

నిష్ఠుర మగు నీ నిర్ణయమ్మునకు
కారణ మేమో కనుగొన వచ్చున ?

రామ మణి

కారణ మేటికి గడచిన దానికి ?
ధర్మకర్తలకు తల యొగ్గగ వలె.

దే వీ దా సు

ధర్మకర్తలు, సంఘ ధర్మాలు పాటింత్రు :
అవనీసురుం డైన యర్చక స్వామికిని
దేవదాసికి నున్న దివ్యానురాగమ్ము
కామసామాన్యమ్ముగా గ్రహించినవారు.
దేవదాసి నతండు దేవాలయమ్ములో
కాంచకుండగ జేయ కర్తవ్య మనుకొనిరి.

తా ర ణి

విపరీతము ! దేవళమున వీరి వియోగమ్ము వలన
అగునె ధర్మసంస్థాపన ? అన్యాయం బన్యాయము !
దేవదాసి వృత్తి వారు తీసి వేసినారు, కాని
అర్చకస్వామి నింక నావలకుం బంపలేదె !

(నిట్టూర్పు విడుచును)

దే వీ దా సు

కొంత సుగుణమె కాని కుదురుగా నెన్నాళ్లు
అమ్మవారికి చండి అర్చకుడుగా నుండు ?

తా ర ణి

దాసిమీద మీ చండీ దాస స్వామికి సైతము
దయ తొలంగ లేదు గదా ధర్మకర్తృ నిర్ణయమున?

## రామ మణి

( మందిరము వైపు తిరిగి )

నేటినుండి నాకు నీదు సేవ తొలగె

కాని వాసులాంబ, కరుణ మాన కమ్మ !

( నిశ్శబ్దముగా రోదనము చేయుచు తారణి భుజముపై తల వాల్చును. ఉభయులును బయలుదేరి కొన్ని యడుగులు వేయుదురు. ఇంతలో వేణుపుంజము వెనుకనుండి నెమ్మదిగా నడుగులు వేయుచు ఆకసముపంక జూచుచు చండీదాసు ప్రవేశించును. దేవీదాసు అతని కెదురు పోవును. అతనిని చూడకుండ ఊర్ధ్వ దృష్టితో )

చ ం డీ దా సు

రామమణీ, రామమణీ, రామమణీ బ్రహ్మమయీ !
తీరినదా నేటినుండి దేవదాసి వృత్తి నీకు!
నీవు దండ లేకుండగ నేను సేవ చేయగలనె ?
వాసులాంబ కేది మనపై వాత్సల్యము రామ మణీ !
రామ మణీ, రామ మణీ ! రామ మణీ, బ్రహ్మమయీ !

# తృతీయ రంగము

దేవ్యాలయ ప్రాకారమునకు ముందరి ద్వారము దగ్గర. ఇంచుమించుగా మధ్యాహ్న సమయము.

### దే వీ దా సు

పాకకృత్యముల పరిసమాప్తి లో
అవశిష్టము లేమయినను కలవా ?

### విశ్వంభర ఠాకూరు

ఆయత్తంబే అంతయు, బ్రాహ్మణు
లింకను రాలే, దేమి కతంబో ?

### దే వీ దా సు

చాలదో పిలుపే సద్బ్రాహ్మణులకు !
ఎంతటి యాగ్రహ మీ సజ్జనులకు !

(చండీదాసు తలుపు తెరచుకొని
యావలకు వచ్చుట చూచి )

ఎచటికి బోయెద ? వేమిది చండీ !
ఇంకను దైన్యం బేటికి చెపుమా ?

### చ ం డీ దా సు

ఇంటి వరుసను బోయి యెల్లవారల అన్న
పేరు పేరున నన్ను పిలిచి రమ్మన్నాడు.

### దేవీదా

నకులదాస, అన్యాయము చండిని
పేరుపేరునను పిలువం బంపుట !

### విశ్వంభరుడు

సత్వరమ్ముగను చండీదాసా,
పామ్ము పిలుపునకు ప్రాదెక్కనదే.
(చండీదాసు నిష్క్రమించును)
అన్యాయంబా అతనినె పంపుట?
నకుల దాసునకు నయ మవిదితమా ?

అంతరంగమున అహంకార లవ
మపస్మృత మగు నీ యాహ్వానముతో.
చండీదాసే చని బ్రాహ్మణులను
స్వయముగ బిలిచిన శాంతి పొందుదురు.

సంతర్పణకై సమ్మతించినపు
డహంకారమున కవసర మేటికి?

### దేవీదాసు

అన్న పోరు పడజాలక అంగీకారము చూపెను,
ప్రాయశ్చిత్తార్థమ్ముగ భావింపడు దీని నతడు.

### విశ్వంభరుడు

ఏది కలదో మానసమున నెవరు చూడగలరు? కాని
బాహ్యవర్తనమ్మునకే ప్రాధాన్యమ్ము దేవీ దాస !

**దేవీదాసు**

ప్రాధాన్యమ్మును సంకల్పమ్మునకే యొసగవలయు
కార్యమునకు కాదనియెడి ఘనసూత్రము నెరుగవలయు.

**విశ్వంభరుడు**

(పైకి చూచి)

మన యదృష్టవశముచేత మందముగా నున్నవాడు
నేడు దినాకరదేవుడు నిజచండిమ చూపకుండ.

**దేవీదాసు**

సంరక్షణకై యున్నవి శాలలు, మూఖమంటపమ్ము,
లయినను సుఖభోజన మగు నాతపమ్ము మందగింప.

(ఇంతలో కొందరు బ్రాహ్మణులు నీళ్ళచెంబులతో ప్రవేశించి, తలుపు తెరచుకొని లోనికి బోవుదురు. వీధివెంట బోవుచున్న తారిణి వారిని గాంచి, కొంచె మాగి ద్వారమువైపు రెండడుగులు వేయును. )

**తారిణి**

ఏ మిది స్వామీ, ఎరుగం జెప్పుడు
ఉత్సవ మేదే నున్నద యిప్పుడ ?

**దేవీదాసు**

బ్రాహ్మణ సంతర్పణ జరుగునుతే
అంగణ భూమిని అర్ధఘటికలో.

**విశ్వంభరుడు**

పో దూరముగా ! భూసురు లరుగో
అరుగుదెంచినా రంతికమునకే.

(తారణి కొంతదూరము తొలగును. బ్రాహ్మణులు వచ్చి, దేవీదాసు తలుపు తెరవగా లోనికి బోదురు.)

**తా ర ణి**

(కొంచెము ముందరికి వచ్చి)

విన గోరెద ఈ విశేష మేదో
తెలియం జెప్పుడు దేవీ దాసా!

**వి శ్వం భ రు డు**

పో, నీ కేటికి? భూసుర కార్యము,
చాకలిదానికి స్థానము లే దిట.

(తారణి బయలు దేరును)

రజక కులోద్భవ రామిదూలమున
సంఘటిల్లె నీ శ్రమ భూసురులకు

**తా ర ణి**

(వెనుకకు వచ్చి)

సంతర్పణ మన సంతసమే కద
బ్రాహ్మణులకు: మరి బాధ యెందులకు?

**వి శ్వం భ రు డు**

(వికటముగా నవ్వి)

బాధ యెందులక? భ్రష్టుని జేసెను
చండీదాసుని చాకలి రామి!

బ్రాహ్మణు లెల్లరు ప్రాయశ్చిత్తము
విధించినా రా వెర్రి వటువునకు.

సంతర్పణ మీ సందర్భమునసె-
వేడు క్షమాపణ విప్రుల నాతడు.

రజక కులోద్భవ రామి మీద నిక
పదము చెప్ప నని ప్రతిజ్ఞ చేయును.
స్మరింప డిక నా చాకలి దానిని
స్వప్నమునందును చండీదాసుడు.
బ్రాహ్మణ వటువును పట్టిన పీడయు
మలగిపోవు నీ మధ్యాహ్నముతో!

**తా ర ణి**

దూషణ పడుటకు దొరకెను రామియె!
మన బంగారము మాత్రము మంచిది!

**వి శ్వం భ రు డు**

తెగువరి యెవ రిది దేవీదాసా?

**దే వీ దా సు**

తారణి: రామికి దగ్గరి చుట్టము.

**తా ర ణి**

ప్రథమ వారమున ప్రణయం బెవరిది?
చండీదాసుద? చాకలి రామిద?
చెల్లును విప్రులు చేసెడి దంతయు,
నిమ్న జాతులకు నిందలు తప్పవు.
తెలియక అడిగెద దేవీదాసా,
స్వామికి చిత్తము చలించి పోయెన?

### దేవీదాసు

నలుగురును వేడ్కింప నకులదాసే తెంచి
బోధింప బోధింప, పోరు పడ లేకితడు
తల యూపినాడు సంతర్పణము కావింప.
సమ్మతింపడ, బహిష్కారమ్ము నిశ్చయము !

(మరికొందరు బ్రాహ్మణులు వత్తురు.
తారణి త్వరితముగా నిష్క్రమించును)

### నకుల దాసు

పంక్తి పావనులైన బ్రాహ్మణుల్ రాలేదు ;
చండి పిలుపందమిని జాగు చేసెద రేమొ.

### దేవీదాసు

పిలువవలె నెల్లరను పేరు పేరున చండి;
తుదకు దయచేయుదురు దొడ్డవారలు వారు !

### నకుల దాసు

ఏతెంతురేని వారెదురుగా జని మీరు
తోడితెం డాదరముతోడ నంగణమునకు.

(లోనికి బోవును)

### విశ్వంభరుడు

ఆదిలోన రామిమీద ననురాగము మనచండికి
ఏ విధాన జనియించెనొ ఎరుగుదువా దేవీదాస ?

దే వీ దా సు

విపణి వీథియందు పండ్లు విక్రయించుచున్న తరుణి
కడకు బోయి చండీదాసు కావలయును ఫలము లనియె.
అంతలోన ఎవ్వండో అరుగుచేర, నితనిమాట
మరచిపోయి, వానితోడ మాటలాడ జొచ్చె నావె.
కొన్ని పండ్లువాడు వెంట గొని చనగా, మనవానికి
ఫలములొసగె నందుకొనుమ పణమొక్కటి యొసుగాత్రి.
నిలువ బెట్టినావు నన్ను నీ వాతనితోడ మాట
లాడుచు, నాపణమునకు తదర్థభాగ మిచ్చినావు,
అని చండీదాసు డడుగ ఆమె మందహాసముతో
అతనిమీద నాకు చాల అనురాగం బన్నదంట

వి శ్వం భ రు డు

ఆశ్చర్యము లే, దనదా మరి యా
పడతిని వేసిన ప్రశ్నకు బదులుగ ?

దే వీ దా సు

అనురాగం బనెడి శబ్ద మాలకించినంత చండి
కంతరంగ పరివర్తన మయినదంట విశ్వంభర !

వి శ్వం భ రు డు

ఈ మాత్రమునకు నేమాత్రము నే
చలనం బొందను సామజంబువలె.

ఆ క్షణమ్మునుండి అనురాగము గూర్చి
చండీదాసు చింత సలుప సాగినాడు.

దేవదాసి కొలది దినములకు నతని
కర్మవశముచేత కంట బడిన దన్న !

విశ్వంభరుడు

(మందహాసముతో)

అర్చకుండు చండి యాలయమున నూత్న
దేవదాసి యయిన దీని గాంచి యుండు.

అపుడు బ్రహ్మచారి ఆలయమున దేవ
దాసి గాంచు కతన తన్మయత్వ మొందె.

విశ్వంభరుడు

ఋష్యశృంగు చందంబున నితడు దానియురోజములు
పట్టి యేమి పండ్లివి యని ప్రశ్న వేయ లేదుగదా ?

చాలు నీదు పరిహాస సరణి రామ మణి నతండు
భావించును దేవతగా భక్తి తోడ సంతతమ్ము.
చదువరి యయి యుండు కతన
సరళహృదయు డగుట వలన
సాధనా విశేష మందు
సహజయాన పంథీ యయ్యె.

(ఇంతలో బ్రాహ్మణులు రాగా వారి నాదరముతో లోనికి బంపుదురు. వేరొక దిక్కునుండి తారణి రామ మణి)

తారణి

ఓసి వెర్రిదాన, ఒప్పుకోవె యిపుడు
కనులతోడ నైన కాంచినట్టి దాని.

విప్రు డెపుడుగూడ విస్మరింప లేడు
అగ్రవర్ణజాతు డనెడి మాట చెలియ !
ప్రేమ మేవిధాన పెరుగు దోహదమ్ము
లేని యెడల లోలో లీన మగును గాని.

ఒక్కసారిమైన ఒడలిమీద చేయి
పడని యట్టిప్రేమ బద్ధ మెట్లు లగును !

**రామ మణి**

(కన్నీరు విడిచి)

స్వామి ముఖము చివరసారి కన్నులార
తనివి దీర చూచి తనువు విడుచుదాన !

**వి శ్వం భ రు డు**

(ఆ మాటలు విని)

ఏమి పనే రామమణీ, ఎవరు నిన్ను పిలిచినారు ?
ఇచట నీకు హవిర్భాగ మిచ్చువారు లేరుసుమా !

పొమ్ము పొమ్ము శీఘ్రముగా ! భూమిసురులు వత్తురదే!
ఏమి కదల కున్న దాన విచటినుండి రామమణీ !

(ఇంతలో బ్రాహ్మణులు వత్తురు)

వేచి యున్నవారు లోన విప్రు లెల్ల తమరాకకు:
సర్వము నాయత్త మాయె సంతర్పణ కార్యాలార !

(ఇంతలో చండీదాసు వచ్చును. అతనిని చూచి
రెండడుగులు ముందరికి వేసి, ఎలు గెత్తి )

**తా ర ణి**

కడసారి మిమ్ము కాంచి రామ మణి
చచ్చి పోవు నంట చండీదాస స్వామి!

( అతడు ముందరికి వచ్చును )

**వి శ్వం భ రు డు**

తిరుగ బెట్టెనా దేవీదాసా,
పాగల్ చండికి ప్రణయ వ్యాధి?

(బ్రాహ్మణుల కలకలము)

**నకుల దాసు**

(లోపలినుండి తలుపు తెరచి వచ్చి)

ఏటికి వచ్చితి రిచటికి మీరలు
పొమ్ము రామ మణి ! పోగదె తారణి !

**తా ర ణి**

వెడలిపోక మేము విప్ర సంఘమునకు
పార్శ్వదేశ మందు పాదుకొనము స్వామి !

( ఎలు గెత్తి )

కడసారి మిమ్ము గాంచి రామ మణి
చచ్చిపోవు నంట చండీదాస స్వామి !

( చండీ దాసు తటాలున రామ మణి కడకు బోవును )

**నకుల దాసు**

( ఆవేశముతో )

పట్టుకొనుడు పట్టుకొనుడు పాగల్ చండీదాసును !
ఇచటి కేల దాపురించె ఈ రజక పిశాచము శివ !

విశ్వంభరుడు

( ముందరికి నడచి )

చండి మైల పడినవాడు చాకిత దేహమును తాకి!
దిమ్మరించు జలకలశము దేవీదాస, వానిమీద !

బ్రాహ్మణ బృందము

( ధ్రువా గీతి )

శివ శివ ! విప్రుడు చెడిపోయిన వా
డేటికి సలిలం, బెట్లు శుద్ధుడగు!
హర హర హర హర! అగ్రవర్ణజుడు
చాకిత పదములు స్పర్శ చేయు నౌనా!
కలి ప్రభుత్వమే కాకుండిన యెడ
ఇట్టి యకార్యం బెట్లు సంఘటిలు !

చండీదాసు

(రామ మణి పాదములకడ మోకరిల్లి దీన దృష్టితో)

వినగదవే నా విజ్ఞాపనమును
రజక శిరోమణి, రామమణీ !
చల్లని దగు నీ చరణ ద్వయమును
శరణు చొచ్చితిని రామ మణీ !
నీ హృదయంగమ నిర్మల రూపము
నిరుపమమ్ము గదె రామ మణీ !
కల్లోలం బగు గదె నా చిత్తము
కనని యెడల నిను రామ మణీ !

ప్రాణాల్ కుదుటను బడు నీ దర్శన
భాగ్యం బొందవిన రామ మణీ !

నిర్మలినం బగు నీ యనురాగము
నికషిత హేమము రామ మణీ !

కామ గంధమే కానరాదు నీ
గాఢ రక్తిలో రామ మణీ !

రజక కన్యకవు, రమ్యాకారవు,
రమణివి నాకో రామ మణీ !

తల్లివి నీవే తండ్రివి నీవే
దైవము నీవే రామ మణీ !

నీవే మంత్రము నీవే తంత్రము
నీవే స్వర్గము రామ మణీ !

## బ్రాహ్మణ బృందము

(ప్రువా గీతిక)

వినలేము వినలేము పీని వాక్కులు శివా !
రండోయి రండోయి రండు బ్రాహ్మణులార !
చాల జాలును విప్ర సంతర్పణము హారా !
ఆలసింపకు డోయి, అలము పాపము మనల !

## నకుల దాసు

(చేతులు జోడించి)

క్షమియింప వలె మహాజనులార, మమ్ములను !
ఉద్ధరింపుడు పెద్దలున్నత్తు డగు వీని!

## చండీదాసు

(రామమణిని జూచుచు)

నిన్ను భజించిన నిఖిలోపాసన
నెరపినయట్లే రామ మణీ !
తావక ముఖ శశి దర్శన సుఖమున
ధన్యుడ నగుదును రామ మణీ !

నీ కారుణ్యము నీ మాధుర్యము
నిరుపమానములు రామ మణీ !
దేవదాసివో దివ్యాంగనవో
దేవి వాసులవో రామ మణీ!

వాస్తవముగా వరప్రదాయిని
వాగ్దేవతవే రామ మణీ !

నీవు నిక్కముగ నిగమత్రయ జన
నివి గాయత్రివి రామమణీ !

చాకెత వయ్యును సకల చరాచర
జగజ్జననివే రామ మణీ !

## బ్రాహ్మణ బృందము

(చెంబులలో నీరు క్రింద పారబోసి)

అల మలమ్ ! వినజాల మంబికా దూషణము !
నాన్నారు బ్రాహ్మణులు నగుబాట్ల పాలయిరి !
దుష్టాంగమును వేగ త్రుంచివేయుట మేలు !
విప్రసంఘమునుండి వెలివేసినా మితని !

నకుల దాసు

( కన్నీళ్ళతో )

ఏమి చేయుదు శివా ! ఈ నిమేషమునుండి
తోడబుట్టిన వాడు దూరమై పోవునే !

బ్రాహ్మణ బృందము

( ధ్రువా గీతి )

చాకలిదానా, జయము గాంచితివి !
కడుపు నిండెనా, కదలుము శీఘ్రమె !
బ్రాహ్మణ యువకులు, భద్రము భద్రము !
స్త్రీ మాయలలో చిక్కుదు రేమో !

దే వీ దా సు

( విస్ఫారిత నేత్రములతో )

చాకత యేదీ ! జగ దంబికయే!
సరిగా జూడుడు సజ్జనులారా !

బ్రాహ్మణ బృందము

( ధ్రువా గీతి )

వీనిని సైతము వెలి వేసితి ! మిక
పదు పదుండో బ్రాహ్మణులారా !

అన్య బ్రాహ్మణ బృందము

( సౌమ్య గీతి )

చాకత కాదే చతుర్భుజంబుల
జనని వాసులా ఛాయ కనంబడు.

### బ్రాహ్మణ బృందము

కించిత్తయినను కిమ్మన దేలా !
చండీదాసుకు స్మయమో భక్తియొ !
మనవారల కిట మతులు పోయినవి !
పదుడు పదుం డో బ్రాహ్మణులారా !

ఐకమత్యమే హరించి పోయిన
దవనీసురులం దక్కటక్కటా !
భ్రష్టత్వమునకె ప్రాబల్యం బిక
పదుడు పదుం డో బ్రాహ్మణులారా !

(వెడలి పోవుదురు)

### చండీదాసు

(అర్ధనిమీలిత నేత్రుడై)

రామ మణీ, రామ మణీ,
రామ మణీ, బ్రహ్మమయీ !
రామ మణీ, బ్రహ్మమయీ,
రామ మణీ, రామ మణీ !

## సమాప్తము

# దీక్షిత దుహిత

అంకితము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణకు

# పాత్రలు

మంగళాంబ

చంద్రమౌళి

సరసవాణి

మరకతవల్లి

అప్పయ దీక్షితులు

•

వృద్ధ బ్రాహ్మణ స్వరమేళ

యువ బ్రాహ్మణ స్వరమేళ

వితంతు స్వరమేళ

•

అడయప్పళ గ్రామములో

అప్పయ దీక్షిత భవనము

క్రీ. శ. 1580 ప్రాంతము

కాల పరిమితి : పది యామములు

## ప్రథమ రంగము

(సాయం సమయము. భవనారామములో వేదికపై గూరుచుండి చంద్రమౌళి పసుపు పచ్చని తాళపత్రముపై గంటముతో వ్రాయు చుండును. మంగళాంబ మెల్లగా వెనుక నుండి వచ్చి కొంచెము సేపు నిలుచుండును)

మంగళాంబ

తిరిగి చూడక యేకాగ్ర దృష్టితోడ
వ్రాయుచున్నావు 'శ్రీ కంచి వరదరాజ
నుతియొ,' 'శ్రీకృష్ణ ధ్యానపద్ధతియొ' కాక
'శిఖరిణీ మాలయో', యేదో చెప్పు మోయి!

చంద్ర మౌళి

(గంటమును తాళపత్రమును వేదికపై
నుంచి, ఆమెను తేరిపార జూచి)

హంసకమ్ములు లేని నీ యడుగుదోయి
అలికిడి రవంత లేక జలాశయమ్ము
నందు విహరించుచుండు రాయంచనడక
ననుకరించెను మంగళా, అందమందు.

మంగళాంబ

అంచనడకల నేనరుదెంచినట్లు
తిరిగి చూడని వానికి తెలియు టెట్లొ!

ఉండవలె దివ్యదృష్టి, లేకుండు నేని
నీకు గల దేమొ తలవెన్క నేత్రయుగళి.

చంద్ర మౌళి

ముగ్ధ హరిణాక్షి, నే చతుర్ముఖుడ గాను,
సిద్ధుడను గాను దృష్టివిశేషమునకు.
బాల, నీ నిండుచక్కదనాల నడక
కనులు మూసిన తెరచిన కానబడును !

(ఆమె పాదములు చూచి నిట్టూర్చి)

పసుపు, పారాణి, అందియల్ పాదములకు
వైభవాపాదకమ్ములు, వదనమునకు
శోణకుంకుమ తిలకమ్ము శోభ కూర్చు;
దుర్విధిని మంగళా, అన్ని తొలగె నీకు !

మంగళాంబ

తండ్రిగారు రచించిన స్తవము లన్ని
ఏకసంపుటిగా వ్రాసి యిత్తు నంటి,
వేమి లిఖియించుచుంటివో యింతకు మును-
ఏది ఒకసారి నన్ను వీక్షింపనిమ్ము.

చంద్ర మౌళి

ఎందులకు నీకు మంగళా, ఈ దిదృక్ష ?
గ్రంథము 'శివార్క మణి దీపికా' ప్రతి సుమి.

మంగళాంబ

నీవు గంటమ్ముతోడ దానిమ్మగింజ
లట్టి రమ్యాక్షరాలు వ్రాయంగ నేర్తు ;

విపుడు నీవు లిఖించెడి యీ యపూర్వ
తాళపత్రమ్ము చూడక తప్పదోయి !

### చంద్ర మౌళి

పఠన యోగ్యము కాదిది; పట్టు వదలి
వేగముగ ఈప్రదేశమ్ము విడిచి పొమ్ము.

### మంగళాంబ

పఠన యోగ్యము కాని దేపగిది నీవు
వ్రాయుచున్నావొ ప్రశ్నింపవచ్చు నొకొ ?
అంత కోపమె యైనచో నడుగ నింక,
విసువుగా నున్నపక్షాన వెడలిపోదు !

### చంద్ర మౌళి

ఏమి మాటలు ముద్దియా, ఎన్నడేని
విసువుకొన్నాన నీమీద ? కసరినాన
మంగళా, నిన్ను? నేడు నా మనసు శాంతి
చెందదే నీముఖేందు వీక్షించుచున్న !

### మంగళాంబ

చంద్ర, నాముఖచంద్ర వీక్షణమువలన
తేరుకొనదేని నీమతి, తిరిగి పోదు.
అయిన నొక్కటి యడిగెద, అట్టులేని
శాంతి లే కెట్లు వ్రాయుట సంభవించె!

(తాళపత్రము తీసి చదువబోవును)

చంద్ర మౌళి

మంగళా, మంగళా, ఏమి మాట వినవ !
అబ్బ, చదువకు మందలి యక్షరాలు !

మంగళాంబ

( నాలు గడుగులు అవలకు వేసి )

ఎంత రమణీయ మూర్తు లీయక్షరాలు !
కానబడుచున్న దిందు నీకవితవోలె.

"చెంగల్వలం బోలు చిన్నిపాదాల
ననుగుచెచ్చెలి మెట్టు నట్టిమార్గంబు
పులకితం బయి వన్నెపూవులు పూయ
రత్నకంబళి మట్లు రంజిల్లుచుండు.

"నా ప్రేయసీ పదన్యాస సౌభాగ్య
మొందిన యీ సుందరోపవనంబు
శ్రీప్రయాగ మహత్త్వసిద్ధిచే సర్వ
దేవతలకు గూడ తీర్థరాజమ్మై.

"అనిమిషదుర్లభం బైన యాదివ్య
మంగళవిగ్రహ మహితహస్తంబు
గ్రహియించు భాగ్యమ్ము కలుగు టేలాగొ !
పెనగొను సంభ్రమ భీ విస్మయాలు !"

(చంద్రమౌళి ఆమెచేయి పట్టుకొనును)

మధురభావోజ్జ్వలంబు లౌమంజరులను
అల్లితివి చంద్ర, నీయది అమృతవాక్కు...

నాకు దెలియఁగనీక యెన్నాళ్ళనుండి
వ్రాయుచున్నావు కావ్యమ్ము వన్నెకాఁడ?

చంద్రమౌళి

ఇది యపూర్వము; మంగళా, ఈప్రభాత
వేళ హృదయములోనుండి వెడలివచ్చె.

మంగళాంబ

కావ్యభాగమ్మొ, ప్రాస్తావికమ్మొ, తెలియ
దెడద వెలువడి వచ్చిన యిది కవీశ!

చంద్రమౌళి

కావ్యము రచించుబాధయే కలదు కాని
అంతరాయము ఘటియిల్లె నాదియందె.
అవసితం బైన కృతి నీ కరాబ్జమందు
ఉంచి సమ్మతి నర్థించి యుండువాఁడ.

మంగళాంబ

సాగు నందురు రచన విశ్రాంతిలోన,
బాధలో నీకు కవన మేపగిది వెలసె?

చంద్రమౌళి

నీకు విదితంబు కాదె వాల్మీకి శోక
మొక్కఁ డుదయాన శ్లోకత్వ మొందియుంట?

మంగళాంబ

అది పురాతన ఋషివార్త: అయిన చంద్ర,
ఏమిటికి నీకు గలిగిన దింత బాధ?

### చంద్ర మౌళి

చెప్పినంతనె తీరునా చిన్నదాన !
ఈ మనోవ్యథ వర్ణించి యేల నీదు
కోమలం బైన హృదయంబు గూడ నేడు
చింతతో నేను చీకాకు చేయవలయు ?

### మంగళాంబ

ఆప్తులకు జెప్పుకొన్నచో వ్యథ తొలంగు
నెంతయో, దాచుకొన్నచో నేమి మేలు ?
అవునులే, కాను నీకు నే నాప్తురాల,
నంతియే కాక కేవల మబలను గద !

### చంద్ర మౌళి

ఎవ్వ రాప్తులు నీకన్న నిచట నాకు ?
అప్పదీక్షిత పుత్రిక అబల యగునె ?
కుసుమకోమల మైన మానసము వేరు,
స్థైర్యవిరహిత మైన చిత్తమ్ము వేరు.

### మంగళాంబ

ఆప్తురాలను స్థిరచిత్త నైనయపుడు
నాకు నీ వెత తెలుపుట న్యాయమె కద ?
పంచుకొని కొంతయైన యత్నించి చూతు
నీ మనోవ్యథ తొలగింప నేర్తు నేమొ.

### చంద్ర మౌళి

(గొంతు సవరించుకొని మెల్లగా)

వార్త పంపినారు వైళంబ రమ్మని

తండ్రిగారు— పోవు తలపు లేదు.
ఎట్లొ పోదు నేని యిచటికి రానీక
బంధుజనము నన్ను పట్టి నిలుపు.

మంగళాంబ

మంచి బంధుజనమె ! మాతండ్రి కడ నీవు
ఇంక జదువ దగిన దేమి లేద ?
అంత పనికిరాని దడయప్పళ గ్రామ !
మస్వతంత్ర వృత్తి అనుచితంబు.

చంద్ర మౌళి

అప్పదీక్షితార్య లఖిల విద్యాగురుల్,
అపరశివులు ! వారి యంతికమున
అభ్యసింప విద్య లాయువు చాలునే !
ఎన్ని జన్మ లైన ఎత్తవలయు.
అఖిలలోక పూజ్యు లాచార్యులే కాక
ఒకరుకూడ నిచట నున్నవారు.
వీరి ననుదినమ్ము వీక్షింప లేకున్న
కనుల క్రమ్ము నాకు గాఢతమము.

( ఆమె ముఖము విప్పారును )

అభిజనమ్ము జేరిన ట్టైన మావారు
కన్నె నొక్క దాని గట్టి పెట్టి
కదలనీరు నన్ను గ్రామాంతరమునకు;
కలత కిదియె ప్రబల కారణమ్ము.

మంగళాంబ

( గుటకలు మ్రింగి, తెచ్చుకొన్న శాంతితో )

పెండ్లి యన్న ఇంత భీతి యేటికి చంద్ర,
ఎపుడు చూడనైతి నిట్టి వింత!
పరుగు పెట్టరొక్క పాణిపీడన మన్న
యువకులైనవార లుత్సుకతను?

( అతనిముఖము పరిశీలించును )

చంద్ర మౌళి

( పెదవి విరిచి )

పెండ్లిమీద నాకు ప్రీతి లే దేమాత్ర,
మిచట నుండ గోర్కె యెల్లకాల,
మన్య చింత మాని అఖిల దర్శనములు
ఆగమములు కూడ నభ్యసింతు.

మంగళాంబ

( కొంచెము జంకుతో )

అంత నియతి బూని అవివాహితుండవై
కాల మెట్లు గడపగలవు చంద్ర?
విసువు పుట్టు నెపుడొ విద్యపై నొకనాడు,
సౌఖ్యరహిత మగును జన్మ మెల్ల.

చంద్ర మౌళి

బంధుజనము నాకు పరిణయార్థము నిర్ణ
యించి నట్టి కన్నె యింపు కాదు.

మంగళాంబ

( ఉత్సాహముతో )

సరస మైనమాట ! స్వయముగా వరియించు
నామెమీద ప్రీతి యన్నమాట !

*                    *

కావ్యభాగమందు కల్పిత కన్యయో
వాస్తవికయొ అడుగవచ్చు నొక్కొ ?

చంద్ర మౌళి

(ధైర్యము తెచ్చుకొని)

యువతి వాస్తవముగ నున్నదే మంగళా !
కావ్యకన్యకన్న కడు మనోజ్ఞ !

మంగళాంబ

(నీరసముగా)

నామధేయ మేమొ ?

చంద్ర మౌళి

నాలుగు వర్ణాలు –

మంగళాంబ

ఉచ్చరింప మందు నొక్కసారి !

చంద్ర మౌళి

అమృతతుల్య మయ్యు అది యేమొ ఇంకుచే
మాట నోట రాదు......మంగళాంబ !

(మంగళాంబ తల వంచుకొని గ్రంథము వేదికపై బడవేసి సమీప వృక్షమును జేరును. చంద్రవదాళి సంభ్రమముతో బోయి, ఆమె చేయి పట్టుకొనును. మంగళ అతనిని క్రీగంట జూచి మరల అవనత వదన యగును.)

చంద్ర వదాళి

చాలకాలమునుండి స్వాంతమ్మునందు
గుప్తమ్ముగా నుంచుకొన్న భావమ్ము
తెల్లమైనది కదా చల్లనివేళ!
ఇప్పుడు నన్నేడి యొచటికేగెదవు?

మంగళా, మంగళా, మాటాడవేమి?
అందాలనడల నీ వరుదెంచునపుడు
పాదాలు ముద్దాడ ప్రభవించు కోర్కె
నెట్టెటులో నిరోధించుచు నుందు.

నీ ప్రసన్నంబైన నిటల భాగమున
తీరిచి కుంకుమ తిలకమ్ము దిద్ది
చెక్కిళ్ళు ముద్దాడ మక్కువ కల్గు.
పదియారు వన్నెల పసిడియందాల
భవదీయ తనువల్లి బాహుయుగ్మమున
గ్రుచ్చి రొమ్మున హత్తుకొన బుద్ధి పొడము.
ఆవరించుచు నిన్ను నాకాశమట్లు
కాంచుచుండగ మహాకాంక్ష జనించు.

ఏది నన్నొకసారి యాక్షింపనిమ్ము
తృప్తి తీరంగ నీ దివ్యదాననము!

ఇందాక లేని యీ ప్రీ్రాభరం బేల?
నీకు నూతనుడనా నే ప్రియురాల!
మంగళా, యేటికి మానుకొన్నానో
యిన్నినాళ్ళు వివాహ, మిపుడు విన్నావు.
ధర్మపత్నిగ నిన్ను దలపోసి యెపుడు
గగనసౌధా లెన్నొ కట్టుకొన్నాను!

( మంగళ విప్పారిన కన్నులతో ముఖము పై కెత్తగా చంద్రమౌళి ఆమె నక్కున చేర్చుకొని, శిరస్సు మూర్కొని, చల్లని కంఠముతో )

బాధ చెందుచు నుండ బహుదినములకు
జీవితేశ్వరి, నన్ను స్వీకరించితివ!

మంగళాంబ

( అతనిరొమ్ముపై శిర మానించి )

పాపము, మనసులో బాధ చెందితిరి
నాకోసమై యిన్నినాళ్ళు ప్రాణేశ!

చంద్రమౌళి

ఎన్నాళ్ళకో గ్రహియింప గల్గితిని
నీమీద ననురక్తి నెలకొన్నయట్లు.
ఆమీద బహుకాల మావహించినది
గురుపుత్రి వనియెడి గూఢభయమ్ము.
అవల నీ వే మందు వనియెడి జంకు
విడువక కొన్నాళ్ళు వేధింప జొచ్చె.

అంతరంగిక యుద్ధ మగుచున్న కొలది
తుద కెట్టులో భీతి తొలగి పోయినది.

మంగళాంబ
( ఆతని చెక్కిలి నిమురుచు )

అయ్యయో, నిష్కారణమ్ముగ
ఆధిపా లయినారు నాథా,
ఈతపస్విని యంతరంగం బెరుకపడ కుంటన్!
ప్రథమవారమె దృష్టి మీపై
బడినయపుడే చెప్ప శక్యము
కాని భావం బేదొ నాలో కలిగె ప్రాణేశా!
కాలవాహిని సాగుచుండగ
క్రమక్రమముగ తెలియసాగెను
స్వాంతమం దనురాగ రేఖలు జటిల మయ్యె నని.
నాకు హృదయం బవగతం బగు
నాడు మిప్పిరి వేసికొన్నవి
విస్మయంబును భయము లజ్జయు, వివశనై పోవన్.
కాని యెట్లో తెప్పరిల్లితి:
గాఢరాగము మాత్ర మెదలో
దీప కళిక విధాన నిరతము తేజరిల జొచ్చెన్.
పిదప జంకితి మీకు నాపై
ప్రేమ కలదో లేదొ తెలియక—

చంద్రవరౌళి
ఉభయులము వెత చెందినామే ఊరకే భ్రమచే!
(ఆమెను ముద్దాడును)

మంగళాంబ

అవల నూతన భీతి పుట్టిన,
దనద నగు నను మీరు శ్రోత్రియ
పుత్రు లేవిధి జూతురో యని బోధపడకుంటన్.
ఎరుగ నాయెను మీ యమాయిక
హృదయగమనము మెల్లమెల్లన,
చనవు పూని మెలంగ సాగితి సాహసముతోడన్.

చంద్ర మౌళి

అదియ, చెప్పవు ! మంగళా, పరి
హాస మాడుచు నుండుకతమున
చాల తికమకపడితి తెలియ చనవో ప్రేముడియో !

మంగళాంబ

చిన్నదానను కాన తెలియక
చేసినా నపచారములు ! మీ
రన్ని దయతో మరచి నన్నిక నాదరించెదరా ?

చంద్ర మౌళి

చాలు జాలును ! నేను శ్రోత్రియ
జడిమచే నీ సరస భావము
శీఘ్రముగ గ్రహియింప లేమికి సిగ్గు పడవలయున్.

మంగళాంబ

చెప్పవచ్చిన పిన్నితో నను
స్వీకరించి వివాహ మాడగ
నభిలషించుచు మీర లున్నా రన్న శుభవార్తన్ ?

**చంద్ర వళౌళి**

(చింతాక్రాంతు డయి)

ఆమె కరుణార్ద్రహృదయయే యగును గాని
సమ్మతించునె విపరీత సంప్రదాయ
సిద్ధమైన వివాహమ్ము? చివర కెట్లు
పరిణమించునో కోరిక ప్రాణకాంత !

**మంగళాంబ**

భయము చెందెద రేటికి ప్రాణనాథ !
ఇందు పెద్దలతాత్పర్య మేమొ నాకు
తెలియ నింతక : అయినను త్రిప్పగలను
మనకు ననుకూలముగ నెల్ల మానసములు.

**చంద్ర వళౌళి**

(ఆమెను వేదికపై గూర్చుండ బెట్టుకొని)

తలచుకొన్న కొలందిని ధైర్య మెడలి
పోవుచున్నది. మంగళా ! బుద్ధిమతివె
కాని నీ నేర్పు ఫలకారి కాగలుగునె
ఇట్టి జతనమ్మునందు యోజించి చూడు.

**మంగళాంబ**

నాకు మాతండ్రిగారు పునర్వివాహ
మొప్ప రను సందియము మీర లుజ్జగింపు
డార్ద్రహృదయులు వారు, మాయన్న లైన
కూర్మితో నా సుఖమ్మును కోరువారె.

(వికాసముతో)

చెల్లిపై ప్రేమ మరకత వల్లి, కింక
అమ్మ యన్ననో మా కెదు రాడ దెపుడు.
వలయుచో ప్రాణముల్ కూడ వదల గలదు
పిన్నతల్లి నాపై గల ప్రీతిచేత.
అస్మదనురాగ మాయమ కవిదితంబు
కాదు కేవల మని యెంతు: కార్యహాని
సంఘటిల నీక సకలమ్ము నంతరింతు,
స్వస్థముగ నున్న మీరలు చాలు నాథ !

చంద్రమౌళి

(చుబుకము స్పృశించి)

అమృతవాక్కులు మంగళా, అయిన గాని
యజ్ఞములు, ధర్మశాస్త్రమ్ము, లఖిలలోక
పూజ్యతలు, భూరి ద్రావిడ బుద్ధి మనకు
అంతరాయము కల్పించు నని భయమ్ము !

మంగళాంబ

(ఉత్తేజిత యై)

ఆంధ్రులము మేముకూడ నియోగ్లె, కాని
స్మార్తులమె యయ్యు కొంత వైష్ణవము కలిసె
తొల్లి రంగరాజాచార్య దుహిత తోత
రాంబ ప్రపితామహునిభార్య యగుటవలన.

చంద్రమౌళి

పట్టుదల లేదు మీ కుటుంబమ్మునందు,
మంచిదే: నాకు మరణమో మంగళాంబా___

మంగళాంబ

మంగళమె మంగళమె వేరుమాట వలదు,
భారమంతయు నాయది ప్రాణనాథ!

( చంద్రమహాళి ఆమెశిరస్సు మూర్కొనును.
ఆశాగుల్మములో కదలిక గమనించి అతడు
వెడలిపోవును. మంగళాంబ వేదికమీద
పరుండి కన్నులు మూసికొనును. )

సరస వాణి

( మందగమనములో ప్రవేశించి )

వెర్రితల్లీ, ఎంత వెదకినా నన్ను
ఇల్లన్ని పాలల నిప్పటిదాక
నీకోసమై — ఇట్లు నేత్రముల్ మూసి
వేదికపై సంజవేళ నెందులకు
పండుకొన్నావు నా బంగారుతల్లి!
ఏమి యేడీ తల్లి, ఇటువైపు చూడు—
బాధగానున్నదా పలుకకున్నావు!

మంగళాంబ

మనసు మనసున లేదు! మాటాడ బుద్ధి
పుట్టకున్నది పిన్ని, పట్టుకో నన్ను.

సరస వాణి

ఎందుకే నాతల్లి, యిట్లు లైనావు!
చెదరిపోయిన దేల చికురజాలంబు,
కన్నులలో ఏల కాంతి మారినది,

చెన్ను మాసిన వేల చెక్కుళ్లు బిడ్డ!
నీ యానవమునందు నిత్యమ్ము లేని
క్రొత్త నా కేదియో గోచరించినది.

మంగళాంబ

అవును పిన్ని, ఇప్పు డద్భుతం బైన
బాధ యొక్కటి నన్ను పట్టి వేధించు !

సరస వాణి

వెర్రిపిల్లా, యేమి వింత వాక్యాలు !
మల్లె పూవుల జడ మరకతవల్లి
వేయుటకై చాల వేమాక పడుచు
ఎదురు చూచుచు నున్న, ఇక నైన లెమ్ము.

మంగళాంబ

అది బాధయో నూతనానంద మేమొ
పిన్ని, తోచుట లేదు భేదమ్ము నాకు.

సరస వాణి

కాలు తాకునో యేమొ గ్రంథమ్ము చూడు
గమనింప వైతివి గంటమ్ము నేల
బడిపోవుచున్నది, ప్రాలుమాలికయె !

మంగళాంబ

మరచినా డవి చంద్రమౌళి యిచ్చోట.

సరస వాణి

(గంటము తీసి, గ్రంథము తెరచి చూచి)

ఈమంజరీగుచ్ఛ మెవరినిగూర్చి ?
ఏంతసే పాయెనో యిచ్చోటు విడిచి
చంద్రమౌళీశ్వర శర్మ తెల్పుదువ ?

మంగళాంబ

నీరాక కాక రెండునిముసాలు ముందు.

సరస వాణి

ఈపద్యపాదమ్ము లేకాంతమందు
వినిపించెనా నీకు వేదికమీద ?

మంగళాంబ

క్రొత్త కావ్యం బన్న కుతుకమ్ము వలన
బలవంతముగ నేనె పఠియించినాను.

సరస వాణి

ఈ మంజరీగుచ్ఛ మెవరిని గూర్చి
కూర్చినాడో నీకు గోచరించినద ?

మంగళాంబ

అది నించుక సంశయాస్పద మయ్యు
క్రమముగా క్రమముగా గ్రహియించినాను.

**సరస వాణి**

అవల నీ వేమంటి వాతనితోడ ?
నిద్దంపు చెక్కిళ్ళు నీ రహస్యమ్ము
జెప్పకయే నాకు చెప్పివేసినవి.
ముగ్ధ నాతడు నిన్ను ముద్దాడినాడు—
ఏమందువు ?

**మంగళాంబ**

అపుడు నా కెరుకయే లేదు !
చీవాట్లు పెట్టవా చేసినపనికి ?

సరస వాణి

చిట్టితల్లీ ! ఏల చీవాట్లు నీకు ?
అతడు నీతో నేమి అన్నాడో చెపుమ.

(తేరిపార జూచును)

**మంగళాంబ**

అనురక్తి లోలోనె అణచుకొన్నాడు
బహుకాల మెంతయో భయ మందినాడు
వివరింపక మనస్సు వెత చెందినాడు
నా చిత్త మెరుగక నవసి యున్నాడు—

**సరస వాణి**

సరి సరి ! నీతోడ సల్లాపవేళ
చివర కే మన్నాడో చెప్పవే పిల్ల!

మంగళాంబ

పెద్దవారలమాట పెడచెవి బెట్టి
నా కోసమే మానినా డట పెండ్లి.
గురుపుత్రికాభీతి కొంతకాలమ్ము
సంప్రదాయము కామి జంకు కొన్నాళ్ళు
వేధింప వేధింప వివశుడై పోయి
తన మనోరథ మెట్లొ ధైర్యమ్ము పూని
ఈవేళనే నాకు నెరిగించినాడు.

పెద్దలసమ్మతి బెండ్లాడి నన్ను
ధర్మపత్నిగ జేయు దలచుకొన్నాడు
పాప, మెంతో ఆశపా లయినాడు...

సరస వాణి

(ఆకసమువంక జూచి, తల పంకించి)

వింతసంఘటనమ్ము ! విధివిధానమ్ము !
ఉభయుల యనురాగ మొక్కింత తెలియు.

*                *

మాంగల్య సూత్రమ్ము మరల ధరించి
సుఖియించు భాగ్యమ్ము సుకృతవశాన
వ్రాసెనా నుదుటిపై వనజభవుండు !...
ఆనందదాయి నీ యభ్యుదయమ్ము.

మంగళాంబ

తప్పు చేసితి నంచు తలపవు నీవు
కరుణార్ద్ర హృదయవు కావున పిన్ని !

( ఆమెయొడిలో తల యుంచును )

సరస వాణి

వశము కాదే యెట్టివారికి గూడ
మనసు ! నీ వెంతో యమాయిక వైతి,
విందున నీదోష మే మున్న దమ్మ !
ఆచార బద్ధు లైనట్టి పెద్దలకు
విపరీతముగ దోచు విభవిలాసంబు...
జతనమ్ము చేతు నాశక్తి కొలంది.
(మంగళ ఆమెను కౌగిలించుకొనును)
అనబోకు విూ మాట అమ్మతో నైన !
భాగ్యవశమ్మున పరమదయాళు,
దస్తగత సకల ధర్మాగమరుండు
నీతండ్రి అనుకూల నిర్ణయమ్మునకు
వచ్చుతీరున నింక వర్తింప వలయు.

మంగళాంబ

అవగతంబే నాకు ఆదినుండియును
పిన్నికి నామీద ప్రీతి మెండనుచు.

మరకత వల్లి

( అటు నిటు జూచుచు వచ్చి )

ఎంతసేపటినుండి నీకై
యెదురుతెన్నులు చూచుచుంటిని,
తోటలో ఈమూల చివరకు దొరకినా వమ్మా !
అసుర సంధ్యావేళ పిన్ని,
అలసించెద రేల యిచటనె ?
ఇంక నైనను లేచి రారే యింటిలోపలికి ?

ఎపుడు కలకలలాడు వదనం
ఇపుడు వన్నె దొరంగ నేలా ?
చెల్లెలికి ఈవేళ స్వాస్థ్యము చెడినదా యేమి ?
( మంగళశరీరము నిమిరి చూచును )

సరస వాణి

( మరకతవల్లిచేయి పట్టుకొని )

చెల్లెలివిషయమై చెప్పగా దగిన
సందర్భ మున్నది : శాంత చిత్తమున
వృత్తాంత మంతయు విని నీవు కూడ
దుర్ఘటకార్యాన తోడ్పడవలయు.

మరకత వల్లి

దుర్ఘటం బని సంశయింపకు,
తోడుపాటుకు సిద్ధురాలను–
చెల్లెలికి ఏదైన గానీ చేసి తీరవలెగ !
( వారిచెంత గూరుచుండును )

## ద్వితీయ రంగము

(వెన్నెలరాత్రి. వితర్దికమీద గూరుచుండి అప్పయ దీక్షితులు తాంబూలము వేసికొనుచుండును. సరస వాణి యించుక దూరముగా గూర్చుండి తమలపాకు లకు సున్నము రాయుచుండును.)

దీక్షితులు

నాకలోకాంగనా వీటికా కరండ
మండితోన్నత నవ సుధాఖండ మట్లు
విరియుచున్నాడు శశి యుడువీథియందు
కళలు, త్రిజగ దుద్దీపన కారణుండు.

సరసవాణి

చుర్రు మనిపించెనా యేమి సున్నపుచవి ?
నాగవల్లీ దళంబులు నాలు గిత్తు.

దీక్షితులు

నాల్క పొక్కిన దని యెంచినావొ, లేదు :
అయిన నీచేతి తాంబూల మభిమతంబె.

మంగళాంబ

బాగు, మీ వంటి శ్రోత్రియ ప్రవరులకును
సాంద్ర తాంబూల చర్వణాసక్తి కలదె !

దీక్షితులు

చెప్పుము, గృహస్థ వీటికా సేవనమ్ము
శాస్త్రదూష్యమె యైనచో సరసవాణి !

**సరస వాణి**

అవును, తెలియును, శాస్త్రదూష్యమ్ము కాని
యట్టి దేదైన చేయదు రన్నమాట !

**దీక్షితులు**

అవును, సరె కాని సరస, నీ కభినవముగ
సందియం బేల కల్గె ప్రశాంతవేళ ?

(లోపలనుండి గానము)

"యస్యాహు రాగమవిదః పరిపూర్ణశక్తే
రంశే కియ త్యపి నివిష్ట మముం ప్రపంచమ్,
తస్మై తమాలరుచి భాసుర కన్ధరాయ
నారాయణీ ప్రియ సఖాయ నమ శ్శివాయ !"

మంగళాంబపాట మధుర మైనది సుమా,
చల్ల నైన గొంతు సహజముగనె.
చిన్న తనమునుండి చెప్పించి యున్నచో
ఒజ్జయొద్ద గాన, మొప్పి యుండు.

**సరస వాణి**

కంఠ మెంత యొదుగు కలది యైనను, వాక్య
లలిత మైన నేమి లాభ మొదవె !
మంగళోక్తి నేడు మరి యెందు లేకున్న
సిరము దాని నామధేయమందె !

**దీక్షితులు**

కూడి యున్నవారు కుజ, శని, రాహువు,
లష్టమమ్మునందు : అందువలన

తప్పి పోవదాయె దానికి వైధవ్య
బాధ విధికృతాన బాల్యమందె !

సరస వాణి

ఈ యరుంతుద జీవన మెట్లు గడచు
ముక్కుపచ్చలె ఆరని ముద్దుబిడ్డ
కక్కటక్కట ! ఏల బాల్యమ్మునందె
చేసినారొ వివాహమ్ము శీఘ్రపడుచు !

దీక్షితులు

శుభము కోరి యపుడు సుముహూర్తమును నిర్ణ
యించినారు పెద్ద, లిట్టు లుండ
దానికర్మ, మెట్టి తారాబలము గాని
చంద్రబలము గాని శక్త మగునె ?

సరస వాణి

అంతబాల్యములో శుభ మభిలషించి
పెద్ద లగువారె చేసిన పెండ్లివలన
విగతభర్తృక, బాల, జీవితపథాన
మొండిమ్రాని విధమ్మున నుండవలసె !

దీక్షితులు

లోక సంగ్రహ బుద్ధి వివేకు లైన
ధర్మవేత్తలు చూపిన దారి వెంట
చనెడివారల కొక్కింత శ్రమమె యైన
తుదకు నిశ్శ్రేయసప్రాప్తి ధ్రువము సుమ్ము !

సరస వాణి

ఎంత ఘోర మైన దీ లోక సంగ్రహ
మనెడి మాట ! దీని ననుసరించి
ప్రాజ్ఞు లైనవారె పడుదురు కష్టాలు
అంతరంగబాధ నణచుకొనుచు.

దీక్షితులు

ధర్మ మార్గమునందు పాదములు సుఖము
పొందు నభిలాష కెట్టి పుష్పాదులు లేవు;
కానబడును వికీర్ణమై కంటకములు,
గాటముగ నొప్పు లెత్తించు కరకురాలు.

సరస వాణి

అట్టులే యైన సుఖము లే దన్న మాట
ధర్మమార్గములో ! మహాదారుణమ్ము
శాస్త్రచోదిత కర్తజనుల విధము !
దయ నెరుంగని ధర్మశాస్త్రమ్ము లేల !

దీక్షితులు

కాదు కాదు సుమా ! మహాకారుణికులు
ధర్మనిర్ణాయకులు, వారితలపు వేరు :
ఇహము కన్నను పరమునకే విశేష
ఫలము లోకహితమ్ముగా తలచినారు.

సరస వాణి

ముందు భుక్తి, యవల ముక్తి సక్రమ మగు–
తరచి చూచినారు ధర్మశాస్త్ర

విధుల నెల్ల మీరు : విధవా వివాహ మే
శాస్త్రమందు గాని సమ్మతంబె ?

దీక్షితులు

స్పష్టముగనె యమ స్మృతి సమ్మతించు;
దానితాత్పర్యమే స్థలాంతరములందు
పలుక వచ్చును వ్యాఖ్యాన బలముచేత :
పలువిధంబులు గద మహర్షుల మతాలు.

సరస వాణి

విగతభర్తృకలకు విధియించిన వివాహ
మేల చేయరాదొ యెరుకపడదు !
హేయ మనెడి భావమే యుక్త మగునేని
శాస్త్రపంక్తు లెట్లు సమ్మతించె ?

దీక్షితులు

ప్రౌఢవాదమ్ములో శాస్త్రబలము గాని,
జనమునందు వృద్ధాచారమునకె బలము.

సరస వాణి

బాగు ! బాగు ! నేడు ప్రామాణికుల నోటి
వెంట నిట్టి వాక్కు వింత గొలుపు !

(దీన వదనముతో)

మన యనుంగుతల్లి మంగళి జన్మంబు
బండరాయివోలె నుండవలెనె !

దీక్షితులు

ఏమి చేయ నేర్తు మీ ప్రకారమ్ముగా
ప్రబల కర్మ ఫలము పరిణమింప !
అనుభవింప వలయు నంత ర్విలీనవకా
దుఃఖభార మెట్లొ త్రోసికొనుచు.

సరస వాణి

భూరి కరుణార్ద్ర హృదయు లౌ మీరె యిట్టు
లని యుపేక్షించుచో లోకమందు తండ్రు
లెట్లు బిడ్డల సుఖ మపేక్షించువారు !
ధర్మ మనుపేర హృదయాల దయ తొలంగు !
చూచుచుండగ సంసార సుఖములందు
మునిగి తేలెడి పెద్దల, ముద్దుబిడ్డ
ఊర్మిళ విధాన నిద్రలో నుండవలెనె !
దైవతాంశోద్భవము కాదె దయ మహాత్మ !

దీక్షితులు

చాలు జాలు నింక సరస ! సంగ్రహముగా
ఏమి చేయు మందు విపుడు నన్ను ?

సరస వాణి

మంగళాంబమెడను మాంగల్య సూత్రమ్ము
గాంచు శుభము మరల కలుగవలయు !

దీక్షితులు

( చకితుడై )

నీవు బాగుగ యోజించినావొ లేదొ,
తల్లి దండ్రుల కెటు లున్న, తదితరులకు

అనదల పునర్వివాహమే యనెడి వాక్కు
శ్రవణ శూలాయమానము సరసవాణి !

సరస వాణి

కాదనను, కాని మీవంటి కారుణికులు,
శాస్త్రవేత్తలు బ్రాహ్మణ సంఘమందు
తొలుత పరివర్తనము చూప గలుగునెడల
ఈవిధానమె యుక్తమౌ నెల్లరకును.

దీక్షితులు

అలకింతు రొక్క ఆచారబద్ధులౌ
విప్రు లెల్ల రిట్టి వింతమాట ?
ఆచరింపకుండ నన్యుల కేరీతి
సాహసించి బోధ సలుపువాడ ?

సరస వాణి

ఆచరించి తొలుత, ఆవల నొరులకు
ఒజ్జబంతి యగుట ఉచిత మనిరొ
విన్నవించుదాన ! విప్రసంఘమునకు
తెరపవలయు శాస్త్రదృక్కు మీరె.
శాస్త్రమందు మీకు చాలినవా రేరి ?
ఎదురు చెప్పువార లెవరు మీకు ?
అఖిలలోక గురులు, యజ్ఞ దీక్షితులును,
అంతె కాక మీర లపరశివులు !

దీక్షితులు

ఒక్కవేళ పెండ్లి యోజింత మన్నను
అన్నివిధములందు అర్హు డైన

వరు డెవండు దొరకు ? వ్యర్థాభిలాషమ్ము
సంత్యజింప మేలు సరసవాణి!

(లోపలినుండి గానము)

"చెంగల్వలం బోలు చిన్ని పాదాల
ననుగుసెచ్చెలి మెట్టు నట్టిమార్గంబు
పులకితం బయి వన్నెపూవులు పూయ
రత్నకంబళమట్లు రంజిల్లుచుండు.
నా ప్రేయసీ పదన్యాస సౌభాగ్య
మొందిన యీ సుందరోపవనంబు
శ్రీ ప్రయాగ మహాత్త్వ సిద్ధిచే సర్వ
దేవతలకు గూడ తీర్థరాజంబె !
అనిమిష దుర్లభం బైన యీ దివ్య
మంగళ విగ్రహ మంజు హస్తంబు
గ్రహియించు భాగ్యంబు కలుగు టేలాగొ !
పెనగొను సంభ్రమ భీ విస్మయములు !"

దీక్షితులు

అతి మనోహర మైనదే ఆంధ్ర భాష !
అన్నిరీతుల పద్యమ్ము లల్లవచ్చు.
మంగళకు నెవ్వ రిచ్చి రీ మధురగీతి ?
చెప్పుచున్నది కవనమ్ము చిన్నితల్లి !

సరస వాణి

చెప్పినాడట భవ చ్ఛిష్యరత్నంబు
చంద్రమౌళీశ్వర స్వామి యీనాడె.

దీక్షితులు

చెప్పుచున్నవాడె శిష్యుండు కవనమ్ము !
సాధువర్తనుండు చంద్రమౌళి !
అచిరకాలముననె అడయప్పళిము వీడి
అతడు చేర వలయు సభిజనంబు.

సరస వాణి

అతనికి వెడలెడి యాసక్తి లేదు :
మీ సన్నిధానాన మెలగుచు నుండి
అభ్యసించినమీద అన్నివిద్యలను
స్వజనమ్ము జేరగా జనవచ్చునేమొ !

దీక్షితులు

వాస్తవముగ శుభమె వ్యసనితా శాస్త్రేషు !
అతని తండ్రియాజ్ఞ యగుటవలన
చేరి గృహము పెండ్లి చేసికోవలయును :
కలదు వారిదృష్టిఁ గన్య గూడ.

సరస వాణి

కావచ్చు ! అతండు కదల డిచ్చోటు,
పెండ్లియాడడు వేరెపిల్ల నేనాడు.
చంద్రమౌళితెరంగు చక్కగా తెలియు,
అన్యథా నిలిచిన దాతనిదృష్టి !

దీక్షితులు

అన్యదృష్టి యేమి ? ఆశ్లేయ పౌరుషే-
యములు గలుగువాడె : ఆత్మబంధు

గణము జేరి యతడు గార్హస్థ్య ధర్మము
నెరపుకొనుచు పొందు నిందుసుఖము.

సరస వాణి

పెండ్లిమాట లతండు పెడచెవి బెట్టి
తండ్రియానతి గూడ తల దాల్పకుండ
మనయూర నిన్నాళ్లు మసలుచుండుటకు
కారణం బేదియో గ్రహియించినారె?

( మందహాసము చేయును )

మమకార మతనికి మంగళమీద!
అనురాగమున పాణి అర్థించినాడు!

(దీక్షితు లాలోచనాయత్తు డగును—
మరకతవల్లి ప్రవేశించును )

దీక్షితులు

తల్లి, తీయగలవె తాంబూలపు కరండ
మీవితర్దినుండి : ఇంక జాలు
చర్వణమ్ము, చూడు సదనమ్ములో నేమి
చేయు చున్న దిపుడు చిన్ని తల్లి!

మరకత వల్లి

మండువాకడ పట్టెమంచముమీద
పన్నుండి మంగళ పాట పాడినది—
నిద్ర పోయిన దేమొ నే చూడలేదు.

* *

అనుదినం బట్లు మీ యాననసీమ
విప్పారి యుండ, కీవేళ నెందులకు
గాఢ చింతాంబుధాక్రాంత మైపోయె !

**దీక్షితులు**

చింత పట్టుకొనియె చెల్లెలి గూర్చియే !
తెలియ నోపు దాని తెరగు నీకు.

( మరకతవల్లి శిరఃకంపము చేయును )

మంచి దట్టులేని మర్మము లేకుండ
స్వీయమతము తల్లి, చెప్పవలయు.

**మరకత వల్లి**

సర్వజ్ఞులైన మీ సన్నిధానమున
ఏమి చెప్పగ నేర్తు రెవ్వారుగాని !
మీ నిర్ణయమ్మునే మిగిలినవారు
తల దాల్తు రని నాకు ధైర్యమ్ము కలదు.

**సరస వాణి**

చేయు మందువ నీవు చెల్లెలిపెండ్లి !
మంగళాంబకు చంద్రమౌళి యోగ్యుండె ?

**మరకత వల్లి**

చంద్రమౌళీశ్వర స్వామిలో లోటు
చూప జాలము- పరిశుద్ధ వర్తనుడు!
మంగళాంబ గళాన మాంగల్య సూత్ర,
మాననమ్మున కుంకుమారుణ రేఖ,

పాదయుగ్మమున పసుపు, పారాణి,
చూచి యెల్లరమును సుఖియించు టెపుడొ !

దీక్షితులు

నీకు చెల్లిపెండ్లి నిస్సంశయమ్ముగా
సమ్మతంబు, చాల సంతసమ్ము !
కాని అల్లు డిపుడు గ్రామాంతరమ్మున
కేగినాడె : అత డేమి యనునొ !

మరకత వల్లి

అభిమతమ్మును వేరె అడుగగా వలెనె,
మీ యానతిని వారు మీరి రేనాడు ?
మంగళ స్వేచ్ఛగా మాయింటిలోన
నిజభర్తతో గూడ నివసింపవచ్చు.

దీక్షితులు

చెప్పినారా మీరు చెల్లెలివార్త
అమ్మతో ముందుగా ? ఆమె యే మనునొ !

సరస వాణి

తెలియ దామెకు, మేము తెలుపుదు మింక,
అంగీకరించులే అక్క శీఘ్రముగ !

దీక్షితులు

గ్రహియించెనా నీలకంఠు డీవార్త ?
మరి యేమి పల్కె ఉమామహేశ్వరుడు ?
సమ్మతించినవాడె చంద్రావతంసు ?
డీమువ్వు రే మందు రెటు నాకు దెలియు ?

సరస వాణి

చాలు చాలును! మహా సంశయాపన్ను
లగుదు రేటికి మీర లనుపదమ్మునను?
మీయాజ్ఞ నెపుడేని మీరి యున్నాడె
తనయులం దొకడేని ధైర్యమ్ము బూని?

దీక్షితులు

జాయ యన్నను మహాసాధ్వి, పుత్రులును
వినయోజ్జ్వలుల్, కాన వీరి సమ్మతిని
పడయవచ్చును; కాని బ్రాహ్మణం బేమి
చేయునో ముందుగా చెప్పగా లేము!

సరస వాణి

అంగీకరించులే అఖిల లోకమ్ము!
స్థిరముగా అప్పయ దీక్షితు లున్న
సర్వమ్ము వేగ సుసంపన్న మగును
విశ్వేశ్వరుని కృపా వీక్షణమ్మునను!

## తృతీయ రంగము

(మరునాడు రాత్రి. విశాల మైన గదిలో దీపము వెలుగుచుండును. ఒక పార్శ్వమున పీఠముమీద నున్న నటరాజ విగ్రహమున కెదురుగా కృష్ణాజినము పరచిన వితర్దికమీద గూర్చుండి అప్పయ్య దీక్షితులు గాఢముగా విచారించుచుండును. ఇంతలో నొక తలుపు తెరచుకొని సరసవాణి, మరకతవల్లి నెమ్మదిగా ప్రవేశించి దీక్షితుల సమీపమున నిలుతురు.)

### సరస వాణి

అల్లె చింతాలూత భవదీ
యాస్యవీధిక తంతుజాలము !
వీవ చేటికి హర్షపవనము విదళనక్రియకై ?

### దీక్షితులు

అర్భకునిభంగి లేదు నా యంతరంగ
మోల లాడగ నానంద డోలలోన !
తుంగభంగాలపై నూగు దోనెవోలె
మున్న దని పల్కినను విశేషోక్తి కాదు.

### మరకత వల్లి

జరిపి చెల్లెలి పెండిలి సత్వరముగ
దాని గ్రమ్మర నొకయింటిదాని జేసి

సంతసింపగ వలసిన సమయమందు
కలుగ నేటికి నింతటి కలత మీకు ?

దీక్షితులు

పరిణయం బన్న నెంతటి బాధ్యత గల
కార్యమో తల్లి, గ్రహియింప గలవె నీవు ?
అదియునుం గాక విపరీత మైన క్రొత్త
దారి త్రొక్కుట బహు కష్ట దాయకంబు !

సరస వాణి

మరల మొదటికి వచ్చినారే !
మాటి మాటికి మీకు సంశయ
మంకురించుచు నున్న కార్యం బగుట యేలాగో !

దీక్షితులు

ముందు వెనుకలు చూడక తొందర పడి
అవల తాపము చెందుట అనుచితంబు.

సరస వాణి

సర్వ మెరిగిన ధర్మవేత్తలు
సమాలోచన యిపుడు క్రొత్తగ
చేయవలసిన దేమి ? విడువుడు చిత్తచంచలత !

దీక్షితులు

విడిచి పొందు రవంత యీ వేళ నన్ను—
నేడె తెలుపుదు మీకు నా నిర్ణయమ్ము.

(స్త్రీలు వెడలి పోదురు. దీక్షితులు నట
రాజ విగ్రహమునకు చేతులు జోడించి)
శాస్త్ర మటు పల్కు, మరి వృద్ధ సంప్రదాయ
మిట్లు కా దను; నటరాజ, ఏమి చేతు !
(కన్నులు మూసికొని ధ్యానముద్రలో నుండును.)

## వృద్ధబ్రాహ్మణ స్వరమేళ

(అదృశ్యముగా ధ్రువా గీతి)

హర హర హర హర అక్రమ మార్గమె
ప్రబల మయ్యెనే బ్రాహ్మణకులమున !
శివ శివ శివ శివ చెప్పెడి దేమిటి !
కలిపురుషునకే గరిమ మ్మకటా !
శంభో శంకర శాంతం పాపమ్ !
విప్రవితంతువు వివాహ కార్యమె !
హర హర హర హర అప్పదీక్షితులె
బిడ్డకు క్రమ్మర పెండ్లి చేయునే !
యజ్ఞకర్తయే అక్రమ పథమున
చనునెడ మన కిక శరణం బేదీ !
శాస్త్రం బేటికి ? సదాచారమే
వృద్ధాచారము వృద్ధాచారము !
ఇం కే మున్నది ఇం కే మున్నది
ప్రళయము ప్రళయము బ్రాహ్మణకులమున !
హర హర హర హర అపరశంకరుం
డనియెడి వానికి అపరబుద్ధియా !

సామాన్యునివలె సంభ్రమ మొందకు
అఖిలలోకనుత, అప్పయ దీక్షిత !

దీక్షితులు

( కనులు తెరచి )

ఏమి చేయుదు శివా ! ఏమి చేయుదు నింక !
నామూలమున ఏల నష్టమ్ము రావలయు
విమల వర్తన మైన విప్రసంఘమ్మునకు !

( బిగ్గరగా )

తల్లి, మరకత వల్లి, దగ్గరకు రావమ్మ !

( ఆమె ప్రవేశించి నిలుచుండును )

ధ్యానపూర్వకముగా తలపోసినా నమ్మ !
ఆచారసంపన్ను లైన భూమీసురుల
కిట్టి పరిణయ మన్న హేయమ్ముగా నుండు !
ప్రతిఘటింపగ జాల బ్రాహ్మణ ప్రవరులను.

విప్రు లనదవివాహవిధి సమ్మతింపరే !
ఉజ్జగించి సమాజ ముండగలమా తల్లి !
నే వివాహము చేయ నేర నని పిన్నితో
చెప్పి శాంతమ్ముగా, చింతింప వల దనుము.

మరకత వల్లి

ఇది యేమి ఇది యేమి! ఇంతలో మీమనసు
మారినది ! మంగళకు మంగళమ్మే లేద !

శాంతమ్ముగా నొక్కసారి ఆలోచించి—
నేడె తొందర లేదు, నిర్ణయము చేయంగ—
తెలుపవచ్చును మీరు తెల్లవారిన వెనుక.

( నిష్క్రమించును. ఆయన కన్నులు మూసికొనును )

## యువబ్రాహ్మణ స్వరమేళ

(అదృశ్యముగా ఉత్సాహగీతిక)

అఖిలలోకనుత ! అప్పయ దీక్షిత !
ఆచార్యాణా మాచార్యోత్తమ !
అఖిలనిగమ ధర్మాగమ పారగ !
అధ్వరకర్తా ! అప్పయ దీక్షిత !

శాస్త్రవిదాం వర, సజ్జనకోటికి
సర్వకాలముల శాస్త్రమె లక్ష్యము.
వీర్యవంతులకు వృద్ధాచారము
అంగీకారం బగునా నిరతము !

విరిగిన రక్తము వృద్ధాచారము,
వేమరు మారును వివిధవిధంబుల.

యుష్మదాదులే ఉపేక్షించుచో
అమలధర్మమున కగునె ప్రచారము ?
పూతచరిత్రులు పూజ్యులు మీరే
పూనుకోవలయు పుణ్యక్రియకై.

వాదమునందును వర్తనమందును
అప్పయదీక్షితు లద్వితీయులే.

మే మెల్లరమును మీ బంటులమే,
అగ్నిని దుముకుదు మానతి యగుచో !

కార్యాచరణకు గడగుడు వేగమ !
అపరమహేశ్వర, అప్పయ దీక్షిత !

### దీక్షితులు

ఏమి చేయుదు శివా ! ఇపుడు ద్వైవిధ్యమ్ము
పట్టి లాగును గదే బలవంతముగ నన్ను !

### వితంతువుల స్వరమేళ

(అదృశ్యముగా సౌమ్యగీతి)

అఖిలలోకనుత ! అప్పయ దీక్షిత !
అనుకంపాంబుధి ! అప్పయ దీక్షిత !

బ్రాహ్మణవనితల భాగ్యవశమ్మున
బహుకాలమునకు ప్రభవ మొందితిరి !

అబ్దసహస్రము లరిగినమీదట
అరుగుదెంచె నీ అమర నిమేషము !

కారుణ్యాంబుధి ! కళ్యాణము మీ
తనయకు చేయుడు ధర్మమార్గమున.

ఈ నిమిషములో నేయది మీరలు
చేయుదు రదియే శిలాశాసనము !

అనదల కికపై నాకల్పాంతము
పసుపు కుంకుమల భాగ్యము కల్గును !

ఎండిన వృక్షము లిక మీకరుణను
పల్లవ సుమనః ఫల భరితము లౌ!

భవదీయాజ్ఞను భారత దేశము
సంతానముచే సంపన్నం బగు!

మీ కారుణ్యామృత సేకమ్మున
పుట్టుదు రుత్తమ పురుషులు స్త్రీలును.

అంతరంగమున అమృతకలశమే
కలదు నిజమ్ముగ కరుణావార్నిధి!

చిన్న యనదలకు జీవ న్మరణము
తొలగింపుడు మీ దుహితృప్రేరణ!

ఆ సదాశివుని అవతారంబా!
అద నుదయించిన దనదల బ్రోవగ!

సాహసింప దగు సకలలోక గురు!
అఖిలలోకనుత, అప్పయ దీక్షిత!

## దీక్షితులు

(కన్నులు తెరచి)

ఏమి చేయుదు శివా! ఏది మార్గము నాకు!

(బిగ్గరగా)

తల్లి మరకతవల్లి, దగ్గరకు రావమ్మ!

(ఆమె ప్రవేశించును)

చెల్లెలీయెడ నేమి చేయుచున్నది తల్లి!

### మరకత వల్లి

పిన్నమ్మ కూర్చుండ బెట్టుకొని మంగళను
ఒడిలోన, ముద్దాడు చున్న దనురాగాన.

### దీక్షితులు

మంచి దమ్మా, పోయి మంగళకు పరిణయము
చేయ నవకాశమ్ము సిద్ధించు నని చెప్పు.

### మరకత వల్లి

నిజముగా, నిజముగా ! నిర్ణయంబే తండ్రి !
సాక్షాత్తుగా ఘృణా సాగరంబే మీరు !

( ఆనందముతో వెడలిపోవును )

### వృద్ధబ్రాహ్మణ స్వరమేళ

( అదృశ్యముగా ధ్రువా గీతి )

ఆర్యధర్మవిద, అప్పయ దీక్షిత !
వర్ణసంకరము వాంఛించెదవే !

నీవే ఈ విధి నిర్ణయించునెడ
పాతివ్రత్యము భంగము కాదా !

బ్రాహ్మణ సంఘపు బంగరు వన్నియ
నష్టం బగు నీ నవ విధానమున.

దయ దయ దయ యని దౌర్బల్యంబున
ఆక్రోశించెద రతిసామాన్యులు !

ధర్మము ఛురికా ధారను బోలును !
ధర్మ వీరులకు దయతో పనియా !

ఆర్య ధర్మముల కవలంబన మగు
యజ్ఞకర్తవే అప్పయ దీక్షిత !
భరత వర్షమున పాణిగ్రహణము
బ్రాహ్మణ కన్యకు పరమ పవిత్రము.
ఆలోచింపుమ అప్పయ దీక్షిత !
ధర్మము ముఖ్యమొ తనూజ ముఖ్యమొ !
ఆత్మకర్మఫల మనుభవింపవలె :
తప్పింపగ మన తరమా నిజముగ !

బహు కాలముగా ప్రవర్తిల్లు మన
వృద్ధాచారము విడువం బోకుము !
నీ కెదు రాడెడి నేరుపు కానము !
వినను మా మొర ఆలకింప దగు !

భువనములో నీపుత్రి పునర్భువు
అనెడి కళంకం బలమకుండ వలె !

కాయికసౌఖ్యము ఘనమో, నిర్వృతి
కారణధర్మము ఘనమో, తలపుము !
ధర్మవీరులకు దయతో పని లే,
దఖిలలోకనుత ! అప్పయ దీక్షిత !

లోకసంగ్రహ లోకనమే శివు
కారుణ్యంబున కలుగును గావుత !

( దీక్షితులు కన్నులు తెరచును )

### సరస వాణి

( ప్రవేశించి ఉత్సాహముతో )

మెచ్చుకో దగినది మీ నిర్ణయమ్ము!
మీ నిర్ణయమ్మున మిగుల హర్షమ్ము !
మీ నిర్ణయమ్మున మిగిలినవారు
మిగుల హర్షింతురు మేదినీస్థలిని !

### దీక్షితులు

నీకు హర్షమ్ము కలిగాడి నిర్ణయమ్ము
గా దలంపకు ముందుగా; కారణమ్ము
అడిగి నను బాధ పెట్టక అలకింపు
చిన్నదాని వివాహమ్ము చేయజాల !

### సరస వాణి

ఇది యేమి హరహరా ! ఇంతలో మార్పు!
శివ, శివా, ఇం కేమి చేయ గల్గుదుము !
మరకత చెప్పిన మంగళివార్త
సత్య మానో భ్రమాసంజాత మానో !

### దీక్షితులు

నేను సంపూర్ణదృష్టితో నిర్ణయమ్ము
చేయకుండగ నేదియో చెప్పినట్టి
మాటలంబట్టి మరకత మంగళార్థ
మే గ్రహించిన, కాదు సత్యేతరంబు.
మారిపోయిన దవల నామనసు సరస !
చిన్నతల్లి వివాహమ్ము చేయజాల !

సరస వాణి
మాటిమాటికి మీరు మారినరీతి
మరల నీవారము మారిపోరాదె !

దీక్షితులు
సాహసము నాకు లే దని సరసవాణి,
ఒక్క నిట్టూర్పుతో నూరకుండు మింక !

సరస వాణి
ఆహవముఖమునం దర్జునునట్లు
నిజకుమారి వివాహ నిర్ణయమందు
వెనుకంజ వేసిన విప్రవీరునకు
గీతోపదేశ మే కృష్ణుండు చేయు !

దీక్షితులు
కంఠగత మయ్యె ప్రాణ మీ ఘర్షణమున !
కాలకంఠేశ్వర స్వామి కాలయంబు
అచిరకాలాన నిర్మింప, నగును గాక
మరల మణిదర్పణమ్ము నామానసమ్ము !
సరస, శాంతించి యొక్కింత, చంద్రమౌళి
సత్వరమ్ముగ బంపు నా సవిధమునకు.

(సరసవాణి నిష్క్రమించును)

క్షంతవ్యో మేఽపరాధః
శివ శివ శివ భో శ్రీ మహాదేవ శంభో !

(చంద్రమౌళి ప్రవేశించి అప్పయ
దీక్షితులకు పాదాభివందనము చేయును)

దీక్షితులు

చంద్రమౌళి, నీవు సత్కుటుంబమ్మున
జనన మొందినావు : జనకునాజ్ఞ
నన్యథాకరింప కాచార సంపన్న
మైన విధిని పెండ్లి యాడు మోయి !

చంద్ర మౌళి

వలదు నాకు వివాహమ్ము ! వాంఛ యొకటె :
ప్రత్యహము చేయుచుండ మీ పాదసేవ
అగ మాఖిల దర్శనాభ్యాసమంచె
గడచి పోవును గాక నా కాల మెల్ల !

దీక్షితులు

అట్టి వాంఛ విడిచి, అడయప్పళము వీడి,
శీఘ్ర గమనమునను సేతువునకు
పోయి, చేయ వలయు పుణ్యోదకస్నాన
మంతరంగశుద్ధి యగుటకొరకు.

చంద్ర మౌళి

చిత్తము, మహాప్రసాదము ! చేసి యచట
స్నాన, మరుదెంతు నా సన్నిధానమునకు ?

దీక్షితులు

పూర్వబంధములను పూర్వవాసనలను
కోసి, కడిగి వేసికొనుట శుభము.
సకలతాపహారి స్మరహరు కరుణచే
శర్మ మగుత నీకు చంద్రమౌళి !

(అని లేవగా, చంద్రమౌళి పాదాభివందనము
చేయును. దీక్షితులు నిష్క్రమించును)

చంద్ర మౌళి

(నటరాజ విగ్రహమునకు ప్రణమిల్లి)

క్షంతవ్యో మేఽపరాధః
శివ శివ శివ భో శ్రీ మహాదేవ శంభో !

(మంగళాంబ మందగమనముతో ప్రవేశింప, లేచి)

నాకు గురువులు విధియించినారు కృపను
సేతువున కేగి స్నానమ్ము చేయు మనుచు :
పోవువాడ నహర్ముఖ పుణ్యవేళ,
సెల వొసంగుదువే శాంతచిత్త వగుచు ?

మంగళాంబ

( డగ్గుత్తికతో )

సేతుతీర్థాన స్నానమ్ము చేసి మరల
నేగుదెంతురు మాయింటి కెపుడు మీరు ?

చంద్ర మౌళి

( నిరాశా సూచక స్వరముతో )

తెలియదు మంగళా, తిరుగ నిచ్చటికి
వత్సరమ్ములకైన వత్తునో రానో !
సేతువుకడనుండి శ్రీశైలమ్ము
చేరగావలె తీర్థ సేవలలోన.
తిరుగ రమ్మని గురుదేవులు నాకు
ఆన తిచ్చినవార లనుకొంటి వేళు !

మంగళాంబ

అది యేమి, గురుచర ణాంతికమందు
అభ్యసింపర మీర లాగమమ్ములను !

చంద్ర మౌళి

పూర్వ బంధంబులు, పూర్వ వాసనలు
ఛేదించి, క్షాళన చేయు మన్నారు !

మంగళాంబ

( రుద్ధకంఠముతో )

ఇంక నా కే మున్న దీ లోకమందు !
బ్రదికియున్నను నేను ఫల మేమి కలదు ?
తొలగి పోవగ నాదు దుఃఖభారమ్ము
కాలకంఠా ! నన్ను కబళింప వేమి !

( రోదనము చేయును )

చంద్ర మౌళి

( చల్లని కంఠముతో )

శోకోపహత వౌట శుభము కా దమ్మ !
తేరుకో మంగళా, ధీమంతురాల !

మంగళాంబ

ఇంక మీదర్శనంబే దుర్లభంబు !
ఏమి యాలంబనం బీజన్మమునకు !

( ఆతని మెడవంక జూచి )

కమనీయ మైన మీ కంఠదేశమున
చారువక్షస్స్థలీ సంగత మగుచు
వ్రేలాడుచుండు పవిత్ర రుద్రాక్ష
మాలికా మహిమచే మంగళదుఃఖ
మణగుచుండును గాక !—అర్చాపదార్థ
మగు గాక మాలిక ఆమరణమ్ము !

చంద్ర మౌళి

(రుద్రాక్షమాలిక మెడనుండి కొంచెము
తొలగించి యేమో యోజించి ఆగి)

మంగళా, మంగళా, మరచిపోవమ్మ,
గత మంతయును; దుఃఖకారణం బగును
రుద్రాక్ష మాలిక—రోదింపబోకు :
అర్చింపగా నిది అర్హమ్ము గాదు.
యావ న్నయాతి మరణం యావ న్నాక్రమతే జరా
ఇచ్ఛామాత్రేణ సకలై రర్చనీయో హి శంకరః.

మంగళాంబ

బహుళ దుఃఖ ధ్వాంత బంధురం బైన
జీవితంబున దీపశిఖ యేది యింక !

చంద్ర మౌళి

జీయా త్క్రతౌనఙ్గ పతఙ్గ దాహః
ఖట్వాఙ్గినో నేత్ర శిఖి ప్రదీపః
య స్యాన్తికే శుభ్ర దశా నివేశ
శ్రియం కిరే టేన్దు కరాః శ్రయన్తే!

చూడోత్తంసిత చారు చన్ద్రికలికా
చంచచ్ఛిఖా భాస్వరో,
లీలాదగ్ధ విలోల కామశలభః,
శ్రేయో దశాగ్రే స్ఫురన్,
అంతఃస్ఫూర్జ దపార మోహతిమిర
ప్రాగ్భార ముచ్చాటయన్
చేతస్సద్మని యోగినాం విజయతే
జ్ఞాన ప్రదీపో హరః !

(శాంతముగా నిష్క్రమించును)

మంగళాంబ

(చంద్రమౌళి కనబడునంతవరకు చూచి, పొంగి వచ్చుచున్న దుఃఖ మాపుకొని, నటరాజ విగ్రహముకడ మోకరిల్లి, చేతులు జోడించి డగ్గుత్తికతో)

మన స్తే పాదాబ్జే నివసతు, వచః స్తోత్ర ఫణితౌ,
కర శ్చాభ్యర్చాయాం, శ్రుతి రపి కథాకర్ణనవిధౌ,
తవ ధ్యానే బుద్ధి, ర్నయనయుగలం మూర్తివిభవే...

సమాప్తము

# కవి ప్రియ

అంకితము

శ్రీ నోరి నరసింహ శాస్త్రికి

# పాత్రలు

| | |
|---|---|
| యామినీ దేవి | నాయిక |
| కేరళిక | పాలికా వయస్య |
| మందార మాల | మహారాజ్ఞి |
| బిల్హణ భట్టు | నాయకుడు |
| కోటిపాలుడు | దుర్గాధ్యక్షుడు |

రాజగురువు : అమాత్యుడు

రంగము : లక్ష్మీమందిర నగరమున
'సప్తావని' నామక ప్రాసాదమున
క్రీ.శ. 11 శతాబ్ది-ఉత్తర భాగము
కాల పరిమితి : రెండు పక్షములు

# ప్రథమ రంగము

సప్తావని ప్రాసాదములో ప్రాతః కాలమున సుసజ్జితమైన విశాల కక్ష్యలోనికి యామినీ కేరళికలు ప్రవేశింతురు. కేరళిక చేతిలోనుండి పుష్ప సముద్గకము నందుకొని, యామిని పరధ్యానముగా రత్నకంబళముపై గూరుచుండి, చెంత నుపవేశించిన కేరళికను జూచి, భిత్తికమీది బిల్హణుని చిత్రపటమును గాంచి, తల వంచి, పుస్తకము తెరచి, అస్పష్టముగా రాగాలాపన చేయును.

యామినీ దేవి

అన్యభావము వీడి యేకాగ్రమ వయి
పారవశ్యముచే గురుపాదపద్మ
యుగళిపై వ్రాలి, సంశ్లేష మొందకుండ
మసలె దేటికి అటు నిటు మానసంబ !

కేరళిక

చదువుచున్నావు నాల్గు మాసములనుండి
భట్ట బిల్హణ దేశికపాదులకడ
భూరినిష్ఠా సమన్వితబుద్ధితోడ ;
తోచనే లేదు చాంచల్యదోష మెపుడు.

నిజముగా నొక్కొక్కప్పుడు నీవదనము
విప్పుగన్నులతో నూర్ధ్వవీక్షణముల
నెదియొ కఠిన పరీక్షకై యెదురు చూచు
తరుణవిద్యార్థినీసముత్కంఠ నొప్పు.

### యామినీ దేవి

అట్టి యుత్కంఠ నెచ్చెలీ, అప్పు డపుడు
కానబడు నందువా నా ముఖమ్మునందు?
నిజముగానే ఘటిల్లును నేడొ రేపొ
కఠిన మైన పరీక్షయే కవితయందు.

మూడు మండలముల నెట్టి ముగ్ధ యైన
అగును కవయిత్రి సాహచర్యమ్ముచేత
అంతరంగమ్ములో కవితాత్మ యున్న,
అన్న కవిభాషణము నీవు విన్నదె కద.

### కేరళిక

అవును : జనకులతో సఖీ, ఆరు నెలలు
దాటకుండనె నీకు విదగ్ధతయును
సరసకవితా ప్రవీణత సంక్రమింప
జేయ గలవాడ నని కవి చెప్పినాడు.

అట్టి కవిచంద్రసాన్నిధ్యమందు గాక
అన్యదేశమునం దెట్లు లంకురించు
సరస మైన కవిత్వబీజమ్ము యామి
నీ, సఖీ, నీయదృష్టము నిరుపమమ్ము!

### యామిని

చెప్పగలను కవిత్వమ్ము, చెప్పినాను
కొన్ని పద్యమ్ము, లయినను గురుకవీశ
చరణసన్నిధియం దుంచ జంకు పుట్టు,
క్రమ్మివేయును భీతరంగములు నన్ను.

కే ర ళి క

ఒజ్జకడ జూప జాలవు లజ్జచేత!
నోముకొన లేదె నీసఖీలోచనములు
భవదపూర్వ మనోహర పద్యపాద
విమల వర్ణ విలోకన విభవమునకు?

యా మి ని

నీ విపుడు కవయిత్రి వైనావు చెలియ!
మద్గురూత్తమ భావనామహిమచేత
ఉదిత మానాకవిత్వమ్ము యోగ్య మన్న
పక్షమున నుంతు తత్పాదపద్మమకడ.

కే ర ళి క

ఆలకింప మిగుల నౌత్సుక్యము జనించె!
చదువు చదువు సకియా, సత్వరముగ
భవదపూర్వరచన బద్ధమో అనిబద్ధ
మో, అదేది కాక ముక్తకమ్మొ.

యా మి ని

అప్తురాల వగుట నభిమానలేశమ్ము
మానసమ్మునందు లీన మైన
తోచ నీయ కట్టి దోషమ్ము లైనను
గుణగణమ్ము వోలె గోచరించు.

కే ర ళి క

వ్యక్తిమీద గలుగు నభిమానమును సఖీ,
నేను వేరు చేయ నేర నొక్క

కావ్యవస్తుభావగత మైన రతినుండి ?
చదువ వలదె యింక సత్వరముగ ?

యామిని

అన్యభావము వీడి యేకాగ్రమ వయి
పారవశ్యమ్ముచే గురుపాదపద్మ
యుగళిపై వ్రాలి సంశ్లేష మొదవకుండ
మసలె దేటికి అటు నిటు మానసంబ !

కరగి పోసిన బంగారు కాంతి మీరు
దేశికమహాశయు పవిత్ర దివ్య గాత్ర
యష్టి యూతగ నొగబ్రాకి అంతరిక్ష
లలితసౌవర్ణసీమలో వెలయ వేమి !

మద్గురూత్తమ ముకురాయమాణ మధుర
వితత వక్షః స్థలమ్మున బ్రతిఫలించి
సంచలింపక అవ్యతిచ్ఛన్న మైన
విగ్రహామువోలె నుండవే వెఱ్ఱిమనస !

కేరళిక

బాగు బాగో ప్రియసఖీ, నీ
ప్రథమరచనయె మహామధురము !
తొలుతనే ఘటియింప దేశికస్తుతి శుభప్రదము !
ప్రియసఖీ, వినిపింప నెంతువ
చిష్ణాణార్యున కే స్తవమ్మును ?

( తెరిపార జూచును )

యా మి ని

మంచి దంటివి గదా, యేటికి మానవలెను సఖీ !

కే ర ళి క

అరసినట్టులు తోచ దిందలి
యంతరార్థం బేమొ చెలియా !
ఏమి తలచునొ బిల్హణార్యుం డెంచి చూడ దగున్.

( యామిని ప్రశ్నార్థకముగా జూచును )

కానవచ్చును గురుస్తోత్రము
గాని బహిరంగముగ పద్యము,
లరయ ననురాగమ్ము తోచదె అనున్యూతముగా ?

యా మి ని

ప్రేమ కలదా నాకు శ్రీమ
ద్బిల్హణార్యునియెడల సకియా ?
బాగు బా ! గది వెర్రిదానా, భక్తి యనుకొనవే !

కే ర ళి క

ఆదిలో ననురాగ మందురు,
అవల దానిని భక్తి యందురు :
ఇంతలోనే యెదిగి పైపై కెక్కిపోయె చెలీ !

( బుజము తట్టును )

యా మి ని

నీ పరిహాసమున కోసీ,
నేను జంకెడిదాన గానే,
కవివతంసుం డేమి తలచునొ కనుగొనన్ వలెనే !

నేను ఖండిక చదువువేళను
నీవు కనబడకుండ నావల—
కన్యథా భావింపబోకుము— ఆరుగవలయు సఖీ !

కేరళిక

నీకు నెయ్యది ప్రియము దానిని
నెరపుదానను గదా ! పాలిక
కలత యేమియు గలుగనీయక కాచుచుండవలెన్.

(నిష్క్రమించును. యామిని పటమువంక జూచుచుండ బిల్హణ కవి ప్రవేశించును. యామిని లేచి, అతడు కూర్చున్నపిదప పాదసన్నిధిలో పుష్పములు చల్లి, ప్రణామము చేయును.)

కవి

శుభ మనారత మస్తు తే! సుప్రభాత
మద్య ! రాజపుత్రి కనామయమ్మె నేడు ?

యామిని

సుప్రభాతము ! గురుదేవ శుభ కటాక్ష
వీక్షణముచే ననామయ వికసనంబె.

( అతడు సంజ్ఞ చేయగా కూరుచుండును )

కవి

ఈ మనోహరవేళ ఏకవిగ్రంథ
రాజమ్ము తెచ్చితో రాజకుమారి ?

( చేయి చాపును )

యామిని

శోణ పట్టాంబర శోభాయమాన
మైన యీ కోశమ్మునందు కవీంద్ర
రమ్య సువర్ణంపురాశి మృగ్యమ్ము!
పైపై మెరుంగుల పారదగుళిక !

కవి

విశ్వసింపగ జాల ; విన్నాణ మైన
యిట్టి కోశమ్ములో నెట్టి సువర్ణ
పుంజమ్ము లేకుండ బోవుట యెట్లు ?
ఏది న వ్వొకసారి యీక్షింప నిమ్ము.

( యామిని పుస్తకమును నెమ్మదిగా అతనిచేతి కిచ్చును. అతడు పత్రములు తిరుగవేసి, ఒకచోట కొంచె మాగి, అందలిపద్యములు కన్నులతో పఠించి గంభీర వదను డగును. యామిని కవివైఖరి నుత్కంఠతో పరికించుచుండును. ఆవల కోశమును యామిని కిచ్చి )

కవి

ఆయెను కవయిత్రి యామినీ దేవి !
ఎపుడు రచించిన దీపద్యములను ?

యామిని

( కొంచె మూరకుండి మెల్లగా )

పానుపుమీదను పన్నుండి యుండ
గతరాత్రమున, స్వచ్ఛకౌముదీకాంతి
వాతాయనమువెంట వచ్చి నాతనువు
పాండుర పటవాసభాతి ముంచెత్తె.

గడియలు దాటులే కాని యొక్కింత
కను మూత పడ లేదు : గగనహంసమ్ము
వీక్షించుచుండగా వింతగా నందు
భవదాస్యబింబమ్ము ప్రతిఫలించినది.
( కవివంక జూచును. అతడు చలింప లేదు. )

అప్రయత్నమ్ముగా నస్మదాస్యమ్ము
నుండి వెల్వడిన దీ ఖండకావ్యమ్ము
గురుమహారాజ, ఈ కోశమ్మునందు
ఎపుడు లిఖించితి నెరుకయే లేదు !

క వి

( మందహాసముతో )

చాల సంతోషమ్ము ! సహజమ్ముగానె
జనియించెను కవిత్వశక్తి నీలోన.
కాని, రాజకుమారి, కావ్యవస్తువుగ
వెలయదే ధిషణలో విషయాంతరమ్ము ?

యా మి ని

స్ఫురియింప కుండుటే శుభదాయకమ్ము.

( అవనత వదనయై )

దేవతాస్తుతి కన్న దేశికస్తవము
ఆదియందే యిట్లు లప్రయత్నముగ
కావ్యమం దుండుట కల్యాణదాయి !

కవి

( వింతగా నవ్వుచు )

మంగళా చరణాన మా శిష్యురాలి
కభినవ సిద్ధాంత మావిర్భవించె.
దేవతాస్తుతి కాని దేశిక స్తవము
కావ్యముఖమ్ముల కనలేదు మున్ను.

యామిని

గురువుకన్నను వేరె పరదైవతమ్ము
శిష్యురాలికి లేదు శివశాసనమున.
గురుదేవు వంశమ్ముగూర్చి కావ్యమ్ము
వ్రాయగా మనసులో వాంఛ గాఢమ్ము.

కవి

భక్తి యుక్తమె, కాని ప్రకృతి వర్ణనము
శిష్యురా లొక్కింత చేయుట మేలు.

(ఆమెవంక స్థిరముగా జూచును)

యామిని

నా పద్యములు మీకు నచ్చకయున్న
ఉజ్జగింతును కవితోత్సాహ మిపుడె!

కవి

సాహసింపకు రాజపుత్రీ,
సత్కవిత్వమె పట్టువడినను
ఆదియందె నిబద్ధకావ్యం బల్లవలదు సుమీ!

నీకు చంద్రికలో కవిత్వము
నిర్గతం బగు కారణమ్మున
ముక్తకములు రచింపదగదే ముందు చంద్రునిపై ?

**యామిని**

చిత్త, మటులే చేయుదానను,
శిరోధార్యము గురుని యానతి,
రాత్రి కౌముదియందె చేయుదు రచన, గురుదేవా !
ఎంత రమణీయముగ నుండునో
ఈ వతంసమునందు వెన్నెల-
రాత్రివేళల భవత్కావ్య శ్రీరమ్ము, గురుదేవా !

**కవి**

( నిట్టూర్పు విడిచి )

నిరుపమానం బైన రాత్రులు
నిజముగా వీక్షింపవలయును
గాని వర్ణన యెట్లు చేయంగలను రాజసుతా !
తెలియకున్నది నాకు, నెన్నడు
తిరిగి పోదునో స్వదేశమునకు !
ఇపుడు నీవాక్యమున మరలిన దింటిపై, బుద్ధి.

**యామిని**

మధుర కాశ్మీరమ్ము జూడగ
మనసు పుట్టుచు నున్న దెంతయు;
కూడ నను గొనిపోయి చూపుదు గురుకవిప్రవరా !

కవి

ఏమి కోరిక రాజపుత్రీ!
ఇంతవరకును నీ వనూర్వ్యం
పశ్య, వంతఃపురము వీడుట భావ్య మెట్టు లగున్ ?
అచిరకాలములోనె పెండిలి
యాడి, పితరులమాట వెంబడి
రాజపుత్రుని మహాయోధుని రాణి వయ్యెదవు!

యామిని

( భ్రూభంగముతో )

ఇపుడు పాణిగ్రహణ మన్నను
ఎట్టి రాజకుమారు డన్నను
కుతుక మేమియు లేదు, నమ్ముడు గురుమహారాజా!

కవి

( ఆలోచనాపరుడై )

నాకు కార్తాంతికులు చెప్పినారు శీఘ్ర
కాలమున నేదియో పెద్దగండ మనియు,
అవల నేదియొ ఊహాల కందరాని
భూరి మంగళసుఖము చేకూరు ననియు.

( యామినిముఖమున వివిధభావములు స్ఫురించును )

తలపు పుట్టెను మీరాజధాని విడిచి
రాజపుత్రిక, దేశాంతరమ్ము పోవ___

యామిని

( అతని పాదములు పట్టుకొని )

వలదు, గురుదేవ, మీరు పోవలదు—వలదు !
అవధరింపుడు ప్రియశిష్యురాలి వినతి !

కవి

( ఆమె కరములు మృదువుగా తొలగించి )
రెండు మాసము లెటనో పరిభ్రమించి
మంచి రోజులు వచ్చిన మరలి వత్తు.

యామిని

నన్నుఁ గవయిత్రిఁ జేయుదు నన్నవారు—
జనకుసన్నిధి— ఆరు మాసములలోన.
చనియెఁ నేటికి నాల్గు మాసములె, మీరు
వెడలిపోయిన విద్యకు విఘ్న మొదవు.

అవసితము కాక నడుమలో నంతరాయ
మైన, కళయును విద్యయు నట్టె యుండు,
చేయుచుండెడి దోహదసేవ విడువ
నెదుగు బొదుగులు లేనిమహీజ మట్లు.

సంశయం బేల ? జనకభూజాని కార్య !
ఆదరానురాగములు మీయందు మెండు.
చెప్ప నేటికి, మీ ప్రియశిష్యురాలు
వాడనీయదు మీ గళ వకుళమాల !

కేరళిక

( తటాలున ప్రవేశించి )
ఏటికో అరుదెంచుచున్నా
డిటకు దుర్గాధ్యక్షుడౌ శ్రీ
కోటిపాలుడు రాజపుత్రీ, గురుమహారాజా !

(నమస్కరించును. యామిని సంజ్ఞ చేయగా కేరళిక నియమిత స్థానమున కూరుచుండును. కోటిపాలుడు ప్రవేశింపగా మర్యాదలు నడుచును.)

కో టి పా లు డు

గురుదేవ, కుశల మడిగిరి
ధరణీనాయకులు, మిమ్ము దర్శింపంగా
త్వరితముగ నేగుదెంతురు,
పరీక్ష చేయుదురు సుతను : పంపిరి తెలుపన్.

యా మి ని

నాయన గారరుదెంతుర
ఈ యుదయముననె ? కాక ఎల్లియొ పయినో
సాయంవేళ పరీక్షలు
చేయగవచ్చును కవిత్వ చిత్రకళలలో.

కో టి పా లు డు

చెప్పగ లేదు మహాప్రభు
విప్పడె దయచేయునట్టు : లెల్లిట సభలో
తప్పక జరపుదు, రప్పుడు
మెప్పింపుట నిశ్చయమ్ము మీరు జనకులన్.

యా మి ని

ధైర్యము మీ కెటు కలిగిన
దార్యా, నావిషయమందు నడుగం దగునా ?

కో టి పా లు డు

ఆర్య శ్రీ బిల్హణు లా
చార్యులుగా నుండ నేల సంశయ ముండున్ ?

కవి

సరసవ్యాహారముల
పరమాహ్లాదమ్ము కోటిపాలాగ్రణి ! ఏ
తెరగున వర్తించునో యని
పరీక్షలో రాజపుత్రి, భయము జనించున్.

( యామినివైపు చూచును )

కోటిపాలుడు

ఆచార్యులు కావున సం
కోచించెద రంతె కాని గురుదేవా, మా
రాచకొమారిత ప్రాయిక
వాచంయమ యయ్యె నాడు వరలును సభలో.

( యామిని చిరునగవుతో శిరము వంచును.
కవి ఆమెవంక వింతగా జూచును )

భవదీయ శ్లోకములు
శివస్తుతియు మామకీన చిత్తనిమిత
ప్రవణములు, కాశ్మీరక
కవిప్రవర, నూత్నకృతులు కలవా వినగన్ ?

కవి

కుతుక మేమి లేక కొంతకాలమునుండి
క్రొత్త రచన లేదు కోటిపాల !

కోటిపాలుడు

చిత్త, మింక సెలవు శ్రీ బిల్హణ కవీంద్ర !
పోయి వత్తు రాజపుత్రి, సెలవు !

( అందరును లేతురు. కోటిపాలుడు నిష్క్రమింపగా మరల నుపవేశింతురు.)

కవి

ఈ ప్రభాతవేళ ఏపుస్తకము నీకు
రాజపుత్రి, ప్రీతిభాజనమ్ము ?

యామిని

పుస్తకమ్ముపైకి బుద్ధి పోవుట లేదు,
పట్టిచేతితోడ వచ్చినాను.
కలుగుచున్న దిపుడు కాశ్మీర దేశమ్ము
గూర్చి వినగ కోర్కి గురుకవీశ !

( ఉత్కంఠతో జూచును )

కవి

అలకింపవచ్చు నవల రాజకుమారి,
పద్యరూపముననుఁ, పాఠ మేమి
చదువవైతి విపుడు ! స్వల్పమ్ము కాలమ్ము
కళ యనంత మనియు దెలిసికొమ్ము.

యామిని

కోపగింపవలదు గురుదేవ, మీప్రియ
శిష్యురాలిమీద ! చెప్పవచ్చు—
తప్పకుండ దెత్తు "దమయంతి" కథ నేటి
సంజవేళ పాఠసదనమునకు.

( ఇరువురును లేతురు )

## ద్వితీయ రంగము

ఆరాత్రియే. సప్తావని ప్రాసాదములో బిల్హణ కవి మందిరము. కవి వాతాయనములో నుండి చంద్రబింబమును జూచుచు మృదు మధురముగా పాడును.

కవి

"మారనారాచ నిస్శాణశాణోపల మివోదితమ్
యామినీ కామినీ కర్ణకుండలం చంద్రమండలమ్"

( యామినీ దేవి మెల్లగా ప్రవేశించి తలుపు గడియ వేయును. ఆమెను క్రమముగా చూచి )

ఎవరు ? రాజకుమారియేనా !
ఈ నిశాసమయమ్మునం దిట
కరుగుదెంచితి వేల నమ్మా, యామినీ దేవీ !

యామిని

( అనునయముతో )

నేను పాలికతోడ మీగృహ
నికటమున జనుచుండ, యామిని
యనెడు శబ్దము చెవిని బడగా నరుగుదెంచితిని.

( మందహాసము చేయును )

కవి

అకళంకం బగు రాజపుత్రీ,
యామినీ యనగా విభావరి.
అల్లుచుంటిని పద్యములు నే యామినీవిభుపై.

యా మి ని

వెలుపలం జనుమండగా నను
విలోకించి స్మరించుచున్నా
రనెడి భావముతోడ లోనికి నడుగు పెట్టితిని.

క వి

చదువుచుంటిని నేడె యల్లిన
చంద్రవర్ణనరూప పద్యము
లన్య లున్నారని యెరుంగక అస్ఫుటశ్రుతిలో.

యా మి ని

శిష్యురాలిని అన్యగణమున
చేర్చినారే! శేషరచనను
కర్ణపేయము చేయవలయును కవిగురుప్రవరా!

( ప్రార్థనాపూర్వకముగా జూచును )

క వి

"ఇదం కుముదభేదనం, మదనమాంద్యవిచ్ఛేదనం,
వియత్తిమిరవారణం, విరహకామినీమారణమ్,
సముల్లసతి సుందరాదుదయకందరాద్దైందవం
పురందర దిగంగనా శ్రవణకుండలం మండలమ్."

యా మి ని

గురువులకు నెంతయును తరుణీ
కుండలమ్ములమీద కుతుకము.
కాన నస్మత్కుండలమ్ములు కైకొనుండు గురూ!

( కుండలములు తీయబోవును. కవి వారించును )

కవి

అంకం కేపి శశాంకిరే
జలనిధేః పంకం పరే మేనిరే
సారంగం కతిచిచ్చ సంజగదిరే
భూచ్ఛాయ మైచ్ఛన్ పరే
ఇందౌ యద్దలితేంద్రనీలశకల
శ్యామం దరీదృశ్యతే
తత్సాంద్రం నిశి పీత మంధతమసం
కుక్షిస్థ మాచక్ష్మహే.

యామిని

బహు చమత్కార ప్రదమ్ములు
పద్యములు నా పుస్తకమ్మున
వ్రాసి యిత్తుర? మరల పాడిన వ్రాసికొనుదానన్.

కవి

రాజపుత్రీ, నీవు దొరకని
రజనివేళయె? ప్రభాతమ్మున
వచ్చి పరనాలయమ్మున వ్రాసికొన వచ్చున్.

యామిని

నిజము కవివల్లభ, వచింతున
నేను మీసన్నిధికి వచ్చుట—

కవి

అలసింపక వెడలిపొమ్మా యామినీ దేవీ!

యా మి ని

యామినీవల్లభునిపై నే
వల్లు నూతన ముక్తకమ్ములు
గురువులకు వినిపింప వచ్చితి గూఢమార్గమునన్.

క వి

పద్యముల నాలింతు ముదమున
ప్రభాతమ్మున రాజపుత్రీ !

( ఆమె ముందరికి వచ్చును )

ఆలసింపక వెడలిపొమ్మా యామినీ దేవీ !

యా మి ని

క్రొత్తగా జెప్పినవి కావున
గురువువారికి విన్నవింపగ
వచ్చినట్టి మదీయ యత్నము వ్యర్థమై పోయెన్ !

క్రూల దోయుదు రేని కవితా
గురువులే యిటు మహోత్సాహము
నింకమీదను కవిత్వమ్మే నెట్లు చెప్పుదును !

క వి

చాలు జాలును, మంచిమాటలు !
సత్వరమ్ముగ జదివి రచనలు
ఆలసింపక వెడలిపొమ్మా యామినీదేవీ !

## యామిని

కూరుచుండగ అబల కానతి
గురువు లొసగరు : పద్యములు నే
కాళ్ళమీదను నిలిచి చదువంగలన గురుదేవా !

( అతడు నిషణ్ణకము చూపును )

ఎట్లు లుపవేశింప జాలుదు
నెదురుగా పీఠమ్ముమీదను
నిఖిలజగదారాధ్యు లొజ్జలు నిలిచి యుండంగన్ ?

(కవి పర్యంకముపై గూరుచుండును. ఆమె
దీపస్తంభము జరిపి నిషణ్ణకముపై నుపవేశించి)

ప్రాచీభాగే సరాగే, దరణి
విరహిణి, క్రాంతముద్రే సముద్రే,
నిద్రాలౌ నీరజాలౌ, ధృతముది
కుముదే, కోకలోకే సశోకే,
ఆకాశే సావకాశే, తమసి చ
శమితే, నిర్వికారే చకోరే,
కందర్పేఽనల్పదర్పే, వికిరతి
కిరణాన్ శర్వరీసార్వభౌమః.

స్వైరం కైరవకోరకాన్ విదలయన్,
యూనాం మనః ఖేలయన్,
అంభోజాని నిమీలయన్, మృగదృశాం
మానం సమున్మీలయన్,
జ్యోత్స్నాం కందలయన్, దిశో ధవలయన్,
అంభోధి ముద్వేలయన్,

కోకా నాకులయన్, తమః కబలయన్,
ఇందు స్సముజ్జృంభతే.
చంద్రమండల సురంగయా జగ
న్మందిరే మదనదస్యు రుత్థితః
మానవిత్త మపహర్తు ముద్యతా
మోహభస్మకలి కేవ కౌముదీ.

కవి

శయ్యా మంచిది, బిగువు కూర్పు
సరసకల్పన, చాల హర్షము !
పోదువా యిక రాజపుత్రీ, ప్రొద్దు పోయినది.

(యామిని నిశితముగా జూచి లేచును. కవి పర్యంకము నుండి లేచి, ఆమెను సాగనంపును. ఆమె నాలు గడుగులు నడిచి చప్పున వెనుకకు దిరుగును.)

యామిని

విద్ధకాఖ్యమ్మునకు లతికా
వేష్టితాఖ్యమ్మునకు భేదము
సూత్రమున కవివల్లభా, విస్ఫుటము చేయుదురా !

(కవికి పెదవులపై మందహాస మంకురించును. చంద్ర కాంతిలో అతని మెడలో నిహారము ధగధగలాడును. యామిని అప్రయత్నముగా ముందరికి బోయి కవిని తటాలున కౌగిలించి, ముద్దు పెట్టుకొనును.)

కవి

(గంభీరస్వరముతో)

రాజపుత్రిక, ప్రత్యుత్తరమ్ము రాక
పూర్వమే నీకు భేదమ్ము బోధపడియె.

చదువుచున్నదానవె రహస్యముగ నీవు
కామసూత్రమ్ము పెండిలి కాకమున్నె ?

యామిని

పరిణయానంతరము సూత్రపఠనఫలము
జ్ఞాతసమ్మోద చర్వితచర్వణమ్ము;
వామనాచార్యుడు కవిత్వవర్ధకముగ
తలచె వాత్స్యాయనీయ సూత్రముల గూడ.

కవి

నిబ్బరము లేనివారికి నిభృతమందు
ఇట్టి విషయమ్ము శైథిల్యహేతు వగును.
శిష్యురాలు భేదము గ్రహించినది కాన
శుభము వెడలుట అన్యులు చూడకుండ.

యామిని

పరు లెవరు లేరు కవివల్లభా, రహస్య
సరణి నరుదెంచినాను మీసవిధమునకు.

( ఉత్కంఠతో జూచి )

స్వీకరింపుడు మీ ప్రియశిష్యురాలి
నింక ప్రియురాలిగా గూడ శంక విడిచి.

( పునః పరిష్వంగము )

పలుకకున్నారు వల్లభా, భయము పుట్టు !
మిమ్ము మనసార నేను ప్రేమించినాను__
పఠనమందిరమందు ప్రప్రథమమందు
కనులు తనిసిన మంజులక్షణమువందె !

కవి

అంతమాత్రము తెలియలే దని తలంప
రాదు, ప్రతివాసరము మహారాజపుత్రి,
వలపు తలముక్క లగుట నీ వర్తనమున
గోచరించుచు నుండెను కొంతకొంత.

యామిని

నా రహస్యమ్ము గ్రహియించినారు కాని
ఒక్కనా డైన నుత్సాహ మొసగ లేదు.
మీరు జన్మించినారు కశ్మీరదేశ
మందు, తోణకరు తత్తుహినాద్రివోలె!

నేను దైనందిన విజృంభమాణ మైన
విమలరాగ సరోవరవీచికాళి
మునుగుచుం దేలుచున్ మహామోదమునను
నాథ, పొందుదు సన్ననిబాధ కూడ.

కవి

నిజమె రాజపుత్రి, నీ యాననమ్మున
నాకు గోచరించు నడుమ నడుమ
వింతబాధ — రేఖవిధముననో, కాక
విరళ మైన మంచుతెర తెరగునొ.

యామిని

(పెదవి విరిచి)

నా మనోవ్యథ గ్రహియించినను రవంత
జాలి మాపగ లే దొకసారి యైన!

కాన రాలేదు, వినుట యొక్కటె, కవీంద్ర
సరసహృదయాలు నవనీతసమము లనుట.

(కొంచెె మాగి)

బ్రాహ్మణులవాక్కు కేవల పరుష మంట
హృదయములు మాత్ర మెంతయు మృదువు లంట,
మధువు నధరమ్ము సేయు మీమాట లన్న-
నిజహృదయ మన్న వజ్రాతినిష్ఠురమ్ము !

కవి

స్త్రీలకుంబోలె హృదయాలు శిష్యురాల,
పైనమాత్రము కఠినము బ్రాహ్మణులకు.
అవనిసురకవి, ఆచార్యు డైనవాని
హృదయ మెట్లుండునో గ్రహియింపలేవో ?

యామిని

ఇప్పటికి నైన నన్ గరుణించి రాజ
పుత్రి యనియెడి కఠినసంబోధనమ్ము
మానితిరి : శిష్యురా లనుమాట వింటి—
ఇంక ప్రియురాల యను పిలు పెపుడు వచ్చు !

కవి

కేవలము గ్రంథపాళిలో క్రీడ సేయు
నైష్ఠికబ్రహ్మచారిగా నను దలంప
వలదు యామిని ! నే నవివాహితుండ
నయ్యు గ్రహియింప నేర్తు గాఢానురక్తి.

యా మి ని

స్వీకరింపుడు నన్ను జీవితేశా! యింక
ప్రణయబాధలు నేను పడలేను పడలేను!

(పాదములమీద వ్రాలి)

బిగియార కౌగింట ప్రీతి జేర్పక యున్న
ఈ దాహ మెటు లారు హృదయేశ, హృదయేశ

క వి

(ఆమెను లేవ నెత్తి అక్కున జేర్చుకొని)

యామినీ, యామినీ, ఆలసింపక పొమ్ము
ఆత్మీయ సౌధమున కన్యు లెరుగక మున్నె.
పూర్ణిమాజ్యోత్స్నలో పుట్టినట్టి వికార
మపనయించుట మేలు యామినీ, యామినీ!

యా మి ని

పాదాలు తడబడెను ప్రాణేశ, ప్రాణేశ!
ఒడిలోన గూర్చుండు నొక్క పర్యాయమ్ము.

(కవి నివణ్ణకముపై గూరుచుండును. యామిని
అతని యొడిలో జేరి చల్లని గొంతుతో)

మాటి మాటికి నన్ను మరలి పొమ్మందురే!
ప్రియురాల యని నన్ను పిలువరే నోరార!

(అతని కంఠమున బాహువులు పెనవేయును)

క వి

ప్రేమలే దనుకొకు ప్రియతమా, నీమీద.
అమృతలావణ్యాబ్ధి నవతరించిన లక్ష్మి,

విహాలోక సౌందర్య హేలా మహామూర్తి,
వేపూరుషుం డైన నీక్షించుమాత్రాన
అనురాగ వివశాత్ము డగుట నిస్సంశయము!
బహుజన్మకృత పుణ్య ఫలితమ్ముగా మదీ
యాదృష్ట దేవతా హారిరూపమ్ముతో
ఇపుడు న న్నేలగా నేతెంచు మధురిమవు!

యామిని

కవివరేణ్యుని పాద కమలముల్ సేవించి
అవ్యయానందంబు ననుభవింపగ వచ్చు
సామాన్య మానవశ్యామ ప్రాణేశ్వరా!

కవి

నీప్రేమ యామినీ, నిష్కల్మషం బౌను.
కావ్యలోకపు విదగ్ధత యదభ్రం బైన
అతిముగ్ధవే లోకయాత్రలో ప్రియతమా!
లోక మే మనునో ఆలోచింపు మొకమారు!
శిష్యురాలికి విద్య చెప్పుచున్ బ్రిల్లాణుడు
వలపు తల కెక్కించి వల వేసినాడె నను.

యామిని

శివ శివా! మీ రేమి చేసినారలు స్వామి!
గాఢరక్తిని స్వయంగ్రాహమ్ము చేసినది
యామినీ దేవియే యని దైవతము సాక్షి!

( కొంచెం మాగి )

వనిత తనయంత నే వచ్చుటం జేసిరయే
చూచుచున్నా రింత చులుకవగ కవివరా!

కవి

( ఆమె పాదములకడ మోకరిల్లి )

కాదు దేవీ, నన్ను క్షమియించు క్షమియించు !
అంతరంగమునందె యణచుకొనుచున్నాను
అనురాగవాహినిన్ యామినీ, యామినీ !

యామిని

( కవిని లేవదీసి, అతని యురముపై శిర ముంచి )

త్రికరణ విశుద్ధిగా దేవతాసాక్షిగా
భర్తగా మిమ్ము నే భావించుచున్నాను !
జనయిత్రితో జెప్పి సమ్మతింపగ జేతు
అక్రమమ్ముగ పెండ్లి కాదిలో ప్రాణేశ !
అవలన్ జనకుతో అచిరకాలములోనె
చెప్పింతు జనయిత్రిచేత వృత్తాంతమ్ము.
అస్మన్మనోరథం బనుసరించును తండ్రి,
వ్యతిరేకమార్గాన వర్తింప డెన్నండు.

కవి

చాల కున్నది మనఃస్థైర్యమ్ము ప్రియతమా !
లేదు నీధైర్యాన లేశ మైనను నాకు !

( చేయి త్రిప్పును )

యామిని

బ్రాహ్మణోత్తము లౌట ప్రాణేశ్వరా, మీకు
జంకు కలుగుచునుంట సహజమ్మె కదా !

( మందహాసముతో కవి ఆమెను ముద్దాడును )

గ్రహియించితిరో లేదో కాని మా పితరులకు
అధికాదరమ్ము మీయందు ప్రాణేశ్వరా !

కవి

వర్తమానస్థితిని వాస్తవమ్మే ప్రియా !
కాని నీ వరుడంచు గ్రహియింప నేమౌనో !
( యామిని కృత్రిమకోపముతో కవిని చూచి
పర్యంకము చేరి, ఆనుకొని నిలువబడును )

కవి

( అనునయ పూర్వకముగా )
ఇందీవరాక్షి, తవ తీక్ష్ణ కటాక్ష బాణ
పాతవ్రణే ద్వితయ మౌషధ మేత దేవ :
ఏకం త్వదీయ మధురాధరపాన మన్య
త్త్వత్తుంగపీనకుచ కుంకుమ పంకలేపః !
( ముందరి కడుగు వేయును )

యామిని

కవి రాజపుత్రికా కల్యాణ ఘటికలో
భగవానుడౌ క్షపా ప్రాణేశ్వరుడె సాక్షి !
( పరస్పరపాణిగ్రహణము. కవి వాతాయనము మూసి యామినిని సమీపించును. ఆమె విప్ఫారిన ముఖముతో ప్రియు నొకసారి వీక్షించి, సిగ్గున శిరము వంచుకొనును )

కవి

నేదం ముఖం మృగవిముక్తశశాంక బింబమ్
(ఆమె వదనమును పయి కెత్తును)

నేమా స్తనా వమృత పూరిత హేమకుంభౌ

(కౌగిలించుకొనును)

సై వాలకావలి రియం, మదనాస్త్రశాలా

(అలకలు సవరించును)

సై వేద ముక్తియుగలం నిగలం హి యూనామ్ !

(ముద్దు పెట్టుకొనును. యామినిని మనో
హారముగా పర్యంకముమీద వ్రాలును)

# తృతీయ రంగము

తరువాత రెండవనాడు సాయంకాలము పాఠశాలా భవనమున కవి యిటు నటు తిరుగుచుండును.

కవి

అద్యాఽపి తాం ప్రథమ సంగమ జాతలజ్జాం
నిధ్యాయతి వ్యతికరే మయి మందధీరమ్
సీత్కారకంపిత శిఖాతరలప్రదీప్త
కర్ణోత్పలేన లసతీం సుదతీం స్మరామి !

యామిని

(వెనుకనుండి ప్రవేశించి)

సుదతి నెవ్వతెనో మహాసుందరాంగి
నర్ధమీలిత నయనులై అస్ఫుటాక్ష
రముల జపియించుచున్నవారలు మదీయ
జీవితేశులు ! పే రేమొ చెప్పగలర !

కవి

(మందహాసముతో)

నేను స్మరియించుచున్నాను నిరుపమాన
విమల లావణ్యదేవతా విగ్రహమును.
వెలువడును వసంతతిలక వృత్తమామె
మధుర నామమ్ము తలచిన మాత్రముననె !

ఆమహామాన్య నామధేయాక్షరములు
దేవతాత్రయ మట్లు దేదీప్యమాన

మాలు, మదీయేక్షణోత్సవమ్ములు లతాంగి !
రజని, కాశబ్ద మగును పర్యాయపదము.

(యామిని అతనిని కౌగిలించుకొనును)

నాకు జూపగ నరుదెంచినావె తొలుత
ప్రియతమా, నేటిగోష్ఠిలో పెద్దలకడ
నీవు పఠియింప దలచిన నిజరచనల:
ఏమి లిఖియించినావో యీక్షింపనిమ్ము.

(చేయి చాపును)

**యామిని**

లోపములు లేవు పద్యాలలో త్వదీయ
కరుణచే జీవితేశ్వరా, కాని నాకు___
తలుచుకొన్నంతమాత్ర—సాధ్వసము కలుగు
చదువలే నేమొ యని గురుజనులమ్రోల.

**కవి**

కలుగుచున్నది యించుక కంప మెడద
లోన ప్రాణప్రియా, గోష్ఠిలోన నీవు
సక్రమమ్ముగ తుదిదాక చదువగలవో,
పద్యముల, నెచ్చటే నట్టుపడుదు వేమొ.

మరియు నింకొక భీతి: ఏమాత్ర మైన
వర్ణనల గాని హావభావముల గాని
జీవితేశ్వరి, అనురాగచిహ్నదీప్తి
పొడమగూడదు సుమి బుద్ధిపూర్వకముగ.

యామిని

నాకు దెలియును గా మనోనాథ, యిట్టి
సమయముల జాగరూకత సముచిత మని.
కాని యెడనెడ మీ విలోకనముతోడ
శిష్యురాలికి నుత్సాహసిద్ధి యగును.

(అతనిని కౌగిలించుకొని)

ఆస్మదాచార్యునకు జయం బగును గాక!
ఆత్మవల్లభునకు శుభం బగును గాక!

కవి

(ఆమె శిరస్సు మూర్కొని, వీపు తట్టి)

శిష్యురాలికి శుభజయ సిద్ధి రస్తు!
ప్రాణకాంతకు మంగళప్రాప్తి రస్తు!

(యథాస్థానముల గూరుచుందురు. తరువాత కేరళిక ప్రవేశించును. అనంతరము రాజు, అమాత్యుడు, గురువు, కోటిపాల ప్రముఖులు ప్రవేశింపగా ఉచిత మర్యాదలు నడచును)

రాజు

కుశల మానె కవిత్వగురువుల ? కిచట
శ్రమ మేమియును లేక సక్రమమ్ముగానె
సకలోపచారముల్ జరుగుచున్నవియో ?

కవి

స్వస్త్యస్తు ! చిత్తము ! జగదధీశ్వరుల
కరుణాకటాక్ష వీక్షా ప్రసారమున
సర్వ మిచ్చో మాకు సౌఖ్య ప్రదమ్మై.

రాజ గురువు

ప్రకృతమ్ము బిల్హణభట్ట కవీశ,
పఠియించు నేసర్గబంధమ్ము బిడ్డ ?
పారనమ్మున భవత్ప్రద్ధతి యేమి ?

కవి

శ్రీ త్రివిక్రమ భట్ట శేఖర రచిత
మా నలచంపువు యామినీ దేవి
గురుదేవ, ఒక్కింత తిరుగవేసినది.

గురువులకడ మున్నె కూలంకషముగ
గద్య, రూపక, పద్యకావ్య భాగములు
చదివియుండుట జేసి సారస్యములనె
విశదీకరింతును వివిధఘట్టముల.

అది కాక, నృపుని యాజ్ఞానుసారముగ
కవితాభివృద్ధికి కారణం బైన
సరసశిక్షా నవ్యసరణిపై దృష్టి.

రాజు

పాడుదువా తల్లి, భవదీయ నూత్న
ఖండకావ్యము మాకు కర్ణోత్సవముగ !

## యామిని

(కవిని జూచి, గొంతు సవరించుకొని)

"విదిత కాశ్మీరదేశాన వెలయుచుండు
అగ్రహారమ్ము ఖోనముఖాభిధమ్ము.

భ్రమయు నచటి యూపస్తంభపటలి గాంచి
కట్టునాలానవితతిగా కలిగజమ్ము.
హిమగిరి క్రోడమం దున్నయిందు పండు
కుంకుమమ్మును పాండుర గోస్తనియును.

పిలువ నంపె గోపాదిత్య పృథ్వినేత
మధ్యదేశమునుండి బ్రాహ్మణుల మున్ను
కౌశికసగోత్రజాత జగత్పవిత్ర
చరితులందు విరాజిల్లు శాఖ యొకటి
మూలపురుషుడుగా భట్ట ముక్తికలశు :
డతడు ధరియించినాడు నిజాస్యమందు
కమలసూతి పరస్పర కలహభీతి
నాల్గుమోముల నిలిపిన నాల్గు శ్రుతుల!

తత్సుతుడు రాజకలశుండు ధార్మికుండు,
అధికవీరుండు, దాత, వేదాంతవేత్త.
తుహిన నగగుహా తన్మఖధూమపటలి
విడుచు తిమిరచ్ఛలాన ఇప్పుడును గూడ.

ద్రాక్షలత లల్లుకొన్న యారామవాటు
లమలసలిలమ్ములైన కూపాంతికములు
ఉపవనులు పానశాల లాయుత్తమునకు
విడుదు లగుచుండు వ్యాఖ్యానవేళలందు.

అఖిలవిద్యలలో తదీయాత్మజుండు
జ్యేష్ఠకలశుండు మిన్నయై వెలగినాడు.
ప్రాంగణమ్మున తన్మహా భావ్యవృత్తి
చదువువిద్యార్థిసంఘంబు సందడించు.

శ్రుతినిధాన క్షమాసార శుద్ధమూర్తి
కతిథి సంతర్పణమ్మున అఖిల కార్య
యోజనమ్మున ప్రాపుగా ఉత్తమగుణ
భరితకీర్తి నాగాదేవి భార్య యయ్యె.

( గొంతు సవరించుకొని, కొంచెమాగి,
పుస్తకము కేరళికచేతి కిచ్చును. )

కే ర ళి క

( ఉత్సాహముతో )

ప్రథమసుతు డిష్ట రాముండు బహునృపాల
సభల లీలావతంసుండు: సకల సుకవి
జనని భారతి తద్వక్త్రమున వసించి
కానవచ్చె ప్రపా పాలికా విధాన.

వారి కడగొట్టుసుతుడు దుర్వాదిసుకవి
భూరిమదభేది లీలావతారమూర్తి.
అట్టి అనందు మృదురసనాంచలమ్ము
జేరె సంత్యక్తపర్వత శారదాంబ.

తప్తకాంచనరుచుల గాత్రమ్ముతోడ
నేత్రపర్వమ్ముగా బుట్టె నిఖిలలోక
శేఖరుండు కుమారుడు జ్యేష్ఠకలశ
మాన్యునకు నాగమాంబకు మధ్యముండు.

బిల్హణుని యాననమ్మున ప్రీతితోడ
నిలిచినది మౌంజి గట్టిన నిముసమందె
సాంద్రవేదధ్వనులలోన చాటువడగ
శ్రీసరస్వతి స్వీయమంజీరరవము.

( హర్ష ధ్వనులు )

సాంగముగ వేదమును, పతంజలి మహర్షి
కృత మహాభాష్య యుతము వ్యాకృతి నతండు
శ్రద్ధతో నభ్యసించెను; శ్రవణసుభగ
మైన సాహిత్యవిద్య ప్రాణాస్పదంబు.

సుకవిచంద్రుని విమల ధీముకురమందు
ప్రమదమున సర్వవిద్యలు ప్రతిఫలించె.
కరుణ వహియించి వాగ్దేవి కర్ణపూర
సుమరజమ్మును చల్లె నానూరిమీద.

తనముఖమ్ము వీక్షించు విద్యావధూటి
చక్రమును స్వీకరించిన చతురు డతడు.
తత్కవిత్వము కీర్తి కాంతా ప్రయాణ
సరణిలో సౌవిదల్లులచాయ నరిగె."

రాజ గురువు

మేలు మేలు ! కుమారి నీయది
మృదుమనోహరరీతి! ఎడనెడ
కానవచ్చును రచనలో నవకల్పనలు తల్లీ !

అ మా త్యు డు

వల్లువాక్కున సాగినది గురు
వంశవర్ణన ఖండకృతిలో,
విమల కవితా లక్షణమ్ములు వెలయు ప్రస్ఫుటమై.

కో టి పా లు డు

భర్తృదారిక నిజగురూత్తమ
భక్తిభరితార్ద్రాంతరంగము
తోడ పద్యము లల్లె ననియే తోచు గురుదేవా!

రా జు

ఆర్యులారా, శ్రీకుమారీ
యామినీరచనా ప్రణాళిక
గానవచ్చును నాకు నుత్తమ కావ్యచిహ్నములు.

బిడ్డ కవనము చెప్ప గలిగెను
బిల్హణార్యుని ప్రసాదమ్మున!
మాన్యకాశ్మీరక కవీంద్రుడు మాకు వంద్యుండు.

క వి

నేను ధన్యుడ నైతి దేవా,
నిజముగా శ్రీమత్కుమారికి
అంతరంగములోన సుకవిత్వాంకురము కలదు.

నేను వనపాలకునిరీతిని
నిత్య సముచిత దోహదమ్ముల
రవులు కొలిపితి : ప్రతిభ మాత్రము రాజపుత్రికదే.

## కోటిపాలుడు

పడయు వికటనితంబ పోలిక
ఫల్గుహాస్తిని శ్రీ సుభద్రల
చాడ్పునన్, ప్రభుదేవిరీతిని, జఘనచపల వలెన్-
ఇందురేఖ, అవంతి సుందరి
చందమున శ్రీ రాజపుత్రిక
సుందరం బగుపదవి కవితామందిరాన ప్రభూ !

## అమాత్యుడు

స్త్రీలు వైదికభాషలో మును
చెప్పియున్నా రెన్నొ బుక్కులు,
పాడి రెన్నో థేరీగాథలు పాలిభారతిలో.
ప్రాకృతమ్మున గాథ లెన్నో
పలికినారలు, దేవవాణిని
ప్రతిభమై విరచించి రెన్నియొ పద్యరత్నములన్.
కాని యెవ్వరు సుదీర్ఘం బగు
కావ్య మల్లినవారు నేటికి
కానబడకున్నారు దేవా, కారణం బేమో !

## రాజు

గురుకటాక్షముచే సుభాషిత
కోశమున జీవించుగాథలె
కాక, యామిని చేయు గావుత కావ్యబంధములన్ !

రాజ గురువు

క్రొత్తపద్యము లేవియైనను
గురుకవీశా, జ్ఞప్తి యున్నను
శ్రవణపేయము చేయగలరా శ్రమము వహియించి?

కవి

"కశ్మీరదేశాన కలదు పురాతన
ప్రఖ్యాత మైనట్టి ప్రవరపురము.
ఇచ్చుచుండును సాక్ష్య మిందుమౌళి ప్రీతి
గ్రహించినవిధాన గౌరిపాణి.
స్వైరధావత్కలి స్తంబేరమాంకుశా
కారంబు లౌ తరంగములతోడ
తనరారుచున్న వితస్తాతరంగిణి
పురసమీపమ్ముగా నొరసియుండు.
తత్పురీవిప్ర శాపసంత్రాస మొంది
తొలగి చనె పుష్పకము తోడ దూరముగనె
దర్పమున మున్ను కైలాస ధరణిధరము
హస్తముల నూపినట్టి దశాననుండు.
తత్పురీసౌధవాతాయనమ్ములయందు
వ్యాఖ్యానకారవిద్వాంసులపయి
కుసుమవర్షం బేల కురియరో దేవతల్
వెరగందు నని కాక విబుధగురుడు!
వాగ్దేవి ఆత్మీయ వాహన హంసిని
మధుమతీ సైకతమధ్యమందు
విహరణోత్సుక వృత్తి విడిచి విద్యారక్ష
చేయుచుండును బుధశ్రేణి కచట.

సంస్కృత ప్రాకృతమ్ముల జన్మభాష
రీతి భాషింపగలదు నారీజనమ్ము
అమృతనిష్యంది పటురసనాద్భుతకవి
శేఖరావాసమైన కాశ్మీరమందు.

పాలసంద్రంబులో ప్రభవించునమృతంబు
    చెదరి కవీంద్రులజిహ్వలందు
ద్రాక్షఖండములందు తరుణీమనోహర
    వీక్షణమ్ములయందు విశ్రమించె.
కడుపారగా గ్రోలి ఖరకరుండు నిదాఘ
    కాలమ్మునందు ద్రాక్షారసమ్ము
ధరియించు మాణిక్యకిరణకళికాకోమ
    లాంశుమాలిక తాప మడగుకతన.

వాపికాహీన నిష్కుటవాటి గాని
కేళిదీర్ఘికలన్ జలక్రీడ లేని
సుందరులు గాని వారల చూపుగముల
కట్టువడిపోని యువకులు గాని లేరు.

తీరయుగ్మస్థ మహా భూరిసౌధమ్ముల
    జాలకమ్ములయందు స్వైరలీల
మీరి యుండెడి యువమిథునహారమ్ములు
    తెగి పడుచుండగా తెలియకుండ
తనవిశాలోత్సంగతలముపై, నిండుగా
    జాలువారును వితస్తా ప్రవంతి
నక్షత్రతిలకిత నభముతో గూడిన
    మందాకినీనది చందమునను.

స్నానవేళ నితంబినీ స్తనతటాల
కుంకుమ మ్ముంకమున బూసికొనుటె కాక
ఈర్ష్య నేమో యనంగ తదీయనీల
చికురముల లాగుచుండు వీచీకరాల.

ఘుసృణచర్చోచ్ఛ్రిష్ట మౌ కుచ మండలమ్ములు
కస్తూరికా సాంద్రగంధిలములు
రాంకవ పట్టముల్, రమణీయ నౌపృష్ఠ
నిర్మితజలకేళి నిలయములును
ప్రచుర నాకసుఖమ్ము పచరించు శిశిరర్తు
కాలమ్మునందును కాముకులకు,
కాశ్మీరకామినీ గణ మనోహారిణీ
కదళికాకోమల గాత్రములును,
హిమశకలపాళి పిహితవక్త్రములు గలుగు
నీరభాండమ్ములును, గోస్తనీ కుడుంగ
జాలములు భూరితాపోపశమన మొసగు
భీష్మరూపమ్ము దాల్చిన గ్రీష్మవేళ."

## రాజ గురువు

చాలకాలమ్మునకు వింటిమి
సరస మైన కవిత్వ మార్యా,
నిజముగా మీభూమి శారదనిలయ మగును గదా !

## అ మా త్యు డు

సత్యమే గురుదేవ ! అచ్చట
శారదా పీఠమ్మువలనని
అఖిల విద్యలు నాట్య మాడుట అబ్బురము కాదు.

కోటిపాలుడు

అచటి యాలంకారికోత్తము
లచటి వైయాకరణు లచ్చటి
దేవభాషాకవులు వేరొకదేశమున గలరా ?

రాజు

అఖిలవిప్రులు శివారాధకు
లగుటచే కాశ్మీర భూమిని
సంస్కృతమ్మున జేయ జాలిరి సద్గ్రంథములన్.

కోటిపాలుడు

అవనిసురులే కాక దేశ
మ్మంతయును శివదీక్ష దాల్చిన
దవయవమ్ముల తుహినభస్మం బలదుకొని దేవా !

రాజగురువు

ప్రబలియున్నా రచట దేవా,
పరమ మాహేశ్వరాచార్యులు
స్పంద మార్గ ప్రత్యభిజ్ఞా శాస్త్రసంచారుల్.

రాజు

మధుర మైనది మీకవిత్వము !
మహాకావ్యము నేటివరకును
బిల్హణార్యా, యేమిటికి తలపెట్టకున్నారు ?

కవి

మహోత్సాహ మ్మయిన గానీ
మహాదుఃఖ మ్మయిన గానీ
కలుగ కుండినయెడల నుత్తమకావ్య మెటు పుట్టున్?

నాకు కోరిక యిపుడు దేవా,
నాటికను రచియింప, దేవర
యనుగ్రహమున దీర్ఘ కావ్యం బవల నల్లెదను.

రాజు

భట్ట బిల్హణ కవిని విద్యా
పతిని జేసినవార మియ్యెడ :
ఎల్ల రామోదింతు రనియే యెంతు గురుదేవా !

( కంఠములోని హారమూ తీయఁబోయి కోటిపాలునివంక సాభిప్రాయముగా జూచును. అతడు నిష్క్రమించును )

రాజగురువు

సత్కవీంద్రుడే కాక శాస్త్ర
జ్ఞానవంతుడు రాజవిద్యా
పతిగ నుండుట సర్వవిధముల భావ్యమే దేవా !

అమాత్యుడు

మీరు ప్రోగం గలదు కవితా
మధురనాదముతోడ నస్త
ప్రా ప్త మెల్లెడ నింక నీకవిరాజుచే దేవా !

( ఇంతలో కోటిపాలుడు దంతపేటిక తెచ్చి రాజు సన్నిధిలో నుంచును. అందులోని రత్నహారమును బయటికి దీసి కదలించుచు )

రాజు

బిల్హణార్యా, పదవి శుష్క
ప్రియముగా నొసగంగ రా, దీ
రత్నహారము భవద్గళమున రంజిలుం గాతన్ !

( హర్షధ్వనులు. రాజు కొంచె మాలోచించి హారము యామినీ దేవి చేతి కిచ్చి )

నీవె కవితాగురుని గళమున
నిలుపు మీ హారంబు, మరి నీ
పేరు నిలుచుత శాశ్వతముగా బిల్హణార్యునిచే !

( కవి శిరస్సు వంచును. యామిని గంభీరవదనముతో హారమును కవి కంఠమున మెల్లగా నుంచును. )

## చతుర్థ రంగము

బిల్హణుని మందిరములో సుసజ్జిత మైన గదిలో. సాయంకాలము. కవి చందనచర్చ చేసికొనుచు యామినీ దేవి పటమువంక చూచుచుండును.

కవి

అద్యాఽపి తాం రహసి దర్పణవీక్ష్యమాణ
సంక్రాంత మత్ప్రతినిధిం మయి పృష్ఠలగ్నే
పశ్యామి వేపథుమతీం చ ససంభ్రమాం చ
లజ్జాకులాం చ సముదంచిత మన్మథాం చ.

( వెనుకనుండి యామిని ప్రవేశించి వ్రేలాడుచున్న కాండపటము చాటున నిలిచి కిలకిల నవ్వును. అతడు కాండపటాభిముఖు డగుచు మెల్లగా )

నాకలోకమునందుండి నన్ను గాంచి
యువతి యెవ్వతెయో నవ్వుచుండ నోపు;
చిత్రగత యైన మత్ప్రేయసీ ముఖమ్మె
జీవములు దాల్చి వేడ్క హాసింప నోపు.

( యామిని వెనుకనుండి తెర కొంచెము కొంచెముగా దింపుచుండగా కవి ఒక్కొక్క పంక్తి పాడుచుండును )

"కి మిందుః ! కిం పద్మం !
కిము ముకురబింబం కిము ముఖం !
కి మబ్జే ! కిం మీనౌ ! కిము
మదనబాణౌ ! కిము దృశౌ !

ఖగో వా ! గుచ్ఛో వా !
కనకకలశో వా ! కిము కుచౌ !
తటి ద్వా ! తారా వా !
కనక లతికా వా ! కి మబలా !"

(కాండపటము క్రింద బడవేసి పరుగున బోయి యామిని కవిగాఢాలింగనమున నిమిడిపోవును)

"ముఖరవలయజాలో మోదితాశేషగాత్రః
పులకముకులసాంద్రో బోధితానంగతంద్రః
పర మురసి నిమగ్నస్ఫారవక్షోజకుంభ
స్సుఖయతు సుముఖీనాం దోర్లతాగాఢబంధః"

యామిని

ఎంత మధురమ్ము నాహృదయేశ్వ రార్ద్రి
చందనాగురు ఘనసార సాంద్రలిప్త
పీనవక్షో మనోహర పీఠభాగ
సంగతోద్రిక్త దృఢ భుజాలింగనమ్ము !

(ఉల్లాసముతో)

మందహాసము మోమున మలయుచుండ
అర్ధమీలితనేత్రాల నమృతమధుర
కంఠమున పాడుచుంటిరి గాథ లేవొ
ఈషదవ్యక్తఫణితిని హృదయనాథ !

(కవాటము బంధించి వచ్చి, ఆమెను నివద్యపై గూరుచుండ బెట్టి, బుజములపై చేతు లుంచి, చిరునగవుతో)

**కవి**

తలచుకొనుచుండ నా యిష్టదైవతమును
నిండుహృదయాంబుజాతంబునుండి వెడలి
అప్రయత్నమ్ముగా దేవి, హర్షవాక్కు
పద్య రూపమ్ము నొందినభంగి దోచు.

(ఆమె చేతు లందింపగా కన్నుల కద్దుకొని)

మామకోపాస్యదేవతా మధురమూర్తి
నిండు కొలు వుండగా మనఃపుండరీక
పీఠమున, రాత్రి పవ లను భేద మెడలి
పారవశ్యమ్ము నిబిడమై ప్రజ్వరిల్లు.

కాని ప్రత్యక్షదేవత యైన యామి
నీమహాదేవి యెపుడు సన్నిహిత యగునొ—
అంకమున గాని క్రోడమ్మునందు గాని—
అపుడు సశరీర నాకసౌఖ్యమ్ము సుమ్ము!

(ఆలింగనము)

అంత కంతకు దుస్సహమ్మగుచు నున్న
దర్థఘటికావియోగమ్మె యైన గాని:
గతవిభావరి పూర్ణజాగరణమునకు
శర్వరీ సార్వభౌముండె సాక్షి దేవి!

**యామిని**

(లేచి ప్రియునినేత్రములు ముద్దు పెట్టుకొని)

పాప! మెంత బాధ పడినారొ ప్రాణేశ,
రజని నిండుజాగరమ్ము చేసి!

పంపజాల నైతి పాలికాసఖి నైన
వేరుదూతి నైన విశ్వసించి.

కవి

నీ శయనమందిరమ్ములోనికి రహస్య
మార్గమున నేను సాహసోన్నత్తుడ నయి
రా బ్రయత్నించియును త్రివారము, త్వదీయ
వినయభంగ భయమ్మున వెను దిరిగితి.

యామిని

మీరు రాక యుంటె మే లయ్యె ప్రాణేశ,
శూన్యమందిరమ్ము జూచువారె
ఒక్క వేళ సాహసోన్నతు లయి యెట్లొ
వచ్చునెడల పట్టువడకయుండ.

(ఉల్లాసముతో)

చాల సరసవార్త, చల్లని శుభవార్త
మిగుల మధురవార్త, మేలివార్త
చెప్పునెడల మీకు జీవితేశా, నాకు
పసదనమ్ము నేమి యొసగువారు?

కవి

నే నొసంగకుండ నిస్సంశయమ్ముగా
నీవె సంగ్రహింపనేర్తువు గద!......
మనవివాహమునకు జననియు జనకుండు
సమ్మతించినారె సంతసమున?

(ఉత్కంఠతో జూచును)

యా మి ని

చేయుచున్నను మహాయత్నము
జీవితేశా, అహారహమ్మును
గతవిభావరివరకు ధైర్యము కలుగలే దాయె !

వర్తనమ్మున నేదియో పరి
వర్తనమ్మును గాంచి యుండగ
నోపు, జనని వివాహగోష్ఠికి ఉద్యమించినది.

వలదు పాణిగ్రహణ మనియును
వాంఛయే లే దనియు, కవితా
వ్యసన మొక్కటె హేతు వనియును వల్లభా, అంటిన్.

ఆరు మాసములందు గడచిన
వయిదు నెల, లిక నొక్క మాసమె
నీ యుపాధ్యాయుండు బిడ్డా, నిలుచు నిచట ననెన్.

అభ్యసింపగ వలసినట్టిది
అనంతమ్ముగ నుండుకతమున
పంపు మెటు కాశ్మీరవిద్యాభట్టగురు నంటిన్.

పెండ్లియైనను నీకు విద్యా
ప్రీతి తరుగనియెడల బిడ్డా,
చదువవచ్చును రాజగురువుల సన్నిధానమున—

అన్న తల్లిని గాంచి పలికితి
అనునయమ్మున జీవితేశా,
భిల్హణార్యులు కాక అన్యులపేరు విన వొల్లన్.

వీలుపడ దిక విద్యార్థులు
వెడలిపోవుట నిర్ణయమ్మే :
ఎల్లకాలము ప్రవాసంబే యెట్లు సుఖద మానెన్.

భరతఖండం బేకదేశము,
ప్రవాస మ్మనుమాట చెల్లదు.
కష్ట మేమియు కలుగ దైనను కవికి మనయింట.

ఎంతకాలం బయిన గానీ
యిచటనే కాశ్మీరకార్యం
డుండి విద్యలు నాకు జెప్పుచు నుండు జనయిత్రీ !

నిక్కవముగా తత్త్వవేత్తని
నికటమున పాఠమ్ము చదువని
నాడు తల్లీ, తోచ దంటిని నాథ, ధైర్యమునన్.

"నీకు విద్యాగురువుమీదను
నిండు గౌరవ ముండబోలును.
అయిన నింతటి వెర్రి బిడ్డా, అనుచితమ్ము సుమా !"

"కవివరుం డుత్తముడు కాడా ?
గౌరవార్హత లేనివాడా ?
విశ్వసింపం దగనివాడా ? విశ్రుతుడు కాడా ?"

"అవును బిడ్డా, అన్నిసుగుణము
లమరియుండెడివాడె; నాకును
విద్యార్థ్యం డన్న నెంతయు ప్రీతి కలదు సుమీ !"

"దాప నేమిటి కింక తల్లీ,
తథ్యమే వచియించుదానను
కవివరేణ్యుం డన్న నాకున్ గాఢరాగమ్ము !

ఆ మనోహరమూర్తి గాంచిన
దాది ఏకాగ్రముగ నందే
విమల మైన మదీయహృదయము విశ్రమించినది !
ఇంత యేటికి? అమృతధాముడు,
హృదయనాథుడు, కవివతంసుడు,
బిల్హణార్యుని గాక యన్యుని పెండ్లియాడ జామీ!"

(అతని ముఖము వికసించును)

అన్నమాటల నాలకించుచు
అక్కజంపడి, మెల్ల మెల్లన
జనని చివరకు వివాహమునకు సమ్మతించినది.

కవి

నా ప్రేయసీబుద్ధినైపుణ్యమునకు
అల బృహస్పతికూడ అక్కజం పడును.
ఆనందవివశాత్ము డయ్యె నీతండు-
ప్రాణప్రియా, యిదే పారితోషికము !

(చిరునగవుతో బాహువులు చాచును. ఆమె దగ్గరకు రాక, కవిని స్తంభము చుట్టును మూడుమారులు త్రిప్పి చివరకు అతనికి పట్టువడి గాఢాలింగనమున నిమిడి కన్నులు మూసికొనును)

ఏల రా వైతివో యీ శుభవార
చెవి వేయ రేయియే జీవనదాత్రి !
పరనాలయమ్మున ప్రాణహమ్మునందు
భవదీయ దర్శన భాగ్యమే లేదు !

యామిని

కూర్మముపోలిక కొంచె కొంచెముగ
మందంపునడకతో మంగళవార్త—
ఔత్సుక్య మెంతయు నతిశయింపగ—
కర్ణజాహము చేరుగద మనోనాథ !

వృత్తాంత మంతయు విన్న మాతల్లి
నిజసన్నిధానాన నిలిపెను నన్ను.
అచటనే పన్నుంటి అంతరంగమున
బహువిధమ్ముల మిమ్ము భావించికొనుచు.

పుస్తకమ్మును జూడ బుద్ధియే లేదు !
ఆగమనమ్మున కవకాశ మేది ?
ఇపుడైన హృదయేశ, యెట్లొ తప్పించు
కొని వచ్చియున్నాను గూఢమార్గమున !

(ఉత్సాహముతో నాట్యము చేయును)

వేరొక తీయని వృత్తాంతమ్మును
ఎరుక పరచుచో నేమి బహుమాకృతి ?

కవి

మధురోదంతము మధురబహూకృతి
బడయం జాలుట ప్రణయిని, ధ్రువమే.

యామిని

( నాట్యము చేయును )

జనకులు వేగమె సమ్మతించు నటు
చేయుదు ననియే చెప్పెను మాతయె.

మాతాపితరులు మంగళవిషయమె
చర్చించెద రీ క్షణమున నాథా !

దయతో జనకులు తమ యంగీకృతి
ఈనిముసముననె ఈయగవచ్చును.
అగుచో శుభమే అతిశీఘ్రముగ
నాథా, ఆహ్వానము చనుదెంచును.

కవి

చక్రము త్రిప్పం జాలిన యామిని
స్వామిని కా దని సంకోచింపను !

యామిని

యామిని స్వామిని అగుచో నిజముగ
తొలుతనె నాథుడు ధ్రువముగ రా జగు !

( నాట్యము చేయుచు వచ్చి నాథునియంకముపై
గూరుచుండి, భుజలతలు మెడకు పెనవేయును )

కవి

కవిని కవిరాజు జేసెడి కమ్రమూర్తి,
సరసభంగిని గురుశిష్యసంప్రదాయ
బంధపరిత్యజనక్రియా ప్రవణమూర్తి,
ప్రణయజీవి కవిప్రియా ప్రథమమూర్తి—

యామిని

అగ్రతాంబూల మిత్తురా అన్నిటికిని
శిష్యురాలిక ప్రేమతో జీవితేశ !

సత్యముగ నీ వినూతన సంప్రదాయ
మందు వాసవదత్తయే అగ్రగణ్య!

**కవి**

కాని వాసవ గాంధర్వకళ గ్రహించు
వేళ వత్సేశగురునిచే విజిత యయ్యె;
కాని మా రాజపుత్రికి కామకళను
దేశికుం డోడిపోయి స్వాధీను డయ్యె!

**యామిని**

అవును హృదయేశ, మీ ప్రియురాలిజయము
వెఱ్ఱివా డెవ్వడేనియు విజయ మనును.
నిలుగులం బెట్టి కవిగంధసింధురంబు
నిలిచె నెట్టెట్లొ ఆలాన నికటమందు.

**కవి**

కవులు గంధద్విపమ్ములే కాని తుదకు
ప్రేయసీపాదయుగళి స్తంబేరమములె.
పడుచుహృదయాల కంకుశప్రాయ మగును
ప్రణయినీ రమ్య వీక్షణ బాణ వితతి!

**యామిని**

రాగరసమున జయము పరాజయమ్ము
హృదయనాయక, నిజముగా నే నెఱుంగ.

**కవి**

ఊర్వ్రతోత్పాటితండు నీయూరముమీద
నర్తనము చేయుచుండెడి నాయకమణి.

(ఆమె హారము తీసి ప్రియుని మెడలో వేయును)

ఒరులరాగమ్మునకు వృద్ధి యుండనోపు,
ఏ సెరుంగను సక్రమవృద్ధి మాట.
నిన్ను మనసార గాంచిన నిముసమందు
ఎంత యనురాగమో నాకు, నిపుడు నంతె.

యా మి ని

వత్సరాజ ప్రియా కథా వర్ణనమ్ము
చేసినా రెందరో కవిశ్రేష్ఠులు మును.

క వి

మదనభూపాల పుత్రికా మధురగాథ
కావ్యములు చేయుదురు మహాకవులు ముందు.

యా మి ని

అవనిపతి పుత్రికా నామ మైనగాని
కలిసిపోవును విస్మృతిగర్భమందు.
కాని అక్షయ్య మగు నాథ, కనకవర్ణ
రంజితంబు కవిప్రియా రమ్యగాథ.

క వి

నిజమె హృదయేశ్వరీ, కాని నిన్ను బోలు
సకలలలితకలాభిజ్ఞ సంఘటిల్లి
చేయకుండిన అనురాగసేచనమ్ము
మొదలె సుకవిత్వబీజమ్ము మొలక రాదు.

(ఆమెకౌగిట నిమిడి, అర్ధనిమీలిత నేత్రుడై)

సంభవించు ప్రాణేశ్వరీ, జన్మజన్మ
పుణ్యపుంజమ్ము పండినపూరుషునకు

నిజమనోహారిణీ మహానిబిడబాహు
మధురబంధమ్ములోపల మరణసుఖము!

( యామిని అతనినోటిపై హస్త ముంచును.
ద్వారము వెలుపల నుండి కంఠధ్వని)

ఆర్య, ఒక్కసారి అర్గళోన్మోచన
మాచరింతు రేని అరుగుదెంతు.

( కవి తలుపు తీయగా కోటిపాలుడు
యామినిని జూచి వెనుక కడుగు వేయును )

యా మి ని

పరులు కారు కోటిపాలాగ్రణీ, గృహా
భ్యంతరమ్ములోని కరుగుదెండు.

కో టి పా లు డు

(లోనికి వచ్చి, కవికి నమస్కారము చేసి)

గురువరేణ్య, ఒక్క గూఢ వృత్తాంతంబు—
విభునియాజ్ఞ : మీకు విన్నవింతు.
ఏగుదెంతు రేని ఏకాంతభూమికి
కలతెరంగు మీకు దెలుపనేర్తు.

యా మి ని

చెప్పవచ్చు : నాకు జీవితేశ్వరునకు
చాటుమాటు లేదు కోటిపాల!

కోటిపాలుడు

(జాలిగా జూచి)

రాజపుత్రి, నాకు రాజాజ్ఞ యైనది
గురుని వెంట బెట్టుకొని చనంగ.

(కవివైపు చూచును)

యామిని

(ఉల్లాసముతో)

మంగళమ్ము ! మీరు మరలి వచ్చెడుదాక
ఇచట వేచి యుందు హృదయనాథ !

(కాశ్మీరశాలువు అతనిమీద కప్పును. కవియు కోటిపాలుడును నిష్క్రమింతురు. ఆమె తలుపు దగ్గరగా వేసి, కుడ్యముమీది బిల్హణుని చిత్రపటమువంక కొంతతడవు చూచి, మందహాసము చేసి, పైట సవరించుకొని, కొంచెము దూరమున వ్రేలాడుచున్న అర్ధనారీశ్వరులచిత్రము చూచి, చేతులు జోడించి, అర్ధస్ఫుటస్వరముతో)

"అచ్ఛిన్న మేఖల, మలబ్ధ దృఢోపగూఢ,
మప్రాప్త చుంబన, మవీక్షిత వక్త్ర కాంతి,
కాంతావిమిశ్రవపుషః కృతవిప్రలంభ
సంభోగసఖ్య మివ పాతు వపుః పురారేః !"

(ఇంతలో కేరళిక తలుపు నెట్టుకొని ససంభ్రమముగా ప్రవేశించును. యామిని ఎదురుపోయి చేతులు చాచును.)

## పంచమ రంగము

ప్రాసాదములో ప్రగ్రీవమున మదనభూపతి చింతాయత్తుడై ఇటు నటు దిరుగుచుండును. క్రిందికుట్టిమమున శూలారోపణప్రయత్నము జరుగుచుండును. బిల్హణ కవి మందహాసముతో చూచుచుండును. ఇంతలో రాజగురువు ప్రగ్రీవములోనికి వచ్చును. రాజు చూచి నమస్కరించి ప్రక్కకు నిలుచును.

**కవి**

(అర్ధనిమీలిత నేత్రములతో)

అద్యాఽపి తద్వికసితాంబుజమధ్యగౌరం
గోరోచనాతిలక పాటలఫాలదేశమ్
ఈషన్మదాలస విఘూర్ణితదృష్టిపాతం
కాంతాముఖం ప్రతి మనో మమ సన్నిధత్తామ్ !

**రాజ గురువు**

చెప్పుకొనుచున్నవారు విచిత్రమైన
ఘోరవృత్తాంతమును దేవ, కోటలోన
దేవర యథార్థముగనె విధించినారె
విప్ర కవివరునకు శూలవేధ శిక్ష ?

**మదన భూపతి**

గురుమహారాజ కర్ణగోచరము లైన
కఠినవాక్కులు సత్యమే : కాని శిక్ష
నేను విధియించినా నని నిర్ణయింప
దగదు, శిక్షించినది మన దండనీతి.

రాజ గురువు

అన్ని శిక్షలకును నాధారభూతంబు
దండనీతి యనుట తథ్య మయ్యె
దాని దెలుపువాడు ధరణినాథుడు, కాన
శిక్ష తుదకు రాజు చెప్పినట్లె.

మదన భూపతి

ప్రభువుమాత్ర మెట్లు పాటింప కుండును
ధర్మనిర్ణయమును దండనమున?
దోషి యైనవాని ద్రుంచి వేయక యున్న
సంఘమునకు హాని సంఘటిల్లు.

రాజ గురువు

శిక్ష చెప్పవలయు క్షితిపతి! ఐనను
భట్ట బిల్హణుండు పండితుండు
గురువు కవియు విప్రకులజాతు, డితనికి
శూలవేధ భూమిపాల, తగదు.

మదన భూపతి

వీడిపోయె నితని విప్రత్వ, మేనాడు
మత్తుడై నయమ్ము మరచిపోయి
ఆచరించినాడొ అంతఃపుర ద్రోహ—
మింక భూమిదేవు డెట్లు లగును?

రాజ గురువు

చేసినది భూరిదోషమే, శిక్షకూడ
పరమదారుణమైనది! ప్రభువు కరుణ

బూని యీ నీచమరణమ్ము భూసురునకు
ఎట్టులైనను తప్పించుకే ఘనమ్ము.

మదన భూపతి

ఏమి చేయజాల నిపు డేను గురుదేవ !
మాట వచ్చె తొలుత నోటినుండి.
అవల దాని నెట్టు లన్యథా ఘటియించు
చండశాసనుండు జనవిభుండు.

రాజ గురువు

బ్రాహ్మణుండు ప్రభూ, మహాపాతకమ్ము
చేయు గాక అజ్ఞానముచేత గాని,
బుద్ధిపూర్వకముగ గాని, భూవిభుండు
అట్టి శిక్ష విధించుట అనుచితంబు.
సమ్మతింపదు ధర్మశాస్త్రంబు దేవ,
బ్రహ్మహత్య, నిష్కాసమే ప్రబలశిక్ష
యిట్టివానికి. శాంతి వహించి వేగ
బిల్హణార్యునిమృతిని తప్పింపవలయు.

మదన భూపతి

మంచిమాట గురుప్రభూ ! మహీసురుండు
శిష్యురాలిని, నమ్మిన చిన్నదాని
మోసగించుట యెంతటి దోస మగునొ
ధర్మనిర్ణాయకాగ్రణుల్ తలప రేమి ?

రాజ గురువు

ఇప్పు డాచర్చచే దేవ, ఏమి ఫలము !
గతము విస్మృతియామిని గలియనిండు.

దండమునకన్న దొడ్డది దయ మహీశ!
అతని గరుణింతురేని ప్రఖ్యాతి యొసగు.

మదన భూపతి

ఇంక మా యామినీ దేవి కేది తెరగు!
సమ్మతించుచునె ఉత్తమక్షత్రియకుల
జాతు డెవడేని బిడ్డను జాయగ గొన?
భావికాలము ఘోరాంధ్యబంధురమ్ము!

రాజ గురువు

మాటలోనను మరణమో మంగళమ్మొ
లేదు విధియించు నపరవిరించియొక్కడ!
నిక్కముగ మంగళము యామినీ కుమారి
బిల్హణార్యునకే యిచ్చి పెండ్లి సేయ.

మదన భూపతి

బ్రాహ్మణోచితవాక్యమ్ము పలికినారు
నేడు గురుదేవ! మా యామినీ కుమారి
యేవిధమ్మున భర్తగా నిచ్ఛగించు
చదువు చెప్పి జీవించెడి జన్నిగట్టు?

రాజ గురువు

చెప్పవలసిన దేదియో చెప్పినాను:
ముందు ప్రత్యక్షమృత్యువుముఖమునుండి
కవిని విడిపింపు; డావల గలుగు గాక
శివకటాక్షమ్ముచే శుభచింత మీకు!

(రాజు శిరము వంచును. రాజగురువు నిష్క్రమించును.

ఇంతలో అమాత్యుఁడు ప్రవేశించును. తిరుగుచున్న రాజు అమాత్యుని జూచి ఆగి నమస్కరించి క్రిందికి జూచును.)

కవి

అద్యాఽపి తాని మృదుమంథరభాషితాని
తిర్యగ్వివర్తి నయనాంత నిరీక్షితాని
లీలాలసాంచితగతాని సువిస్మితాని
తస్యాః స్మరామి హృది విభ్రమచేష్టితాని !

అమాత్యుఁడు

విశ్వసింపనైతిని ప్రభూ, విప్రకవికి
మీరు విధియించినట్టి యీ ఘోరశిక్ష
శాంతచిత్తముతోడనో, సరభసముగ
చిత్తవైకల్యసమయాన చెప్పినారో !

మదన భూపతి

క్రోధ పవమాన వీచీ విఘూర్ణమాన
హృదయ సలిలాశయమ్మున కేది శాంతి !
ద్యోతితంబైనయంతనే దుష్టచేష్ట
సముచితంబైన దండన సంఘటిల్లె.

అమాత్యుఁడు

ప్రభువరేణ్యున కదురాడు బంటు లేదు :
అయిన నిరతమ్ము నేను శ్రేయమ్ము కోరు
వాడ గావున వివరింప వలసివచ్చె—
శిక్ష సముచిత మని దేవ, చెప్పలేము.

మదన భూపతి

అతడు చేసినట్టి దంతఃపురద్రోహ !
మబల రాజతనయ కవినయమ్ము
చూపి నట్టివాడు శూల మారోహింప
నష్ట మేమి లేదు నా తలపున.

అమాత్యుడు

చేసినది మంచిపని యని చెప్పలేము :
కాని యాతడు విప్రుండు కవివరుండు
లోకరంజకు డగుట విలోలహృదయు
లైన దేవర గమనించినట్లు లేదు.

మదన భూపతి

జ్ఞప్తి యున్నది తద్గుణగణము నాకు :
ఐన నాత డొనర్చు మహాపరాధ
కాల జీమూతమాలలో గలసిపోయి
నిజముగా నిల్చినది గాఢనీలిమమ్మై !

అమాత్యుడు

మరణదండన విధియించుమాత్రముననె
ఇచట నడచిన యవినయ మెటు తొలంగు ?
బ్రహ్మహత్యకు మీరు లోపడుట తగదు :
చెప్పవచ్చును నిష్కాసశిక్ష దేవ !

మదన భూపతి

సారెసారెకు బ్రాహ్మణశబ్ద మొకటి
నూరిపోయుచు నున్నారు మీరు చెవుల !

బ్రాహ్మణామాత్య, నను క్షమింపంగ వలయు—
మీకు జాత్యభిమానమ్ము మేదురమ్ము.

అమాత్యుడు

నేను మీసేవలో జేరునిముసమందె
తరిగిపోయెను బ్రాహ్మణత్వమ్ము కొంత.
చెప్పునది విప్రసంప్రీతిచేత కాదు-
ప్రభువరా, నీతిగా గ్రహింపంగ వలయు.

మదన భూపతి

అనుగుబిడ్డ కట్టు లగును వివాహమ్ము,
అక్కటకట ! ఎంత యవినయమ్ము
సంఘటిల్లె! ఇంక సత్కులజాతుడౌ
రాచమగని కీమె నోచలేదు.

అమాత్యుడు

అన్యథా తలంప రని సాహసమ్మున
ఒక్కమాట చెప్ప నుత్సహింతు;
చిన్నతల్లి యైన శ్రీయామినీ దేవి
కవికి ధర్మపత్ని కాదగినది.

మదన భూపతి

మీరుగూడ గురువుధోరణినే మాకు
హితము తెలుపువార, లేమి చేతు !
తస్కరించి నట్టి ధనము మలిమ్లుచు
చేత బెట్టు మనుచు చెప్ప దగునె ?

### అమాత్యుడు

అఖిలధర్మవేత్త లౌ రాజగురువులే
శ్రేయ మభిలషించి చెప్పినపుడు
అన్యచింత లేల? ఆతని మన్నించి
పెండ్లి చేయ దగును బిడ్డ నొసగి.

దుర్మదమ్మువలన తొలుత సామంతుండు
ప్రభువు కెదురు నిలిచి ప్రథనమందు
విజితు డగుచు శరణు వేడిన, దేవర
మరల నొసగ లేదె మండలమ్ము?

శాసమింప కింక దయతోడ దేవర
కవిని ఘోరమృత్యుగళమునుండి
సత్వరమ్ము ప్రోచి జామాత గావింపు,
డఖిల నగరజనము హర్ష మొంద.

(నిదానముగా నిష్క్రమించును. మహారాజ్ఞి మందార మాల ప్రవేశించును. రాజు తల వంచును)

### మందార మాల

ఎంత దారుణ మెంత దారుణ
మీక్షణమ్మున మీరు చేసెడి
బ్రహ్మహత్యాకాండ దేవా, పాపదాయకము!

వెనుకముందులు చూడబోక
విధముగా విధియించినారే
కవికి శూలారోపణమ్మును కఠినముగ నాథా!

మదన భూపతి

దేవి, నీవును బ్రాహ్మణాధిక్యమునకా
సంప్రదాయానుగత సేవ సలిపినావు!
బ్రాహ్మణుండేని ఒక మహాపాతకమ్ము
చేసినప్పుడు వానికి శిక్ష వలదె?

మందార మాల

దండనమ్ము విధింప కేగతి
తప్పిపోవును దుష్టజనులకు?
అయిన నియ్యది బహువిశిష్టంబైన ఘటన గదా!

ప్రాణదండన మెటు విధింతురు?
బ్రాహ్మణుండు మహాపరాధము
చేసినను నిర్వాసనంబే శిక్ష యాతనికి.

ఇపుడు బిల్హణ కవిశ్రేష్ఠున
కట్టి శిక్ష విధింప జెల్లదు.
ఆపివేయుడు నాథ, శూలారోపణము తొలుత.

మదన భూపతి

సాధువే యని యెంచి నిస్సంశయముగ
క్రోడభాగమునం జేర్చికొన్న చిన్న
ముద్దుపులి యేటవాలుగ మోము చీర
శిక్ష చేయక విడుతురా చెప్పు దేవి!

మందార మాల

దోష మెవరిది? వ్యాఘ్రశాబము
తొలుత రొమ్మున హత్తుకొమ్మని
స్వయముగా నరుదెంచి ప్రార్థన సలిపెనా దేవా?

మురిసిపోయినవారు మీరే !
ముందుగా మువ్వన్నెచారల
మెకము నిటు తెప్పించి మనయామిని కొసంగితిరి !

మదన భూపతి

బ్రాహ్మణుం డని, గురు డని, పండితు డని
కవివరుం డని యెంతయు గారవించి
పూర్ణవిశ్వాసవశమున పుత్త్రిని తన
హస్తగత జేయ, నిందు ద్రోహమ్ము జరిగె !

మందార మాల

పడుచువారల విడిచి యొంటిగ
పఠనపాఠనములకు, స్వేచ్ఛను
ఏలికయె దయచేయుకతమున ఇంత పుట్టినది !

మదన భూపతి

కేరళిక యేమి యెరుగదా ? కేవలమ్ము
మువ్వురుం గూడి యోచించి మోసగించి
యింతకాలము గడపిరా ? ఇంక నేల
కాల్పనా ఉండి ఈ పాలికా వయస్య !

మందార మాల

ప్రథమ యౌవన మేల మరతురు ?
ప్రాణనాథా, ఎన్నడేనియు
పాలికాసఖి రహస్యమ్మును బయటపెట్టు నొకో ?

మదన భూపతి

ఆత్మజాత నొకతె నల్లారుముద్దుగా
పెంచి ప్రాణమట్లు పెద్ద చేసి

నిఖిల లలితకళలు నేర్పించిన ఫలమ్ము
నా యశఃపటాన నల్లరేఖ !

( వంగి, కుట్టిమము చూచి )

తలచుకొన్నకొలది దహియించుకొనిపోవు
చున్న దాడలు ! దేవి, ఓసరిలుము !
ఇంత జాగు చేతు రేలనో శూలమ్ము
స్థానమందు నిలుపు జతనమందు ?

మందార మాల

ఇప్పుడైన క్షమించి విడిచిన
నింతతో నపయశము తొలగును:
వానిమృతియే నిక్క మగునెడ వాదు శాశ్వతము.

తిరిగి వచ్చునె యతని మృతిచే
దేవ, కన్యాత్వమ్ము బిడ్డకు ?
అలసింపక ప్రాణనాథా, అపవలె శిక్ష.

శిక్ష యగుచో ప్రాణవల్లభ,
చిన్నదానికిగూడ దండన
చేసినట్లే యగును : కొంచెము చింత చేయవలెన్.

మదన భూపతి

ఒక్కవేళ నతని నక్కటికమ్మున
వదలిపెట్టినంత వాడు పోయి
క్షత్రియోత్తముండు చనుదెంచి బిడ్డను
పెండ్లియాడు నొక్క ప్రీతితోడ ?

మందార మాల

(నిశ్చలముగా జూచి)

బిల్హణార్యు క్షమించి వేగమె
ప్రీతితో రావించి, యామిని
నతని కొసగుట యుత్తమోత్తమ మైన కార్యమ్ము.

మదన భూపతి

కులగురుండు నమాత్యుండుగూడ నిట్లె
బ్రాహ్మణాభిమానమ్మున పలికినారు.
నీవు మూర్ధాభిషిక్తవే దేవి, యెట్లు
క్షత్రియవిరుద్ధముగ చెప్ప గలిగినావు ?

మందార మాల

కులవిభేదముమాట యిచ్చట
కొంచెమేనియు లేదు దేవా,
బిడ్డయెడ జనయిత్రి కుండెడి ప్రీతి పలికించెన్.

మదన భూపతి

భాగ్యహీనుండు, విద్యచే బ్రదుకువాడు,
దూరకాశ్మీర దేశాగతుండు, విప్రు
డట్టి యువకున కటు మదీయాత్మజాత
నిచ్చి, జామాతగా గొన నిచ్చగింతు?

మందార మాల

భవ దనుగ్రహ వీక్షణమ్మే
పడినచో మన బిల్హణార్యుడు
చిన్నప్రభు వగు, నవల నల్లుని చేసికొనవచ్చు.

## క వి

( పార్శ్వమునకు జూచును )

అయి, కిమనిశం బాలే, ద్వారే సమున్నత కంధరా
కువలయదలస్నిగ్ధే ముగ్ధే విముంచసి లోచనే !
అమర రమణీలీలావల్గ ద్విలోకన వాగురా
వలయపతితో న వ్యావృత్తిం కరిష్యతి బిల్హణః !

## మందార మాల

విప్రుడయ్యును క్షత్రియోచిత
వీరలక్షణలక్షితుం, డీ
కవివరేణ్యుం, డితని మనలో గలిపికో దగును.

మిసిమి మేల్మిపసిండి వన్నియ
మేనివానిని, మహాసుందరు
పడయుచో జామాతగా మనభాగ్యమే నాథా !

కదల దీకాశ్మీరకవి మద
గజము లక్ష్మీమందిరమున
బద్ధమై అష్టతుక్కుమారీ పాదయుగళమున !

( ఇంతలో యామిని విచారముతో ప్రవేశించి
తల్లిని కౌగిలించుకొనును. రాజు ‘పూర్ణ
మాల’కు త్రిప్పును )

ఎన్నివిధముల జెప్పిచూచిన
వించుకేనియు గరగకున్నది
ప్రభువుచిత్తము! సేవ చేయుము ప్రార్థనము తల్లీ !

యామిని

( తండ్రిపాదముల మీఁద వ్రాలి డగ్గుత్తికతో )

కరుణ బూని పుత్రికా ప్రార్థనమును
తండ్రి, అవధరించి తత్క్షణమ్మె
మద్గురూత్తమునకు మరణదండనమును
మాన్పి, అభయ మిచ్చి మనుపవలయు !

( రాజు మౌనము )

అయ్యొ, యెగిరిపోవు నల్పక్షణమ్ములో
ఏమి చేయుదాన ! ఇంకనైన
కరుణ బూని తండ్రి, కాశ్మీర కవివర్యు
మరణదండనమ్ము మాన్పవలయు !

( రాజు పరాఙ్ముఖుఁ డగును )

పలుక కున్నవారు ! ప్రార్థన మ్మాలించి
తండ్రి, ఇంకనైన దయ వహించి
నను క్షమించి, వేగ నామనోనాయకు
మరణదండనమ్ము మాన్పవలయు !

కోటపాలుఁడు

( కుట్టిమముమీఁదికి వచ్చి, కవితో )

ఆర్య, ఇంక శూల మారోపణము చేయ
నేగుదెంచు సమయ, మిష్టదైవ
తమ్ము చివరిసారి ధ్యానించి బిల్హణ
కవివరేణ్య, మీరు కదలవలయు.

( బిల్హణుఁడు మందహాసము చేయును )

కోటిపాలుడు

కిం కారణం కవివరేణ్య, దరస్మితోఽసి ?
భీతిర్న కిం తవ ?

కవి

భవిష్యతి భీః కథం వా

ఉత్ఫుల్ల లోచనలసద్వదనారవిందా
దేవీ యదీయహృదయే నివస త్యజస్రమ్ !

( యామినివైపు చూచును )

యామిని

( ఉద్వేగముతో )

తండ్రి, చివరిసారి దయనీయవిజ్ఞప్తి—
ఘృణ వహించి— ఆలకించి, తలచి
నా భయంకరార్తి, నా ప్రాణవల్లభు
మరణదండనమ్ము మాన్పవలయు !

( ఉత్కంఠతో ఎల్లరును రాజువంక జూతురు.
రాజు యామినిని జూచి, ముఖము త్రిప్పికొనును )

కవి

అద్యాఽపి తా మవహితో మనసాచలేన
సంచింతయామి రమణీం మమ జీవితేశామ్
నాన్యోపభుక్త నవయౌవనభూరిసారాం
జన్మాంతరేఽపి న మయా వియుతి ర్యథా స్యాత్ !

( యామిని తండ్రిపాదములమీద మరల వాలును )

మదన భూపతి

( పుత్త్రికను బుజ్జగించుచు )

తల్లి, ఇంత వెఱ్ఱి తగ దమ్మ ! వింతగా
విప్రగురువు కొరకు వేడ నేల ?
విస్మరింప వమ్మ, వెనుకటి వృత్తమ్ము :
కర్త మెవ్వరేని గడవ గలరె ?

యామిని

కవివతంసుడు నాకు గురువే
కాడు ప్రాణప్రియుడు తండ్రీ !
పలుకు లేటికి నాకు సాక్షాత్పరమ దైవతమే !

మదన భూపతి

( పుత్త్రికను లేవ నెత్తి )

అమ్మ, భట్టబిల్హణార్యుండు కవి యాట
మధురభాషణముల మాయ చేసి
నట్లు గోచరించు నంతరంగమునందు :
వెఱ్ఱి యింక నైన వీడ దగదె ?

యామిని

సిగ్గు విడుచుట యెట్లు తండ్రీ !
చెప్పజాలను యథార్థమును !
విశ్వసింపుడు కవిప్రవరుడు విమలవర్తనుడు.
ప్రాణవల్లభు డయిన కవినే
పతిగ బడయనిపక్షమున మీ
పాదసన్నిధియందు విడిచెద ప్రాణములు తండ్రీ

**మదన భూపతి**
(జాలితో)

నీది నిర్మల మైన ప్రేమమె
నిక్కువమ్ముగ, కాని అతనికి
నీపయిని గాఢానురాగము నెగడునా తల్లీ ?

**యామిని**

కవివతంసులరక్తి యొరులకు
గ్రాహ్య మగునా ! విభుడు నాకై
ప్రమోదమ్మున విడువజాలును ప్రాణములు తండ్రీ !

**కవి**

(చేతులు జోడించి, కన్నులు మూసికొని)

పంచత్వం తను రేతు ! భూతనివహా
స్స్వాంశా మిలంతు ధ్రువం !
హే ధాతః, ప్రణిపత్య సాదర మిదం
యాచే నిబద్ధాంజలిః !
తద్వాపీషు పయ, స్తదీయ ముకురే
జ్యోతి, స్తదీయాంగణే
వ్యోమ స్వా చ్ఛ, తదీయవర్త్మని ధరా,
తత్తాలవృంతేఽనిలః !

(శూలమును సమీపించును)

**మదన భూపతి**
(చేతితో వారించి)

బాలార్కద్యుతిమత్కిరీటము శిరో
భాగమ్ముమీదన్, మణి

ప్రాలంబం బురమందు కాంతు లెసగన్,
భద్రేభ యానమ్ముపై
నీల చ్ఛత్రముక్రింద బిల్వాణుని
నిర్ణిద్రోత్సవశ్రీలతో
ఆలోకింపగ పౌరు లెల్ల గాని రమ్మా,
కోటిపాలాగ్రణీ !

(హర్షధ్వనులు చెలరేగును. యామిని తండ్రిపాద మూలకడ మోకరిల్లును. రాజు పుత్రికను లేవనెత్తి, శిరము మూర్కొనును.)

సమాప్తము

# ప దాం క ము

## అం కి త ము

శ్రీ కురుగంటి సీతారామ భట్టాచార్యులకు

# పాత్రలు

| | | |
|---|---|---|
| లలితాదిత్యుడు | ... | కాశ్మీర ప్రభువు |
| బంధురకుడు | ... | చాటుకారుడు |
| సువర్ణ ప్రభ | ... | గాయని |
| మహా పద్మ | ... | ప్రతీహారి |
| నీల లోచన | ... | రాజ నర్తకి |
| మనో రథుడు | ... | ముఖ్యామాత్యుడు |

బ్రాహ్మణ బృందము, పరివారజనము

సమయము : క్రీ . శ . శతాబ్ది 8

కాల పరిమితి : యామములోపు

# ప దాం క ము

(సాయంసమయము. రాజ ప్రాసాదమునకు కొంత దూరములో నున్న ఆరామములో కేళీగృహము. విపణ్ణికములు, నివద్యలు, జంత్రములు, పరివారజనము. రాజు లలితాదిత్యుడు నాట్యవేషముతో వీణ సారించు చుండును. సమీపమున గాయని సువర్ణ ప్రభ రాగాలాపన చేయుచుండును. ఇంతలో విప్ఫారిత ముఖముతో చాటుకారుడు బంభరకుడు మెల్లగా ప్రవేశించును.)

### బంభరకుడు

జయము మహాప్రభూ, జయము జయమ్ము!
లభియించినది జయ శుభ ముహూర్తమున.

### రాజు

బంభరకా, శబ్దవిధిని ప్రవీణుండ వయ్యు నిట్టి
భేదమ్మును పాటింపక ప్రేలినాడ వెందులకో?
జయమని యొకమారు, మరల జయ యటంచు తోడ్తోడ
పలికినందులకును నీవు పారితోషికమ్ము గొనుము:
పంచవార మియ్యెడ నే పాణిని లింగానుశాసన
మమ్ము నప్పగింపవలయు నాస్త్రోలను చాటుకార!

### బంభరకుడు

అంతటి శిక్షయే! ఐదు వారమ్ము
లారాము కాసార మన్ని వైపులను

లీలమై ఈదెద : లింగానుశాస
న మ్మప్పగించుట నావల్ల గాదు !
అయినను వెరవక అడిగెద నొకటి :
ఈక్షించుచో నిప్పు డేలినవారి
సెంతటి మతిమంతు డేని లింగంబు
విస్మరింపక పోడు విభ్రాంతి జెంది.
జయమును జయయును సత్యంబు లగుట
క్షణములోనే దేవ, కనుగొనంగలరు.

**రా జు**

కూటనీతిలోన నీవు కుశలుడ వని సమ్మతింతు ;
తికమక పెట్టక యేదో తెలుపు మోయి, స్పష్టముగా.

**బంభరకుడు**

త్రోవలోనికి రండు! తొలుత నామాట
తిన్నగా విన్నచో దేవరవారు
ఉబ్బి తబ్బిబ్బులై యుండెడివారె !
జయ చనుదెంచెను, జయు చనుదెంచె.

**రా జు**

తెలుప వేల నోయి సఖా, తీపిసరకు తెచ్చినట్లు
నీమాటల గోచరించు ; నిజమేనా నా భావన ?

**బంభరకుడు**

అవును, బృహస్పతి యంతటివారు
శాస్త్రీరనాయకుల్ ! కామినీగోష్ఠి
కావ్యగోష్ఠిని మహాఘటికు లేనాడు,
కావున సత్యమే గ్రహియించినారు.

రా జు

నేత్రోత్సవ మొనరింపక నిష్ఫలమ్ముగా నమృత
క్షణములు వాచాలతలో గడచిపోవ నిత్తు వేల ?

బంథరకుడు

అఖిల సత్క్రతులకు నవతారికలును
అన్ని రూపకముల కాముఖమ్ములును
శుభకార్యముల కెల్ల సుముహూర్తములును
సందర్శనములకు సముచితక్షణము—

రా జు

ఆవరించె నీధోరణి నతిశబ్ద మహాదోషము ;
ఉజ్జగించి దూరాన్వయ మున్న తెరగు వివరింపుము.

బంథరకుడు

ఆనతి యైనచో నాత్మార్పణమ్ము
కావింపగా జయ కాంక్షించు దేవ !
కాని కొంచెము జంకు కలవర పరచు
నెటు చేతురో యని యేలినవారు.

కలడు మహాప్రభూ, కల్యపాలకుడు
ఉపాఖ్యు, డత్యంతయోగ్యు; డాతనికి
ముద్దుకుమారిక ముల్లోకములను
వెలిగింపగా జాలు విమలోజ్జ్వలాంగి.

రా జు

చెప్ప వేమి బంథరకా, స్త్రీ యెన్నడు రక్షించే !
అన్యచర్చ లప్రస్తుత మనాఘ్రాతసుమము నెడల.

(బంభరకుడు వెడలిపోవును)

వంశ మెట్టిది యైన వనిత రత్నమె కదా
స్త్రీనామధేయాన తేనె లూరును గదా!
సౌందర్య మాధుర్య సముచితార్చనలచే
స్త్రీపరమ్ముగ రససిద్ధి తథ్యము గదా!

సువర్ణ ప్రభ

నరభృంగంబులు నవీన- నూతన
కుసుమ మరందము గ్రోల నెంచు గద.
(బంభరకుడు జయతో ప్రవేశించును. జయాదేవి వినత
యగును. రాజు జయను ఆపాదమస్తకము వీక్షించును.)

బంభరకుడు

ఆకరరత్నము నంజన బలమున
ఇహలోకమ్మున కెటో ఘటియించితి!

రాజు

అంజనసిద్ధుడ వగుదువు సఖుడా!
విమల రత్నమును వెలార్చినాడవు.
మహార్ఘ మగు నీ మాణిక్యంబును
కోటీరంబున గూర్చుట న్యాయము.

(జయ నుద్దేశించి)

మృదుపాదములకు మేదిని కఠినము,
నిలిచెద వేలా?—నీస్థానం బిదె.
(వామాంకమును జూపును. జయాదేవి ఒకసారి
రాజును, ఒకసారి బంభరకుని జూచును.)

బంభరకుడు

(మందహాసముతో)

గ్రహియించితివా కాశ్మీర ప్రభు
చిత్తం బెంతటి క్షీరాంబుధియో !

(రాజు నుద్దేశించి)

"అంక మంక పరివ ర్తనోచితే
తస్య నిన్యతు రశూన్యతా ముభే
వల్లకీ చ హృదయంగమస్వనా
వల్గువా గపి చ వామలోచనా."

రాజు

(ఉల్లాసముతో)

అంకతలము జయ అలంకరించిన
జయము మాకు రసజగత్తులో సఖ !

(జయావదనమును జూచును. మందమందముగా జయ చని రాజుతొడపై మెల్లగా నుపవేశించును.)

వాస్తవమ్ముగ నీమె వామలోచనయె :
అదె కాక వల్గువాక్కనియును తలతు.

(ఆమెచెక్కిళ్ళు నిమురును)

బంభరకుడు

జంతగాత్రముల సమ్మేళనమున
జయ కరగింపం జాలును శిలలను.

రాజు

అటులే యగుచో అష్టాపదమున
సుగంధ మబ్బెను సువర్ణప్రభా !

సువర్ణ ప్రభ

సత్యమె, మా ప్రభుచంచరీక మిక
సంశ్రయించు నీ స్వర్ణసూనమునె.
ఆరామములో నఖిల సుమమ్ములు
వాస్తవమ్ముగా వాడును దేవా !

బంభరకుడు

అఖిల లతాంతము లమ్లానముగా
వరలును దక్షిణవాత స్పర్శను.

రాజు

బాగు ! మనోహర భాష్యకారుడవు
అవల పసదన మర్పింపుము సఖ !

(చాటుకారుడు వినతు డగును)

జయా దేవి యిక శ్రవణోత్సవమును
సంతరింప దగు : సావధానులము.

(ఆమె వదనము పై కెత్తును. ఇంతలో
మహాపద్మ త్వరితముగా ప్రవేశించును.)

మహాపద్మ

నిజసఖీవృత యైన నీలలోచన వచ్చు
కేకిగమనమ్ముతో కేళీసదనమునకు—

రా జు

(జయను క్రిందికి దింపి, తొట్రుపాటుతో)

బంభరకా, అంతఃపుర ప్రత్యేకాగారములో
జయా దేవి నివాసమ్ము సముచిత పరివారముతో.
పది గడియల ప్రొద్దు వోవ భవదీయాంతికమున కే
వరుగుదెంచువాడ జయా! అంతవరకు సుఖ ముండుము.

(జయ బంభరకుని వెంట బోవుచు వెనుదిరిగి రాజును జూచును. అతడు మందహాసము చేసి వీణ సారించుచుండును. ఇంతలో రెండవ ద్వారమునుండి నీల లోచన చెలులతో ప్రవేశించును. పరధ్యానముగా పైకి జూచుచున్న రాజును గమనించి)

నీల లోచన

అవనీశు మధుర కటాక్ష వీక్షణము
ఇహ లోకమున గాక యే హేతువుననో
అంతరిక్షమ్మునే అలముటచేత
తద్దేవతల్ మహా ధన్యులైనారు.

రా జు

స్వాగతమ్ము! నిండు చక్షురుత్సవమ్ము
నేడు మాకు నిజము నీలలోచనాంబ!

నీల లోచన

స్వాగతం బన్నారు వాచా మహాశయుల్!
జిహ్వాగ్రమం దుండి చెదరి వచ్చెనె కాని
నిండు మానసమునం దుండి రానేలేదు
ఈ నాటి స్వాగతం, బేమి కానోపునో?

అస్మదాగమనమ్ము విస్మయ ద్యోతకం
బయినట్టు తెల్లమే ఆలోకనములోనె
ప్రభువువారి వినోదభంగ కారణముగా
చనుదెంచిన విధమ్ము స్పష్ట మాయెను మాకు.

(రాజుకన్నులలోనికి జూచును.)

రాజు

నీలలోచనా, నే డెందులకో
బహు వక్రముగా భాషించెదవే !
ప్రమద కారణము భవదాగమనము,
ఏటికి విస్మయహేతు వనియెదవు ?
నిఖిలసమయముల నీ కొక్కతెకే
అధికారము కల దాగమనమునకు.

నీలలోచన

జిహ్వాంచలమ్ముపై చిందులాడుచు నుండు
అమృత బిందుకదంబ మవనీధవుల కెపుడు.

రాజు

అమృతబిందుస్నపిత మగుచుండు పై నిజమ్ము
అవనీధవార్ద్రి హృదయాపహారి జనమ్ము.

నీలలోచన

కారణం బెరుగని అస్మదాదులకు
సుధాబిందువులు శూన్యములే కద !
నే నరుదెంచిన నిమేషమ్ములో
ప్రభు వెవ్వరినో భావన చేయుచు——

### రాజు

కాదు ప్రియా, నిక్కముగా ఖనూచిన్నై యుంటి నపుడు
వీణా వాదనవిశేష విషయము భావన చేయుచు.
వల్లకి యున్నది సాక్ష్యము- వామాంకము నింక నీవు
శీఘ్రమె యలంకరించిన చిత్రశాంతి యొదవు ప్రియా!

### నీలలోచన

అంకపీఠతల మధిష్ఠింపగా
అస్మదాదులకు అర్హత కలదా!
భుక్తోజ్ఝితమై పోయినదానిని
ఆరగించు వికలాంగులు లేరిట!

### రాజు

(వస్త్రమువంక జూచుకొని)
నీలలోచనకు నిక్కముగా భ్రమ
ముక్తాజాలకమూలకమే సుమి!

(మందహాసము)

### నీలలోచన

బొంకి తప్పించుకో భూమీశ కంఠాన
కానంబడదు హారికిక స్రజము చెలులార!
తెలిసిపోయె నపూర్వలలనా కటిస్థలీ
విస్రస్త మేఖలావిర్భూత జాలకము.
వాదింపదు ఖనూచి వైయాకరణునట్లు
చిక్కునం బడిన కాశ్మీర నాయకమణి!

రాజు

నీలలోచన కీ నాడు నిజముగాను
కోపకారణమే సమకూరె, గాని
ఇంచుకంత శాంతము వహియించు నెడల
ఏను నిర్దోషి నని గ్రహియింపగలదు.

నీలలోచన

మాకు కోపమ్ము జనియించు మాత్రమునను
లోపమే మగు కాశ్మీర భూపతులకు!
ఒక్క నూతనయువతి నిజోరుసన్ని
విష్ట గావించి, నిర్దోషి వేష మేల ?
అంకతలమున నాసీన యైన దాని
ఊహ చేసితి నని చెప్పు టొప్పు నేమొ;
కాని, ఆరామసరణిలో కంట బడిన
దాని స్వప్నకుమారిగా దలపలేను.

రాజు

కేళికామందిరములోని కే యపూర్వ
వామలోచన యరుదెంచె వాసవముగ,
తోడుతోడనె వెడలుటగూడ నిజము
అడుగుము సువర్ణ నిందు యాథార్థ్య మేమొ.

( సువర్ణప్రభ తల త్రిప్పును )

నీలలోచన

సాక్ష్యముం దొలుదొల్తనె సంతరించి
నృపులు రాజకార్యమ్ములు నిర్వహింత్రు

కామినీ గోష్ఠికూడ సాక్ష్యమ్ముతోడ
నిర్వహించెను దేవర నేర్పు మీర.

రాజు

లోకయాత్రయందు లోపముల్ లేకుండ
నడచు టెట్లు లోక నాయకుండు?
చూచి మాడనట్లు లోచనా, నీవంటి
యోగ్యురాలు నడచుచుంట శుభము.

( ఆమెముఖము చూచును )

నీల లోచన

తెలిసె నేటి కైన! దేవర సెల విచ్చి
నట్లు చనుటె మాకు అధిక శుభము.
అలసింతు రేల అనుగు నెచ్చెలులార,
ఇచట మనకు స్థాన మింక లేదు!

( బయలుదేరును )

రాజు

( లేచి, అడ్డము పోయి )

అపరాధం బయ్యె ప్రియా! ఆగ్రహ ముపసంహరించి
కరుణ బూని ప్రసారించు కటాక్ష వీక్షణము నిపుడు.
అలుక విడువకున్న దాన, వలకలు సవరింతు మన్న
చేతులు సాధ్వసముచేత చెమరించును చూడు ప్రియా!

నీల లోచన

మధుర మధురవాక్కులతో మైరేయమువలె తోడకె
మైకము కల్పింప నేల మదికి, నింక చాలు చాలు!

రాజు

భావింపకు వ్యర్థముగా ప్రణయిని యింకొకతె లేదు
నీకన్నను లోకములో నీలలోచనా, నిజమ్ము.

( బంధరక్షకుడు మెల్లగా ప్రవేశించును )

## నీల లోచన

పృథివీనాథున కెదుటిదె ప్రేయసియును, పెండ్లికూతు,
రావలమాత్రము విస్మృతి: అనురాగం బంతపాటి.

రాజు

కాదు ప్రియా, నిక్కముగా గాఢరక్తి నీయెడలను
అనవరతము చెలగు గాని అర్ధదివసవర్తి కాదు.
విశ్వసింపవేని నాదు విజ్ఞాపన ప్రాణప్రియ,
పదసరోజయుగళి మంటి ప్రతిజ్ఞ చేయుదును సుమీ !

( నీలలోచన చిరునగవుతో రాజుకు
మృదు చపేటాఘాత మిచ్చును.)

గండగండశిల ఘాతముచే నీ
కర కుశేశయము కందిన దేమో.
నిలిచియుంటివే నీలలోచనా,
నిపద్యమీదను నిషణ్ణ కాగదె !

(కూరుచుండ బెట్టును.)

## బంధరక్షకుడు

మన లోచనాదేవి మంజుపాద ద్వయము
విమల శుభలక్షణాన్వితమ్ము ప్రభువరా !

ఏతత్పదాంకమ్ము లేల కౌశేయాల
మీద ముద్రింపగా రాదు శ్రీగంధాన ?
దేవీపదాంక ముద్రిత మైన కౌశేయ
రమణీయ వస్త్రముల్ రాజపరివారంబు
నిజభుజమ్ములమీద నిండుగా ధరియించి
వేడుక రోజులన్ విహరింప నెట్లుండు !

రాజు

సాధు సాధు బంభరకా! స్తవనీయము నీసూచన
ప్రతివత్సర మీగినమ్ము పండువుగా ప్రకటింతము.
నీలలోచనా పదాంక నిచోళమ్ము లీక్షణమే
పంచిపెట్ట వలయు నోయి, పరివారము కంతటికిని.
చందనంబు నిచోళములు సత్వరమే రావలయును
నీలపదాంకోత్సవమ్ము నే డని ప్రకటింపవలయు.

(పరిచారికల ప్రస్థానము)

సువర్ణ ప్రభ

నీపయి లేనికి నిర్భరరాగము:
నిజముగ ధన్యవు నీలలోచనా !

రాజు

నేను ధన్యుడను నీలలోచనా
పదాంకోత్సవ ప్రవర్తకముచే.

నీల లోచన

కాశ్మీరనాయకాగ్రణి త్రిలోకములకును
ప్రభుత నిర్వర్తింప పటిమ గలిగినవాడు;

భయదసంగరభూమి భాగాన వైరులను
ఖడ్గహస్తముతో ఖండింప గలవాడు;
సుందరాంగీఫాల చూర్ణకుంతలములను
సరళహస్తముతోడ సవరింపగలవాడు;
తర్కకర్కశవచన ధౌరేయ జిహ్వనే
సరసవాగమృతంబు స్రవియింప గలవాడు;
దాక్షిణ్యభావాన — తనను గూర్చెడువారి —
దక్షిణానిలుడట్లు తాప మార్పగలాడు;
దర్పంబు లేక కందర్పు మించినవాడు
మారాజవల్లభుడు మహనీయు డిహమందు!

రాజు

(ఆమె చెక్కిళ్ళు నిమిరి)
ప్రస్తుతరంగస్థలీ పదచాలనమునందు
నీలలోచన మహానిపుణ యాట ధ్రువమ్ము.
మృదుల రసనారంగ పదచారణమునందు
నిపుణురా లన్న ప్రథ నే డయ్యెను ధ్రువమ్ము.
(గంధపు గిన్నెలతో, వస్త్రములతో పరిచారికలు
వత్తురు. రాజు గిన్నెలో చేయి ముంచును.)

మహాపద్మ

ముఖ్యామాత్యులు మున్నుగ పౌర
ప్రముఖులు వాకిట ప్రతీక్షించెదరు.

రాజు

అబ్బబ్బా పురముఖ్యుల నసమయమున గొనివచ్చుట
పానకమ్మునందు పుల్ల పగిది నున్న, దేమి చేతు!

బంభరకుడు

"గౌరవా ద్య దపి జాతు మంత్రిణాం
దర్శనం ప్రకృతి కాంక్షితం దదా
తద్గవాక్ష వివరావలంబినా
కేవ లేన చర ణేన కల్పితమ్."

(వాతాయనమువంక జూచును.)

రా జు

అగ్నివర్ణనృపు డటు లొనరించుట
సత్యమె, మన మటు సలుపం దగు నా ?
మన మనోరథామాత్యుని సైతము
దర్శన మొసఁగక తగునే, పంపుట ?

బంభరకుడు

ముఖ్యమంత్రికే మొదల మొసంగుడు,
పౌరముఖ్యులకు పాదదర్శనమె.

(మహాపద్మ వెడలిపోవును. రాజు అటు నిటు తిరుగుచుండును. మనోరథుడు ప్రవేశించును.)

రా జు

ఆర్య, యీసమయాన అరుదెంచినారు,
ఉత్పాత మే దైన ఉద్భవించినద ?

మనోరథుడు

ప్రభుదర్శనార్థమై ప్రముఖులు కొంద
రరుదెంచి యున్నవా రాసక్తితోడ.

రాజు

ఈనాడు దర్శన మెవరికి లేదు,
వేడ్కలో నున్నాము, వే రేమి వలదు.
చేతులు చందనసిక్తంబు లగుట
ఆకార మిట్లుంట, అన్యుల కిపుడు
దర్శన మీయగా దగునె అమాత్య ?

బంభరకుడు

కాని, ఉత్సాహభంగంబు కలుగ నీక
ప్రభువు పీఠనిషణ్ణులై పాదయుగళి
జాలమార్గమునం దుంచి, జనులు చూచి
సంతసంబున జనునట్లు సలుప దగును.

(మంత్రి విరక్తితో వెడలిపోవును. రాజు నిషద్యపై గూరు చుండి, పాదములు వాతాయన వివరములం దుంచును.)

సువర్ణప్రభ

ఆననకమలము హస్తకమలమును
చరణకమలములు సందర్శించిన
చాలును వచ్చిన జనులకు దేవా !

బంభరకుడు

రాజదర్శనము రమణీయంబే
కాని వీక్షణము కష్టదాయకము.
పని లేకున్నను ప్రభుదర్శన మని
బహువారంబులు పౌరులు వత్తురు.

చాలును దేవా, జాలమార్గమును
బంధించినచో ప్రజలు వెడలుదురు.

రాజు

(పాదములు తీసి, సరిగా కూరుచుండి)

ఆతపము సోకనిందు పదాంకముద్రి
తమ్ము లైన నిచోళవస్త్రముల కిపుడె,
వాని ధరియింపవలె పరివార జనము
అస్తమింపకమున్న అహస్కరుండు.

(పరిచారికలు పాదముద్రలు వేయించి
వస్త్రముల నావలకు గొనిపోవుదురు)

రాజు

(నీలలోచనచెక్కిళ్ళకు చందనము పూసి)

చందన ద్రవలిప్త లోచన-కపోల
పాళి శోభిల్లు చంద్రాతప ప్రవాహ
సిక్త గాంగేయ పర్వత స్నిగ్ధ విమల
సానుతటమట్లు లోచనోత్సవము నెరపి.

(ఎల్లరు హర్షధ్వనులు చేయుదురు)

బ్రాహ్మణ బృందము

(అకస్మికముగా, మెల్లగా ప్రవేశించి)

జయజయ కాశ్మీరరాజ్య జలజ జాగర ప్రదీప!
స్వస్తి! మహారాజమకాళి జయము జయము జయము జయము!

రా జు

(అప్రయత్నముగా లేచి)

ఇచటి కేమిటికి మీ రేతెంచియున్నారు?
ఈ హఠాదాగమన మెవరి సమ్మతితోడ?

బ్రాహ్మణ బృందము

అన్యసమ్మతి యేల? అరుదెంచితిమి మేము,
దేవరను దర్శించిపోవు సంకల్పాన.

రా జు

ఆపలేదా ప్రతీహారి ద్వారమునందు?

బ్రాహ్మణ బృందము

అడ్డగించెడి ప్రతీహారి యెవ్వతె మమ్ము?
అనివారితమ్ముగా నాటినుండియు మేము.
అరుగుదెంచెడివార మధిప! దర్శనమునకు.
ఆదరించును శ్రీ జయాపీడ భూపాల
మౌళి, మీజనకుండు మమ్ము నేకాలమున.

రా జు

మందమతి దొరకనా మాతండ్రి విప్రులకు!

బ్రాహ్మణ బృందము

నిందించుచున్నావు నీ తండ్రినే రాజ!
పితరు సమ్మానంబు పృథివీశు ధర్మంబు.

రాజు

ధర్మపన్నా లేల దర్శనార్థము వచ్చి?
చెప్పి కార్యం బేమొ శీఘ్రమే తరలుండు.

బ్రాహ్మణ బృందము

విసువుకొనె దేల నరపాల, విప్రు లన్న?
నిలిచితివి నీవు మమ్ముల నిలువబెట్టి.

రాజు

పీఠములు లేవు, మిమ్ముల బిలువ లేదు,
మీరు వచ్చిన త్రోవనే మేలు చనిన.

బ్రాహ్మణ బృందము

అసమయం బని యెరుగక, అరుగుదెంచి
యుండుట నిజమ్మె భూపాల! ఉత్సవమున
నీవు నటవిటగాయక నివహమధ్య
గతుడ వై యుందు వను నూహ కలుగ లేదు.

రాజు

భద్రము భద్రము బ్రాహ్మణులారా!
పలికెద రధిక ప్రసంగధోరణి.

బ్రాహ్మణ బృందము

త్వత్పిత మమ్ముల దయతో జూచుచు
నాదరించువా డన్ని వేళలను.
జయించి స్త్రీరాజ్యంబును నీ పిత
లోపడ లేదే లోలనేత్రలకు.

### రాజు

నమ్ముం డాయన నపుంసకుం డని!
గెలిచిన వనితల కేళీభవనము
జేరిచి పూర్ణవిహారము చేయక
విడిచిన షండుని వినుతించెదరే!

### బ్రాహ్మణ బృందము

శివశివ! అయుఃక్షీణ వాక్యములు
ఉచ్చరించితివి యువభూపాలక!
జనకుడు నడచిన సన్మార్గమునే
అనుసరించుటే అర్హము నృపతికి.
అభిలషింతుము కాన నీ యభ్యుదయము
అడుగకున్నను జెప్పెదము మనవిపాల,
నీకు హితవాక్యములు; ప్రజానీకమునకు
మేలు చేకూర్చు సరణిని మెలగు మయ్యా!
కామినీగోష్ఠిలో నిట్లు కాలహానన
మేల చేసెద వయ్యా విలోలుడ వయి!
ఓజము క్షయించిపోవు, ఆయువు హరించు-
ధర్మవీరోచిత ప్రవర్తనము శుభము.

### రాజు

పోవుమన్నారు మితి మీరి భూమిసురులు!
ఒడయని దిరస్కరించుచు నున్నవారు.

### బ్రాహ్మణ బృందము

ధరణిపు దిరస్కరించెడి తలపు లేదు,
న్యాయమార్గము జూపుచున్నాము కాని.

### రాజు

ప్రాణహారులు! బోధన ద్రావకమ్ము
చాలు జాలును! మీనివాసమ్ము లెచట?

### బ్రాహ్మణ బృందము

ఫలపురమ్ము, సువర్ణ పార్శ్వమ్ము, లోచ
నోత్సవాగ్రహారమ్ములనుండి మేము
వచ్చితిమి: విన్నవించెడి వార్త యేదో
చెవిని జేర్పక పరిహసించెదవు రాజ!

### బంధరకుడు

ఎవ్వరు మీ రని యిచటికి వచ్చితి,
రే మని భూపతి నీక్షించెదరో!

### బ్రాహ్మణ బృంధము

"న నటా న విటా న గాయకాః
న చ సభ్యేతరవాద చుంచవః,
నృప మీక్షితు మత్ర కే వయం
స్తనభారానమితా న యోషితః!"

### బంధరకుడు

మీ యహంకారమ్ము మితిమీరిపోయినది!
బ్రాహ్మణోత్తము లన్న భ్రమచేతనే మేము
సహియించినా మెట్లో శాంతచిత్తముతోడ:
అగ్రహారమ్ములన్ హరియించినం గాని___

బ్రాహ్మణ బృందము

ఓయి దాస్యాః పుత్ర! ఒడలు మరచెద వేల?
ఇచ్చకంబులతోడ హీనమార్గాలలో
కాలమ్ము గడపు వాచాలుడవు— భద్రమ్ము!

రాజు

భూసురగ్రామణులు కోలుపోయినారు
నేటితో నగ్రహారముల్ : నీల కొకటి
పద్మ కొక్కటియు, సువర్ణప్రభకు నొకటి
పారితోషిక మిచ్చితి- ప్రభువునాజ్ఞ!

నీలలోచనాదులు

ధిక్కరించితి మనుమ దేవ, భావింపకుడు!
పారితోషిక మన్న ప్రమదావహం బయ్యె
బ్రాహ్మణద్రవ్యంబు ప్రళయానలం బట్లు
ఏర్చివేయు పరిగ్రహించువారల నెల్ల!

బ్రాహ్మణ బృందము

భార్గవుండు మున్ను భరతఖండ మెల్ల
దాన మిచ్చె నంట ధరణిపాల, వింటె!
అందులోని భాగ మైన కశ్మీరమ్ము,
అందు చిన్నభాగా లగ్రహారములును
మాకు వలదు రాజ; నీక యుండనిమ్ము.
పోయివత్తు మింక, పుణ్య మాయె నయ్య!

(ప్రస్థానము)

రా జు

( నిట్టూర్పు విడిచి )

విప్ర రక్షస్సమూహమ్ము వెడలిపోయె
కౌతుకమ్మంతయును గూల్చి క్షణములోన !
అంతరాయాలు వేడుక కడు గడుగున-
క్షాళనము చేయవలె నిరుత్సాహ మిపుడె.

స్త్రీ బృందము

అరుణోజ్జ్వల మగు నాసవచషకము !
మధుర మధుర మగు మైరేయంబును
మాంద్యము బాపెడి మాధ్వీకంబును
మిలమిల లాడెడి మృద్వీకంబును
కలుపుడు కలుపుడు కాంచనపాత్రల,
ఆస్వాదింపుడీ ఆకంఠమ్ముగ !

( నృత్యము )

రా జు

మహీమండలవిఖ్యాతము మణిగణరుచిపింజరితము
కాశ్మీరద్రాక్షాసవ ఘనచషకము, ఘనచషకము !

బృంద గీతి

నిఖిలమాంద్యముల నిరుత్సాహముల
సకలదుఃఖముల క్షాళన చేయగ
ఆసవచషకము నాస్వాదింపుడు !

(నృత్యానంతర మందరును ఆసవము గ్రోలుదురు.
ఒక ద్వారమునుండి మనోరథుడు ప్రవేశించును)

రాజు

ఏమి స్వామీ, మరల నిటకు దయచేసితిరి !
వచ్చిపడెనా యేమి వైరిసందోహంబు ?

మనోరథుడు

కల్యపాలకుని కన్యను దేవర
అంతఃపురమున కంపినవారట.
విశ్రుతపౌరులు విజ్ఞాపనకై
ఏతద్గృహమున కేతేరంగా
జాలమార్గమున చరణద్వంద్వ
ప్రదర్శనమ్మున పరిభవించితిరి.
దర్శనార్థమై ధరణీదేవులు
విచ్చేయంగా, వికటసరణిలో
అపహాసించుమను అగ్రహారముల
హరించి యొసగితి రట నట విటులకు.

రాజు

( మందహాసముతో )

అయిపోయినవా అమాత్య శేఖర,
మా నేరమ్ములు, మరియుం గలవా !

( ఇంతలో పాదముద్రికలు తెత్తురు )

మనోరథుడు

దేవా, పద ముద్రితవస్త్రంబులు
సిద్ధము చేయించితి రెందులకో ?

బంభరకుడు

( తూలుచు )

కవులకుం బండితులకు రాంకవము లట్లు
భక్తులకు నిష్టదేవతా ప్రతిమ లట్లు
శాసనపురేకు లట్లు యాచకుల కార్య,
లలితపదలాంఛిత నిచోళములు సకల
రాజపరివారమునకు గౌరవ సమాఖ్య.

మనోరథుడు

చాలు జాలును బంధకీ పాదయుగళ
చిహ్నితదుకూలముల్ రాజసేవకులకు
రాంకవము లౌనె కశ్మీర రాజ్యమందు!
ఏమి యుత్పాతముల్ కల్గు నింకమీద!
సేవకులలోన మగుల నిస్తేజు లెవరొ
వారు తాల్తురు గాక యీ వస్త్రములను,
ఉత్తమాన్వయసంజాతు డొకడు కూడ
తాకజాలడు వామపాదమున నైన.

మీరు నటవిటగాయకుల్, మేదినీశు
కాలము హరించుచున్నారు కౌశలమున;
రాజతంత్రంబు లక్షించు నోజ మాన్పి,
చేసితిరి కామతంత్రాభిషిక్తు నకట!

యోగ్యపరిజనవృతు గొల్చు టొప్పు గాని
నిరతకేళీవిలాసు డౌ నృపుని సేవ
మాదృశుల కెట్లు చెల్లు? అమాత్య పదవి
విడుతు, నన్ను విముక్తు గావింపవలయు.

రాజు

మాపై ముఖ్యామాత్యుల కాగ్రహ
మీ దుర్దినమున నేలనో కలిగెను.

మనోరథుడు

కోప మేమియు లేదు, మీ కొలువు చేయ
నేర నిటనుండి— ఇది తుది నిర్ణయమ్ము.
శ్రీమహాదేవు ననుకంపచే శుభమ్ము
చేకురుం గాక మీకు, కాశ్మీరమునకు!

రాజు

నూనము భగ్నమనోరథ వాసర
మిది, యుత్సవదిన మెట్లు కాగలదు!

( రాజు నమస్కరించును. మంత్రి నిష్క్రమించును )

బంభరకుడు

మహితుడే యగు గాక, అమాత్యు డొకడు
పోవుమాత్రాన ప్రళయ ముద్భూత మగునె?

రాజు

మందబుద్ధి! మనోరథామాత్యు బోలు
దొడ్డ సచివుడు లోకాన దుర్లభుండు.

స్త్రీ బృందము

దేవా, యేలిక ధీరులు కావున
కటువాక్యంబులు కడు సహించితిరి.
చింతా యవనిక జీర్ణము చేసెడి
అరుణారుణ మా ఆసవ మిదిగో!

( ఆస్వదించి నృత్యము చేయును )

రా జు

అఖిలచింతల బాపెడి ఆసవంబు,
కుతుక ముద్దీపనము చేయు కోమలాంగి,
కర్ణతాపహారులు కావ్య గానములును
నేత్రపర్వంబు లౌ చిత్ర నృత్యములును
నిండుసుఖ మిచ్చు నాట్యంబు నుండ, మనకు
లోచనా, యింక సామాన్యలోక మేల!

(అందరును నాట్యము చేయుదురు. కొంతతడవునకు రాజు, నీలలోచనయు నిషణ్ణకముపై నుపవేశింతురు).

రా జు

ప్రథముడం గాన నేను ప్రప్రథమమందె
నా భుజంబులపై గప్పు న్యాయ మగును
త్వత్పదాంక నిచోళమ్ము తావకీన
కమ్ర కంకణభూషిత కరయుగాన.

నేటినుండియు నాకు శ్రీనీలలోచ
నా మనోహర మృదుచరణ ప్రభూత
లాంఛనాంకిత మౌ నిచోళ మ్మొకండె
కామ బాధానిరోధక కవచ మగుత!

(నీలలోచన నిచోళము రాజు భుజములపై గప్పి, అతని రొమ్ముపై వాలును. హర్ష ధ్వనులు. స్త్రీ బృందము నృత్యము చేయుచుండును.)

స మా ప్త ము

# సద్వాక్యము

అంకితము

శ్రీ కాటూరి వేంకటేశ్వర రావుకు

# పాత్రలు

సుమతి

రాజీవ లోచన

సుజాత

భదంత రాహులుడు

సమయము : క్రీ. శ. తృతీయ శతాబ్ది

కాల పరిమితి : సప్తాహము లోపు

# ప్రథమ రంగము

( ధాన్యకటక నగరములో 'రాజీవ'
సౌధమున విశాల కక్ష్య. రాత్రి. )

**సుమతి**

ఉచిత మౌనె ప్రాణేశ్వరి, ఉదయము నను గాంచి కూడ
చూడనట్లు సంభ్రమమున సోపానము లెక్కినావు.

సౌధోపరితలమునకుం జని— కోపం బేమొ కాని—
జాలకముల నన్నింటిని సశబ్దముగ మూసినావు.

నీ దర్శన వాంఛతోడ నే దూరమునుండి మిగుల
శ్రమపడి యరుదెంచినాను: జాలి కలుగ లేదు నీకు !

అపరిష్కృత కైశికవై అగపడుటం జేసి నాకు
సంభ్రమమున నుప్పరిగకు జనినా వని భావించితి.

ఇంకొక భావమ్ము కూడ నిపుడే యుద్బుద్ధ మాయె—
నీవు తాల్చినట్టి చీర నీటారగ లే దనియా ?

అందముగా లే దని నే నదివరలో నంటి ప్రియా !
ఇపుడు నిజము పలుకుదు— నీ వేది ధరించినను సొబగె.

శ్యామవర్ణ పత్రంబులు సాంద్రముగా ముద్రించిన
గులాబీల లేత యెరుపు కోక తాల్చినావు ప్రియా !

పరిచారిక చేత వార్త పంపితి నీ నికటమునకు :
పఠన మందు వ్యగ్ర వనుచు ప్రతివచనము వచ్చె నాకు.

మరల నేను వార్త నంప మాటలాడ నవకాశము
లేన రా దటంచు నాపె ఖండితముగ బలికె ప్రియా !

అపుడు నాకు శిరశ్ఛేద మైనయట్లు బాధ పడితి!
వేవిళచే నవమానము చేయించుట తగునె ప్రియా!

బహు పర్యాయములు నన్ను పరిభవించినావు నీవు-
కాని నేను సైరించితి గాఢ ప్రణయమ్ము చేత.

దేవికి నా వందనమ్ము తెలుపు మంటి నామెతోడ,
దిగ మ్రింగుచు నవ మానము తెచ్చికొన్న చిరునగవున.

అంత కఠిన దండనమున కర్హ మైన యపరాధము
ఏమి చేసినానో తెలియ దింత వరకు నాకు ప్రియా!

రాజీవ లోచన

అపరాధము కాదు కాని అనుదినమ్ము మీరు నన్ను
ప్రణయము ప్రణయ మ్మటంచు బాధించుచు నున్నవారు

సుమతి

ఇంతకన్న చిత్రము వేరే మున్నది ప్రాణప్రియ!
ప్రణయ ప్రకటనము కూడ బాధా కారణమె ప్రియా!

రాజీవ లోచన

నిజము చెప్పుచున్నదాన మీకు
నే నెరుగను ప్రేమ మేమొ.
సారె సారె కింక నన్ను
చంప వలదు ప్రేమ మనుచు!

సుమతి

విన్నానా సక్రమముగ! వీనులలో లోపంబా!
ఎంత వింత పలుకు వెడలె నీ యాదిని వేళయందు!

నీ వెరుగవ యనురాగము నిక్కముగా ముద్దరాల!
నే నేదో ప్రతికూలా నిలము వీచినట్లు తోచు.

రాజీవ లోచన

అన్య మేమి కాదు కాని ఆర్యా, యీనాడు నన్ను
ప్రీతి భార మానసులై పీడించుచు నున్నవారు!

సు మ తి

పీడించుచు నున్నా నా! ప్రియురాలా, మున్నువోలె
ఉపగూహానమందు మిగుల నుద్రేకము చూపలేదు.

రాజీవ లోచన

ఇంత కన్న మిన్నగాను యేమి వలయు? ఇంతదాక
ఆలింగన జనిత మైన ఆయాసము తగ్గ లేదు.

సు మ తి

కాని యెంత యాశ్చర్యము- గాఢాలింగనము లన్న
అంతరంగమందు యువతు లానందము గాంత్రు గదా.
అయ్యో ప్రియగాత్రంబా, అయాసం బొదవించితె
తొలగించెద నా పెదవులతోడ నీ శ్రమమ్ము కొంత.

రాజీవ లోచన

కట్టిపెట్టి చమత్కార గరిమమ్మును, దూరముగా
పోవలయును తత్క్షణమే బుజముమీది చేయి తీసి.
ఏమి, కదల లేమి, పోయి యెదుటి నివర్ణాకమువూద
శాంతముగా గూరుచుండి ఫల్లాపము లాడవచ్చు.

సుమతి

చిత్తము, దేవి యనుజ్ఞను శిరముమీద దాల్చినాను...
ఇచటినుండి మాటలాడ నెట్లు వినంబడును నీకు?

రాజీవలోచన

ఏల మాటలాడ వలయు మీరు?
ఎవరు సముచితాహ్వానము
తమకు పంపుకొన్నవారు
దయచేయుం డనుచు నేడు?

సుమతి

ఆహ్వానముతోడ నాకు నవసర మేమిటికి ప్రియా!
రాత్రి పవలు నిచటికి నా రాకకు నధికార ముండ?

ఎల్లరు బంధువుల విడిచి ఏకాంత నివాసంబే
చేయుచున్నదానవు కద— చెప్పు మేమి యవరోధము?

అదియునుంగాక నీవు ఆభరణాదికము దాల్చి
నిర్జరయువతీ విధాన నిశావేళ వెలుగ నేల?

నాకొరకే చిత్రమండనమ్ము చేసికొన్నదాన
వనుచు నేను తల పోయుట అయథార్థము కాదు కదా!

రాజీవలోచన

అను దినమ్ము చేసి కొనెడి అలంకరణమే, విశేష
మావంతయు లేదు; మీకు అనుకొనుటే యెందులకో?

సుమతి

కాంత విశేషమ్ము నాకు గోచరించె- స్త్రీ మండన
చారుత్వమునకు ప్రియజన సంప్రీతియె ఫలితము కద?

రాజీవ లోచన

పురుషుల తీర్పెపుడు నింతె- పూబోణుల కెన్నండును
స్వేచ్ఛా జీవనము మీరు చెప్ప రేమి ధర్మవిదులు?

సుమతి

స్వేచ్ఛా జీవన వాదము చిత్రమైన సిద్ధాంతము
నాశ్రయించి యుండు, దాని నస్మదాదు లొప్ప రెపుడు.
తరుణి యైన తరుణు డైన తనకొరకే జీవయాత్ర
చేయుట సాధ్యము కా దను సిద్ధాంతము నిష్కృష్టము.
విపరీతాలోచనములు విరమించుట శుభము సుమీ...
కాలహారణ మేల ప్రియా, గ్రహియింపం దగదె నన్ను!

రాజీవ లోచన

వివాహమ్ము వలదు నాకు- వెడలిపొందు నన్ను విడిచి,
మరియాదగ వెడలి పొండు- మరల నిటకు రాగూడదు!

సుమతి

మహార్ణవమువంటి నేను మర్యాదను మీర నెపుడు-
అయినను నావలన నేటి యపరాధం బేమొ చెపుమ.

రాజీవ లోచన

ఇంతకన్న ప్రాణవ్యథ యేమి వలయు? వెనుక నెపుడో
మీ కథినురాల నగుట మిక్కిలి పొరపాటె యయ్యె.

సుమతి

కాదు ప్రియా, నిష్కల్మష గాఢప్రేమమ్ము చేత
వెన్నవోలె కరగిపోవు వెనుకరీతి స్మరియింపుమ.

చూడు మొక్కమారు ప్రియా, సుగంధదీపముల కాంతి
నీ రూపము, నా రూపము, నిభృత చంద్రికా త్రియామ.

పెండ్లిమాట యటు లుంచుము—
ప్రియతమ, ఉత్సాహముతో
ఇచట గడప వచ్చినాడ
నీతమి నీతోడ తమిని.

### రాజీవ లోచన

మంచిమాట ! చాలు నింక మరియాదగ వెడలిపొమ్ము !
పోవకున్న తత్క్షణమే పొరుగువారి కేక వేతు !

### సు మ తి

రాజీవా, యేమి మిగుల రసాభాస ! మయిన, వారి
బిలిచి చూడు మే మగునో ! భీతి లేదు—కూరుచుంటి.

### రాజీవ లోచన

మరియాదగ బోవ ? ఎన్ని మారులు చెప్పవలె నీకు ?
బయలి కరుగవేని యిపుడె పరిచారికలం బిలిచెద.

### సు మ తి

మూడు మారు లేక వచనములను ప్రయోగించినావు !
మరవబోకు మెవ్వరితో మాటాడుచు నున్నావో.
పిలువుము పరిచారికలను—ప్రీతితోడ వీక్షింతురు
రాజీ - వస్త్రాపహారణ రమణీ యోత్సవము నేడు.
కాని యేల ప్రియా, నీకు కలుగవలసె నింత భీతి
భూరిసాధు వైన పురుష పుంగవు సాన్నిధ్య మందు ?

అలుక యేల ప్రాణేశ్వరి, అలకలు సవరింప గలను:
కామకలా ప్రావీణ్యము కలదు కొంత నీ కృపచే.

రాజీవ లోచన

ఏమి మాటలాడుచుంటివి నీ రాతిరి వేళ నేను—
ఒడలు తెలియకున్న, దింక నుప్పురిగకు బోవనిండు !

సుమతి

సోపానము లెక్కలేవు, చూడుము నీ యురమెంతో
దడదడ లాడుచు నున్నది, తడయుము మిటనె ప్రాణప్రియ!
బిగిసియున్న కుచబంధము ప్రియా, కొంత సడలింతున !
వీడవలదు నిమ్మణ్ణకము—విడువదగదె సంభ్రమమ్ము ?
పోగల వెచ్చటికి ప్రియా, భుజముమీద వాలిపొమ్ము—
అభ్యంతర మందిరమున కరుగనిత్తు ననుకొంటివ ?
ఈ ఉషా మనోజ్ఞవేళ నెంత లోభనీయ వగుచు
కానబడుచు నున్నావో కామదేవుడే యెఱుంగు !

రాజీవ లోచన

ఈ పోకడ కట్టిపెట్టి యేగుట శ్రేయస్కర మగు.
నన్ను లోని కేగనిండు—నలిపివేయు చున్నవారు !

సుమతి

వాసించును నలగు కొలది వనితలు ప్రసవములు కూడ !
కట్టిపెట్టి వికారమ్ము కాగదవే సరళ మతివి !

రాజీవ లోచన

ఉపగూహన చుంబనముల నుక్కిరి బిక్కిరి యొనర్ప
తాళజాల, నింక నన్ను తటాలునం జంపరాదె !

సుమతి

భావించెదవా కేవల పశువుగ నను ప్రాణప్రియ !
నీ పదపంకేరుహముల నికటమునం గూరుచుందు.

నీ రమణీయాంగంబుల నివహంబున నెద్దియైన
ఆరాధ్యం బనెడి భావ మచ్చు పడియె నా మనసున.

చేసిన యపచారమునకు శిక్షారూపమున నీదు
పదపద్మము లొత్తనిమ్ము ప్రాణేశ్వరి, నీ దాసుని.

నీ వియోగ భారముచే నిర్భరమై పోవుచున్న
దానాటికి నానాటికి నస్మదీయ జీవయాత్ర !

నీ వియోగ భావముచే నే నెంతో నవసినాను
చూడుము నా దేహ మెంత కుష్కించెనో ప్రాణప్రియ !

నీ యొడిలో నా దేహము నిలుపనిమ్ము, మద్బాహుల
బెనవేయగ నీయగదే ప్రియా, భవత్కటి సీమను!

చల్లని నీ దేహలతా స్పర్శనమున ఈ క్షణమున
మచ్ఛరీర ఘనీభూత మహిత తాప మారగదే !

అనుమానము వీడి ప్రియా ! అనుగ్రహింపరాదె నన్ను!
స్వీకరింపగదవె పతిగ – సేవ చేయుచుందు నీకు.

రాజీవ లోచన

పరిణయమ్ముమీద నాకు భావము లే, మిదే చేతు !
వేడికొందు నేటికి నను విడిచి పొందు కష్ట మయిన!

సుమతి

ఒదవించితి నీ కలజడి నుద్రేకములోన కొంత :
నీ యానతి తల దాలిచి నేటి కరుగువాడ ప్రియా!

## ద్వితీయ రంగము

('రాజీవ' సౌధము. సంధ్యా సమయానంతరము)

### రాజీవ లోచన

స్వామివారి పాదయుగళ జలజములకు నమ్ర యగుచు
అధికభక్తి ప్రణామమ్ము నాచరించు రాజీవ !
నేడు సుదిన మాచార్యుల నిర్హేతుక జాయమాన
కృపాకటాక్షేక్షణమ్ము కింకరిపై బడుటజేసి.
గురుదేవుల రాకలోని కోర్కి యేమొ సెల విచ్చిన
శిరసా వహియించి త్రుటిని శిష్యురాలు నెరవేర్చును.

### భదంత రాహులుడు

వర్షఋతువు తుదిని మేము వచ్చినట్టు లిటకు జ్ఞప్తి.
నీకే బహుమాన మొసగ నేటి రాక రాజీవా !

### రాజీవ లోచన

పాద దాసి కేదో నూత్న బహుమానము తెచ్చినార
ధన్యురాలి జేయనూహ దయతో గురుదేవు లిటకు ?

### భదంత రాహులుడు

ఇది యపూర్వ మనెడుమాట యెంతయు సత్యంబు-కాని
ప్రథమ వీక్షణమ్మునందు ప్రమోదమ్ము నొసగ బోదు.
గవు సెన తొలగించునపుడు కరమునుండి జారు నేమొ
భద్రము ! రాజీవా, యీ బహుమతి వెల లేని దమ్మ!

### రాజీవ లోచన

గురుదేవా, గురుదేవా, ఘోర మైన నర కపాల
మేమి కారణంబో నాకు నిచ్చితి రిశాంతవేళ!

### భదంత రాహులుడు

ఘోర మనకు రాజీవా, కొండొక కాలమ్మునందు
ఆంధ్రభూమిలోన పెద్ద యందగత్తె కపాలమ్ము.
తెల్లజేమ పండు బోలు దేహకాంతి నొప్పె, నాడు
పూర్ణ చంద్ర బింబమువలె పొలిచెను ముఖమండలమ్ము.
అలక లింద్ర నీల మణుల నతికరించు దీప్తులతో
ఫాలరంగ మందు నృత్య పద్ధతులం జూపె నాడు.
ఆ శ్రవణ విశాలములై అలరారెడు నేత్రంబులు
అస్యచంద్ర మండలమున హ్రదద్వయమువోలె నొప్పె.
లలనామణీ సముజ్జ్వల లావణ్య సముద్రంబున
ద్వీపకల్పమట్లు మిగుల తేజరిల్లుచుండె నాస.
బింబాధరమును దాడిమ బీజపంక్తి గూడి యున్న
ప్రమదావదన స్థలంబు పండ్లతోటవోలె నుండె.
విరతోజ్జ్వల మగు రమణీ నిరుపమ సౌందర్యదీప
పావకంబునందు కామి పతంగములు మ్రగ్గెనొ్ను.
శారీరక భోగంబుల సంతతమ్ము తేలుటచే
త్రింశద్వర్షమ్ము లపుడె దేహ మధఃపతన మందె.
కామి జనాకర్షకములు కను లేమయి పోయినవో!
వర్ణ మధుర భాషణముల నాలుక గతి యే మాయెనొ!

సౌందర్యము యౌవనంబు శాశ్వతములు కా వనియెడి
జ్ఞానము లేకుండ మెలగు జనమున కీ గతియె సుమీ !
నీ వయినా వుపాసికవు నిరుపమ సద్ధర్మము నెడ
కలుఁగు ప్రీతి చేత శుభ క్షణమునందు వొక్క నాడు.
అంతవరకు సంతోషమె : అయినను శ్రద్ధాభక్తుల
అష్టాంగ ప్రథిత సరణి ననుసరణము కానబడదు.
నీ వింకను జన్నిగట్టు నెయ్యురతో మంతనములు
చేయు చుందు వనుచు మాదు చెవి జేరెను రాజీవా !
విడిచి భవద్బంధు జనము వివిక్త సదనంబు నందు
కాలక్షేపము చేయగ కారణంబు కానరాదు.

## రాజీవ లోచన

గురుదేవా, ధర్మమునెడ కొంచెమేని తగ్గలేదు
నాకు శ్రద్ధ యనెడి మాట నమ్మవలయు నని ప్రార్థన.
బ్రాహ్మణు లవుడపుడు నాదు భవనమునకు వచ్చుచుంట
సత్యమైన వార్త యనియె సమ్మతింతు గురుదేవా !
వల దిచటికి రావల దని వారించుచు నున్నదాన,
నిర్లక్ష్యము వారికి నా నిషేధమ్ము పట్ల నెపుడు.

## భదంత రాహులుడు

సుమతి యన్న తరుణ విప్ర సుందరు నెన్నండు గాని
నిషేధించి నావ నీవు ! నిజము పల్కు రాజీవా !

## రాజీవ లోచన

సిగ్గు విడిచి గురుదేవా, చెప్పుచున్నదాన నిజము.
ఆయన నా ప్రాణేశ్వరు, డంతె కాక ధర్మసముడు.

### భదంత రాహులుడు

శిష్యురాలు సత్యంబే చెప్పినందు కానందము!
కాని ఉపాసికవు గదా – కామమునకు లోబడితివ ?

తలచినాను కోర్కెలెల్ల దమించి నీ వింతకు మును
విషయ సుఖము లన్న మహావిముఖత్వము చెందితి వని.

### రాజీవ లోచన

సంసారము నెడల నేను సత్యముగా వైముఖ్యము
చెంది బ్రహ్మచర్య దీక్ష స్థిరముగ గైకొన్నదాన.
చెంద లేదు భ్రంశ మెపుడు శీలరక్షణమ్ము నందు :
ద్వావింశద్వర్షమ్ముల వయసు నాకు గురుదేవా !
సుమతి మహాశయుడు నిన్న చూడవచ్చినపుడు నన్ను
దర్శనమ్ము నొసగకుండ ద్వారము బంధించినాను.

### భదంత రాహులుడు

నిక్కముగా నట్టి పనియే నీవు చేసియున్న యెడల
నిగ్రహ సౌధమ్ము పైకి నిశ్శ్రేణిక నెక్కినట్లె.
ప్రబలముగా వ్యాపించెను పరీవాద మెందులకో
పట్టనమ్ములోని మహా భద్రజనము నందు గూడ.
రాజీవా, మా సంఘారామమునకు నీ యుదంత
మెటులో చేరంగ నేడె యిచటికి నే వచ్చినాను.

మందలింప వచ్చితి సుమి – మంచిమాట లెపుడు కూడ
శ్రోతల కప్రియము లగుచు శూలప్రాయముగ నుండు.

ఉపాసికగ నెంత కాల ముందువు ? వర్షత్రయమ్ము
సాధనకై రాజీవా, చాలు నందు నా తలంపు.
ఇంకిట సంపూర్ణ దీక్ష నిచ్చెద నభిమత మగుచో.
సంఘారామమున కిమ్ము సర్వస్వము తొలుదొల్తను.
కాలయాపనమ్ము చేయు కష్టములకు లో నగుదువు
భ్రాంతి కలుగుచుండు నీకు ప్రాపంచిక సుఖముల యెడ.
విక్షేప నిదానం బగు విప్రసుమతి సాంగత్యము
వానికి సద్ధర్మమునెడ వైర భావ మని గ్రహించు.
సంఘారామమున కీవు సమర్పించి సర్వస్వము
తడయకుండ భిక్షుణివై ధన్యత గను రాజీవా !
సౌందర్యము యౌవనంబు సంపద శాశ్వతము కావు
మరవ వలదు రాజీవా ! మంచిది నే పోయి వత్తు.

(నిష్క్రమణము)

**రాజీవ లోచన**

ఓసి సుజాతా, ఒకమా రిటు రా !
దాహము ! నాలుక తడి యారినదే !

**సుజాత**

(ప్రవేశించి)

తెత్తున దేవీ, తీయని పాడబ
చషకము, క్రోలగ సత్వరముగ నే.

**రాజీవ లోచన**

ఆసవమే యిపు డవసర మోసీ !
కనక సరకముల గ్రక్కున తే గదా.

**సుజాత**

మొన్న నాసవము మూర్కొను నప్పుడు
మరల ముట్ట నని మాట యిచ్చితిరి.

**రాజీవ లోచన**

భదంతు డాడిన పలుకుల కోసీ,
చిత్తం బెంతయు చెదరి పోయినది!
సత్వర మాసవ చమకము తెమ్మా
మనఃక్షోభమును మరచి పోవలెను.

(సుజాత ప్రస్థానము)

ఏమి కపాలము, ఇదె పరిణామము
సౌందర్యమునకు, జవ్వనమునకును !
సకలాంధ్రంబున సౌందర్యమునకు
ఖ్యాతిం గాంచిన గణిక కపాలము !
కాల మహాత్త్వము గడవం గలమా !
కడకు నాకు నీ గతియే పట్టున !

(సుజాత ఆసవపాత్రతో వచ్చును.)

అమితశక్తి యీ యాసవమునకును
పోయుము పోయుము పూర్ణపాత్రముగ.
సకల చింతలను సంక్షోభములను
పరిహరింప గల ప్రభావ మున్నది.

(ఉద్దీప్తితో)

మంచిది, నిన్నొక మాట యడిగెదను —
ఎట్టి వానిగా నెంతువు సుమతిని?

సుజాత

సుమతి దేవుడు మహా సుందర మూర్తి :
ఉన్నత దేహుండు, వ్యూఢ వక్షుండు,
దీర్ఘ భుజుండు, సుదృఢ శరీరుండు
తనువు దాల్చిన పూర్ణ తారుణ్యమూర్తి.
ఉన్నతవంశ సముద్భూతు డయ్యు
సమబుద్ధి కల్గిన సాధు వర్తనుడు.
నిజ కలా విద్యల నిష్ణాతు డయ్యు
దుర్విదగ్ధుల కైన దూర దెన్నండు.
అన్యు లప్రియములే యన్నను, బదులు
పరుష వాక్యంబులు పలుకని వాడు.
ఎట్లు వర్తించిన నితరులు, తాను
సరళేతరమ్ముగా సంచరింపండు.

రాజీవ లోచన

అసవమే చెలి, అంతటి యోగ్యుడె !
చూడవలయును నే సుమతి మహాశయుం.

సుజాత

పాపము ! నిన్నను పంపి వైచితిరి
చూడకుండనే సుమతి మహాశయుం.

రాజీవ లోచన

ఏ మందువు చెలి, యిప్పుడె చని నీ
వాతని నిచ్చటి కాహ్వానింతువె ?

సుజాత

మానధనుం డా మహీసుర పుత్రుడు –
నా యాహ్వానము నచ్చునో నచ్చదో!

రాజీవ లోచన

సత్యమె – లేఖన సామగ్రిని గొని
వత్తువె? నేనే వ్రాసెద పత్రిక.

## తృతీయ రంగము

(రాజీవ సౌధము. అర్ధరాత్రము.)

సుమతి

రాజీవా, రాజీవా, రావచ్చున నేను భవత్
శయ్యాగారములోనికి ?... సంతోషము, సంతోషము !

రాజీవ లోచన

యామమునుండియు మీకై ఔత్సుక్యముతోడ నేను
ప్రతీక్షించు చున్నదాన ప్రాణేశా, యిచ్చోటను.

సుమతి

జాగు చేసినందులకై క్షమియింపం గలవె నన్ను !
స్థలజలేజ సమములు నీ చరణము లంటెదను ప్రియా !

(ఆమె పాదములను స్పృశించును. అతని
చేతు లామె కన్నుల కద్దుకొనును.)

ఏమిది, ఏమిది, ప్రియతమ, ఇంత వేడి యొక్క పాణి
సరోజంబు, లెల్లపుడును చల్లగ నుండెడివి కదా !

రాజీవ లోచన

భావమ్మును బట్టి కదా పాణి పాద నేత్రమ్ములు
ఉష్ణత్వము శీతలత్వ మొందుచుంట ప్రాణేశ్వర !

సుమతి

నిలిచి యున్నదానవు ప్రియ ! నివష్ణకము చేరరాద !
ఏది తాకి చూడనిమ్ము ఎట్లున్నదొ యొడలిలోన.

రాజీవ లోచన

నిలువ నేల దూరముగా ? నిషద్యపై జీవితేశ,
ఆసీనులు కారాదా అస్మత్ పార్శ్వమ్మునందు ?
కౌశేయోపమ మగు మీ గాత్ర శీత సంస్పర్శను
త్రుటిలో నా తనుతాపము తొలగిపోయె జీవితేశ !

సుమతి

జీవిత దాత్రికి నించుక సేవ చేయగలుగుటచే
ధన్యత గన్నాడ ననుచు తలపోయుచు నున్నవాడ.

రాజీవ లోచన

ఏల జాగు చేసినారో హృదయేశా, ఆగ్రహమ్ము
నా మీదను కలుగ లేద నాటి రాత్రి చర్యవలన ?

సుమతి

ఏమి వింత మాటలు ప్రియ ! ఎన్నడైన నీ యెడలను
అలుక బూని యుంటి నేమొ యథార్థముగ జెప్పవలయు.
మొన్న విభావరిని నేను మూర్ఖముగా వర్తించితి
క్షమియింపం గలవె ప్రియా, సరశేతర వర్తనమ్ము !

(ఉభయుల గాఢాలింగనము)

రాజీవ లోచన

పరిచారిక చేత నేను పంపిన యనురాగ లేఖ
అందినదా అందలేద ? ఆలసించినార లేల ?

సుమతి

సిగ్గు విడిచి ప్రాణప్రియ, చెప్పుచున్నవాడ నిజము-
చేరలేదు పరిచారిక చేత నంపినట్టి లేఖ.

వికల మయ్యె నా మనస్సు- వెఱ్ఱివోలె తిరిగినాను
మొన్న నిన్ను విడిచి చన్న మొదలిప్పటిదాక ప్రియా!
సాయం సమయమ్మునందు చైత్యమునకు బోయి నేను
ప్రదక్షిణమ్ము చేసితి మీ భగవానుని దలపోయుచు.
నిశ్చయించుకొంటి ప్రియా, నీవు స్వీకరింతువేని నన్ను
అచిరకాలముననె ప్రీతి నగుదు నుపాసకుడ ననుచు.

రాజీవ లోచన

చాలు జాలు సద్ధర్మము! సాహసించి సత్వరముగ
చేయబోకు దృష్టికర్మ జీవితేశ, యెన్నటికిని.

సు మ తి

ఆర్యధర్మములకు శత్రువైన బౌద్ధ మార్గముపై
ప్రీతి కలిగి కాదు నాకు ప్రియా, అట్టి నిర్ణయమ్ము.
నీకోసమె రాజీవా, నిష్ఠుర కార్యంబు సైత
మాచరింప బూనుకొంటి: అన్యథా గతిర్నాస్తి!
కొంత తడవు నే కృష్ణా కూలమునం గూరుచుండి
శూన్య మానసమ్ముతోడ జూచుచుంటి స్రోతస్విని.
వచ్చి యటకు ప్రాణసఖుడు వాలకంబు గాంచి, నుడుల
ధైర్యము పురికొల్పి, నన్ను తనయింటికి గొనిపోయెను.

రాజీవ లోచన

నన్ను బయట బెట్టి మీరు నలుగురిలో ప్రాణేశా,
అల్లరిపాల్సేయుట మీ కన్యాయముగా దోచద?

## సుమతి

రాజీవా, మన యిరువురి రహస్యములు ప్రియసఖునకు
బట్ట బయలు చేయుదు నని భావించుట భావ్యంబా ?

నికారమ్ము చూపినావు నీ వనియెడి మాటమాత్ర-
మాతడు నను గ్రుచ్చి యడుగ నంతమునం జెప్పినాను.

నీ గౌరవ మొక్కటిగా నిజ గౌరవ మిం కొకటిగ
భిన్న దృష్టి లేదు నాకు ప్రియా, విశ్వసింప వలయు.

ఆది నుండి సఖు డెరుంగు నస్మదీయ రాగ వృత్త
సరణిని : నీ కతని యెడల సమాదరము కలదు కదా.

చెప్పకోని యెడల నట్టి స్నిగ్ధుతోడ నైన కొంత
గుండెబరువు తగ్గు టెట్లు ? కొంచెము యోచింపు ప్రియా!

అతని బలవంతముపై నారగించినాను విందు-
అవల నతని వాక్సుధచే ఆశ యొదవె మరల ప్రియా !

మార్గ మధ్యమందు నాకు మనసు మరల వెన్నెలలో
నీ దర్శన కాంక్ష మహా నిర్భరమై పోయె ప్రియా!

క్రూర మృగాలోకనమున గూడ భీతి కలుగ నట్టి
నాకు జంకుతోడ కొంత నాన యుద్భవించె ప్రియా!

ప్రేమోన్మత్తులకు నెట్టి భీతి యుండ దందురు గద-
పదము లవిదితమ్ముగ నీ భవనమునకు దెచ్చె నన్ను.

అలిందమ్ములోని కాంతి ఆరామముపై బడగా
నిద్ర పోవలే దింకను నీ వని విస్పష్ట మాయె.
సాహసించి యెట్టులో నీ చరణ ద్వంద్వంబు మీద
వ్రాలి క్షమాపణము వేడ వచ్చినాను రాజీవా !

భాగ్యం బని తలతు, కొంత ప్రసన్నతను జూపినావు.
పరిపూర్ణానుగ్రహమ్ము ప్రాప్తించుట యెన్నటికో !

రాజీవ లోచన

నా భయాలు వివరించెద నాథా, మీ సౌందర్యము
దశగుణమ్ము లధికము నా తనూలతా రుచులకన్న.
ఉచిత ధర్మ ముజ్జగించి ఉపాసికగ మెలగినాను,
భ్రష్టత్వము సంక్రమించె బ్రాహ్మణత్వమందు కొంత.
బంధువులను వీడలేక బాధ పడుచు నున్నదాన!
పురుష వృషభ సాహసంబు పూబోణుల కట్టు లుండు ?
విడిచి పుత్తురేమొ నన్ను విసివి కొంత కాలమునకు
అతి పరిచయ వశముచేత నన్న జంకు బాధించును.

సుమతి

ప్రియతమ, నీ వింత వింత భీరురాల వని యెరుంగ !
గ్రహియింపం జాలవె బహు కాల మైన నా నైజము ?

రాజీవ లోచన

నా కవిదిత మౌనె భవ న్నైజము ? సుందర పూరుషు
లధిపులవలె నూత్న ప్రియు లన్న మహాసంశయంబు.
నిగ్రహమ్ముతోడ మీరు నిశ్చలముగ నుండబోలు.
కాని యూరకుండ నీదు కామినీ గణమ్ము నాథ !

సుమతి

ప్రాణప్రియ, నీ కింతటి భ్రాంతి యేల కలిగినదో
పరస్త్రీని జూడను– నీ పాద పద్మయుగళి మాన !

### రాజీవ లోచన

అనురాగము శాశ్వతమా ? అహరహమ్ము ప్రేమలతకు
చేయవలయు దోహదమ్ము స్నిగ్ధమ్ములు యత్నమ్ముతోడ.

### సుమతి

స్వీకారము కాదు నీదు సిద్ధాంతము హృదయేశ్వరి!
నా యనురాగంపు రూపు నమ్ముము కూటస్థం బని.
క్రీడింపం దలపు లేదు కేవల కాముకుల రీతి!
సమ్మత మగునేని నిన్ను జాయగ గైకొందు ప్రియా!

### రాజీవ లోచన

బహుకాలము మిమ్ము నేను బాధించితి ప్రాణనాథ!
చిత్రవర్తనమ్ముచేత- స్వీకరింపగలరె నన్ను ?

### సుమతి

బహువారము లేని నిన్ను బాధించితి నేమొ ప్రియా,
ఉత్సాహము చేత గాని, ఉద్రేకము వలన గాని.
స్వప్నమట్లు గతకాలము స్మరియింపక వర్తమాన
భవిష్యత్తులే తలంచి భార్యాభర్తల మగుదము.

(రాజీవ అతని పాదములపై వ్రాలును. ఆమె
నతడు లేవ నెత్తి, చేతులలోనికి దీసికొనును)

### రాజీవ లోచన

దుర్బల హృదయమ్ము చేత దూరముగా నుంచితి మిమ్ము
నను దయతో నింకమీద నాథా, పాలింప వలయు.

సుమతి

వనితగాని కవిత గాని స్వయముగ వరియింప వలయు
ననెడి సూక్తి నీయెడ నే డన్వర్థం బయ్యె ప్రియా.
సుముహూర్తము రాజీవా, చూతము త్వరలోన—కాని
ప్రథమమందు బుద్ధదేవ ప్రణామమ్ము చేయుదమా?

రాజీవలోచన

వలదు వలదు సంసారము వ్యర్థ మని తలంచు భిక్షు
వతడు: మనమె ఆర్యధర్మ మనుసరించు వారము కద.

సుమతి

రాజీవా, నీవు ధన్యురాలవు, నే ధన్యుండను!
అఖిల జగమునందు కేవ లార్యధర్మ ముత్కృష్టము!

రాజీవలోచన

అఖిల దేవ సంఘంబున కార్య ఋషి సమూహమునకు
ప్రణమిల్లుద మొక్కమారు భక్తితోడ ప్రాణనాథ!
(కన్నులు మూసి అంజలులు ఘటింతురు)

సుమతి

ఒక్కసారి నా యొడిలో నుపవేశింపంగ రాదె
ప్రియా, భర్తృ భావముతో పెదవులు ముద్దాడ వలయు
(అన్యోన్య చుంబనము)
యుక్తముకా, దయిన నిన్నొక్కమాట అడుగ దలత
స్వీకారమునకు హేతువు వివరింతువ రాజీవా!

రాజీవ లోచన

(మందహాసముతో)

పరసు లయ్యు నాథు లిట్టి సంప్రశ్నము చేసినారు!
భదంతదాహుల గురుండు పరమార్థము తెలుప గలడు!

(అవనత వదన యగును)

## చతుర్థ రంగము

(రాజీవ సౌధము. ఉదయము ప్రథమ యామము)

### భదంత రాహులుడు

శుభము! మంచిది, కూరుచుండుము
సుమతి, నిజ పీఠమ్ముమీదను.
ఉన్నదా రాజీవలోచన ఉప్పరిగ మీద ?

### సు మ తి

అరిగినది రాజీవలోచన
అహార్ముఖమున స్వజన సన్నిధి,
కింక సాయం సమయమునకే యిచటి కరుదెంచున్.

మొన్న మా రాజీవ తెల్పిన
ముఖ్య వాక్కుల వలననే తమ
సన్నిధానము జేర నుంటిని సత్వరమ్ముగనే.
అయిన నేత త్ప్రిభాతమ్మున
నప్రయత్నముగా లభించెను
గురువరేణ్యుల దర్శనము - నా కోర్కు లీడేరన్.
సంచి సంఘారామమునకై
సమర్పించుము నున్నవాడను
వినయపూర్వకముగను, గురువులు స్వీకరింపవలెన్.

### భదంత రాహులుడు

లేదె సద్ధర్మంబు మీదను
లేశ మేనియు శ్రద్ధ సుమతీ,
భూరిదానము చేసి తెట్టులు ? బుద్ధి మారినదా ?

సు మ తి

మతమునం దాచార్యదేవా,
మార్పు చెందుటచేత గా దని
విన్నవించెద: నా కృతజ్ఞత వెల్లడించుటకే.
శ్రీమదాచార్యోత్తముల కృప
చేత నా భాగ్యమ్ము పండెను,
ధన్యతం గన్నట్టు లెంతయు దలచుచున్నాడన్.
చిత్ర మేమో కాని మా రా
జీవ లోచన తమ సుబోధల
వలన సత్వర మైన శుభ పరివర్తనము చెందెన్.

భదంత రాహులుడు

(కొంచె మప్రతిభుడై)

నీ కృతజ్ఞత వెల్లడింపగ
నేను చేసిన మేలు తెలియదు:
కాని యామెకు బోధతో నొక కాన్క యిచ్చితిని.

సు మ తి

ఏమి హేతువొ కాన్కసంగతి
యెత్తనే లే దామె నాకడ.
కాని చేసిన బోధ తెలుపంగలరె గురుదేవా!

భదంత రాహులుడు

జవ్వనంబును చక్కదనమును
శాశ్వతంబులు కావె కావని
విషయ సుఖములయెడల వాంఛలు విడుచు టుత్తమము.

చేయుచుండిన కాలయాపన
చిత్త విక్షోభమ్ము కల్గును,
అహరహమ్మును దుఃఖసంతతి అలముకొను దేహిన్.
అనుసరించిన పక్షమం ద
ష్టాంగ యోగము సక్రమమ్ముగ
పూర్ణ నిర్వాణాప్తి – ఇదియే బుద్ధశాసనము.
శీలవతి దీక్షితయు నగు రా
జీవలోచన అచిరముగనే
భిక్షుణీ గణమందు చేరును ప్రీతి నని యెంతున్.

## సుమతి

చిత్రమే గురుదేవ, మా రా
జీవ కేశవిహీన భిక్కుని
గణములో జేర్పంగ స్థవిరులు గడగినా రొక్కో!
దీన మేలే యయ్యె, తమ యూప
దేశ పరిణామమ్ము వింటిర ?
స్వీకరించెను నన్ను భర్తగ స్వేచ్ఛగా నామె.

## భదంత రాహులుడు

శాంతం పాపమ్! సంసారమ్మున
బడ ద్రోచితివా పాపము ముగ్ధను!

## సుమతి

స్వామీ, నమ్ముడు స్వయముగ దేవియె
కల్యాణమ్మును కాంక్షించినదే.

భదంత రాహులుడు

కావ్యగ నామెకు కపాల మిచ్చుచు
అఖిల మశాశ్వత మని బోధించితి.

సు మ తి

తెలిసికొన్నయది దీప ముండగనె
ఇల్లు చక్కగొను టెంతయు మే లని.
కాల రూపమును గ్రహించి లోచన
వార్త నంపినది వైళమ నాకై.

భదంత రాహులుడు

తలచిన దొక్కటి తత్ఫల మొక్కటి-
ధర్మబోధ యిట తలక్రిం దైనది.

సు మ తి

స్వామీ, యువతికి సమంజసంబా
సుఖపడ కుండగ శూన్యసరణి జన?
భర్తను బిడ్డను పరివారమ్మును
గాంచి ముదమ్మును గను టక్రమమా !

భదంత రాహులుడు

అంత మెన్నటికి అవర్తముతో
సామ్యము కలిగిన సంసారమునకు ?
సౌందర నందుడు సతతము జాయా
యుతుడై యుండగ, నొక్క దినమ్మున
భూరి కృపాళువు బుద్ధదేవునకు
పుట్టె ననుగ్రహ బుద్ధి యతనిపై.

పిలువ నంపి, యా ప్రియాదాసునకు
సంఘటియించెను సంఘముచేతను
బలవంతముగా పరివ్రాజనము.

తొలుత నందునకు దుఃఖం బొదవెను-
కాని యాతనికి క్రమక్రమమ్ముగ
శాంతి నెలకొనియె: జాయయు నాతని
యధ్వమునే తుద కనుసరించినది.

సుమతి

నచ్చ లేదు కథ నా కాచార్యా !
బలాత్కారముగ ప్రవ్రజనంబున
బాధ పడియె గద పాపము నందుడు !
సుందరి గతియును సుఖదూరము కద !

భదంత రాహులుడు

నీ కెటు నచ్చును - నిండు జవ్వనము
పొంగులు వారెడి పురుషర్షభునకు !
ఈ సంసారములో నెన్నటి కయినను
అంత ముండవలె - అవునా, కాదా ?

సుమతి

చిత్తము : గురువులు సెల విచ్చిన యది
మాన్యంబే యగు మా వారలకును.
ఆర్య ధర్మమున ఆశ్రమ భేదము
లేర్పరించినా రెంతయు ప్రాజ్ఞులు.

భదంత రాహులుడు

ఆశ్రమ భేదము లను పక్షములో
విరక్తి కలుగుట చిరకాలమునకె !
దిట్టతనముతో తెగించి తొలుతనె
విరక్తి జెందుట వివేకి కార్యము.

సు మ తి

ఆర్యమార్గమునె యభిలషించు నా
తల కెక్కదు పరధర్మ విధానము.
మా జీవితముల మాధుర్యంబును
గార్హస్థ్యంబున గ్రహింప నెంతును.
భ్రంశము నొందక పరంపరా గతి
ఆచారోత్తమ, అనుసరించెదము.

(భదంతుడు లేచును.)

చిత్తము, మా రాజీవ లోచనకు
తమ యాగమనము తప్పక తెలిపెద.

భదంత రాహులుడు

ఏటికి తెలిపెద, వేమి ప్రయోజన
మంతయు వ్యర్థం బయినది తుదిలో.

సు మ తి

క్షమించి మమ్ముల, కల్యాణములో
దయ చేయుదురా తమ యాశీస్సులు ?

జాయా పతులము శక్తి కొలందిని
కావ్యాలు పంపంగలము భదంతా !

(భదంతుడు తల వాల్చి నిష్క్రమించును)

ఎంత గండము తప్పె హృదయేశ్వరీ, నీకు !
నీలకుంతలములన్ నేలపాల్సేయంగ
పూర్ణ జన్మము దుఃఖ భూయిష్ఠ మొనరింప
తలపెట్టిరే శూన్య ధర్మాను వర్తనుల్ !
చెడిపోయినావు రాజీవ, దురోధచే !
సుఖము కోల్పోయితివి శూన్య వాదమ్ముచే!
పెడదారి బోనీను ప్రియతమా, నిన్నింక !
సమకూర్తు సౌఖ్యముల్ శక్తి వంచన లేక.

(ఊర్ధ్వముఖుడై చేతులు జోడించి)
కాపాడుడీ మము శచీ పురందరులార !
కాచుడీ మము భారతీ చతుర్ముఖులార !
పాలింపుడీ మమ్ము భార్గవీ హరులార !
మమ్ము రక్షింపుం డుమామహేశ్వరులార !

సంపూర్ణము

# కావ్యాంతర్గత సంస్కృత శ్లోక భావాను వాదములు

### పుట 485

పల్లవింపఁగఁ జేయఁ బలుకు లుమాపతి
ధరుఁడు దక్షుండు; సందర్భ శుద్ధి
తెలుఁగు శ్రీ జయదేవుఁడే; దురూహ ద్రుతి
సరణిని శ్లాఘ్యుండు శరణ సుకవి;
శృంగారరస వీచి పొంగారు మధుర ర
చనల గోవర్ధనా చార్యవర్యు
నెదుర నేరుచునాతఁ డెందును గనరాఁడు;
సుకవిసోముఁడు ధోయి శ్రుతిధరుండు.

### పుట 486

అరయన్ సంసరణామయోపశమన మైత్రె
లెస్సయై నిచ్చ శ్రో
త్ర రుచుల్ గొల్పు ముకుందపాదవనజ
ధ్యానామృత మ్మోలిఁ గ్రో
ల, రసస్యంది కలావిలాసముల లీలల్
చూడఁగాఁ గోరుచుం
దుర యేనిన్ జయదేవ సత్కవి నొడుల్
తోరంబు లాలింపుఁడీ!

లలిత గాంధర్వ కలా విలాసముల
వైదగ్ధ్యమ్ము, శ్రీశార్చనా

ధృతి, శృంగారవివేక తత్త్వరచనో
ద్దీప్తత్వముం, గావ్య ని
ర్మితి రీతిన్, జయదేవ పండితకవి
శ్రీగీత గోవింద వా
క్కృతి విజ్ఞుల్ చవిఁ జూచి మోవరో కో
యా ధన్యాత్ము మూర్ధముపై!
తేజరిలుత రామాంబికా భోజదేవ
సుతవరుండు శ్రీజయదేవ సుకవిచంద్రు
భవ్య గీతగోవింద కావ్యము పరాశ
ర ప్రముఖ కంఠముల నాభరణము గాఁగ!

పుట 530

కర మలరుత మురభంజను
చరణములే శరణ మన్న జయదేవ కవీ
శ్వరు భారతి రసికులమదిఁ
దిరముగఁ గోమల కలావతి యువతి యటులే.

పుట 552

మున్ను సుకవుల నెన్నునప్పుడు కనిష్ఠి
క అల కాళిదాసుని మోచి గణుతి కెక్కె;
వాని కెన వచ్చు కవి నేఁడు లేని కతన
అర్థవతియై యనామిక యట్లె నిలిచె.

కాళిదాసుని కవిత, క్రొక్కారు వయసు,
సార మాహిష దధి, పంచదారపాలు,
ఏణమాంసము, సుకుమారి యయిన తరుణి,
అమరుఁ గావుత జన్మజన్మమున నాకు!

పుట 554

ఏలాని ద్వారదేశమున
    నీ సహాకారము ? నీ వదృష్ట మీ
లీలను గోలుపోయితివి లే !
    ఇది వట్టి విపర్భ్రమమ్ము సు
మ్మీ లలితాంగి ! పెంపకు; మి
    దొక్క రవంత చివిర్చినంత నా
ఖీలముళై పొసంగి పొదివెన్
    మదన జ్వర సన్నిపాతముల్.

సురుచిర దిగ్వధూ వదన
    చుంబన చుంచువుగా నెసంగి నీ
చిరయశో మొప్పు మీఱఁ గని,
    చేసిన యాసున దోఃలలామ ము
ద్ధురముఁ బయోధరోద్గమముఁ
    దోరముగాఁ బ్రకటించె, హాస ని
ర్భర మది గాఢగాఢ పరి
    రంభమునం గొని దానిసైతమున్.
లలితోల్లాస విశేష నూతన మహా
    లావణ్య కల్లోలినీ
తిలకం బియ్యది కంటె ? నల్లులవ
    లెంతే నొక్క చో నీదు జా
బిలితోఁ; నొక్కడఁ గుంభికుంభకటి
    శోభిల్లున్ సమున్నగ్నమై;
కలలం దేలు మృణాలదండ కదలీ
    కాండంబు లిం కొక్కడన్.

పుట 572

హేమ మాసమ్ములను దాటుమాటు చేసి,
కల గలిపి సకాశమును శకాస మనుచు,
రమలలో నొండు వదలి యుష్ట్రమునఁ బలుకు
తద్ఘుంఠకు వికటనితంబ నిడిరి.

పుట 638

అమరి యే పరిపూర్ణ శక్త్యంశమందు
నీ ప్రపంచంబు నిలుచు నం చెల్ల యోగ-
మజ్ఞు లందురో అట్టి తమాలనీల
గళునకు నమస్సు పార్వతీకాముకునకు.

పుట 664

ప్రబలమై మరణంబు పై బడకమున్నె,
ప్రజ్వరమ్ముగ జర క్రమ్మి రాకమున్నె,
కొలువ వలయును దమయిచ్చకొలఁది చెల్ల
నరులు శంకరు లోకశంకరుని నమ్మి.

"దేవిసన్నిధి శుభ్రదశా నివేశ
సంపద కిరీటశశికరజాల మొందు,
దగ్ధ మయ్యెను కామపతంగ మెందు,
అట్టి హరనేత్ర శిఖిదీప మతిశయిల్లు."

పుట 665

"కలిత వతంసితేందు కలికా
శిఖచే విలసిల్లి, చిత్రభూ
శలభము నుగ్గు చేసి, శుభసార
దశాగ్రమునన్ వెలుంగుమన్

బలవదపార మోహాభర
బాధతమోహారణంబు సేయుచుం
దెలివి వెలుంగు పొల్చు శివదేవుడు
యోగిమనో గృహంబులన్."
మనసు సతమ్ము నీదు సుకుమార
పదాబ్జములందు, వాక్కు నీ
వినుతులయందు, హస్తములు
పీడక నీదు సమర్చలందు, నీ
యనఘచరిత్రముల్ వినుటయందుఁ
జెవుల్, మతి నీదు ధ్యాన చిం
తనముల, నేత్రముల్ భవదుదార
తనుద్యుతి నిల్చుఁ గావుతన్!

పుట 684

మార వీర ధన్వి నారాచ నిస్త్రాణ
శాణ శిల విధాన సరవి నుదిత
మై కలశాసె, యామినీ కామినీ కర్ణ
కుండలమ్ము చంద్ర మండలమ్ము.

పుట 685

కలువల నిద్ర లేపి, రతి
కాంతుని మాంద్యము వాపి, నింగినిం
గల తిమిరంబుఁ ద్రోఁపి, యెడ
గల్గిన యింతులవంత రేపి, యి
మ్ములఁ బొడసూపె నయ్యుదయ
భూధర సుందర కందరమ్ము ది
క్కులఁ దొలిదిక్కు చెల్వచెవిఁ
గుండల మైందవ మండలం బిదే!

పుట 686

కొందఱు మచ్చ యంద్రు, మఱి
కొందఱు వారిధి పంకమం, ద్రిఁకం
గొందఱు లేఁడి యంద్రు, మఱి
కొందఱు ధారుణి నీడ యంద్రు, పె
ల్చం దలితేంద్ర నీల శకల
ప్రథమా విధునందు కందు; నే
వందు నిశానిపీత ముదరాంతర
సంస్థము నా తమంబుగాన్.

పుట 688

ప్రాగ్దిశా భాగంబు రాగరక్తము గాఁగ,
జక్కవ జంటల చొక్కు లీఁగఁ,
గడఁగి సముద్ర మాక్రాంతముద్రము గాఁగఁ,
దమ్ములు నిద్దురదిమ్ము గొనఁగఁ,
కుముదముల్ ముదమునఁ గ్రొత్తవాసన లెత్త,
కోక లోకమ్ములు శోక మొంద,
నాకాశ మవకాశ మాఁకం గొని వెలుంగఁ,
దమ మంతయును బ్రశాంతమ్ము గాఁగఁ,
గోరికల్ మీఱఁ బాఱఁ జకోరకము, ల
వల్ప దర్పుఁడై కందర్పుఁ డతిశయిల్ల,
నమృత శరణమ్ము లొ కిరణముల నురక
చల్లుచున్నాఁడు యామినీ వల్లభుండు.
విరికల్వ మొగ్గల విరియించి, యువకుల
మనముల నుల్లాసమునను ముంచి,
శూ దమ్మి మొగములు మొగిడించి, హారిణలో

చనల యీసులు లెస్స సాగఁ బంచి
కడు వెన్నెలలు నించి, కడలఁ జెల్వ నయించి,
మున్నిటి వెల్లువ పొంగుఁ బెంచి,
శోకమ్ములఁ గలంచి, చీఁకటుల్ కబలించి,
పొందుమన్నాఁ డేపుఁ జందురుండు.

పుట 689

కుముద హితమండలపు సారంగమునఁ జొచ్చెఁ
బంచశర తస్కరుఁడు జగద్భవనమందు;
మానవిత్తము నపహరింపంగ మోహ
భస్మ కలిక చందమునఁ బన్నడియె జ్యోత్స్న.

పుట 696

అంబుజ పత్ర నేత్ర ! భవ
దాయత తీక్ష్ణకటాక్ష బాణ పా
తంబుల నా వ్రణంబునకుఁ
దద్దయు నౌషధ మీద్వయంబె స
త్యంబు; భవత్సుధాతి మధు
రాధర బింబనిపాన మొండు, వ
న్యంబు, భవత్పృథు స్తన యు
గాంకిత కుంకుమ పంక లేపమౌ.

ఇది వదనంబు కాదు, నిజ
మేణ విముక్త శశాంక బింబ; మి
య్యది చనుదోయి కా, దభిన
వామృత పూరిత హేమకుంభ సం
పద; చికురాళి కా దిదియు,
మన్మథ దేవ మహాస్త్రశాల; యి

య్యాది కనుదోయి కాదు, తరు
ణావలికిన్ నిగలమ్ము నిల్వనన్!

పుట 698

సరసత దూలుచుం బ్రథమ
సంగమ మందుఁ ద్రపా విలోలయై,
యరయుచునుండ నేను రుచి
రావయవంబులు, మంద ధీరమా
సరణినిఁ గూర్చు సీత్కృతుల
జాలునఁ జేసి, చలన్మణీ శిఖా
తరల సుదీప్త కర్ణ కుముదంబున
వొప్పు ప్రియం దలంచెదన్.

పుట 713

కడు నేకాంతమ రత్న దర్పణ దిదృక్షా
సక్తయై యున్న య
య్యెడ, నే వెన్కన డాసి నిల్వఁ దమి,
నందే తోఁచు మన్మూర్తిఁ జూ
ప్పడ నీక్షించి, కలంచు నివ్వెఱలఁ
గంప మ్మొందుచున్ సిగ్గునం
బడి, తోడ్తో నుదితస్మరార్త యవు నా
వామాక్షి నెంతున్ మదిన్.
కలువల చెల్మి కాఁడో! నవ
కంజమొ! దర్పణమో! ముఖంబో! త
మ్ములో! మగమీనులో! మదను
పూనిన తూఁపులో! కన్నులో! ఖగ
మ్ములో! కమనీయ గుచ్ఛములో!

పుత్తడి కుండలా! గబ్బిగుబ్బలో!
వలగొను మించో ! చుక్క యొకో !
బంగరు తీవయొ ! తీవబోఁడియో !

పుట 714

ముఖర వలయ జాలమ్ము, సమ్మోదితాఽఖి
లాంగము, పులకముకుల తరంగ భంగ
సాంద్ర, మాబోధితానంగ తంద్ర, మతి స
రస, మురోనిమగ్నస్ఫార లసదురోజ
హేమకుంభమ్ము, ప్రియకామినీ మనోజ్ఞ
దోర్లతా గాఢబంధమ్ము, దుర్లభమ్ము
సుఖము సమకూర్చుఁ గావుత.......

పుట 725

సడలదు మేఖలాగుణము,
సల్పఁగలేదు దృఢోపగూఢ, మే
ర్పడ దొక ముద్దు, వక్త్రరుచి
పుంజ మవీక్షితమై యెసంగ, నె
ప్పుడుఁ గృతవిప్రలంభ పరి
భోగ సఖిత్వమువోలె నొప్పు నా
మృదుని సతీవిమిశ్ర సుస
'మృద్ధ శరీరము ప్రేమ నిచ్చలున్.

పుట 726

రమ్యాబ్జ మధ్యగౌరమ్ము, గోరోచనా
తిలక పాటలఫాల దేశసంశోభితము,
లలిత, మీషన్మదాలస విఘూర్ణితదృష్టి

పాత వశా ప్రియురాలి వదన బింబము నందె
నిలుచుఁ గావుత నాదు నెమ్మన మిప్పుడును.

పుట 730

తలఁతు నిరంతరమ్ము నెడఁదన్,
మృదు మంథర భాషితమ్ము, లా
వలిత వివర్తితాయత విభాసి
దృగంత నిరీక్షితమ్ము, లు
ల్లల దలసాల సాంచిత విలాస
గతమ్ములు, మొల్క నవ్వ వె
న్నెలలు నెసంగు ముత్ప్రణయినీ
మణి విభ్రమ చేష్టితమ్ములన్.

పుట 738

నిలఁబడి ద్వారదేశమున,
నెమ్మి సమున్నత కంధరమ్ముతో,
వలిన దల ప్రముగ్ధ నయనమ్ములఁ
గ్రుమ్మరియింతు వేల? వే
ల్పుల జవరాండ్ర కన్గలువ
పూవిరి చూపుల కోఁపు లన్న పే
ర్వలలఁ దవుల్పడేన్, మరలి
రాఁడు నిజంబుగ బిల్హణుం డిఁకన్.

పుట 740

రసిక కవీంద్ర! సుందర దర
స్మితముల్ వెలయింతు వేల? నీ
కసదు భయంబు లేదా? విక
చాంబుజనేత్ర లసన్ముఖాంబుజో

ల్లసిత యనుంగు ప్రేయసి, కళానిధి రైయె
హృదయాబ్జ పీఠిపై
నెసఁగుచునుండ, నెట్టులు
జనింపఁగ నేరుచు, నట్టి దేరికిన్ ?
చలన మొకింతయుం గొనని
స్వాంతము తోడ నిరంతరంబునుం
దలఁతు, ననన్యభుక్త నవ
నందిత యౌవన భూరిసార, ని
స్తుల, రమణీమణీ ప్రణుతి
ధూర్వహ, నా ప్రియ జీవితేశ్వరిన్;
గలుగక యుండ, న న్నెడయు
కస్తులు వేఱొక బాము నందునన్.

పుట 742

ఆ పూవు విరిబోఁడి వాపికలం దోయ,
మా యిందుముఖి యద్దమందుఁ దేజ,
ఆ మంజు లాపాంగి యంగణంబున వ్యోమ,
మా హంసగమన పద్యాల ధరిత్రి,
ఆ యింతి వీవనలందు వాయువు గాఁగఁ,
దమ యంగములు భూత సముదయమువఁ
గలిసి పోవగ లెస్స గలుగుఁగావుత నాదు
తనువు పంచత్వమ్ముఁ గొనిన యపుడు;
సాదరముగ మ్రొక్కి యోఁదల నంజలిఁ
గూర్చి మివుల వేఁడికొందు నిన్నుఁ
బరగ నీ మదీయ వాంఛితంబును సమ
కూర్పఁగాఁ గదయ్య కూర్మి ధాత !

పుట 751

అంక విహార యోగ్య మగు
    నంకిలిఁ జేజిలి, వల్గు వాగ్విలా
సాంకిత వామలోచనయు,
    హారి మనోహర మంజుల స్వనా
లంకృతి నిత్య వల్లకియు,
    లక్షితలై యొనరింపఁ జోరు మీ
నాంక సమానుఁ డా నృప
    శశాంకుని యంకము నెప్డు శూన్యమున్.

పుట 761

ఘనులగు వృద్ధ మంత్రులెడ
    గౌరవ బుద్ధి నొకప్డు రాష్ట్రిపుం
జనముల కెల్ల దర్శన
    మొసంగక తప్పనిదైన నాసుద
ర్శన సుతుఁడున్, గవాక్ష
    వివరమ్ముల నుంచిన యొంటి కాల్తో
డన తనరించి యత్తెఱఁగు,
    లక్షితుఁ డయ్యె విలక్షణవైఖరిన్.

కాపా నటులము[illegible]ములము, గాయకుల, వా
సభ్య వాధ చందువులము, నైప రాని
చనుల బరువున వంగిన జవ్వనులము,
ఇంక వే మెవ్వరము ధరణీశుఁ గనఁగ ?

UNIVERSITY OF HYDERABAD LIBRARY

CHECKED June 84 Acc. No. 713

Call No. T82 S945

Author శ్రీ శివశంకర శాస్త్రి

Title శ్రీ శివశంకర [illegible]

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

Help to keep the book fresh and clean